శనివారం 27-7-2024

సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 18 వెల: ₹ 5.50 సంపుటి: 17 సంచిక: 126



'నా అక్కలూ..చెల్లెళ్లు... తమ్ముళ్ల కళ్లలో వెలుగులు చూసినపుడే నా నిజమైన పుట్టిన రోజు'



పొలిమేరల నుంచే హెచ్చరిస్తున్నా..

కార్గిల్ యుద్ధంలో చావుదెబ్బ తిన్నా పాకిస్తాన్‌కు బుద్ధి రాలేదని ప్రధాని నరేంద్ర మోదీ మండిపడ్డారు. ఈ సందర్భంగా పాక్‌కు తీవ్ర హెచ్చరికలు చేశారు.

6 లో

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



ఆరుగురు సీఎంలు దూరం

నేడు ఢిల్లీలో జరిగే నీతి ఆయోగ్ భేటీని విపక్ష 'ఇండియా' కూటమి పార్టీలకు చెందిన ఆరుగురు ముఖ్యమంత్రులు బహిష్కరించారు.

వివరాలు 6లో ▸



ఫ్రాన్స్‌లో దుండగుల దుశ్చర్య

ఫ్రాన్స్‌లో దుండగులు విధ్వంసానికి పాల్పడ్డారు. హైస్పీడ్ రైలు నెట్‌వర్క్‌ను లక్ష్యంగా చేసుకొని దాడులకు దిగారు.

వివరాలు 6లో ▸



'సామ్యవాద' కోటలో నారీ భేరి

వెనిజులా అధ్యక్ష ఎన్నికల్లో విపక్ష నేత మరియాకు ప్రజా మద్దతు వెల్లువెత్తుతోంది. మదురోకు ఆమె ముచ్చెమటలు పట్టిస్తున్నారు.

వివరాలు 6లో ▸



కమలకు ఒబామా మద్దతు

అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డెమొక్రటిక్ అభ్యర్థిగా పోటీకి దిగుతున్న కమలాహారిస్‌కు మాజీ అధ్యక్షుడు ఒబామా మద్దతునిచ్చారు.

వివరాలు 6లో ▸

ఒలింపిక్స్ ప్రారంభోత్సవ పరేడ్‌లో త్రివర్ణ పతాకాలతో భారత బృందం కేరింత. చిత్రంలో పతాకధారులు పీవీ సింధు, శరత్‌కమల్



లాహిరి లాహిరి లాహిరిలో... పారిస్ ఊగెనులే..



16 లో

ప్రపంచం ఎదురుచూసిన పారిస్ ఒలింపిక్స్‌కు శుక్రవారం జేగంట మోగింది. గత విశ్వక్రీడలకు భిన్నంగా... ఆతిథ్య వేదికకు దూరంగా... సాధారణ జనానికి దగ్గరగా ఆరంభ వేడుకలు పారిస్ నడిబొడ్డున... సెన్ నది పొడవున అట్టహాసంగా సాగాయి. మార్చ్‌పాస్ట్ మాటలేదు... పతాకధారికి ప్రత్యేకత లేదు.. ఆటగాళ్లంతా ఒక్కటే..

అన్ని దేశాలు లాహిరి లాహిరి లాహిరిగా అంటూ పడవల్లోనే పరేడ్ చేస్తూ ఒలింపిక్స్‌కు ఎన్నడూ లేని, ఎప్పుడూ చూడని కొత్త శోభ తెచ్చారు. ఫ్రెంచ్ కళలు అద్దారు. ఓ వైపు నదిలో వివిధ దేశాలకు చెందిన జట్లు విహరిస్తుంటే... నదీతీరం వెంట ఫ్రెంచ్ కళలు, విభిన్న కళాకృతులు, నృత్యకారిణిల హొయలు అబ్బురపరిచాయి. భారత బృందానికి బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధు, టేబుల్ టెన్నిస్ స్టార్ ఆచంట శరత్ కమల్ పతాకధారులుగా వ్యవహరించారు. ప్రారంభోత్సవం ముగియడంతో నేటి నుంచి క్రీడాకారులు తమ పతకాల వేట మొదలుపెట్టనున్నారు.

గురి అదరాలి... తీపి కబురు వినాలి

నేటి నుంచి భారత షూటర్ల పతకాల వేట

మరో 90 రోజుల్లో 30 వేల ఉద్యోగాలు

ఇప్పటికే 30 వేల ఉద్యోగాలు భర్తీ చేశాం • సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడి

- ఉద్యోగ నియామకాల్లో చిత్తశుద్ధి నిరూపించుకుంటున్నాం
- గత ప్రభుత్వం నిరుద్యోగులను పట్టించుకోలేదు..
- మీకు సమస్యలు ఉంటే మంత్రులు, అధికారులను కలవండి
- ఫైర్‌మెన్ పాసింగ్ అవుట్ పరేడ్‌లో పాల్గొన్న సీఎం



ఫైర్‌మెన్ పాసింగ్ అవుట్ పరేడ్‌లో గౌరవ వందనం స్వీకరిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో మంత్రి శ్రీధర్‌బాబు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో మరో 90 రోజుల్లో 30 వేల ఉద్యోగాలను భర్తీ చేయనున్నట్టు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. ఈ ఉద్యోగాల భర్తీకి ఇప్పటికే నోటిఫికేషన్లు ఇచ్చినట్టు చెప్పారు. డీఎస్సీ నోటిఫికేషన్ ద్వారా 11 వేల టీచర్ పోస్టులను భర్తీ చేయనున్నామని, అదేవిధంగా గ్రూప్–1, గ్రూప్–2, గ్రూప్–3 ద్వారా పోస్టుల భర్తీతో పాటు వివిధ శాఖల్లో వచ్చిన ఖాళీలు కలిపి 30 వేల పైచిలుకు ఉద్యోగ నియామకాలకు ప్రభుత్వం పోటీ పరీక్షలు నిర్వహిస్తోందని వివరించారు. తెలంగాణ రాష్ట్ర సాధనకు సంబంధించిన అత్యంత కీలక అంశాల్లో ఉద్యోగాల భర్తీ ఒకటని, అయితే రాష్ట్రం ఏర్పడిన తర్వాత గత పదేళ్లలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిరుద్యోగులను పట్టించుకోలేదని విమర్శించారు. శుక్రవారం రంగారెడ్డి జిల్లా వట్టినాగులపల్లిలో తెలంగాణ ఫైర్ సర్వీసెస్ అండ్ సివిల్

మిగతా 2వ పేజీలో ▶

'స్థానిక' ప్రక్రియ వేగవంతం చేయండి

అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం

5 లో

ధరణిపై ప్రజల్లోకి ఆర్‌వోఆర్ ముసాయిదా

సమీక్షలో ముఖ్యమంత్రి నిర్ణయం

2 లో

'నీట్' టాపర్లలోంచి మనోళ్లు ఔట్!

రెండోసారి సవరించిన ఫలితాలతో తారుమారైన రాష్ట్ర విద్యార్థుల ర్యాంకులు

- వివరాలు 3లో

61 నుంచి 17కు..

- నీట్–యూజీలో పడిపోయిన టాప్ ర్యాంకర్ల సంఖ్య.. రీ–రివైజ్డ్ తుది జాబితా విడుదల

- వివరాలు 6లో

అబద్ధపు పత్రాలవి

హామీల అమలుపై ప్రజల దృష్టిని మళ్లించేందుకే శ్వేతపత్రాల పేరుతో డ్రామా

సాక్ష్యాధారాలతో సీఎం చంద్రబాబును కడిగిపారేసిన వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్



శాసనసభలో ఉన్నది రెండు పక్షాలే. ఒకటి అధికారపక్షం.. రెండు ప్రతిపక్షం. కానీ ప్రజల గొంతుక విన్పించకూడదనే లక్ష్యంతో వైఎస్సార్‌సీపీని ప్రతిపక్షంగా గుర్తించకుండా కుట్రలు చేస్తున్నారు. ప్రతిపక్షంగా గుర్తిస్తే పాలక పక్షం సాగిస్తున్న ఆటవిక పాలన, విధ్వంసకాండ గురించి గళమెత్తుతాం. మమ్మల్ని ప్రతిపక్షంగా గుర్తించకపోతే మిన్నకుండిపోము. మీడియా ద్వారా ప్రజల గొంతుక విన్పిస్తాం.
- వైఎస్ జగన్

- ఎన్నికలకు ముందు రూ.14 లక్షల కోట్ల అప్పులతో ఆర్థిక విధ్వంసం చేశారని ఆరోపించావు
- రూ.పది లక్షల కోట్ల అప్పులున్నాయని గవర్నర్‌తో తప్పులు చెప్పించావు.. ఇంతకూ ఏ లెక్క కరెక్ట్ బాబూ..?
- వాస్తవంగా ఉన్న అప్పులు రూ.7.48 లక్షల కోట్లేగా.. తక్కువ అప్పుతో ఆర్థిక క్రమశిక్షణ పాటించామని మా ప్రభుత్వాన్ని కేంద్ర సామాజిక ఆర్థిక సర్వే ప్రశంసించలేదా?
- 2019 మే 30 నాటికి ఖజానాలో రూ.100 కోట్లే ఉన్నా మేం రూ.2.27 లక్షల కోట్లతో పూర్తి స్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టాం
- ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ అమలు చేశాం
- ఇప్పుడు ఖజానాలో రూ.7-8 వేల కోట్లున్నా ఎందుకు పూర్తి స్థాయి బడ్జెట్‌ను ప్రవేశ పెట్టలేదు బాబూ?
- అలా చేస్తే నీ ప్రచారం అంతా అబద్ధాలేనని తేలిపోతుందనే కదా నీ భయం.. అందుకే మాపై దాడులు, విధ్వంసాలు
- అసెంబ్లీలో మేం నిలదీస్తామనే భయంతోనే ప్రతిపక్షంగా గుర్తించడం లేదు

12 లో

మోరంచపల్లి మొర.. కొండాయి గోడు వినేదెవరు?

ఏడాదిగా తీరని రెండు గ్రామాల 'వరద కష్టాలు' ఇప్పటికీ మారని ఈ పల్లెల స్థితిగతులు -18లో



ఇరకాటం




రికార్డుల్లో బాగానే ఉంది! బయటే మరోలా ఉంది డాక్టర్!

ఆగస్టు 2 డెడ్‌లైన్

అప్పటికల్లా కాళేశ్వరం బరాజ్‌లలో నీరు నింపాలి

- లేకపోతే మేమే 50 వేల మంది రైతులతో వచ్చి మోటార్లు ఆన్ చేస్తాం: బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హెచ్చరిక
- గోదావరి నిండుగా పారుతున్నా ప్రభుత్వం నేరపూరిత నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని మండిపాటు
- పార్టీ నేతలతో కలిసి మేడిగడ్డ బరాజ్ పంప్‌హౌస్‌ల సందర్శన

- వివరాలు 2లో



బీఆర్‌ఎస్ ప్రతినిధుల బృందంతో కలసి మేడిగడ్డ లక్ష్మీ బరాజ్‌ను పరిశీలిస్తున్న మాజీ మంత్రి కేటీఆర్

ఇది ఎన్డీఎస్‌ఏ ఆర్డర్

బరాజ్‌లలో నీటిని నిల్వ చేయవద్దని ఎన్డీఎస్‌ఏ కమిటీ స్పష్టం చేసింది

- నీరు నిల్వచేస్తే బరాజ్‌లు కొట్టుకుపోయి తీవ్ర ఆస్తి, ప్రాణ నష్టం సంభవిస్తుంది
- కేటీఆర్ అదే కోరుకుంటున్నట్టు ఉంది
- కేటీఆర్, కేసీఆర్ తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలి.. విలేకరుల సమావేశంలో మంత్రి ఉత్తమ్

2 లో



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి. చిత్రంలో జీవన్‌రెడ్డి, ఆది శ్రీనివాస్

క్లుప్తంగా...

నేడు వార్షిక బడ్జెట్‌పై చర్చ

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా శనివారం ఉదయం 10 గంటలకు శాసనమండలి, శాసనసభలో వార్షిక బడ్జెట్‌పై సాధారణ చర్చ జరగనుంది. శాసనసభ ప్రారంభమైన వెంటనే నేరుగా బడ్జెట్ ప్రతిపాదనలపై కాంగ్రెస్‌తో పాటు బీఆర్ఎస్, బీజేపీ, ఎంఐఎం, సీపీఐ సభ్యులు ప్రసంగిస్తారు. అనంతరం బడ్జెట్‌పై జరిగిన చర్చకు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సమాధానం ఇస్తారు. శాసనమండలిలోనూ బడ్జెట్‌పై జరిగే చర్చకు భట్టి సమాధానం ఇస్తారు.

బీఆర్ఎస్‌ను ప్రజలే చీల్చి చెండాడారు


మంత్రి జూపల్లి కృష్ణారావు



సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను ప్రజలు చీల్చి చెండాడారని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. శుక్రవారం ఆయన గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్ర బడ్జెట్‌పై కేసీఆర్ మాట్లాడుతూ తాము చీల్చి చెండాడుతామని వ్యాఖ్యానించడం హాస్యాస్పదం అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజాగ్రహానికి గురై అధికారం కోల్పోయిన బీఆర్ఎస్, పార్లమెంట్ ఎన్నికల్లో కూడా ఒక్క సీటు గెలవలేక గుండుసున్నాకే పరిమితమయిందని ఎద్దేవా చేశారు. అధికారంలో ఉన్నప్పుడు సచివాలయానికి రాని కేసీఆర్, ప్రతిపక్ష నాయకుడిగా ఉండి ఆరు మాసాలుగా అసెంబ్లీకి రాలేదని మండిపడ్డారు. తనకంటే చిన్న వయసులో రేవంత్‌రెడ్డి సీఎం కావడాన్ని కేసీఆర్ ఓర్వలేకపోతున్నారని, అందుకే ఆయన ముందు అసెంబ్లీలో కూర్చోవాలన్న వాస్తవాన్ని జీర్ణించుకోలేకపోతున్నారన్నారు. వాస్తవ ఆదాయ పరిస్థితులకు అనుగుణంగా గత ప్రభుత్వం ఎప్పుడూ బడ్జెట్‌ను ప్రవేశ పెట్టలేద ని, ఆదాయం, ఖర్చులు రెండూ ఎక్కువ చూపించి ప్రజలను మోసం చేసిందని పేర్కొన్నారు. కానీ తమ ప్రభుత్వం వాస్తవిక బడ్జెట్ ను ప్రవేశపెట్టిందని, వ్యవసాయం రంగం అభివృద్ధి, రైతన్నల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని కేటాయింపులు జరిపామని చెప్పారు.

బీఆర్ఎస్ నేతలు వాస్తవంలోకి రావాలి

ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి కేసీఆర్‌తో పాటు బీఆర్ఎస్ నేతలు మొసలి కన్నీరు కార్చడం ఆపి, వాస్తవిక దృష్టితో మాట్లాడాలని ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి హితవు పలికారు. ఆయన గాంధీభవన్‌లో శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ గత ఏడాది అక్టోబర్‌లోనే మేడిగడ్డ కుంగిపోవడంతో వేసవి కాలంలో నీటిని లిఫ్ట్ చేయలేదన్నారు. మేడిగడ్డతో పాటు అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు కూడా నీటి నిల్వకు పనికిరావని డ్యాం సేఫ్టీ అధికారులు రాతపూర్వకంగా తెలియజేయడాన్ని గుర్తు చేశారు. నిర్మాణ, నిర్వహణ, డిజైన్ లోపాలున్నాయని అధికారులు తేల్చారని చెప్పారు. దీనిపై న్యాయ విచారణ కొనసాగుతోందని, త్వరలోనే నిజాలు బయటికి వస్తాయని స్పష్టం చేశారు. ఈలోపు నిజాలు వెలుగులోకి రాకుండా, ప్రజలని తప్పుదోవ పట్టించే కుటిల యత్నాలకు బీఆర్ఎస్ దిగిందని విమర్శించారు. ఎల్లంపల్లి నుంచే నీటిని తరలించే అవకాశాలను నీటిపారుదల శాఖ పరిశీలించాలని జీవన్‌రెడ్డి సూచించారు.

'నీతి ఆయోగ్ బహిష్కరణ తగదు'



సాక్షి, హైదరాబాద్: ఢిల్లీలో శనివారం జరగనున్న నీతి ఆయోగ్ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశాన్ని ముఖ్యమంత్రులు రేవంత్‌రెడ్డి, స్టాలిన్ బహిష్కరించడం సరికాదని బీజేపీ నేత, తమిళనాడు, కర్ణాటక ఇన్‌చార్జి పొంగులేటి సుధాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేంద్ర బడ్జెట్‌లో తమ రాష్ట్రాలకు తగిన కేటాయింపుల్లేవని వారు అపోహకు గురై ఆవిధంగా చేయడం సరికాదని అభిప్రాయపడ్డారు. బడ్జెట్‌ను అర్థం చేసుకోకపోవడం, కేంద్ర ఆర్థికమంత్రి ఉద్దేశాలను సరైన దృక్పథంతో చూడకపోవడం వల్ల ఇద్దరు సీఎంలు అతిగా స్పందించారని భావిస్తున్నట్టు తెలిపారు. రాష్ట్రాలకు వివిధ పథకాలు, నిధులు తెచ్చుకునేందుకు నీతి ఆయోగ్ వంటి అత్యున్నత వేదికలను వినియోగించుకోవాలి తప్ప బహిష్కరణ తగదని హితవు పలికారు.

పారిస్ ఒలింపిక్స్-24లో ఎల్‌పీయూ విద్యార్థులు

జలంధర్: ఈ ఏడాది జూలై 26 నుంచి ఆగస్టు 11 వరకు పారిస్‌లో జరగనున్న ఒలింపిక్స్ క్రీడలకు దేశంలోని ప్రతిష్ఠాత్మక లవ్లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీ (ఎల్‌పీయూ)కు చెందిన 24 మంది విద్యార్థులు భారత్ తరఫున హాజరుకానున్నారు. పారిస్ ఒలింపిక్స్ 2024లో భారత్ తరఫున 21% మంది విద్యార్థులు క్రీడాకారులుగా ఎల్‌పీయూ నుంచి పాల్గొననున్నారు. ఒలింపిక్స్‌కు వీరి ఎంపికతో ఎల్‌పీయూ అటు ఉన్నత విద్య, క్రీడా రంగాల్లోనూ తన ప్రతిష్టను మరింత ఇనుమడింపజేసినట్టైందని విశ్వవిద్యాలయం యాజమాన్యం శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొంది. ఒలింపిక్స్ క్రీడాల్లో జావెలిన్ త్రో, రెజ్లింగ్, హాకీ, అథ్లెటిక్స్, వెయిట్ లిఫ్టింగ్, షూటింగ్, బాక్సింగ్ రంగాల్లో ఎల్‌పీయూ విద్యార్థులు పాల్గొననున్నారని వెల్లడించింది.

ఆగస్టు 2 డెడ్‌లైన్

అప్పటికల్లా కాళేశ్వరం బరాజ్‌లలో నీరు నింపాలి

- లేకపోతే మేమే 50 వేల మంది రైతులతో వచ్చి మోటార్లు ఆన్ చేస్తాం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హెచ్చరిక



కన్నెపల్లి లక్ష్మీ పంప్‌హౌస్‌లోని మోటార్లను పరిశీలిస్తున్న కేటీఆర్. చిత్రంలో పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, సునీతాలక్ష్మారెడ్డి, జగదీశ్‌రెడ్డి, సబిత, కౌశిక్‌రెడ్డి, సత్యవతి తదితరులు

సాక్షి ప్రతినిధి, వరంగల్/గోదావరిఖని: గోదావరి నిండుగా పారుతున్నా కన్నెపల్లి (మేడిగడ్డ (లక్ష్మీ)) పంపుహౌస్ నుంచి నీరు పంపింగ్ చేసే అవకాశం ఉన్నా కాంగ్రెస్ ప్రభుత్వం నేరపూరిత నిర్లక్ష్యం (క్రిమినల్ నెగ్లిజెన్సీ) ప్రదర్శిస్తోందని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీ రామారావు విమర్శించారు. దేశం గర్వించే విధంగా నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో మాజీ సీఎం కేసీఆర్‌ను బద్నామ్ చేయాలనే రాజకీయ దురుద్దేశంతో రైతులకు నష్టం చేస్తోందని ధ్వజమెత్తారు. ఆగస్టు 2 వరకు కాళేశ్వరం బరాజ్‌ల్లో నీరు నింపాలని, లేదంటే 50 వేల మంది రైతులతో తరలివచ్చి తామే మోటార్లు ఆన్ చేస్తామని హెచ్చరించారు. కాళేశ్వరం బరాజ్‌ల సందర్శనకు బయలుదేరి గురువారం రాత్రి గోదావరిఖని ఎన్టీపీసీ జ్యోతిభవన్‌లో బస చేసిన కేటీఆర్..శుక్రవారం బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నేతలతో కలిసి కాళేశ్వరం ప్రాజెక్టులోని కన్నెపల్లి, మేడిగడ్డ బరాజ్‌లను, పంపుహౌస్‌లను సందర్శించారు. ఈ సందర్భంగా మేడిగడ్డలో మీడియాతో మాట్లాడారు

ప్రభుత్వానికి నీళ్లిచ్చే ఉద్దేశం లేదు..

'రాష్ట్ర ప్రభుత్వానికి రైతులకు నీళ్లిచ్చే ఉద్దేశం లేదు. డిసెంబర్-జనవరిలలోనే నీరివ్వాలని ప్రభుత్వానికి సూచించినా భేషజాలకు వెళ్లి యాసంగి పంటలను ఎండబెట్టింది. ఇప్పుడు ఈ ప్రాజెక్టుపై ఆధారపడిన ఎస్సారెస్పీ, ఎల్ఎండీ, సింగూరు, మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్ తదితర రిజర్వాయర్లు, ప్రాజెక్టులు ఎండిపోతున్నా కేవలం రాజకీయ దురుద్దేశంతో వాటిని నింపే ప్రయత్నం చేయడం లేదు. వానాకాలంపై రైతులు ఆశలు వదులుకోవాల్సిన దుస్థితిని కల్పిస్తున్నారు. శాసనసభ సమావేశాలు ముగిసేలోపు కాళేశ్వరం పరిధిలోని జలాశయాల్లో నీటిని నింపాలి..'అని కేటీఆర్ డిమాండ్ చేశారు.

70-80 టీఎంసీలు పంపింగ్ చేసే అవకాశం ఉన్నా..

'తెలంగాణలో ఎగువ ప్రాంతాలకు సాగునీరు అందించే లక్ష్యంతో కాళేశ్వరం ప్రాజెక్టును డిజైన్ చేశారు. ఆ ప్రాజెక్టు ద్వారా ఇప్పటికే 70-80 టీఎంసీల నీరు పంపింగ్ చేసే అవకాశం ఉన్నా ఈ ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. పాలేరు, కోదాడ, సూర్యాపేట, తుంగతుర్తి, పాలకుర్తి, మహబూబాబాద్, డోర్నకల్, ఆదిలాబాద్, హుజూరాబాద్, హుస్నాబాద్, గజ్వేల్, భువనగిరి.. ఇలా తెలంగాణలోని మెట్ట ప్రాంతాలకు సాగునీరు అందించే అవకాశం ఉంది. ఇందుకోసం రోజుకు రెండు, మూడు టీఎంసీల చొప్పున నీళ్లు ఎత్తిపోస్తే మిడ్ మానేరు, అన్నపూర్ణ, రంగనాయకసాగర్, మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్‌లను గోదావరి నీటితో నింపొచ్చు. పైన ఉన్న సింగూరు, నిజాంసాగర్, శ్రీరాంసాగర్‌లలోనూ నీళ్లు లేవు, వీటికీ కాళేశ్వరమే ఆధారం. మరో ప్రత్యామ్నాయం లేదు. ఇవన్నీ తెలిసినా రాజకీయం కోసం రైతులు, ప్రజలను వంచిస్తున్నారు..'అని మాజీమంత్రి ధ్వజమెత్తారు.

ఎన్‌డీఎస్ఏ రిపోర్టు ఓ ఫార్స్

'నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్ఏ) రిపోర్టు ఓ ఫార్సు. ఆ నివేదికను సాకుగా చూపుతూ రాష్ట్ర ప్రభుత్వం రాజకీయం చేస్తోంది. పోలవరం ప్రాజెక్టుపై ఐదేళ్లు గడుస్తున్నా ఇంకా రిపోర్టు ఇవ్వలేదు. కాళేశ్వరంపై మాత్రం కనీసం ప్రాజెక్టును పరిశీలించకుండా ఒక్కరోజులోనే నివేదిక ఇవ్వడం హాస్యాస్పదంగా ఉంది. కాళేశ్వరంపై కాంగ్రెస్, బీజేపీల వైఖరి ఒకే విధంగా ఉంది. కాళేశ్వరం జలాల కోసం అసెంబ్లీలో ప్రభుత్వాన్ని నిలదీస్తాం. పంప్‌హౌస్‌లు ఆన్ చేసేందుకు ఎలాంటి ఇబ్బందులు లేవని ఇంజనీర్లు చెప్పారు. నీటిని లిఫ్ట్ చేస్తే రెండు రోజుల్లో మిడ్ మానేరుకు చేరుకుంటాయి. దీనిపై ప్రభుత్వం వెంటనే నిర్ణయం తీసుకోవాలి..'అని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఉదయం గోదావరిఖని నుంచి చెన్నూరు మీదుగా కాళేశ్వరం ప్రాజెక్టు సందర్శనకు బయలుదేరి వెళ్లిన కేటీఆర్ దారిలో గోదావరి బ్రిడ్జి వద్ద కొద్దిసేపు ఆగి నీటి ప్రవాహాన్ని పరిశీలించారు. అక్కడ వరద లేకపోవడంతో..ప్రస్తుత ప్రభుత్వ తీరుతో గోదావరి నదిలో చిల్లర నాణేలు సమర్పించేందుకు నీరు లేకుండా పోయిందని వ్యాఖ్యానించారు. కేటీఆర్ వెంట బీఆర్ఎస్ నేతలు వేముల ప్రశాంత్‌రెడ్డి, సత్యవతి రాథోడ్, కొప్పుల ఈశ్వర్, సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి, జగదీశ్‌రెడ్డి, మల్లారెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, పాడి కౌశిక్‌రెడ్డి, గంగుల కమలాకర్, గోరటి వెంకన్న, వాణీదేవి, ఎలగందుల రమణ, బాల్క సుమన్, దివాకర్‌రావు, చిన్నయ్య, గండ్ర వెంకటరమణారెడ్డి, కోరుకంటి చందర్, సుంకె రవిశంకర్, ముఠా గోపాల్, కోవ లక్ష్మీ, విజయుడు ఉన్నారు.

ఇది ఎన్‌డీఎస్‌ఏ ఆర్డర్

- బరాజ్‌లలో నీటిని నిల్వ చేయవద్దని ఎన్‌డీఎస్ఏ కమిటీ స్పష్టం చేసింది
- విలేకరుల సమావేశంలో మంత్రి ఉత్తమ్

సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌లలో నీటిని నిల్వ చేయరాదని నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ(ఎన్డీఎస్ఏ) నిపుణుల కమిటీ కోరిందని..వారికంటే కేటీఆర్‌కు కొద్దిగా ఎక్కువ పరిజ్ఞానం ఉన్నట్టుందని రాష్ట్ర నీటిపారుదలశాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఎద్దేవా చేశారు. దేశంలోనే అత్యంత నిపుణులైన ఆరుగురితో ఎన్డీఎస్ఏ ఈ కమిటీ ఏర్పాటు చేసిందని, వారి సూచనల ప్రకారమే ప్రభుత్వం ముందుకు పోవాలా? కేటీఆర్ చెప్పినట్టు పోవాలా? అని ప్రశ్నించారు. నీరు ఉన్నా పంపింగ్ చేయడం లేదని తప్పుడు ప్రచారం చేస్తున్న కేటీఆర్ తన పేరును జోసెఫ్ గోబెల్స్‌గా మార్చుకోవాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. జలసౌధలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆగస్టు 2లోగా కాళేశ్వరం పంప్‌హౌస్‌లను ఆన్ చేయకుంటే 50వేల మంది రైతులతో కలిసి తామే ఆన్ చేస్తామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అల్టిమేటం జారీ చేయడంపై స్పందిస్తూ.. లోక్‌సభ ఎన్నికల్లో ఒక్క ఎంపీ సీటు గెలవకపోవడంతోనే ఇలా మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

పంపింగ్ సాధ్యం కాదు

పంపింగ్ చేయాలంటే అన్నారం బరాజ్‌లో కనీసం 11 మీటర్లు, సుందిళ్ల బరాజ్‌లో కనీసం 9 మీటర్ల ఎత్తులో నీరు నిల్వ ఉండాలని, రెండు బరాజ్‌లలో 5 మీటర్ల నీటిమట్టం లోపే బుంగలు పడి ఉండడంతో పంపింగ్ సాధ్యం కాదని ఉత్తమ్ స్పష్టం చేశారు. బరాజ్‌ల గేట్లు దింపి పంప్‌హౌస్‌ల ద్వారా వాటిలోకి నీరుఎత్తిపోస్తే అవి కొట్టుకుపోతాయని, కేటీఆర్ అదే కోరుకుంటున్నట్టు ఉందని అనుమానం వ్యక్తం చేశారు. బరాజ్‌లు కొట్టుకుపోతే భారీ ప్రాణ, ఆస్తినష్టం వాటిల్లుతుందన్నారు. దిగువ ఉన్న సమ్మక్క బరాజ్, సీతమ్మ సాగర్ బరాజ్‌లూ కొట్టుకుపోతాయని, భద్రాచలం, ఏటూరు నాగారంతో పటు 44 గ్రామాలు పూర్తిగా నీట మునుగుతాయని తెలిపారు. నీళ్లు మళ్లించడానికి తక్కువ నిల్వ సామర్థ్యంతో బరాజ్‌లు నిర్మిస్తారని, ఏకంగా 16 టీఎంసీల నిల్వ సామర్థ్యంతో మేడిగడ్డ బరాజ్‌ను నిర్మించారని తప్పుబట్టారు. ప్లానింగ్, డిజైన్లు, క్వాలిటీ కంట్రోల్, నిర్మాణం, నిర్వహణ, పర్యవేక్షణ లోపాలతోనే బరాజ్‌లు విఫలమయ్యాయని.. ఎన్డీఎస్ఏ కమిటీ నివేదిక ఇచ్చిందని గుర్తు చేశారు.

కేటీఆర్, కేసీఆర్ క్షమాపణలు చెప్పాలి

కమీషన్ల కక్కుర్తితో రీఇంజనీరింగ్ చేసి రూ.లక్ష కోట్లతో కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించారని కేసీఆర్‌పై మంత్రి ఉత్తమ్ ఆరోపణలు చేశారు. ప్రాజెక్టు పూర్తయ్యేసరికి రూ.1.47లక్షల కోట్లకు వ్యయం పెరుగుతందని కాగ్ తేల్చిందన్నారు. రాష్ట్ర ప్రజలపై ఆర్థికభారం మోపినందుకుగాను మీరు, మీ తండ్రి కేసీఆర్.. తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలన్నారు.

2 రోజుల్లో ఎల్లంపల్లి నుంచి పంపింగ్

బరాజ్‌లు మినహా కాళేశ్వరం ప్రాజెక్టులోని మిగిలిన భాగాలను వాడుకుంటామని మంత్రి ఉత్తమ్ స్పష్టం చేశారు. ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి మిడ్‌మానేరుకు నీటిని పంపింగ్ చేసే ప్రక్రియ రెండు రోజుల్లో ప్రారంభిస్తామన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన రామడుగు, అనంతగిరి, ఇమామాబాద్, మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్‌తో పాటు ఎగువ మానేరుకు సైతం ఎల్లంపల్లి నీటినే తరలిస్తామని చెప్పారు. ఎల్లంపల్లిలో 14 టీఎంసీల నిల్వలను కొనసాగిస్తూ మిగిలిన నీళ్లను పంపింగ్ చేస్తామన్నారు. శ్రీరాంసాగర్ నిండిన వెంటనే నీళ్లను ఎత్తిపోస్తామన్నారు.

విహార యాత్రలకు బీఆర్ఎస్ నేతలు: జీవన్‌రెడ్డి

మేడిగడ్డ బరాజ్‌ను బీఆర్ఎస్ ప్రభుత్వమే నిర్మించగా, వారి హయాంలోనే కుంగిందని ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి స్పష్టం చేశారు. మేడిగడ్డ ఘటన వెనక అనుమానాలున్నాయని కేటీఆర్ అనడాన్ని తప్పుబట్టారు. విహార యాత్రల కోసం కాళేశ్వరం ప్రాజెక్టు సందర్శనకు వెళ్లారని విమర్శించారు.

ధరణిపై ప్రజల్లోకి ఆర్వోఆర్ ముసాయిదా

- విస్తృత సంప్రదింపులు, ప్రజల సూచనలు, అఖిలపక్షం తర్వాతే కొత్త చట్టం
- ధరణి సమస్యలకు శాశ్వత పరిష్కారం కోసం లోతుగా అధ్యయనం చేయాలి
- సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయం



సమావేశంలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో మంత్రి పొంగులేటి, కేశవరావు, జానారెడ్డి

సాక్షి, హైదరాబాద్: రికార్డ్ ఆఫ్ రైట్స్ (ఆర్వోఆర్) చట్ట ముసాయిదాను ప్రజల్లో ఉంచి వారి అభిప్రాయాలు, సలహాలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి నిర్ణయించారు. చట్టం చేసే ముందు పార్లమెంటరీ పద్ధతిని అనుసరించాలని, మరీ ముఖ్యంగా భూ సమస్యల విషయంలో ప్రజలు, రైతుల అభిప్రాయాలు తీసుకున్న తర్వాతే ముందుకెళ్లడం మంచిదని అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో తీసుకురావాలనుకుంటున్న ఆర్వోఆర్ కొత్త చట్టం విషయంలో విస్తృత సంప్రదింపులు జరపాలని, అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయాలని, అసెంబ్లీలో చర్చ జరిపిన తర్వాతే కొత్త చట్టాన్ని అమల్లోకి తేవాలని చెప్పారు. సచివాలయంలో సీఎం అధ్యక్షతన శుక్రవారం ధరణి సమస్యలపై సమీక్ష జరిగింది. ఈ సమావేశంలో రేవంత్ మాట్లాడుతూ ధరణి సమస్యలకు శాశ్వత పరిష్కారం కనుగొనేందుకు మరింత లోతుగా అధ్యయనం చేయాలని సూచించారు. ఒకప్పుడు గ్రామస్థాయిలోనే అందుబాటులో ఉండే రికార్డులు చట్టాల మార్పుతో క్రమంగా మండల కేంద్రానికి, తర్వాత జిల్లా కేంద్రానికి, రాష్ట్ర స్థాయికి వెళ్లిపోయి ప్రజలకు దూరమయ్యాయని అన్నారు. గతంలో భూ సమస్యల పరిష్కారానికి అప్పీలు చేసుకునే అవకాశం ఉండేదని, ధరణితో గ్రామ, మండల స్థాయిలో ఏ సమస్యకు పరిష్కారం లేకుండాపోయిందని, సమస్త అధికారాలు జిల్లా కలెక్టర్‌కు అప్పగించారని వెల్లడించారు. కలెక్టర్లు తీసుకునే ఏ నిర్ణయాలను ప్రశ్నించే అవకాశం లేకుండా ధరణిని రూపొందించారని, ఈ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించినప్పుడే రైతులకు స్వాంతన కలుగుతుందని రేవంత్ చెప్పారు. భూదాన్, పోరంబోకు, బంచరాయి, ఇనాం, కాందిశీకుల భూముల సమస్యలున్న ఓ మండలాన్ని ఎంపిక చేసుకొని, అక్కడ ఎదురవుతున్న సమస్యలపై అధ్యయనం చేసి సమగ్ర నివేదిక రూపొందిస్తే ఆ సమస్యలపైనా పూర్తి స్పష్టత వస్తుందన్నారు. అవసరాన్ని బట్టి అసెంబ్లీలో చర్చించి ఈ భూములపై తుది నిర్ణయం తీసుకోవచ్చని పేర్కొన్నారు. ఈ సమీక్షలో రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పంచాయతీరాజ్ మంత్రి సీతక్క, రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, మాజీ మంత్రి కె. జానారెడ్డి, ధరణి కమిటీ సభ్యులు ఎం.కోదండరెడ్డి, ఎం.సునీల్‌కుమార్, రేమండ్‌పీటర్, మధుసూదన్, రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిత్తల్, సీఎం ముఖ్య కార్యదర్శి వి.శేషాద్రి, ఓఎస్డీ వేముల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

సాదాబైనామా... చేద్దామా.. వద్దా?

సాదాబైనామాల పరిష్కారంపై ఈ సమావేశంలో చర్చ జరిగినట్టు తెలిసింది. రాష్ట్రవ్యాప్తంగా 9.24 లక్షల దరఖాస్తులు ఇంకా పెండింగ్‌లో ఉన్న నేపథ్యంలో కొత్త ఆర్వోఆర్ చట్టంలో ఈ సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారానికి తగిన మార్గం కనుగొనాలనే చర్చ వచ్చింది. అయితే, ఒకరిద్దరు అధికారులు ఇందుకు అభ్యంతరం చెప్పినట్టు తెలిసింది. సాదాబైనామాలను ఇప్పటికే పలుమార్లు పరిష్కరించామని, ఇంకా అవసరం లేదని, ఒకవేళ చేసినా దుర్వినియోగం జరుగుతుందని, లేదంటే ప్రస్తుత రిజిస్ట్రేషన్ ఫీజులు వసూలు చేసి వారికి హక్కులు కల్పించాలని చెప్పినట్టు తెలిసింది. ఈ అభిప్రాయాలతో విభేదించిన రెవెన్యూమంత్రి పొంగులేటి ఎట్టి పరిస్థితుల్లోనూ సాదాబైనామా దరఖాస్తులను పరిష్కరించాల్సిందేనని, తాను నియోజకవర్గానికి వెళ్లినప్పుడు వచ్చే భూసమస్యల్లో ఇవి కూడా ప్రధానంగా ఉంటున్నాయని చెప్పారు.

నేత కార్మికులకు ఉపాధి: సీఎం రేవంత్

చేనేత, పవర్‌లూమ్ కార్మికుల ఉపాధి కల్పనకు చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. తెలంగాణ హ్యాండ్లూమ్ వీవర్స్ కో-ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ (టీజీసీవో) కార్యకలాపాలపై సీఎం శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఆగస్టు 15 తర్వాత అన్ని ప్రభుత్వ విభాగాల్లో యూనిఫాం వస్త్రాలు కొనుగోలు చేసే వారితో సమావేశం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఆర్టీసీ, పోలీసు, ఆరోగ్య విభాగాల్లోనూ ప్రభుత్వ సంస్థల నుంచే వస్త్రం సేకరించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు.


కేంద్రంపై బీసీల తిరుగుబాటు తప్పదు: ఆర్.కృష్ణయ్య

బీసీలకు బడ్జెట్‌లో 2లక్షల కోట్లు కేటాయించాలి



కాచిగూడ: అన్ని రంగాల్లో బీసీలను విస్మరిస్తున్న కేంద్ర ప్రభుత్వంపై బీసీల తిరుగుబాటు తప్పదని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య హెచ్చరించారు. జాతీయ బీసీ యువజన సంఘం అధ్యక్షుడు గవ్వల భరత్ కుమార్ అధ్యక్షతన శుక్రవారం కాచిగూడలోని అభినందన్ గ్రాండ్‌లో నిర్వహించిన బీసీ కుల సంఘాల ప్రతినిధుల సమావేశంలో ఆర్.కృష్ణయ్య ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా గుజ్జ కృష్ణ, గుజ్జ సత్యంలతో కలిసి ఆయన మాట్లాడుతూ.. కేంద్ర బడ్జెట్‌లో బీసీలకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. 80 కోట్ల మంది బీసీలకు బిచ్చమేసినట్లు రూ.2,300 కోట్లు ఇవ్వడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీల బడ్జెట్‌ను రూ.2లక్షల కోట్లకు పెంచాలని డిమాండ్ చేశారు. కాగా, రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్లు పెంచకుండా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తే తీవ్రస్థాయిలో ఉద్యమిస్తామని ఆర్.కృష్ణయ్య హెచ్చరించారు. ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్నట్లుగా బీసీ రిజర్వేషన్లు తప్పకుండా పెంచాలని కోరారు. ఈ మేరకు చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు.

బీసీలకు రూ.3 వేల కోట్లేనా?



సాక్షి, హైదరాబాద్: కేంద్ర బడ్జెట్‌లో బీసీలకు రూ.3వేల కోట్లు మాత్రమే కేటాయించడమేమిటని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ ప్రశ్నించారు. ఆయన తెలంగాణ సచివాలయం వద్ద శుక్రవారం మాట్లాడుతూ పదేళ్లుగా కేంద్ర ప్రభుత్వం బీసీలకు నిధులు కేటాయించకుండా అన్యాయం చేసినందునే..పార్లమెంట్ ఎన్నికల్లో ఆ పార్టీకి తగిన బుద్ధి చెప్పారని గుర్తు చేశారు. అయి నా ఆ పార్టీలో మార్పు రావడం లేదని విమర్శించారు. ఒకవైపు బీసీలను కేంద్రం మోసగిస్తుంటే.. రాష్ట్ర బడ్జెట్‌లో బీసీ సంక్షేమానికి రూ.9వేల కోట్లు కేటాయించిందని తెలిపారు. గతంతో పోలిస్తే రూ.3వేల కోట్లు అదనంగా పెంచినప్పటికీ.. డిమాండ్‌కు తగినట్లు కేటాయింపులు జరపలేదని పేర్కొన్నారు.

ఆ రైతుల సమస్యలు పరిష్కరించండి

రుణమాఫీ కాని రైతుల సమస్యలపై మాజీ మంత్రి హరీశ్‌రావు



సాక్షి, హైదరాబాద్: రుణమాఫీ కాలేదని అనేక మంది రైతులు ఆవేదన చెందుతున్నారని, దీన్ని పరిష్కరించేందుకు ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని 'ఎక్స్'వేదికగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మాజీమంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు కోరారు. డిసెంబర్ 9న రైతు రుణమాఫీ చేస్తామని మాట తప్పారని, ఏడు నెలల తర్వాత ఆ ప్రక్రియను ప్రారంభించడం వల్ల రైతులకు కొత్త సమస్యలు ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ముందుగా ఏడు నెలల వడ్డీ చెల్లించాకే, రుణమాఫీ చేస్తామని బ్యాంకర్లు రైతుల్ని వేధిస్తున్నారని వివరించారు. ప్రభుత్వం తక్షణం స్పందించి, డిసెంబర్ నుంచి జూలై దాకా వడ్డీని తామే భరిస్తామని, రైతుల నుంచి వసూలు చేయవద్దని స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి మెదక్ జిల్లా నర్సాపూర్ నియోజకవర్గం శివంపేట్ మండలానికి చెందిన ఒక రైతు పంట రుణాన్ని రూ.9000 మిత్తి కట్టించుకున్నాకే క్లోజ్ చేశారని, ఉమ్మడి కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలానికి చెందిన రైతులకూ ఇదే పరిస్థితి ఎదురైందని తెలిపారు. రైతులు పంపిన విజ్ఞప్తులను మీ పరిశీలనకు పంపుతున్నామని, తక్షణమే పరిష్కరించాలని హరీశ్‌రావు కోరారు.

పార్టీలే వేరు.. ఆలోచనా విధానం ఒక్కటే

రేవంత్, కేసీఆర్‌లపై బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు ధ్వజం



సాక్షి, న్యూఢిల్లీ: కాంగ్రెస్, బీఆర్ఎస్ లు.. పార్టీలే వేరు కానీ, నేతల ఆలోచనా విధానం మాత్రం ఒక్కటే అని బీజేపీ మెదక్ ఎంపీ రఘునందన్‌రావు అన్నారు. రాష్ట్రంలో జెండాలు మారాయి తప్ప విధానాలు మారలేదంటూ సీఎం రేవంత్‌రెడ్డి, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ల తీరుపై విమర్శలు చేశారు. కేంద్ర బడ్జెట్‌పై అసత్యాలు, అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. శుక్రవారం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లా డారు. కేంద్ర పన్నుల్లో రాష్ట్ర వాటాగా రూ.26 వేల కోట్లు, గ్రాంట్స్ కింద రూ.21 వేల కోట్లపైన చూపించారన్నారు. ఈ రెండు కలిపితే రూ.50 వేల కోట్లు తెలంగాణకు వస్తుండగా.. మరి రాష్ట్రానికి ఏమిచ్చారని ఎలా ప్రశ్ని స్తున్నారని రఘునందన్ నిలదీశారు. 'నిధులు వచ్చుడో.. ఇద్దరం చచ్చుడో'అన్న వారు.. కేంద్రం తెలంగాణకు నిధులు ఇచ్చిందని తేలితే ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ముక్కు నేలకు రాస్తారా? అంటూ సవాల్ విసిరారు. మూసీ ప్రక్షాళనకు నిధులు ఇవ్వలేదన్న సీఎం, కేంద్రానికి డీపీఆర్ ఇచ్చారా? డీపీఆర్ ఇవ్వకుండా నిధులు ఎలా వస్తాయని ప్రశ్నించారు. రాష్ట్ర బడ్జెట్‌లో కొండగల్‌కు రూ.5 వేల కోట్లు ఇచ్చుకున్న వారు కేంద్ర బడ్జెట్‌పై మాట్లాడే హక్కు లేదన్నారు.

మరో 90 రోజుల్లో 30 వేల ఉద్యోగాలు

▶ మొదటి పేజీ తరువాయి

డిఫెన్స్ ట్రెనింగ్ ఇనిస్టిట్యూట్‌లో ఫైర్‌మెన్ పాసింగ్ అవుట్ పరేడ్‌కు సీఎం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పరేడ్‌లో పాల్గొన్న 483 మంది ఫైర్‌మెన్‌ల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అగ్నిమాపక శాఖ డీజీ నాగిరెడ్డితో కలిసి పరేడ్‌ను పరిశీలించారు. అనంతరం శిక్షణలో ఉత్తమ ప్రతిభకనబర్చిన వారికి ట్రోఫీలను, అదేవిధంగా అగ్నిమాపక శాఖలో డ్రైవర్ ఆపరేటర్లుగా నియమితులైన 157 మందికి ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి నియామక పత్రాలను అందించారు. అనంతరం సీఎం మాట్లాడారు.

జాబ్ కేలండర్ ద్వారా ప్రతి ఖాళీ భర్తీ

'ఉద్యోగాల నియామకంలో ప్రభుత్వం తన చిత్తశుద్ధిని నిరూపించుకుంటోంది. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 90 రోజుల్లోనే 31 వేల ఉద్యోగ నియామక పత్రాలను నిరుద్యోగులకు అందించాం. ఇప్పటికే ఇచ్చిన ఉద్యోగాలతో పాటు త్వరలో భర్తీకానున్న పోస్టులు కలిపితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపే 60 వేల పైచిలుకు ఉద్యోగాలు భర్తీ చేసినట్టవుతుంది. రాష్ట్ర ప్రభుత్వంలో ఏర్పడే ప్రతి ఖాళీని జాబ్ కేలండర్ ద్వారా అందించాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం నిరుద్యోగులకు ఇబ్బందులు ఏమైనా ఉంటే మంత్రులు, అధికారుల దృష్టికి తెండి. నిరసనలు తెలపాల్సిన పనిలేదు.. ఆందోళన చెందాల్సిన పని అంతకంటే లేదు. మంత్రులు, ఉన్నతాధికారులు మీకు అందుబాటులో ఉంటారు. సహేతుకమైన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తెస్తే వాటిని పరిష్కరించేందుకు మీ రేవంత్ అన్నగా ఎప్పుడూ నిబద్ధతతో పని చేస్తా..'అని సీఎం పేర్కొన్నారు.

ఉద్యోగుల్లో విశ్వాసం పెరిగింది:

'ప్రభుత్వ ఉద్యోగులకు యజమాని రాష్ట్ర ప్రభుత్వం. యజమాని ప్రతి నెలా 1వ తేదీన జీతం ఇవ్వకపోతే ఆ ఉద్యోగి విశ్వాసం కోల్పోతాడు. గత ఎనిమిదేళ్లలో అధికారంలో ఉన్న ప్రభుత్వం.. ఉద్యోగులకు జీతాలు ఎప్పుడు వస్తాయో లేదో తెలియని గందరగోళ పరిస్థితి తెచ్చింది. పదవీ విరమణ పొందిన వారికి పింఛన్ ఎప్పుడు వస్తుందో తెలియని పరిస్థితి ఉండేది. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఆర్థికమంత్రి భట్టి విక్రమార్క ఆర్థిక నిబద్ధతను పాటించి.. ప్రతి నెలా 1వ తేదీనే ప్రభుత్వ ఉద్యోగు లకు జీతాలు, ఉద్యోగ విరమణ పొందిన వారికి ఫింఛన్ అందేలా చర్యలు తీసుకున్నారు. దీంతో ఉద్యోగుల్లో విశ్వాసం పెరిగింది. గురువారం నాటి రూ.2.91 లక్షల కోట్ల బడ్జెట్‌లో విద్యకు, ఉపాధికి, వ్యవసాయానికి అత్యధిక ప్రాధాన్యత ఇచ్చాం. రైతులకు సహాయం, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యాలు నిర్దేశించుకున్నాం..' అని సీఎం తెలిపారు.

ఇది ఉద్యోగం కాదు.. సమాజ సేవ

'కఠినమైన ఫైర్ మెన్ శిక్షణ పూర్తి చేసుకుని సమాజానికి సేవలందించేందుకు 483 మంది ముందుకు వచ్చినందుకు సంతోషంగా ఉంది. ఫైర్ సిబ్బంది అంటే జీతాల కోసమే పని చేసేవారు కాదు. ఏ విపత్తు వచ్చినా ప్రాణాలు త్యాగం చేసైనా ప్రజలను కాపాడతామన్న సామాజిక బాధ్యత తీసుకోవడం..'అని రేవంత్ అన్నారు. యువకులను సుశిక్షితులుగా మార్చిన అగ్నిమాపక శాఖ డీజీ నాగిరెడ్డి, ఫైర్ సర్వీసెస్ అండ్ సివిల్ డిఫెన్స్ ట్రెనింగ్ ఇనిస్టిట్యూట్ ఉద్యోగులను సీఎం అభినందించారు. రంగారెడ్డి జిల్లా ఇన్ చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఫైర్ డీజీ నాగిరెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్, ఎమ్మెల్సీలు పట్నం మహేందర్ రెడ్డి, ఎగ్గె మల్లేశం, హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రవిగుప్తా, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, అగ్నిమాపకశాఖ డైరెక్టర్ జీవీ నారాయణరావు పాల్గొన్నారు.

గుండె సమస్యలపై అవగాహన అవసరం

- అపోలో ఆస్పత్రి జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సంగీతారెడ్డి
- హెచ్ఐసీసీలో ప్రారంభమైన ఇంటర్వెన్షనల్ కార్డియాలజీ సదస్సు



సదస్సును ప్రారంభిస్తున్న అపోలో ఆస్పత్రి జాయింట్ ఎండీ సంగీతారెడ్డి తదితరులు

మాదాపూర్: గుండె సమస్యలపై అందరికీ అవగాహన అవసరమని అపోలో ఆస్పత్రి జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సంగీతారెడ్డి పేర్కొన్నారు. మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో శుక్రవారం 3 రోజుల పాటు నిర్వహించనున్న ఇంటర్వెన్షనల్ కార్డియాలజీ సదస్సును ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...గుండె సమస్యల నుంచి ఉపశమనానికి అనేక కొత్త పద్ధతులున్నాయన్నారు. ఇంటర్వెన్షనల్ కార్డియాలజీ రోగిని గాయం, అనారోగ్యం, మరణాల నుంచి కాపాడుతుందని తెలిపారు. గతంలో ధమనులు పూర్తిగా బ్లాక్ అయినప్పుడు తప్పనిసరిగా శస్త్రచికిత్స చేసేవారన్నారు. ఇప్పుడు ధమనులను క్లియర్ చేయడానికి ప్రత్యేక పద్ధతులు ఉన్నాయన్నారు. రోగులు కోలుకోవడానికి సాధ్యమైనంత వరకు చౌకగా ఉండే తాజా పద్ధతులపై ప్రతినిధులకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. కార్డియాలజిస్టులు కార్డియోథొరాసిక్ సర్జన్లతో కూడిన 1,200 మంది ప్రతినిధులు హాజరయ్యారన్నారు. ఈ సదస్సులో ఇంట్రాకోరోనరీ ఇమేజింగ్, కాల్షియం మేనేజ్‌మెంట్, టీఏవీఆర్, ఇతర కొత్త ఆవిష్కరణల వంటి వివిధ సెషన్‌లు జరుగనున్నట్లు తెలిపారు.

పేద విద్యార్థికి కోమటిరెడ్డి అండ

- ఐఐటీలో చేరేందుకు ఆర్థికసాయం
- 'సాక్షి' కథనానికి స్పందించిన మంత్రి



మిర్యాలగూడ: నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలంలోని యాద్గార్‌పల్లి గ్రామానికి చెందిన కుంచం శివ జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో జనరల్ కేటగిరీలో 211వ ర్యాంకు, బీసీ కేటగిరీలో 24వ ర్యాంకు సాధించి ఐఐటీ ముంబైలో కంప్యూటర్ సైన్స్ విభాగంలో సీటు సంపాదించాడు. అయితే, శివ ఆర్థిక ఇబ్బందులతో ఫీజు చెల్లించలేకపోయాడు. చిన్న వయస్సులో తల్లిదండ్రులను కోల్పోయిన శివకు అండగా నిలిచేవారు లేరు. శివ దీనస్థితిపై 'సాక్షి'లో ఈ నెల 1న 'సరస్వతీ పుత్రుడికి సాయం చేయరూ'శీర్షికన వార్త ప్రచురితమైంది. ఈ వార్తను చూసిన నల్లగొండ కలెక్టర్ నారాయణరెడ్డి విషయాన్ని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన మంత్రి తన కుమారుడి పేరుతో నిర్వహిస్తున్న కోమటిరెడ్డి ప్రతీక్ ఫౌండేషన్ నుంచి ఏడాదికి రూ.లక్షన్నర ఆర్థిక సాయం ప్రకటించారు. శివ నాలుగు సంవత్సరాల కోర్సు పూర్తయ్యేంతవరకు అండగా నిలబడతానని హామీ ఇచ్చారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సహకారంతో కష్టపడి చదివి ఉన్నతస్థానానికి చేరుకుంటానని శివ చెప్పాడు. మంత్రికి కృతజ్ఞతలు తెలిపాడు.

నిరుపేద కష్టం తీరింది

ఐఐటీ విద్యార్థికి కలెక్టర్ చేయూత

- ల్యాప్‌టాప్, ఫస్ట్ సెమిస్టర్ ఫీజు అందజేత
- సాక్షి కథనానికి స్పందన

సాక్షి ఎఫెక్ట్



రోషన్‌కు ల్యాప్‌టాప్, చెక్ అందజేస్తున్న సిద్దిపేట కలెక్టర్ మనుచౌదరి

కోహెడ రూరల్ (హుస్నాబాద్)/ముషీరాబాద్: ఆర్థిక ఇబ్బందులతో ఐఐటీలో చేరలేకపోతున్న నిరుపేద విద్యార్థిపై సాక్షి దినపత్రికలో ప్రచురితమైన 'ఐఐటీలో సీటు.. ఫీజు చెల్లించలేని దుస్థితి'అనే వార్తకు సిద్దిపేట కలెక్టర్ మనుచౌదరి స్పందించారు. విద్యార్థికి చేయూతనిచ్చి తన ఉదారతను చాటుకున్నారు. సిద్దిపేట జిల్లా కోహెడ మండలం నకిరేకొమ్ముల గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన బోజిలా ఆర్యన్ రోషన్ ఎస్సీ కేటగిరీలో 2,406 ర్యాంకును సాధించాడు. జోసా కౌన్సెలింగ్‌లో మొదటి రౌండ్‌లోనే తిరుపతి ఐఐటీలో కెమికల్ ఇంజనీరింగ్ బ్రాంచ్‌లో సీటు సాధించాడు. కానీ ఆర్థిక ఇబ్బందులతో ఫీజు కట్టలేక దాతల సాయం కోరాడు. రోషన్ పడుతున్న ఇబ్బందులను సాక్షి దినపత్రికలో ప్రచురించగా.. కలెక్టర్, దాతలు కలసి శుక్రవారం సమీకృత జిల్లా కార్యాలయంలో అతనికి సహాయం అందజేశారు. ఒక ల్యాప్‌టాప్‌తో పాటు ఫస్ట్ సెమిస్టర్ ఫీజు కోసం రూ.36,750 చెక్‌ను అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్‌తో కలసి అందించారు. అలాగే ఇతర ఖర్చులకు కూడా దాతలు రూ.50 వేలు ఇచ్చారు. తన పరిస్థితి తెలుసుకొని కథనం రాసిన సాక్షి దినపత్రికకు రోషన్ కృతజ్ఞతలు తెలిపాడు. కాగా, చదువుకునే పట్టుదల ఉంటే పేదరికం అడ్డురాదని సిద్దిపేట జిల్లా కలెక్టర్ మనుచౌదరి అన్నారు. రోషన్‌పై వచ్చిన కథనానికి హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్‌దురిశెట్టి కూడా స్పందించారు. ముషీరాబాద్ తహసీల్దార్ గోవర్ధన్, అలాగే సాక్షి ప్రతినిధికి ఫోన్ చేసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కథనానికి స్పందించి హైదరాబాద్‌తోపాటు ఇతర ప్రాంతాలకు చెందిన పలువురు వ్యాపారులు, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు దాదాపు లక్ష రూపాయల వరకు గూగుల్‌పే, ఫోన్‌పే ద్వారా రోషన్‌కు సాయం అందించారు. విద్యార్థి రోషన్ శనివారం తిరుపతి ఐఐటీకి బయలుదేరి వెళ్తున్నాడు.

'నీట్' టాపర్లలోంచి మనోళ్లు ఔట్!

- రెండోసారి సవరించిన ఫలితాలతో తారుమారైన రాష్ట్ర విద్యార్థుల ర్యాంకులు
- రాష్ట్రం నుంచి తొలుత 47,371 మందికి అర్హత.. తాజాగా 47,356 మందికి..
- జనరల్ కేటగిరీలో కటాఫ్ మార్కులు 164 నుంచి 162కు తగ్గుదల



సాక్షి, హైదరాబాద్: జాతీయ అర్హత, ప్రవేశపరీక్ష (నీట్-యూజీ 2024)కు సంబంధించి తాజాగా విడుదలైన రెండోసారి సవరించిన (రీరివైజ్డ్) ఫలితాలు తెలంగాణ విద్యార్థులకు కాస్త నిరాశ మిగిల్చాయి. తొలిసారి ఫలితాల్లో జాతీయ స్థాయిలో టాప్-100 ర్యాంకుల్లో నిలిచిన మన విద్యార్థులు.. తాజా ఫలితాల్లో మాత్రం ఆ జాబితాలోనే లేరు. గత ఫలితాల్లో జాతీయ స్థాయిలో 77వ ర్యాంకుతో రాష్ట్ర టాపర్‌గా నిలిచిన అనురాన్ ఘోష్ తాజా ఫలితాల్లో ఏకంగా 137వ ర్యాంకుకు పరిమితమయ్యాడు. అలాగే ఎస్టీ కేటగిరీలో ఆలిండియా టాప్ ర్యాంకర్ తెలంగాణకు చెందిన గుగులోత్ వెంకట నృపేష్ సవరించిన ఫలితాల్లోనూ టాపర్‌గానే ఉన్నారు. కానీ అతని జాతీయ ర్యాంకు అప్పుడు 167 ఉండగా తాజా ఫలితాల్లో 219కు పడిపోయింది. అలాగే ఎస్టీ జాతీయ రెండో ర్యాంకర్‌గా నిలిచిన లావుడ్య శ్రీరామ్ నాయక్ ఇప్పుడు నాలుగో ర్యాంకుకు పరిమితమయ్యాడు. నీట్-యూజీ ఎంట్రన్స్‌లో అక్రమాలు జరిగినట్లు నిర్ధారణ కావడంతో సుప్రీంకోర్టు ఆదేశంతో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) సుమారు 1,500 మందికి మళ్లీ 'నీట్'నిర్వహించి సవరించిన ఫలితాలను కూడా ప్రకటించింది. కానీ ఫిజిక్స్ విభాగంలో అడిగిన ఓ ప్రశ్నకు గతంలో రెండు ఆప్షన్లను సరైన సమాధానంగా పరిగణించిన ఎన్‌టీఏ ఆ మేరకు రెండు రకాల సమాధానాలు ఇచ్చిన విద్యార్థులందరికీ ఐదు మార్కులు ఇచ్చింది. అయితే దీనిపై తాజాగా సుప్రీంకోర్టు నియమిత నిపుణుల బృందం ఆ రెండింటిలో ఒక దాన్నే సరైన సమాధానంగా గుర్తించడంతో ఆ ప్రశ్నకు రెండో సమాధానాన్ని ఎంచుకున్న విద్యార్థులకు 5 మార్కుల కోత పెట్టింది. దీంతో విద్యార్థుల ర్యాంకుల్లో తేడా వచ్చింది. తెలంగాణ నుంచి మొదటిసారి విడుదల చేసిన ఫలితాల్లో 47,371 మంది అర్హత సాధించగా తాజాగా సవరించిన ఫలితాల్లో 47,356 మంది అర్హత సాధించారు.

త్వరలో రాష్ట్రస్థాయి ర్యాంకులు...

ఆలిండియా ర్యాంకులు ప్రకటించిన ఎన్‌టీఏ... త్వరలో రాష్ట్రాలవారీగా అభ్యర్థుల జాబితాను రూపొందించనుంది. ముందుగా ఎంబీబీఎస్, బీడీఎస్ సీట్ల కోసం ఆలిండియా ర్యాంక్ ఆధారంగా మెరిట్ జాబితాను తయారు చేయనుంది.

తగ్గిన కటాఫ్ మార్కు...

సవరించిన ఫలితాల్లో కటాఫ్ మార్కు తగ్గింది. జనరల్ కేటగిరీ/ఈడబ్ల్యూఎస్ కింద తొలిసారి ఫలితాల్లో కటాఫ్ 164గా ఉండగా ఇప్పుడు 162కు తగ్గింది. ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ అండ్ పీహెచ్, ఎస్సీ అండ్ పీహెచ్‌ల అర్హత మార్కులు కూడా 129 నుంచి 127కు తగ్గాయి. అన్ రిజర్వ్‌డ్/ఈడబ్ల్యూఎస్ అండ్ పీహెచ్‌ల అర్హత మార్కు సైతం 146 నుంచి 144కు తగ్గింది. ఎస్టీ అండ్ పీహెచ్‌లోనూ 129 నుంచి 127కు తగ్గింది. గతేడాది రాష్ట్రంలో 459 మార్కులు వచ్చిన వారికి జనరల్ కేటగిరీలో కన్వీనర్ కోటాలో సీటు రాగా ఈసారి 500 మార్కులు దాటిన వారికి కూడా కన్వీనర్ కోటాలో సీటు వచ్చే అవకాశం ఉంది.

వైద్య బదిలీల్లో భారీ అవినీతి!

రాష్ట్ర ప్రభుత్వానికి ఇంటెలిజెన్స్ నివేదిక



సాక్షి, హైదరాబాద్: వైద్య, ఆరోగ్యశాఖలో డాక్టర్లు, నర్సులు, ఇతర సిబ్బంది బదిలీల్లో భారీ స్థాయిలో అవినీతి జరిగినట్లు ప్రభుత్వానికి నిఘా విభాగం శుక్రవారం నివేదిక అందజేసింది. ఈ దందాలో ప్రజారోగ్య సంచాలకుల కార్యాలయం మొదలు పైస్థాయి వరకు అందరి హస్తం ఉన్నట్లు స్పష్టం చేసింది. ఒక విభాగానికి చెందిన అధిపతితోపాటు ఆయన వద్ద పనిచేసే ఇద్దరు అధికారులు, సచివాలయంలోని ఇద్దరు అధికారుల పేర్లను నివేదికలో పేర్కొంది. ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేస్తూ సొంత క్లినిక్‌లు, ఆసుపత్రులను నడుపుతున్న కొందరు డాక్టర్లు బదిలీపై ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు ఇష్టపడక రూ. లక్షల్లో లంచాలు సమర్పించినట్లు తెలిసింది. ఇలా ఒక ఉన్నతాధికారి ఏకంగా రూ. 5 కోట్లు వసూలు చేసినట్లు ప్రచారం జరుగుతోంది. ముఖ్యంగా నర్సులకు సంబంధించిన సీనియారిటీ లిస్టు మాయాజాలంగా మారింది. దీనిపై నర్సులు పెద్ద ఎత్తున ధర్నాలు, ఆందోళనలు చేయడం తెలిసిందే. దీనిపై సీఎం కూడా ఆరా తీశారు. ఈ నేపథ్యంలోనే 23 ఆసుపత్రుల్లోని నర్సింగ్ విభాగాల్లో పనిచేస్తున్న అధికారులు, సిబ్బందికి షోకాజ్ నోటీసులు ఇచ్చి చర్యలు తీసుకోవాలని కూడా నిర్ణయం తీసుకున్నారు. ఈ వ్యవహారమంతా ఇంటెలిజెన్స్ నివేదిక ద్వారా ప్రభుత్వానికి చేరింది. పలు జిల్లాల డీఎంహెచ్‌వోలు కూడా డబ్బు వసూలు చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ విషయాన్ని ఇంటెలిజెన్స్ తన నివేదికలో పేర్కొనడం గమనార్హం. యాదాద్రి భువనగిరికి చెందిన ఒక కీలకాధికారి ఐదారు రోజుల కిందటే బదిలీపై మరో ప్రాంతానికి వెళ్లి రిపోర్టు చేసినప్పటికీ పాత కేంద్రంలో ఉంటూనే ఇప్పటికీ వర్క్ ఆర్డర్లు ఇస్తున్నట్లు తెలిసింది.

గురుకులంలో పాముకాటు

ఒక విద్యార్థి మృతి, ఇద్దరికి అస్వస్థత



రాజారపు గణాదిత్య (ఫైల్)

కోరుట్ల/మెట్‌పల్లిరూరల్: జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలం పెద్దాపూర్ గురుకుల విద్యాలయంలో పాముకాటుతో ఒక విద్యార్థి మృతి చెందగా, ఇద్దరు పిల్లలు అస్వస్థతకు గురయ్యారు. గురుకులంలో 8వ తరగతి చదువుతున్న రాజారపు గణాదిత్య(13), గణేశ్(13), హర్షవర్ధన్(14) గురువారం రాత్రి ఒకే గదిలో నేలపై నిద్రపోయారు. ఈ ముగ్గురిని పాము కాటు వేసినట్లు సమాచారం. రాజారపు గణాదిత్య వేకువజామున నాలుగు గంటలకు తీవ్ర అస్వస్థతతో మృతి చెందాడు. తమను ఏదో విషపురుగు కుట్టినట్లుగా ఉందని హర్షవర్ధన్, గణేశ్‌లు కేర్‌టేకర్ వెంకట్‌కు చెప్పగా తెల్లారి చూద్దాంలే అని సర్దిచెప్పినట్లు తోటి విద్యార్థులు చెప్పారు. తెల్లవారాక వెంకట్ ఈ విషయాన్ని ప్రిన్సిపాల్ దృష్టికి తీసుకెళ్లారు. వీరిద్దరిని తొలుత మెట్‌పల్లి ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లగా, తర్వాత మెరుగైన చికిత్స కోసం నిజామాబాద్ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం వీరిద్దరి ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు సమాచారం. ఈ ఘటనతో పెద్దాపూర్ గురుకులంలో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు హడలిపోయి తమ పిల్లలను ఇంటికి తీసుకెళ్లారు. బెడ్‌లు లేకుండా నేలపైన నిద్రించడంతోనే విద్యార్థులు పాముకాటుకు గురైనట్లుగా తల్లిదండ్రులు చెబుతున్నారు.

జీవో 317తో అన్యాయం జరిగినట్లు తేలితేనే ఉద్యోగులకు న్యాయం చేస్తాం

- మంత్రివర్గ ఉపసంఘం స్పష్టీకరణ
- సొంత జిల్లాలకు వెళ్లాలనే ఉద్దేశాన్ని ఉపేక్షించబోమని వెల్లడి
- నిర్దేశిత ఫార్మాట్‌లో వివరాలు ఇవ్వాలని అధికారులకు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: నూతన జోనల్ విధానంలో భాగంగా జీవో 317కు అనుగుణంగా జరిపిన ఉద్యోగుల కేటాయింపుల్లో అన్యాయం జరిగినట్లు తేలితేనే వారికి న్యాయం చేసేలా చర్యలు తీసుకుంటామని మంత్రివర్గ ఉపసంఘం స్పష్టం చేసింది. తాము నిర్దేశించిన తరహాలోనే ఉద్యోగుల కేటాయింపులకు సంబంధించిన సమాచారాన్ని ఇవ్వాలని అధికారులను ఆదేశించింది. జీవో 317 బాధిత ఉద్యోగుల వినతుల పరిష్కారం కోసం ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం శుక్రవారం సచివాలయంలో సమావేశమైంది. మంత్రి దామోదర రాజనర్సింహ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్‌తో పాటు ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. దాదాపు అన్ని ప్రభుత్వ శాఖల నుంచి పూర్తి సమాచారం వచ్చినప్పటికీ.. కొన్ని శాఖలు నిర్దిష్టమైన ఫార్మాట్‌లో సమాచారం ఇవ్వలేదని ఉపసంఘం గుర్తించింది. కాగా, కొందరు ఉద్యోగులు ఈ వెసులుబాటును ఉపయోగించుకొని సొంత జిల్లాలకు వెళ్లేందుకు ప్రయత్నాలు చేసినట్లు ఉపసంఘం దృష్టికి వచ్చింది. ఈ క్రమంలో ఉద్యోగులు సమర్పించిన దరఖాస్తులు పరిశీలించి నష్టపోయిన వారిని గుర్తించి సమస్యను పరిష్కరిస్తామని ఉపసంఘం పేర్కొంది. ఆమేరకు తాము కోరిన వివరాలను త్వరగా పంపాలని అధికారులను ఆదేశించింది. ఈ సమావేశంలో విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం, జీఏడీ ముఖ్య కార్యదర్శి మహేశ్‌దత్ ఎక్కా, హోంశాఖ ముఖ్య కార్యదర్శి రవి గుప్తా, పీఆర్సీ చైర్మన్ శివశంకర్, పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు చైర్మన్ శ్రీనివాసరావు, రాష్ట్ర వైద్యారోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టినా తదితరులు పాల్గొన్నారు.

త్వరలో ఎల్‌ఆర్‌ఎస్‌కు మోక్షం

- ప్రత్యేక టీమ్‌ల ఏర్పాటుకు చర్యలు
- సర్కార్ వద్ద 25 లక్షల దరఖాస్తులు
- అధికారులతో సమీక్షలో డిప్యూటీ సీఎం భట్టి



సమీక్షలో పొంగులేటి, భట్టి విక్రమార్క

సాక్షి, హైదరాబాద్: మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న లేఅవుట్ల క్రమబద్ధీకరణ ప్రక్రియకు త్వరలోనే మోక్షం లభించనుంది. కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరిన వెంటనే లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీం (ఎల్‌ఆర్‌ఎస్) దరఖాస్తులను పరిశీలించి ఆమోదించనున్నట్టు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రకటించారు. ఇందులో భాగంగా అధికారులకు మౌఖిక ఆదేశాలు జారీ చేసినా, ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిష్కారానికి నిర్దిష్టమైన విధివిధానాలు రూపొందించలేదు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులకు ఎప్పుడు మోక్షం లభిస్తుందోనని ప్రజలు ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో గురువారం సచివాలయంలోని తన కార్యాలయంలో రెవెన్యూమంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఇతర ఉన్నతాధికారులతో భట్టి విక్రమార్క దీనిపై సమీక్షించారు. ఎల్‌ఆర్‌ఎస్ విధివిధానాలపై పూర్తిస్థాయిలో కసరత్తు జరిపారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం హయాంలో 2020లో రూ.1,000 చెల్లించి దరఖాస్తు చేసుకోవాల్సిందిగా ఆహ్వానిస్తే.. రాష్ట్రవ్యాప్తంగా 25 లక్షల పైగా దరఖాస్తులు వచ్చాయి. ఇందులో హెచ్‌ఎండీఏ పరిధిలోనే 5 లక్షల దరఖాస్తులు ఉన్నట్టు సమాచారం. ఈ నేపథ్యంలో ప్రజలకు ఇబ్బందుల్లేకుండా ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను వేగంగా పరిష్కరించాలని అధికారులకు భట్టి విక్రమార్క సూచించారు. ఇందుకోసం 33 జిల్లాల్లో ప్రత్యేకంగా అధికారులతో బృందాలను ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. సిబ్బంది కొరత ఉంటే ఇతరశాఖల నుంచి డిప్యుటేషన్ ద్వారా తీసుకోవాలన్నారు. ఈ సమీక్షలో ఆర్థికశాఖ ప్రత్యేక ప్రధానకార్యదర్శి రామకృష్ణారావు, రెవెన్యూశాఖ ముఖ్యకార్యదర్శి నవీన్ మిట్టల్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ కార్యదర్శి జ్యోతి బుద్ధప్రకాష్, జీహెచ్‌ఎంసీ కమిషనర్ కాట అమ్రపాలి, గృహనిర్మాణ శాఖ ప్రత్యేక కార్యదర్శి వీపీ గౌతమ్ పాల్గొన్నారు.

క్లుప్తంగా...

జేపీఎస్ పోస్టులు గ్రేడ్-4 పంచాయతీ సెక్రటరీలుగా మార్పు

సాక్షి, హైదరాబాద్: జూనియర్ పంచాయతీ సెక్రటరీ (జేపీఎస్) పోస్టులను గ్రేడ్-4 పంచాయతీ సెక్రటరీలుగా మారుస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో జేపీఎస్‌లను బదిలీల ద్వారా గ్రేడ్-4 పంచాయతీ సెక్రటరీలుగా నియమించనున్నారు. ఈ మేరకు పీఆర్‌ఆర్‌డీ కమిషనర్ అనితా రామచంద్రన్ శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. గత నెల 30 నాటికి కొత్తగా చేరిన 463 మంది జేపీఎస్‌లు గ్రేడ్-4 పంచాయతీ సెక్రటరీలుగా నియమించేందుకు అర్హులని జిల్లా పంచాయతీ అధికారులు (డీపీవో) ప్రభుత్వానికి నివేదిక అందజేశారు. కొత్త పంచాయతీరాజ్ చట్టం ప్రకారం గ్రామ పంచాయతీలను గ్రేడ్లవారీగా విభజించనందున, కేటగిరీలు, గ్రేడ్లతో సంబంధం లేకుండా పంచాయతీ సెక్రటరీలను మంజూరైన పోస్టుల్లో నియమిస్తున్నట్లు ఉత్తర్వుల్లో ప్రభుత్వం పేర్కొంది. ఈ నేపథ్యంలో హెచ్‌వోడీ వద్ద అందుబాటులో ఉన్న 2,141 పోస్టుల్లో 463 మంది జేపీఎస్‌లను పంచాయతీ సెక్రటరీలుగా నియమిస్తున్నట్లు తెలిపింది.


గోల్కొండ కోటలో పంద్రాగస్టు వేడుకలు



సాక్షి, హైదరాబాద్: గోల్కొండ కోటలో పంద్రాగస్టు వేడుకల్ని నిర్వహించనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పరేడ్‌గ్రౌండ్‌లోని సైనిక అమర వీరుల స్మారక స్తూపం వద్ద నివాళులర్పించి తర్వాత గోల్కొండ కోటలో జాతీయ పతాకాన్ని ఎగుర వేస్తారని ఆమె తెలిపారు. స్వాతంత్య్ర దినం వేడుకల ఏర్పాట్లపై సీఎస్ శుక్రవారం డాక్టర్.బి.ఆర్.అంబేడ్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. అధికారులు సమన్వయంతో పనిచేసి వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని డీజీపీ, జీఏడీ కార్యదర్శితోపాటు వివిధ శాఖల ఉన్నతాధికారులను సీఎస్ ఆదేశించారు.


కోర్టు అంటే లెక్కలేదా?

పోలీసులపై నాంపల్లి కోర్టు ఆగ్రహం



సిటీ కోర్టులు: ఫోన్ ట్యాపింగ్ కేసులో నిందితులను ఇప్పటివరకు ఎందుకు అరెస్ట్ చేయలేదని నాంపల్లి కోర్టు పోలీసులను ప్రశ్నించింది. ఈనెల 11న ఏ-1 ప్రభాకర్ రావు, ఏ-6 శ్రవణ్‌కుమార్ రావుకు నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేయగా ఇప్పటి వరకు వారిని ఎందుకు అరెస్ట్ చేయలేదని అడిగింది. కోర్టు అంటే లెక్కలేకుండా పోయిందా? కోర్టు ఆదేశాలున్నా.. వారిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చడంలో ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేసింది. తదుపరి విచారణలోపు వారిని కోర్టులో హాజరుపర్చాలని శుక్రవారం నాంపల్లి 12వ అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ వి.ఈశ్వరయ్య పోలీసులను ఆదేశిస్తూ విచారణను ఈనెల 31కి వాయిదా వేశారు. ఇప్పటికే అరెస్టయి చంచల్‌గూడ జైల్లో ఉన్న ఏ-2 నుంచి ఏ-5 (ప్రణీత్‌రావు, భుజంగరావు, తిరుపతన్న, రాధాకిషన్‌రావు)లను పోలీసులు కోర్టులో హాజరుపర్చారు. ఏ-1, ఏ-6లను కచ్చితంగా హాజరపర్చాలని కోర్టు వారంట్ జారీ చేసినా వారిని ఇంకా అరెస్ట్ చేయకపోవడంతో న్యాయస్థానం సీరియస్ అయ్యింది. నిందితుల తరఫు న్యాయవాది సురేందర్‌రావు వాదనలు వినిపిస్తూ.. ఇప్పటికీ ఏ1, ఏ6లకు బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 196 ప్రకారం వారంట్ నోటీసులు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయని, వారికి ఎలాంటి నోటీసులు వెళ్లలేదని చెప్పారు. అనంతరం ఏ2 నుంచి ఏ5ల జ్యుడీషియల్ కస్టడీని ఈనెల 31 వరకు పొడిగించారు.









ఏదైతే అత్యంత ప్రకాశవంతమైనదో, ఏదైతో సూక్ష్మాతి సూక్ష్మమైనదో, దేనిలోనైతే సమస్త లోకాలు– వాటిలోని సకల లోకులతో యుక్తంగా స్థితమై వున్నాయో, అదే అనశ్వరమైన బ్రహ్మ.

– ముండకోపనిషత్తు (హైందవ ధర్మం)

సాక్షి

శనివారం, 27 జూలై 2024

ఆర్టీఐని బతకనివ్వరా?!

విధాన నిర్ణయాలపై అనవసర గోప్యత పాటించటం, నిజాలు రాబట్టే ప్రయత్నాలకు పాతరేయటం ప్రజాస్వామ్యానికి చేటు తెస్తుంది. సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) పుట్టి దాదాపు రెండు దశాబ్దాలు గడిచింది. లోటుపాట్లు సరిదిద్దుకుంటూ మరింత పదునెక్కాల్సిన ఆ చట్టం కాస్తా ప్రభుత్వాల పుణ్యమా అని నానాటికీ నీరుగారుతోంది. తాజాగా ఆ చట్టం తమకు వర్తించదంటూ జవాబిచ్చి మధ్యప్రదేశ్ ప్రభుత్వం ఆ జాబితాలో చేరింది. షోపూర్ జిల్లా కునోలో ఉన్న వన్యప్రాణి సంరక్షణ కేంద్రం, మాందసార్ జిల్లాలో నెలకొల్పబోయే మరో వన్యప్రాణి సంరక్షణ కేంద్రాల గురించి, ముఖ్యంగా చిరుతల సంరక్షణకు తీసుకుంటున్న చర్యల గురించి సమాచారం కావాలంటూ అడిగిన సమాచార హక్కు కార్యకర్త అజయ్ దూబేకు కళ్లు తిరిగి కింద పడేలా ప్రభుత్వ అటవీ విభాగం సమాధానమిచ్చింది. అలాంటి సమాచారం వెల్లడిస్తే దేశ భద్రతకూ, సార్వభౌమత్వానికీ ముప్పు ఏర్పడుతుందట. దేశ సమగ్రత, వ్యూహాత్మక, ఆర్థిక ప్రయోజనాలు దెబ్బతింటాయట. వేరే దేశంతో సంబంధాలు కూడా దెబ్బతినవచ్చుట. కాబట్టి చట్టంలోని సెక్షన్ 8(1)(ఏ) ప్రకారం ఇవ్వడం కుదరదట. ఒక చిరుత కూన కాలికి కట్టు కట్టినట్టున్న ఫొటో చూసి మొన్న ఫిబ్రవరిలో పులుల జాతీయ సంరక్షణ ప్రాధికార సంస్థకు దూబే ఫిర్యాదు చేశాడు. ఎట్టకేలకు అటవీశాఖ స్పందించింది. కానీ ఆ సమాచారం వెల్లడిస్తే మిన్ను విరిగి మీదపడుతుందన్న స్థాయిలో సమాధానమిచ్చింది.

ప్రభుత్వాల పనితీరుపై అవధుల్లేని సమాచారం పౌరులకు లభ్యమైనప్పుడే ప్రజాస్వామ్యానికి పునాదిగా భావించే స్వేచ్ఛ, సమానత్వాలు సాధించుకోవటం, వాటిని కాపాడుకోవటం సాధ్యమవుతుందని జగజ్జేత అలెగ్జాండర్‌కు గురువైన గ్రీకు తత్వవేత్త అరిస్టాటిల్ చెబుతాడు. అరిస్టాటిల్ క్రీస్తు పూర్వం రెండో శతాబ్దినాటివాడు. సమాచారం ఇవ్వటానికి ససేమిరా అంటున్న మన ప్రభుత్వాలు మానసికంగా తాము ఏకాలంలో ఉండిపోయామో తెలుసుకోవటం ఉత్తమం. ఇప్పుడే కాదు... 2005లో ఆర్టీఐ చట్టాన్ని తీసుకొచ్చినప్పుడే దేశభద్రత పేరు చెప్పి 22 సంస్థలకు మినహాయింపు ఇచ్చి దాని స్ఫూర్తిని దెబ్బతీశారు. తర్వాత కాలంలో ఆ జాబితా పెరుగుతూ పోయింది. ఆర్టీఐ పరిధిలోకి రాబోమని వాదించే వ్యవస్థలు, విభాగాలు ఎక్కువవుతున్నాయి. రాజకీయ పార్టీలు మొదలుకొని న్యాయవ్యవస్థ వరకూ ఇందులో ఎవరూ తక్కువ తినలేదు. పారదర్శకత తమవల్ల కాదని అందరికందరూ నిర్మొహమాటంగా చెబుతున్నారు. అసలు ఏ సమాచారమైనా కోరితే 30 రోజుల్లో దాన్ని అందజేయాలని ఆర్టీఐ నిబంధనలు నిర్దేశిస్తున్నాయి. అది ఎక్కడా అమలవుతున్న దాఖలా లేదు.

అప్పీల్ కోసం వెళ్తే అక్కడ మరో కథ. చాలా రాష్ట్రాల్లో సమాచార కమిషనర్లు, ఇతర సిబ్బంది తగినంతమంది ఉండటం లేదు. కొన్నిచోట్ల ప్రధాన కమిషనర్ల జాడలేదు. అయిదేళ్ల క్రితం కేంద్ర ప్రభుత్వం కేంద్ర రాష్ట్ర ప్రధాన సమాచార కమిషనర్ల, కమిషనర్ల పదవీకాలం, వారి జీతభత్యాలు, సర్వీసు నిబంధనలు రూపొందించే నిర్ణయాధికారాన్ని తన చేతుల్లోకి తీసుకుంటూ ఆర్టీఐకి సవరణలు తెచ్చింది. ఈ సవరణలు సహజంగానే సమాచార కమిషన్ వ్యవస్థల స్వయంప్రతిపత్తిని దెబ్బతీశాయి. పార్లమెంటులో తగిన సంఖ్యాబలం ఉన్నది కనుక చట్ట సవరణలకు సులభంగానే ఆమోదం లభించింది. కానీ సంబంధిత వర్గాలతో మాట్లాడాకే ఆ సవరణలు తీసుకురావాలన్న కనీస సంప్రదాయాన్ని పాలకులు విస్మరించారు. పౌరులు ప్రధానంగా ప్రభుత్వాల నుంచే సమాచారం రాబట్టాలని కోరుకుంటారు. ఆ ప్రభుత్వమే రకరకాల ప్రయత్నాలతో దానికి అడ్డుపుల్లలు వేయదల్చుకుంటే ఇక ఆ చట్టం ఉండి ప్రయోజనమేమిటి? ఆర్టీఐ తీసుకొచ్చిన ఆనాటి ప్రధాని మన్మోహన్ సింగే తర్వాత కాలంలో దాన్ని 'మితిమీరి' వినియోగిస్తున్నారంటూ మండిపడ్డారు. పార్టీలకు అతీతంగా పాలకులందరిదీ ఇదే బాణీ. పాలనలో పారదర్శకత కోసం, ప్రభుత్వాలకు జవాబుదారీతనం పెంచటం కోసం వచ్చిన చట్టం హద్దులు దాటుతున్నదని పాలకులతోపాటు ఉన్నతాధికార గణం కూడా విశ్వసిస్తోంది. ఆర్టీఐని వమ్ము చేయటానికి ప్రయత్నిస్తూనే ఉన్నారు. కనుకనే సమాచారం కోరినవారి ఆనుపానులు క్షణాల్లో అవతలివారికి వెళ్తున్నాయి. సమాచార హక్కు ఉద్యమకారుల ప్రాణాలు గాల్లో దీపాలవుతున్నాయి. ఇప్పటివరకూ వందమందికి పైగా కార్యకర్తలను దుండగులు హత్యచేశారు.

ఈ ఏడాది మొదట్లో ఎలక్టోరల్ బాండ్స్ కేసులో సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పు పౌరుల సమాచార హక్కు ప్రాధాన్యతనూ, ప్రజాస్వామ్యంలో అది పోషించే కీలకపాత్రనూ తెలియజెప్పింది. రాజ్యాంగదత్తమైన ప్రాథమిక హక్కుల్లో దాన్నొకటిగా గుర్తించింది. ఏదైనా చట్టం వచ్చినప్పుడు దాన్ని సద్వినియోగం చేసుకునే వారున్నట్టే దుర్వినియోగం చేద్దామనీ, స్వప్రయోజనాలు సాధించు కుందామనీ ప్రయత్నించేవారు ఉంటారు. అంతమాత్రంచేత ఆ చట్టాన్ని నీరుగార్చకూడదు. కార్గిల్ అమర జవాన్ల కుటుంబాలకు ఉద్దేశించిన ఆదర్శ్ హౌసింగ్ సొసైటీలోకి రాజకీయ నేతలు, ఉన్నతాధికారులు చొరబడి ఫ్లాట్లు కొట్టేసిన వైనం ఆర్టీఐ చట్టం లేకపోయివుంటే బయటికొచ్చేదే కాదు. అలాగే మధ్యప్రదేశ్‌లో వ్యాపమ్ కుంభకోణం, పశ్చిమ బెంగాల్‌లో టీచర్ రిక్రూట్‌మెంట్ల అక్రమాలు ఎప్పటికీ వెలుగుచూసేవి కాదు. వ్యక్తులుగా ఎవరైనా దుర్వినియోగానికి పాల్పడితే శిక్షించే విధంగా నిబంధనలు తెస్తే తప్పులేదు. కానీ ఆ సాకుతో మొత్తం చట్టాన్నే నీరుగార్చాలని చూడటం, దేశ భద్రత పేరు చెప్పి అందరినీ బెదరగొట్టడం ప్రమాదకరమైన పోకడ. ఇలాంటి చర్యలు ప్రజాస్వామ్యాన్నీ, జవాబుదారీతనాన్నీ దెబ్బతీస్తాయి. నిరంకుశత్వానికి బాటలు పరుస్తాయి.

నిషేధాలే గానీ సేవలు గుర్తుండవా?

అభిప్రాయం



చెన్నమనేని విద్యాసాగరరావు

58 ఏళ్ల కిందట నాటి ఇందిరా గాంధీ ప్రభుత్వం, ఆర్ఎస్ఎస్ కార్యక్రమాలలో పాల్గొనకుండా ప్రభుత్వోద్యోగులపై నిషేధం విధించింది. ఆ నిషేధాన్ని మొన్న జూలై 9న కేంద్ర ప్రభుత్వం ఎత్తివేసింది. దానితో ప్రతిపక్ష నేతలు గగ్గోలు పెడుతున్నారు. సంస్థ భావజాలం, కార్యకలాపాలు నచ్చితేనే ఎవరైనా చేరడమో లేదా పరోక్షంగా మద్దతు ఇవ్వడమో చేస్తారు. చైనాతో జరిగిన యుద్ధంలో భారత సైన్యానికి తోడుగా ఆర్ఎస్ఎస్ కీలక పాత్ర పోషించింది. ప్రకృతి వైపరీత్యాల కాలాల్లో సేవలు అందించింది. గాంధీ హత్య ఘటనలో పోలీసుల దర్యాప్తు, కోర్టు విచారణ అనంతరం ఆర్ఎస్ఎస్‌పై వచ్చిన ఆరోపణలన్నీ సత్యదూరమని తేలిపోయింది. అయినాకూడా ఆర్ఎస్ఎస్‌ను ఇప్పటికీ మహాత్మగాంధీ హత్యతో ముడిపెట్టడం ఎంత దారుణమో ఆలోచించాలి.

గోవధను వ్యతిరేకిస్తూ లక్షలాది ప్రజల మద్దతును కూడగట్టిన రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్)ను నిలువరించేందుకు 1966 నవంబర్ 30న, అంటే 58 ఏళ్ల కిందట నాటి ఇందిరా గాంధీ ప్రభుత్వం, ఆర్ఎస్ఎస్ కార్యక్రమాలలో పాల్గొనకుండా ప్రభుత్వోద్యోగులపై నిషేధం విధించింది. ఆ నిషేధాన్ని మొన్న జూలై 9న కేంద్ర ప్రభుత్వం ఎత్తివేసింది. దానితో ప్రతిపక్ష నేతలు గగ్గోలు పెడుతున్నారు. ఆర్ఎస్ఎస్ మీద విధించిన నిషేధాల గురించే తప్ప... ఆ నిషేధాల ఎత్తివేత గురించి గానీ, పాకిస్తాన్, చైనా మన దేశం పైన యుద్ధం చేసిన సమయాల్లో, ప్రకృతి వైపరీత్యాల కాలాల్లో సామాన్య ప్రజలకు స్వయంసేవకులు అందించిన సేవలను మరిచిపోయారు.

కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చెప్పినట్టు... మహాత్మా గాంధీ హత్యానంతరం 1948 ఫిబ్రవరి 4న ఆర్ఎస్ఎస్‌పై పటేల్ విధించిన నిషేధాన్ని 18 నెలల తర్వాత ఆయనే హోంమంత్రి హోదాలో ఎత్తివేశారు. గాంధీ హత్య ఘటనలో పోలీసుల దర్యాప్తు, కోర్టు విచారణ అనంతరం ఆర్ఎస్ఎస్‌పై వచ్చిన ఆరోపణలన్నీ సత్య దూరమని తేలిపోయింది. అప్పుడు ఆర్ఎస్ఎస్ సర్‌సంఘచాలక్‌గా ఉన్న గురూజీ (ఎంఎస్ గోల్వాల్కర్)కి పటేల్ రాసిన లేఖలో సంఘ్ సేవలను ప్రశంసించడమే గాక, స్వయంసేవకులు కాంగ్రెస్‌లో చేరి సేవలను కొనసాగించాలని ఆహ్వానించారు. 1948 సెప్టెంబర్ 11న సర్దార్ పటేల్ రాసిన ఈ లేఖ 'జస్టిస్ ఆన్ ట్రయల్' పుస్తకంలో ఉంది.

ఆర్ఎస్ఎస్ శాఖను మహాత్మా గాంధీ సందర్శించిన సంఘటనను మనం గుర్తు చేసుకోవాలి. గాంధీజీ 1936లో వార్ధాకు దగ్గరలో జరిగిన సంఘ్ శిబిరాన్ని సందర్శించారు. ఆ తరువాతి రోజు ఆయన్ని కలుసుకోవడానికి డా. హెడ్గేవార్ వారి నివాసానికి వెళ్లారు. అక్కడ వారితో జరిపిన సుదీర్ఘమైన సంభాషణ వివరాలు పుస్తకరూపంలో లభిస్తున్నాయి. దేశ విభజన సమయంలో ఢిల్లీలోని తన నివాసానికి దగ్గరగా ఉన్న సంఘ్ శాఖకు గాంధీజీ మరోసారి వచ్చారు. స్వయంసేవకులతో మాట్లాడారు. ఈ వివరాలు 1947 సెప్టెంబర్ 27 నాటి 'హరిజన్' పత్రికలో ప్రచురితమయ్యాయి. స్వయంసేవకుల క్రమశిక్షణాయుత, కులభేదాలకు అతీతమైన వ్యవహారశైలిని ఆయన మెచ్చుకున్నారు.

1939 మే 12న పూనా నగరంలో జరిగిన ఆర్ఎస్ఎస్ కార్యకర్తల శిబిరానికి సంఘ్ కార్యకర్తల ఆహ్వానం మేరకు బాబాసాహెబ్ అంబేడ్కర్ ముఖ్య అతిథిగా వచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ సంస్థాపకులు డా.కేశవరావు హెడ్గేవార్, ఇతర ఆర్ఎస్ఎస్ స్థానిక ప్రముఖులు, అంబేడ్కర్ అనుయాయి బాలాసాహెబ్ సాలుంకే ఉన్నారు. వీరు 1957–62 మధ్య లోక్‌సభ సభ్యులు. వీరి ఆత్మకథలో ఈ ఘటనను పేర్కొన్నారు. 1957 ఏప్రిల్ 1 ఉగాది రోజున పూనాలో జరిగిన ఆర్ఎస్ఎస్ ఉత్సవంలో ఈ ఘటనను వారు బహిరంగ సభలో తెలియజేశారు. ఆర్ఎస్ఎస్‌ను అంబేడ్కర్ ఎక్కడా విమర్శించిన సందర్భాలే లేవు.



చైనాతో జరిగిన యుద్ధంలో భారత సైన్యానికి తోడుగా ఆర్ఎస్ఎస్ ఎంతో కీలక పాత్ర పోషించింది. అది చూసిన నాటి ప్రధాని నెహ్రూ ఎంతో ప్రభావితం అయ్యారు. ఆర్ఎస్ఎస్‌లోని ఒక దళం పూర్తి యూనిఫాం, బ్యాండ్‌తో 1963 గణతంత్ర దినోత్సవ పెరేడ్‌లో పాల్గొనేందుకు ఆహ్వానించారు. 1965 నాటి ఇండో–పాక్ యుద్ధ కాలంలో కూడా భారత సైన్యానికి ఆర్ఎస్ఎస్ అందించిన సేవలను గుర్తించి నాటి ప్రధాని లాల్‌బహదూర్ శాస్త్రి అప్పటి ఆర్ఎస్ఎస్ సర్‌సంఘచాలక్ ఎం.ఎస్.గోల్వాల్కర్‌ను ప్రశంసించారు.

ఇందిరా గాంధీ ప్రభుత్వం 1975లో విధించిన అత్యవసర పరిస్థితి సందర్భంలో ఒకసారి... అనంతరం 1992లో బాబ్రీ మసీదు ఘటన సందర్భంలో మరోసారి ఆర్ఎస్ఎస్‌పై నిషేధాలు విధించడం ... వివిధ ప్రభుత్వ శాఖల దర్యాప్తులు, న్యాయస్థానాల విచారణల అనంతరం ఎత్తివేయడం జరిగింది. సంఘ్ మీద ఏ సందర్భంలో నిషేధం విధించినా అవన్నీ రాజకీయ కారణాల వల్ల అప్పటి ప్రభుత్వాలు విధించినవే తప్ప ఒక్క ఆరోపణ కూడా కోర్టు విచారణల్లో రుజువు కాలేదు.

ఇందిర సర్కారు నిషేధం విధించడానికి ముందే ఈ అంశంపై కోర్టు తీర్పులను పరిశీలిస్తే... పంజాబ్ ఉద్యోగి రాంపాల్ అనే వ్యక్తి ఆర్ఎస్ఎస్ కార్యక్రమాలలో పాల్గొంటున్నాడనే కారణంతో ఉద్యోగం నుంచి తొలగించగా... ఆర్ఎస్ఎస్ రాజకీయ పార్టీ కాదంటూ పంజాబ్ – హరియాణా కోర్టు అతని తొలగింపు సమర్థనీయం కాదని తీర్పునిచ్చింది. మరో సంఘటన కర్ణాటకలోని రాయచూర్ జిల్లాకు సంబంధించినది. 1966లో అక్కడ అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా ఉన్న రంగనటచార్ అనే వ్యక్తి ఆర్ఎస్ఎస్ కార్యక్రమాల్లో పాల్గొంటున్నాడనే కారణంతో ఆయన పదోన్నతికి ఆటంకం కలుగగా... ఆర్ఎస్ఎస్ రాజకీయ సంస్థ కాదనీ, హిందుమేతరులకు అది వ్యతిరేకం కాదనీ 1966 జూలై 6న మైసూర్ హైకోర్టు తీర్పునిచ్చింది.

ఆర్ఎస్ఎస్ కార్యక్రమాలలో పాల్గొనే విషయంలో ప్రభుత్వోద్యోగులపై నిషేధం ఉన్నా, లేకపోయినా.. సంస్థ సిద్ధాంతం, భావజాలం, కార్యకలాపాలు తమకు నచ్చితేనే ఎవరైనా చేరడమో లేదా పరోక్షంగా మద్దతు ఇవ్వడమో చేస్తారు తప్ప, నిషేధం ఎత్తివేసినంత మాత్రాన దేశంలోని ప్రభుత్వోద్యోగులందరూ మూకుమ్మడిగా ఏ సంస్థ కార్యకలాపాల్లోనూ పాల్గొనరు గదా? అందువల్ల ప్రభుత్వోద్యోగులపై ఇన్నేళ్లు ఉన్న నిషేధాన్ని ఎత్తివేసినందుకు ఏదో జరిగిపోతుందన్నట్టు గగ్గోలు పెట్టడంలో అర్థం లేదు.

కాంగ్రెస్‌లో ఒకప్పటి అగ్రనేత, ఆ పార్టీ సర్కారులో కేంద్రమంత్రి, దేశ మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ 2018లో ఆర్ఎస్ఎస్ స్వయంసేవకుల తృతీయ వర్ష ముగింపు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. నాటి కాంగ్రెస్ వర్గాలు ఎంత వ్యతిరేకించినా ప్రణబ్ ఈ వేడుకలో భాగస్వామి అయ్యారు. 'నేను ఈ రోజున భరతమాత గొప్ప సంతానమైన డా. కేశవ బలిరామ్ హెడ్గేవార్‌కు అంజలి సమర్పించడానికి వచ్చాను' అని రాశారు. అదే ఏడాది కేరళలోని కొట్టాయంలో డిసెంబర్ 31న జరిగిన ఆర్ఎస్ఎస్ ప్రాథమిక శిక్షవర్గ ముగింపు కార్యక్రమంలో సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పనిచేసిన జస్టిస్ థామస్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. 'భారత్‌లో ప్రజలు ఎందుకు సురక్షితంగా ఉన్నారని ఎవరైనా నన్ను అడిగితే – మొదట రాజ్యాంగం, రెండవది ప్రజాస్వామ్య వ్యవస్థ, మూడు సైన్యం, నాలుగు ఆర్ఎస్ఎస్ వల్ల అని జవాబు చెపుతాను' అన్నారు. వీరేగాక లోకమాన్య జయప్రకాశ్ నారాయణ్, శాస్త్రవేత్తలైన జి.మాధవన్ నాయర్, కె. రాధాకృష్ణన్, కె.కస్తూరి రంగన్ వంటి పెద్దలు సైతం సంఘ్ కార్యకలాపాలను ప్రశంసించారు.

ఆర్ఎస్ఎస్ పైన నిషేధాన్ని ఎత్తివేసిన రెండు దశాబ్దాల తరువాత ఇందిరాగాంధీ నేతృత్వంలోని ప్రభుత్వం మహాత్మగాంధీ హత్యకు జరిగిన కుట్రపై విచారణ జరిపేందుకు ఒక కొత్త జ్యుడీషియల్ కమిషన్‌ను ఏర్పాటు చేసింది. సుప్రీంకోర్టు రిటైర్డ్ జడ్జి జె.జె. కపూర్‌ను చైర్మన్‌గా నియమించారు. ఆ కమిషన్ దాదాపు వందకు పైగా సాక్షులను విచారించి 1969లో నివేదిక సమర్పించింది. 'నేరస్థులు ఆర్ఎస్ఎస్ సభ్యులన్న విషయం ఎక్కడా రుజువు కాలేదు. ఆ సంస్థకు హత్యలో భాగం ఉందని నిరూపితం కాలేదు' అని కపూర్ కమిషన్ (సంపుటి –1, పేజీ–186) స్పష్టీకరించింది. దేశ విదేశాలలో కోట్లాదిమంది స్వయంసేవకులు ప్రతిరోజూ ప్రాతఃస్మరణంలో గాంధీజీ పేరును తలుచుకుంటారు. అయినప్పటికీ ఆర్ఎస్ఎస్‌ను మహాత్మాగాంధీ హత్యతో ముడిపెట్టడం ఎంత దారుణమో ఆలోచించాలి. ఈ నిరాధారమైన ఆరోపణలు చేసేవారిని శిక్షార్హులుగా ప్రకటించి చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సిన సమయం ఆసన్నమైంది.

వ్యాసకర్త మహారాష్ట్ర మాజీ గవర్నర్

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

నెరవేరని కల



ఇవ్వాళ (జూలై 26) ఒలింపిక్స్ ప్రారంభోత్సవం. కానీ ఒక అఫ్గాన్ మహిళగా నా పోరాటం వల్ల నేను ఎంపిక కాలేదు. స్వేచ్ఛ కోసం నా పోరాటం ఒలింపిక్స్‌లో నా స్థానాన్ని కోల్పోయేలా చేస్తుందని గ్రహించలేక పోయాను. లింగవివక్ష పూరిత అఫ్గానిస్తాన్‌లో మహిళ కల నెరవేరదు.

– మర్జియే హమీదీ, తైక్వాండో అథ్లెట్

సైనికులకు వందనం



కార్గిల్ విజయ్ దివస్ (జూలై 26) రోజున, అసమానమైన ధైర్యం, త్యాగాలతో మన దేశ పర్వత శిఖరాలను వెనక్కి పొందిన మన సాహస సైనికులకు నివాళి. మన త్రివర్ణ పతాకం సగర్వంగా ఎగిరేలా చేసిన వారి అసాధారణ శూరత్వం, అంకితభావాలను గుర్తుచేసుకోవాల్సిన రోజు ఇది.

– సోనమ్ మహాజన్, విశ్లేషకురాలు

వదలని మురికి



మురిక్కాలువలను శుభ్రం చేస్తూ జనాలు చనిపోయే దేశం ప్రపంచంలో ఇండియా ఒక్కటే. సఫాయి కర్మచారీ ఆందోళన్ గణాంకాల ప్రకారం, గత ఆరు నెలల్లో మురిక్కాలువలు, సెప్టిక్ ట్యాంకులను శుభ్రం చేస్తూ 43 మంది చనిపోయారు.

– పమేలా ఫిలిపోస్, జర్నలిస్ట్

అదో తమాషా



ఏ2 నెయ్యి అని ఒక యాడ్ కనబడింది. ఏ2 నెయ్యి? మామూలు కంటే ఐదు రెట్లు ఎక్కువ ధరకు? ఏ1, ఏ2 ప్రోటీన్లు. కానీ నెయ్యి అనేది 99.5 నుంచి 99.7 వరకు కొవ్వు, తేమ. అందులో ఏ1, ఏ2 ఏ ప్రోటీన్ ఉండదు.

– నిఖిల్ చితలే, డైరీ ఇండస్ట్రియలిస్ట్

నేను నయం



ఇండియన్, హిందూ సంస్కృతికి చెందినామె కాబట్టి కమలా హారిస్‌కు ఓటు వేస్తామని (అమెరికాలోని) ఇండియన్స్ చెబుతున్నారు. ఆమె నరాల్లో సగం భారతీయ రక్తం ప్రవహిస్తోంది, అంతవరకే. నా నరాల్లో ఏ భారతీయ రక్తమూ లేదు. కానీ నేను ఆమె కన్నా వెయ్యి శాతం ఎక్కువ భారతీయురాలిని. హిందువును. మేలుకోండి!

– రెనీ లిన్, హిందూ యాక్టివిస్ట్

ఇన్ బాక్స్

ఈ స్ఫూర్తి కొనసాగాలి

దేశంలో నక్సలైట్ ఉద్యమానికి ఆద్యుడు కామ్రేడ్ చారు మజుందార్ 52వ వర్ధంతి రేపు. ఈ సందర్భంగా దేశంలో ఉన్న పరిస్థితులను పునః పరిశీలించడం అవసరం. ఎమర్జెన్సీ కాలం నుంచి ఎన్నో నిర్బంధాలను ఎదుర్కొని దేశ వ్యాప్తంగా విస్తరించిన కమ్యూనిస్టులు ఫాసిస్టు శక్తులకు సింహస్వప్నంగా మారారు. ఎప్పుడూ పీడితుల పక్షానే నిలిచారు. తమ విధానాన్ని కొనసాగిస్తూ 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఎన్డీఏ నియంతృత్వ పాలనకు వ్యతిరేకంగా 'ఇండియా' కూటమిలో చేరి పోరాడారు. ఈ ఎన్నికల్లో ప్రజలు ఫాసిస్ట్ పాలనను తీవ్రంగా దెబ్బతీశారు. ఇందులో ఈ రోజు పార్టీ పునర్వ్యవస్థీకరణ 50వ వార్షికోత్సవం జరుపుకుంటున్న సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ భాగస్వామి అయ్యి బిహార్ వంటి చోట్ల విజయం సాధించింది.



రేపు చారు మజుందార్ వర్ధంతి

బీజేపీ తన సొంత మెజారిటీని కోల్పోయింది. ప్రభుత్వం గణనీయంగా బలహీనపడింది. కానీ అది మాత్రం ఏమీ జరగలేదన్నట్టు వ్యవహరిస్తోంది. మోదీ మళ్లీ ప్రధాని, అమిత్ షా మళ్లీ హోం మంత్రి, ఓం బిర్లా స్పీకర్! ప్రజల జీవనోపాధిపై, రాజ్యాంగంపై, పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థపై నిరంతర దాడులతో రెండో దఫాలో నిర్వహించిన పాలనా విధానాన్నే మోదీ ప్రభుత్వం మూడవసారి కూడా కొనసాగించడానికి ప్రయత్నిస్తుంది. సంఘ్ బ్రిగేడ్‌కు చెందిన లించ్ గుంపులు, అల్లరి మూకలు హింసా వలయాన్ని పునఃప్రారంభించి, దానికి రాజ్య హింసను, చట్ట వ్యతిరేక బహిరంగ హింసను జోడిస్తూ వీధుల్లో స్వైరవిహారం చేస్తాయి. వీటిని ఎదుర్కోవడానికి ప్రజలకు మద్దతుగా నిలుస్తారు కమ్యూనిస్టులు.

2024 ఎన్నికల తీర్పుకు సంబంధించిన దిశను, స్ఫూర్తిని పరిశీలిస్తే, పార్లమెంటు లోపలా, వెలుపలా ప్రతి సమస్యపై మోదీ ప్రభుత్వాన్ని ఎదుర్కోవటానికి 'ఇండియా'కు తగినంత బలాన్ని ఇస్తూ... ప్రజలు మోదీ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సంఘ్ పరివార్ శక్తులకు వ్యతిరేకంగా రాజకీయ, సామాజిక శక్తులు... ప్రజా ఉద్యమాల ఆధారంగా విశాల ఐక్య వేదిక ఏర్పడాలి అన్న ప్రజాకాంక్షను నిజం చేస్తూ 'ఇండియా' కూటమిలో చేరాం. ఈ కూటమి స్థానికంగా పరస్పరం పోరాడే శక్తులతో సహా, అఖిల భారత స్థాయిలో రాజకీయ శక్తుల సమగ్ర ఐక్యతగా రూపుదిద్దుకుంది. తదుపరి అసెంబ్లీ ఎన్నికల క్రమంలో కూడా ఎన్డీఏని తీవ్రంగా దెబ్బతీసేందుకు ఈ ప్రక్రియను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లడంలో కీలక పాత్ర పోషించడంలో ప్రజాస్వామిక వాదులంతా ఏకమవ్వాలి.

– మామిండ్ల రమేష్ రాజా । సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ టీఎస్ కార్యదర్శి

వ్యక్తి స్వేచ్ఛకు ప్రమాద ఘంటికలు!

అభిప్రాయం



మాడభూషి శ్రీధర్

మన న్యాయచట్టాల నుండి రాజద్రోహాన్ని తొలగించారని అనుకుంటున్నాం. ఆ మేర ప్రకటనలు, పబ్లిసిటీలు చేస్తున్నారు కూడా. దానికన్నా భయంకరమైన సెడిషన్ తరహా కొత్త నేరాన్ని సృష్టించారు. తమకు పడని వారిపై కేసులు పెట్టడం, తమ పార్టీలో చేరిన పాత నేరగాళ్లను ప్రభువులను చేయడం చూస్తున్నాం.

పోలీసు ఆఫీసర్లకు విపరీతమైన అధికారాలు ఇచ్చారు. ఉదాహరణకు పోలీసు అధికారుల ఆదేశాలకు అవిధేయులైనవారినీ, ప్రతిఘటించే వారినీ; రాజ్యాంగ బద్ధంగా నిరాహార దీక్షలు, ధర్నాలు, సమ్మెలు చేసే వారినీ జైలుకు పంపించే అధికారం అదనంగా ఈ చట్టాలు పోలీసులకు ఇస్తున్నాయి. నింద పడగానే నిందితులకు బేడీలు వేసే అధికారాన్ని ఈ చట్టాల ద్వారా వారికి లభిస్తోంది.

నేరాల పరిశోధనలో చాలా కాలం అనుమానితుల్ని కస్టడీలో ఉంచడానికి, ఎఫ్ఐఆర్ చేయాలా వద్దా అనే విచక్షణాధికారం కూడా వారికి దఖలు పడుతున్నాయి. ఇది దారుణం కాదా?

తుషార్ గాంధీ, తనికా సర్కార్ వంటి వేలాది మంది ప్రముఖులు ఈ కొత్త నేర చట్టాలను పూర్తిగా పరీక్షించి, సమీక్షించి, జనం కూడా చర్చించుకున్న తరువాత ప్రభుత్వం నిర్ణయాలు తీసుకోవాలని కోరారు. కానీ వీరి విన్నపాన్ని ఎవ్వరూ పట్టించుకోలేదు.

ఇవి భయానకమైన నిర్ణయాలని మామూలు జనానికి అర్థం కావడం లేదు. ఈ కొత్త నేర చట్టాలు 'టెర్రరిజా'నికి కొత్త భాష్యాన్ని ఇచ్చి జనాన్ని జనాన్ని జైళ్లకు పంపే ప్రమాదాన్ని సిద్ధం చేశాయి. 'మాట్లాడే హక్కు అని అడుగుతారా' అని కోపించి 'నోర్మూయ్' అంటూ జనాన్ని వెళ్లగొట్టే బలాన్ని పోలీసులకు ఇచ్చే చట్టాలివి.

ఇప్పటికే ఈ చట్టాలను పోలీసులు ఎడాపెడా ఉపయోగించి కేసులు నమోదు చేస్తున్నారు. హైదరాబాదు చార్మినార్ పోలీసు స్టేషన్‌లో భారత న్యాయ సంహిత (బీఎన్ఎస్) సెక్షన్ 281 కింద, మోటారు వాహనాల (ఎమ్‌వీ) చట్టం సెక్షన్ 177, 80(ఎ) కింద చట్టం అమలులోకి వచ్చిన తెల్లవారు జామునుంచే కేసుల నమోదు మొదలయ్యింది. న్యూఢిల్లీ రైల్వే స్టేషన్ బ్రిడ్జి కింద తోపుడు బండి మీద చిన్న చితక వస్తువులు అమ్ముకుని పొట్టపోసుకునే మామూలు చిన్న వ్యాపారులపై భారతీయ న్యాయ సంహిత సెక్షన్ 281 కింద కొత్తకేసులు పెట్టడం మొదలు పెట్టారు.

ఇవీ మన కొత్త చట్టాలు-1



మొత్తం దేశంలో రాబోయే కాలంలో ఎన్ని లక్షలు, కోట్ల జనాలపై కొత్త కేసులు పెడతారో ఎవరూ చెప్పలేరు. 650 జిల్లాలలో, 16 వేల పోలీసు స్టేషన్లలో ఈ నేరపు చట్టాలను హడావిడిగా అమలు చేయడం ప్రారంభించారు. పాత క్రిమినల్ ప్రొసీజర్ సెక్షన్ 154 కిందకు వచ్చే నేరాలకు కొత్త న్యాయ చట్టం సెక్షన్ 173 కింద కేసులు పెడుతున్నారు.

ఇదివరకు 511 ఐపీసీ సెక్షన్ కింద నమోదు చేసే కేసులను ఇప్పుడు భారత న్యాయ సంహిత సెక్షన్ 398 కింద నమోదు చేయడానికి అవకాశం కల్పించారు. వాటికి తోడు మరో 20 కొత్త నేరాలనూ ఇందులో చేర్చారు. మొత్తం మీద 33 కొత్త శిక్షలు, 83 కొత్త రకం జరిమానాలు విధించే అవకాశం కల్పించారు. 23 కొత్త నేరాలకు 'కనీస కారాగార శిక్ష'లను కనిపెట్టారు. ఇవి గాక 'సామాజిక సేవ' అనే పేరుతో 6 నేరాల్లో వినూత్న విభిన్న నియమాలు తయారు చేశారు.

పార్లమెంట్‌లోనూ, బయటా సరైన చర్చ జరగకుండానే, హడావిడిగా కొత్త క్రిమినల్ న్యాయ చట్టాలను ఎందుకు ఆమోదించి అమలులోకి తెచ్చారో అర్థం కాదు. ఇలా చేయడం కూడా నేరమే కదా. ఇక్కడ ఒక పెద్ద సమస్య గురించి మరిచిపోవడం శోచనీయం. ఇప్పటికే ఐపీసీ సెక్షన్ల కింద నమోదైన కేసులను ఆ సెక్షన్ల కిందే కోర్టుల్లో విచారణ చేయాలి. 2024 జూలైలో అమలులోకి వచ్చిన కొత్త న్యాయ చట్టాల ప్రకారం పెట్టిన కేసులను కొత్త చట్టాల ప్రకారమే విచారించాలి. పోనీ రెండు రకాల కేసులను విచారణ చేయడానికి విడి విడిగా ఏమైనా ఏర్పాట్లు చేశారా అంటే అదీ లేదు. దాదాపు కోటి పాత కేసులు వివిధ న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్నాయి. ఈ పాత కేసులను విచారించడానికి ఎన్నేళ్ల కాలం పడుతుందో తెలియదు.

మరి కొత్త న్యాయ చట్టాల ప్రకారం 2024 జూలై నుంచి నమోదైన కేసులను ఎవరు విచారణ చేస్తారు, ఎన్నేళ్లు చేస్తారు? పాత కేసులను ఇప్పుడున్న కోర్టుల విచారణా పరిధుల్లో ఉంచి, కొత్త చట్టాల ప్రకారం విచారించడానికి సుప్రీం కోర్టు నుంచి కింద స్థాయి కోర్టుల వరకూ కొత్త న్యాయ స్థానాలను ఏర్పాటు చేస్తారా? ఇది సాధ్యమయ్యే పనేనా? ఏకకాలంలో పాత చట్టాలు, కొత్త చట్టాల కింద పాత, కొత్త కేసులపై విచారణ చేయడం సాధ్యమవుతుందా? కొత్త చట్టాలపై సాధికారత సాధించడానికే చాలా కాలం పట్టవచ్చు. మొత్తంగా కోర్టులపైనా, అందులో పనిచేసే న్యాయమూర్తులు, లాయర్లూ ఇతర సిబ్బందిపైనా విపరీతమైన ఒత్తిడి ఏర్పడటం ఖాయం అనిపిస్తోంది. ఇంత ఒత్తిడిలో సక్రమంగా బాధితులకు న్యాయం అందుతుందా అనేది ప్రశ్నార్థకమే. ఏతా వాతా ఈ మొత్తం ప్రహసనంలో ఇబ్బందులు ఎదుర్కొనేది సామాన్యులే అని వేరే చెప్పనవసరం లేదు.

వ్యాసకర్త మహేంద్ర యూనివర్సిటీ 'స్కూల్ ఆఫ్ లా'లో ప్రొఫెసర్

మోక్ష నిరోధకాలు

భ్రమలో ఉండేవారిని అజ్ఞానం ఎంతగానో తికమక పరుస్తుంది. అటువంటివారు అనాత్మను ఆత్మగానూ, ఆత్మను అనాత్మగానూ (అనగా శరీరము, మనస్సు, బుద్ధిగా) తలచి ఒకదానిపై వేరొకదానిని ఆరోపించుకుంటున్నారు. వారి సహజ ప్రకృతియే సచ్చిదానందం అనే వాస్తవాన్ని మరిచిపోతున్నారు. ప్రాపంచిక విషయాల్లో మునిగిపోయి వాటి నుండి సంతోషం పొందుతామని అనుకుంటున్నారు.

దత్తబోధ



శ్రీ గణపతి సచ్చిదానందస్వామి

భ్రమలో ఉండేవారు ఆత్మనే పరమాత్మ అనే వాస్తవాన్ని తెలుసుకోలేక పోతున్నారు. అటువంటివారికి విగ్రహారాధన మొదటి మెట్టుగా పెద్దలు చెప్పారు. ఆత్మనే ఎల్లప్పుడు బంధరహితంగా ఉంటుందనే సత్యం తెలియనంతవరకు అల్ప ప్రాణులు అనేక దీక్షలు, వ్రతాలు, తీర్థయాత్రలు చేయడానికి పూనుకొంటారు. యాత్రా స్థలాలను దర్శించటం వల్ల, అక్కడ నివసించడం వల్ల మోక్షం సాధించగలమని వారు తలుస్తారు. ఎవరైనా సరే... ఎంతకాలం ఈ శరీరమే 'నేను' అనే భావాన్ని కలిగి ఉంటారో, అంతకాలం పైన పేర్కొన్న కార్యకలాపాలు ఆత్మసాక్షాత్కారాన్ని కలిగించలేవు. ఆధ్యాత్మిక మార్గాన్ని అనుసరించి చూచినప్పుడు శారీరక స్పృహ అజ్ఞానమే.

వాసనలు మూడు రకాలు: దేహవాసన, శాస్త్రవాసన, లోకవాసన. దేహ ధర్మాలను ఆత్మపై ఆరోపించడమే దేహవాసన. 'నేను సాధించాను, నేను పండితుడను, నేను శాస్త్రాన్ని పఠించాను' అనే భావన శాస్త్రవాసన. ఈ భౌతిక ప్రపంచమే యధార్థమైందని తలచి దానితో సంబంధం కలిగి ఉండటం లోకవాసన.

ఈ వాసనలు ఉన్నంత కాలం మోక్షం లభించదనే వాస్తవాన్ని సాధకుడు తెలుసుకోవాలి. వాసనలను దూరం చేయడానికి వేదాలు అనేక మార్గాలను సూచిస్తున్నాయి. దివ్యనామ సంకీర్తన, నిరంతరం దైవదర్శనం అనేవి అందరికీ అందుబాటులో ఉన్నవే. అలాగే వీటిని సులభంగా ఆచరించనూవచ్చు. నీవు మనసారా మోక్షాన్ని కోరుకుంటున్నట్లయితే పూర్వ సంస్కారాలను విడచిపెట్టి, పైన తెలిపిన మార్గాలను నిజాయితీగా ఆచరించాలి.

మానవుడంటే శరీరం, మనస్సు, బుద్ధి మాత్రమే కాదు, ఒక ఆత్మ స్వరూపం అనీ వేదాలు చెబుతున్నాయి.

గ్రహం అనుగ్రహం శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, గ్రీష్మ ఋతువు, ఆషాఢ మాసం, **తిథి:** బ.సప్తమి రా.1.04 వరకు, తదుపరి అష్టమి, **నక్షత్రం:** రేవతి సా.5.27 వరకు, తదుపరి అశ్విని, **వర్జ్యం:** ఉ.6.16 నుండి 7.45 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.5.40 నుండి 7.22 వరకు, **అమృతఘడియలు:** ప.3.12 నుండి 4.41 వరకు; **రాహుకాలం:** ఉ.9.00 నుండి 10.30 వరకు, **యమగండం:** ప.1.30 నుండి 3.00 వరకు, **సూర్యోదయం:** 5.40, **సూర్యాస్తమయం:** 6.32.

క్లుప్తంగా...

సాగర్ నుంచి ఏపీకి మరో 3 టీఎంసీలు

● కృష్ణా బోర్డు అనుమతి

సాక్షి, హైదరాబాద్: నాగార్జున సాగర్ నుంచి కుడి ప్రధాన కాల్వకు 3 టీఎంసీల జలాలు విడుదల చేసుకోవడానికి ఆంధ్రప్రదేశ్‌కు కృష్ణా నదీయాజమాన్య బోర్డు(కేఆర్ఎంబీ) అనుమతిచ్చింది. ఏపీ విజ్ఞప్తి మేరకు ఈ మేరకు అనుమతిస్తూ కృష్ణాబోర్డు సభ్యకార్యదర్శి డీఎం రాయ్‌పూరే శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల జరిగిన కేఆర్ఎంబీ త్రిసభ్య కమిటీ సమావేశంలో సాగర్ నుంచి ఏపీకి 4.5 టీఎంసీలు, తెలంగాణకు 5.4 టీఎంసీలను కేటాయించాలని నిర్ణయించింది. అదనంగా మరో 3 టీఎంసీలను విడుదల చేసుకోవడానికి తాజాగా ఏపీకి కృష్ణా బోర్డు అనుమతిచ్చింది. తాగునీటి అవసరాలకు పోతిరెడ్డిపాడు నుంచి 12 టీఎంసీలను వాడుకోవడానికి అనుమతి ఇవ్వాలని ఏపీ ప్రభుత్వం మళ్లీ కృష్ణాబోర్డుకు విజ్ఞప్తి చేసింది. దీనిపై త్వరలో బోర్డు నిర్ణయం తీసుకోనుంది.

ఆగస్టు 15 తర్వాత డీఏ ప్రకటన

● సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి హామీ



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు వచ్చే నెల 15 తర్వాత కరువు భత్యం (డీఏ) ప్రకటించేందుకు సర్కారు చర్యలు తీసుకుంటోందని ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డి చెప్పారు. శుక్రవారం ఆయన ఉపాధ్యాయ సంఘాల నేతలతో సమావేశమయ్యారు. రైతు రుణ మాఫీ ప్రక్రియ పూర్తయిన వెంటనే ఆగస్టు 15 తర్వాత ఉపాధ్యాయులకు, ఉద్యోగులకు బకాయిలున్న డీఏ ప్రకటిస్తామని ఆయన చెప్పారు. యూఎస్పీసీ, జాక్టో సంఘాలు సీఎం రేవంత్‌రెడ్డి అపాయింట్‌మెంట్ కోరగా.. ముందుగా వేం నరేందర్ రెడ్డితో చర్చించాలని సూచించిన నేపథ్యంలో శుక్రవారం ఈ చర్చలు జరిగాయి. బదిలీలు, పదోన్నతుల్లో ఏర్పడిన సమస్యలపై అప్పీళ్లను సత్వరమే పరిష్కరించాలని కోరారు. గత ప్రభుత్వం ఉపాధ్యాయ సంఘాల నాయకులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని కోరగా, అప్పటికప్పుడే డీజీపీకి ఫోన్ చేసి వాటిని ఉపసంహరించమని వేం నరేందర్‌రెడ్డి సూచించారు.

సాయినగర్ - షిర్డీ ఎక్స్‌ప్రెస్‌లో దోపిడీ

● ఖమ్మంలో ఫిర్యాదు చేసిన బాధితులు

ఖమ్మంక్రైం: మహారాష్ట్రలోని పర్లీ - కర్ణాటక రాష్ట్రంలోని బీదర్ మధ్యలో శుక్రవారం అర్ధరాత్రి దాటాక రైలులో దోపిడీ జరిగింది. షిర్డీ నుంచి కాకినాడ వస్తున్న సాయినగర్ - షిర్డీ ఎక్స్‌ప్రెస్‌లో దోపిడీ జరగగా..బాధితుల ఫిర్యాదు మేరకు ఖమ్మంలోని జీఆర్పీ స్టేషన్‌లో మూడు కేసులు నమోదయ్యాయి. ఏసీ కోచ్‌లైన బీ-1, బీ-2, బీ-3ల్లో ప్రయాణికులు గాఢనిద్రలో ఉన్న సమయాన ఆగంతకులు సుమారు రూ.30 లక్షలకు పైగా సొత్తు అపహరించారు. బాధితుల్లో సికింద్రాబాద్, వరంగల్, ఖమ్మం, విజయవాడ, రాజమండ్రి, కాకినాడకు చెందిన వారు ఉండగా...వారు రైలు దిగాక స్వస్థలాల్లో ఫిర్యాదు చేశారు. ఇందులో భాగంగానే ఖమ్మం జిల్లా ముదిగొండ మండలం గోకినపల్లికి చెందిన పద్మ, ఏపీలోని జగ్గయ్యపేటకు చెందిన వాణి, శ్రీనివాస్ తదితరులు 11తులాల బంగారు ఆభరణాలు, నగదు, ఫోన్లు చోరీ అయినట్లు ఫిర్యాదు చేయడంతో ఖమ్మం జీఆర్పీ ఎస్ఐ భాస్కర్‌రావు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి చోరీ జరిగిన ప్రాంతమైన పర్లీకి బదలాయించారు.

యూఎన్ఓ సమావేశాలకు గార్ల వాసి



జోగ్రాం నాయక్

గార్ల: మహబూబాబాద్ గార్ల మండలం చిన్నబంజర గ్రామానికి చెందిన బంజారా సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు తేజావత్ జోగ్రాం నాయక్‌ను ఐక్యరాజ్యసమితి స్పెషల్ కన్సల్టేటివ్ స్టేటస్ గుర్తింపునిచ్చి సమావేశాలకు ఆహ్వానించింది. ఈ మేరకు యూఎన్ఓ ఆఫ్రికాలో ఇథియోపియా లో జరిగే సమావేశాలకు ఆయన హాజరయ్యారు. 'యునైటెడ్ నేషన్స్ హెడ్ క్వార్టర్స్ ఇన్ న్యూయార్క్, ఫస్ట్ సేషన్ ఆఫ్ ది ప్రిపరేటరీ కమిటీ ఫర్ ది ఫోర్త్ ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ ఫైనాన్సింగ్ ఫర్ డెవలప్‌మెంట్'అంశంపై జరిగిన డిబేట్‌లో మాట్లాడారు. జోగ్రాం చిన్ననాటి నుంచి గిరిజన, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం పాటుపడుతున్నారు. బంజారా సేవా సమితి సంస్థను స్థాపించి అనేక సామాజికసేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్నందుకు జోగ్రాం నాయక్‌ను ఐక్యరాజ్యసమితి గుర్తించింది.

31కి కవిత కేసు విచారణ వాయిదా

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం విధానం కుంభకోణంపై సీబీఐ కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత కేసు విచారణ వాయిదా పడింది. విచారణలో భాగంగా జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న ఎమ్మెల్సీ కవితను జైలు అధికారులు వర్చువల్ ద్వారా రౌజ్ అవెన్యూ కోర్టు న్యాయమూర్తి కావేరి బవేజా ముందు శుక్రవారం హాజరుపరచాల్సి ఉంది. కానీ న్యాయమూర్తి సెలవులో ఉండటంతో కేసు విచారణ జూలై 31కు వాయిదా పడింది.

భద్రాచలం వద్ద మళ్లీ రెండో ప్రమాద హెచ్చరిక



భద్రాచలం వద్ద మునిగిన స్నానఘాట్‌లు

భద్రాచలం/ధరూరు: భద్రాచలం వద్ద గోదావరి ప్రవాహం పెరగడంతో శుక్రవారం రాత్రికి మళ్లీ రెండో ప్రమాద హెచ్చరిక స్థాయికి చేరింది. గోదావరికి ఎగువన ఉన్న మహారాష్ట్రలో భారీ వర్షాలు కురుస్తుండడంతో పాటు కాళేశ్వరం, సమ్మక్క బ్యారేజీ వద్ద నుంచి పెరిగిన వరద గోదావరికి చేరుతుండగా నీటిమట్టం తగ్గినట్టే తగ్గి పెరుగుతోంది. గురువారం రాత్రి 11 గంటలకు 48.10 అడుగుల నీటిమట్టం ఉండగా.. శుక్రవారం ఉదయం 8గంటలకల్లా తగ్గి 46.90 అడుగులకు చేరింది. దీంతో రెండో ప్రమాద హెచ్చరిక ఉపసంహరించారు. కానీ ఆతర్వాత పెరుగుతూ రాత్రి 9:15 గంటలకు నీటిమట్టం 48 అడుగులకు చేరింది. దీంతో మళ్లీ రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. కాగా, వరదతో ముంపు గ్రామాల రైతులు పంట కాలం ఆలస్యమవుతుందని ఆందోళన చెందుతుండగా.. రహదారుల పైకి నీరుచేరి ఏపీ, ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాలకు రవాణా స్తంభించింది.

నిలకడగా జూరాల

జూరాల ప్రాజెక్టులో వరద నిలకడగా కొనసాగుతోంది. శుక్రవా రం రాత్రి 10 గంటలకు ప్రాజెక్టుకు 2,65,000 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. 36 క్రస్టు గేట్లు ఎత్తి స్పిల్‌వే ద్వారా 2,30,283 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. అలాగే 10 యూనిట్లలో విద్యుదుత్పత్తి కోసం 19,668 క్యూసెక్కులు, భీమా, నెట్టంపాడు, కుడి, ఎడమ కాల్వలకు కలిపి మొత్తం 2,53,290 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

శాంతిభద్రతల్లో డయల్ 100 సేవలు కీలకం

● వీడియో కాన్ఫరెన్స్‌లో డీజీపీ జితేందర్



సాక్షి, హైదరాబాద్: శాంతిభద్రతల పరిరక్షణలో, త్వరితగతిన పోలీసు సిబ్బంది స్పందించడంలో డయల్ 100, డయల్ 112 అత్యంత కీలకమని డీజీపీ జితేందర్ అన్నారు. డయల్ 100, 112 పనితీరుపై పోలీస్ కమిషనర్లు, ఎస్పీలు, స్టేషన్ హౌస్ ఆఫీసర్లతో శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ.. డయల్ 100, 112 హెల్ప్‌లైన్ ద్వారా వచ్చిన కాల్స్‌పై సత్వర చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పోలీసు సిబ్బందిపై ప్రజల విశ్వాసాన్ని పెంపొందించే లక్ష్యంతో, నైపుణ్యం, స్పందనలో అత్యున్నత ప్రమాణాలను పాటించాలని సూచించారు. సమావేశంలో అదనపు డీజీపీలు మహేశ్ భగవత్, వీవీ శ్రీనివాసరావు, ఐజీపీలు ఎం.రమేశ్, వి.సత్య నారాయణ, హైదరాబాద్ సిటీ జాయింట్ సీపీ పరిమళ హన నూతన్ తదితరులు పాల్గొన్నారు.

'స్థానిక' ప్రక్రియ వేగవంతం చేయండి

అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం

- ఈసీఐ నుంచి ఓటర్ల జాబితా అందిన వెంటనే రంగంలోకి దిగాలి
- రిజర్వేషన్లపై బీసీ కమిషన్ గడువులోగా నివేదిక ఇవ్వాలి
- సచివాలయంలో ముఖ్యమంత్రి ఉన్నతస్థాయి సమీక్ష
- అక్టోబర్ లేదా నవంబర్ చివర్లోగా ఎన్నికలు నిర్వహించే చాన్స్



స్థానిక సంస్థల ఎన్నికలపై సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

సాక్షి, హైదరాబాద్: స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ ప్రక్రియను వేగవంతం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ) నుంచి కొత్త ఓటర్ల జాబితా అందిన వారంలోగానే ఆయా స్థానిక సంస్థలకు తగినట్లుగా ఓటర్ల జాబితాలు రూపొందించాలని చెప్పారు. రిజర్వేషన్ల ఖరారుకు సంబంధించి నిర్దిష్ట గడువులోగా బీసీ కమిషన్ సైతం తమ నివేదికను ప్రభుత్వానికి సమర్పించాలని కోరారు. శుక్రవారం సచివాలయంలో ముఖ్యమంత్రి అధ్యక్షతన స్థానిక సంస్థల ఎన్నికలపై ఉన్నతస్థాయి సమీక్ష జరిగింది. ఎన్నికల నిర్వహణకు ఉన్న అడ్డంకులు, ఎన్నికలు సత్వరం నిర్వహించడానికి ఉన్న అవకాశాలపై ఈ సందర్భంగా చర్చించారు. ఎన్నికల ప్రక్రియ మొదలుపెట్టడానికి ఉన్న ఆటంకాలు ఏమిటని అధికారులను సీఎం ప్రశ్నించారు. దీంతో కొత్త ఓటర్ల జాబితా కేంద్ర ఎన్నికల సంఘం నుంచి రాష్ట్ర ఎన్నికల సంఘానికి రావాల్సి ఉందని అధికారులు తెలిపారు. ఇప్పటికే రెండు రాష్ట్రాలకు జాబితాలు పంపిందని, మనతో పాటు మరో ఆరు రాష్ట్రాలకు మరో వారంలోగా జాబితాలు పంపించనుందని వివరించారు. కాగా ప్రస్తుత పరిస్థితుల్లో ప్రభుత్వపరంగా కసరత్తు పూర్తయితే..అక్టోబర్ లేదా నవంబర్ చివర్లోగా ముందుగా పంచాయతీ, ఆ తర్వాత మండల, జిల్లా పరిషత్‌లకు ఎన్నికలు నిర్వహించే అవకాశాలున్నట్లు విశ్వసనీయ సమాచారం. సమావేశంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు దామోదర రాజనరసింహ, ధనసరి అనసూయ సీతక్క, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, మాజీ మంత్రి జానారెడ్డి, బీసీ కమిషన్ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు, సీఎస్ శాంతికుమారి, సీఎం ముఖ్య కార్యదర్శి వి.శేషాద్రి, కార్యదర్శులు చంద్రశేఖర్‌రెడ్డి, వేముల శ్రీనివాసులు, సంగీత సత్యనారాయణ, అజిత్‌రెడ్డి, అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా ఆధారంగానే రిజర్వేషన్లు?

కులగణన ద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీ జనాభా లెక్కించి, ఆయావర్గాల వారీగా స్థానిక రిజర్వేషన్ల ఖరారుకు చాలా సమయం పడుతుందని అధికార వర్గాలు భావిస్తున్నాయి. దీంతో ఇటీవలే ముగిసిన లోక్‌సభ ఎన్నికల సందర్భంగా జారీ చేసిన ఓటర్ల జాబితా ఆధారంగా రిజర్వేషన్లు పూర్తి చేయాలని ప్రభుత్వం సూత్రప్రాయంగా నిర్ణయించినట్టు సమాచారం. గ్రామ పంచాయతీలు, మండల, జిల్లా ప్రజా పరిషత్‌లకు అనుగుణంగా ఓటర్ల జాబితాను రూపొందించి, పంచాయతీరాజ్ శాఖ ద్వారా కాస్ట్ ఎన్యూమరేషన్ (కుల గణన) పద్ధతుల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లపై స్పష్టత సాధించాలని భావిస్తున్నట్టు తెలుస్తోంది. అదే సమయంలో ఓటర్ల జాబితాను అనుసరించి ఎస్సీ, ఎస్టీ, బీసీ జనాభాపై ఒక అంచనాకు రావడంలో ఏవైనా సాంకేతిక సమస్యలు ఎదురవుతాయా అన్నది కూడా పరిశీలించనున్నట్టు తెలిసింది. కాగా వారం రోజుల్లో తాజా ఓటర్ల జాబితాలు అందగానే, వాటి ప్రాతిపదికన రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ ఆధ్వర్యంలో ఈ ప్రక్రియను వేగవంతం చేయాలని నిర్ణయించినట్లు సమాచారం. ప్రక్రియలో భాగంగా బీసీ కమిషన్ ఆధ్వర్యంలో తొమ్మిది ఉమ్మడి జిల్లాల పరిధిలో కుల సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో బహిరంగ విచారణ పద్ధతుల్లో అఖిలపక్ష సమావేశాలు నిర్వహిస్తారు. ఇవి ముగిశాక రాష్ట్ర స్థాయిలో అన్ని పార్టీలు, సంఘాలతో నిర్వహించే అఖిలపక్ష భేటీల్లో తుది నిర్ణయం తీసుకోనున్నారు. రిజర్వేషన్లు ఖరారైన తర్వాత ఎన్నికల తేదీలపై రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు ప్రభుత్వం స్పష్టతనిస్తుంది. ఆ వెంటనే ఎస్ఈసీ ఎన్నికల నిర్వహణ కసరత్తును ప్రారంభించి, నెలన్నర, రెండునెలల వ్యవధిలోనే ప్రక్రియను పూర్తి చేయనుంది.

పరిహారం రాక.. ప్రాణాలు తీసుకున్నాడు!

- మంచిర్యాల జిల్లాలో యువకుడి ఆత్మహత్య
- చావుకు సింగరేణి యాజమాన్యమే కారణమని సూసైడ్ నోట్



హరీశ్

జైపూర్: జీవనోపాధి కోసం రూ.6 లక్షలు అప్పు తెచ్చి కొనుగోలు చేసిన ట్రాక్టర్‌కు గిరాకీ లేదు.. ట్రాక్టర్ కిస్తీలు కట్టలేని పరిస్థితి. అదీగాక ఏడాది క్రితం చెల్లి పెళ్లి కోసం రూ.5 లక్షలు అప్పు తెచ్చాడు. సింగరేణి సంస్థ నుంచి పరిహారం వస్తే తన కష్టాలు గట్టెక్కుతాయనుకున్నాడు. కానీ, రెండేళ్లుగా పరిహారం విషయం ఎటూ తేలడం లేదు. ఈ క్రమంలో అప్పులు ఇచ్చిన వారి ఒత్తిడి తట్టుకోలేక శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో హరీశ్ (28) అనే యువకుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తన చావుకు సింగరేణి యాజమాన్యం, గ్రామ పెద్దలు కారణమని సూసైడ్ నోట్ రాశాడు. అమ్మా నాన్న క్షమించండి.. అక్క, చెల్లి.. అమ్మనాన్నలను బాగా చూసుకోండి అని అందులో పేర్కొన్నాడు. ఈ ఘటన మంచిర్యాల జిల్లా జైపూర్ మండలం రామారావుపేట పంచాయతీ పరిధిలోని దుబ్బపల్లిలో జరిగింది. జైపూర్ ఎస్సై నాగరాజు కథనం ప్రకారం.. దుబ్బపల్లి గ్రామానికి చెందిన జాడి బొందాలు-పద్మ దంపతులకు ఇద్దరు కూతుళ్లు, కుమారుడు హరీశ్ సంతానం. బొందాలు కూలీనాలి చేస్తూ పిల్లలను పెంచి పెద్ద చేశాడు. వృద్ధాప్యం, అనారోగ్య సమస్యలతో ప్రస్తుతం ఏ పని చేయడం లేదు. దీంతో కుటుంబ భారం హరీశ్‌పై పడింది.

ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ వస్తుందని...

దుబ్బపల్లి గ్రామాన్ని రెండేళ్ల క్రితం సింగరేణి శ్రీరాంపూర్ ఓసీపీ విస్తరణ కోసం సేకరించింది. ఇంటితోపాటు ఆర్అండ్ఆర్ ప్యాకేజీ కింద రూ.20 లక్షలు పరిహారం వస్తుందని హరీశ్ భావించాడు. కానీ, రెండేళ్లుగా సింగరేణి యాజమాన్యం పరిహారం విషయం తేల్చడం లేదు. గ్రామ పెద్దలు పరిహారం ఇప్పించే బాధ్యత తీసుకున్నా.. ఎలాంటి పురోగతి లేదు. ఒక్కగానొక్క కొడుకు ఆత్మహత్య చేసుకోవడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరవుతున్నారు. పోలీసులు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నకిలీ పురుగు మందులపై ఏ చర్యలు తీసుకున్నారు?

● కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ప్రశ్నించిన హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: నకిలీ పురుగు మందుల సమస్యను పరిష్కరించడానికి ఏం చర్యలు చేపట్టారో చెప్పాలని హైకోర్టు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది. ఈ మేరకు కేంద్ర వ్యవసాయ శాఖ కార్యదర్శి, ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఏఐ)కు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణలోగా కౌంటర్ దాఖలు చేయాలని ప్రతివాదులైన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అధికారులను ఆదేశించింది. విచారణను 4 వారాలకు వాయిదా వేసింది. నకిలీ, నాసిరకం పురుగు మందుల సమస్యను అడ్డుకోవడంలో అధికారులు విఫలమయ్యారని, దీని కారణంగా ఆరోగ్యానికి హాని కలిగించే ఆహార ఉత్పత్తులు మార్కెట్‌లోకి వస్తున్నాయని పేర్కొంటూ సంగారెడ్డికి చెందిన న్యాయవాది వి.రవికృష్ణ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. ఇలాంటి పురుగు మందులు మార్కెట్‌లోకి రాకుండా చర్యలు తీసుకునేలా అధికారులను ఆదేశించాలని పిటిషన్‌లో విజ్ఞప్తి చేశారు. ఈ పిల్‌ను ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్ కుమార్ జూకంటి ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టింది.

'5 వకాలత్‌ల నిబంధన సవరించాలి'

సాక్షి, హైదరాబాద్: న్యాయవాద వృత్తిలో కొనసాగేవారు సర్టిఫికెట్ ఆఫ్ ప్రాక్టీస్ (సీవోపీ)తోపాటు 5 వకాలత్‌లు సమర్పించాలన్న నిబంధనను తొలగించాలని బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా(బీసీఐ)ను రాష్ట్ర బార్ కౌన్సిల్ చైర్మన్ ఎ.నరసింహారెడ్డి విజ్ఞప్తి చేశారు. సీవోపీ సమర్పణకు ఐదేళ్లలో నమోదు చేసిన 5 వకాలత్‌ల వివరాలు లేదా లా సంస్థలు జారీ చేసిన ధ్రువీకరణ పత్రం సమర్పించాలని బీసీఐ జనవరి 14న రాష్ట్ర కౌన్సిల్‌కు లేఖ రాసింది. ఈ నిబంధనపై న్యాయవాదులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై స్పందించిన రాష్ట్ర కౌన్సిల్ వైస్ చైర్మన్ సునీల్ గౌడ్, బీసీఐ సభ్యు డు విష్ణువర్ధన్ రెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కొల్లి సత్యనారాయణరావు, ఏ.గిరిధర్‌రావుల బృందం బీసీఐ చైర్మన్ మనన్‌కుమార్‌ను కలసి వినతిపత్రం సమర్పించింది. కొత్త మార్గదర్శకాల్లో లోపాలను బీసీఐ దృష్టికి తీసుకెళ్లామని, తమ అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుంటామని బీసీఐ హామీ ఇచ్చిందని నరసింహారెడ్డి తెలిపారు.

లైంగిక దాడి ఘటనపై విచారణ జరపాలి

● అంధ బాలికల ఆందోళన



రోడ్డుపై నిరసన వ్యక్తం చేస్తున్న అంధ విద్యార్థినులు

సాక్షి, హైదరాబాద్: మలక్‌పేట అంధబాలికల వసతిగృహ విద్యార్థినులు రోడ్డెక్కారు. వసతిగృహంలో ఉంటున్న ఎనిమిదేళ్ల అంధబాలికపై జరిగిన లైంగికదాడి ఘటనపై సమగ్ర విచారణ చేయాలని డిమాండ్ చేశారు. శుక్రవారం ఉదయం నుంచి వసతిగృహం ముందున్న రోడ్డుపైనే బైఠాయించి ఆందోళన కొనసాగించారు. వసతిగృహం శిథిలావస్థకు చేరిందని, ఈ అంశంపై వికలాంగుల సంక్షేమ శాఖ డైరెక్టర్‌తో పాటు ఇతర ఉన్నతాధికారులకు ఎన్నిసార్లు వినతులు ఇచ్చినా ఫలితం లేదని, కనీసం పట్టించుకునే నాథుడే లేకుండాపోయారని విద్యార్థినులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. వసతిగృహంలో సమస్యలు పేరుకుపోయాయని, ఇక్కడ వసతి పొందే పరిస్థితే లేదని, తప్పనిసరి పరిస్థితుల్లో ఇక్కడ ఉండాల్సి వస్తోందని బాలికలు వాపోయారు. ఈ క్రమంలో తహసీల్దార్‌తోపాటు ఇతర అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని విద్యార్థినులకు నచ్చజెప్పే ప్రయత్నం చేయడంతో పరిస్థితి సద్దుమణిగింది.

మంత్రి సీతక్కకు వినతి

లైంగిక దాడికి పాల్పడిన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ది బ్లైండ్ తెలంగాణ విభాగం అధ్యక్ష, కార్యదర్శులు వీర రాఘవన్, సార ప్రవీణ్‌కుమార్‌గౌడ్ డిమాండ్ చేశారు. మంత్రి సీతక్కను కలిసి వినతిపత్రం సమర్పించారు. దీనిపై మంత్రి స్పందిస్తూ తగిన చర్యలను వేగవంతంగా తీసుకొని బాధితురాలికి న్యాయం చేస్తామని హామీ ఇచ్చినట్టు వారు తెలిపారు.

కాంట్రాక్టర్ల మీన'వేషాలు'

- ధర పెంచేందుకు కాంట్రాక్టర్ల కొత్త ఎత్తుగడ
- బిడ్స్ దాఖలుకు ఎవరూ ముందుకు రాని వైనం
- బిడ్స్ దాఖలుకు ఆగస్టు 2 వరకు పొడిగించిన మత్స్యశాఖ



సాక్షి, హైదరాబాద్: చేపపిల్లల టెండర్లు గిట్టుబాటు ధర రావడంలేదని, ప్రభుత్వమే టెండర్ల ధర పెంచేలా పక్కా వ్యూహంతో కాంట్రాక్టర్లు విసిరిన అత్యాశల వలలో చేపపిల్లలు విలవిల్లాడుతున్నాయి. ఈ ఏడాది చేపపిల్లలను కొత్తనీటిలో వదిలేందుకు వాటి పంపిణీ నిమిత్తం రాష్ట్ర మత్స్యశాఖ టెండర్లను ఆహ్వానించింది. జూలై నెలాఖరు వరకు టెండర్లు పూర్తి చేసి ఆగస్టు మొదటి వారంలో చెరువులు, రిజర్వాయర్లు, జలాశయాల్లో చేప పిల్లలను వదలాలని నిర్ణయించింది. అయితే తమకు గిట్టుబాటు కావడంలేదనుకున్న కాంట్రాక్టర్లు సిండికేట్‌గా ఏర్పడి రెండు జిల్లాల్లో మినహా అసలు టెండర్లు దాఖలు చేయకుండా మిన్నకుండి పోయారు. దీంతో చెరువులు, జలాశయాలు, రిజర్వాయర్ల, కుంటల్లో కావాల్సిన నీళ్లు ఉన్నా..అందులో చేపపిల్లలు మాత్రం లేకుండా పోయాయి.

ఆ రెండు జిల్లాల్లోనే దాఖలైన టెండర్లు

చేప పిల్లల పంపిణీ టెండర్ల కోసం రూ.90 కోట్లతో దాదాపు 86 కోట్ల చేప పిల్లల సరఫరా కోసం టెండర్లు దాఖలుకు ఈ నెల 23 చివరి తేదీగా మత్స్యశాఖ నిర్ణయించింది. అయితే రాష్ట్రవ్యాప్తంగా టెండర్లకు ఆహ్వానిస్తే దీనికి ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల్లో మాత్రమే టెండర్లు దాఖలయ్యాయి. ధరల పెంపు ఒక అంశమైతే.. గతేడాదికి సంబంధించి చెల్లించాల్సిన దాదాపు రూ.80 కోట్లను ప్రభుత్వం ఇప్పటివరకు చెల్లించకపోవడం వల్ల కూడా కాంట్రాక్టర్లు టెండర్లు వేసేందుకు ముందుకు రావడం లేదన్న వాదన కూడా వినిపిస్తోంది.

ఆగస్టు2 వరకు టెండర్లకు అవకాశం

రాష్ట్ర మత్స్యశాఖ ఆశించిన మేర చేప పిల్లల పంపిణీ టెండర్లను వేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో వచ్చేనెల 2 వరకు ఆ గడువును వాయిదా వేసింది. దీంతో ఈ ఏడాది కూడా మత్స్యశాఖ ఆలస్యంగా చేప పిల్లలను వదిలేలా ఉంది. ముందస్తు చర్యలు చేపట్టకపోవడం, దీనికి ప్రభుత్వం నుంచి అనుమతి రాకపోవడమే కారణమన్న వాదన కూడా వినిపిస్తోంది.



మదురో


మచాడో

వెనిజులాలో రేపు అధ్యక్ష ఎన్నికలు

మచాడోకు వెల్లువలా ప్రజా మద్దతు

అధ్యక్షుడు మదురోకు ముచ్చెమటలు

దేశ చరిత్రలోనే అత్యంత ఆసక్తికరమైన పోరుకు రంగం సిద్ధం

సామ్యవాద కోటలో నారీ భేరి

వెనిజులా. ప్రపంచంలోనే అత్యధిక చమురు నిక్షేపాలున్న లాటిన్ అమెరికా దేశం. అయినా అత్యంత నిరుపేద దేశాల జాబితాలో అగ్రస్థానంలో ఉంది. పాతికేళ్లుగా సాగుతున్న స్వయం ప్రకటిత సామ్యవాద కూటమి నియంతృత్వ పాలనే అందుకు ప్రధాన కారణం. నిరసనలపై ఉక్కుపాదం, హక్కుల అణచివేత, విపక్ష నేతలకు సంకెళ్ల తదితరాలతో వెనిజులా యువత విసిగిపోయింది. దీనికి తోడు అంతర్జాతీయ సమాజం ఆంక్షలతో ఆర్థిక వ్యవస్థ కుప్పకూలి ఉపాధి అవకాశాలూ లేకపోవడంతో కట్టకట్టుకుని దేశం వీడుతోంది. నిండా 3 కోట్ల జనాభా కూడా లేని దేశంలో గత పదేళ్లలో ఏకంగా 80 లక్షల మంది విదేశీ బాట పట్టారు! సుప్రీం కోర్టు, ఎన్నికల సంఘం వంటి కీలక వ్యవస్థలన్నింటినీ ప్రభుత్వమే గుప్పెట్లో పెట్టుకోవడంతో పాతికేళ్లుగా వెనిజులాలో అధ్యక్ష ఎన్నికలు కూడా ఏకపక్షమే. 2018 ఎన్నికల్లోనైతే విపక్షాలన్నీ కట్టకట్టుకుని ఎన్నికలనే బహిష్కరించేంతగా ప్రభుత్వ అధికార దుర్వినియోగం శ్రుతి మించిపోయింది. దాంతో ప్రహసనప్రాయంగా సాగిన ఆ ఎన్నికల్లో అధ్యక్షుడు నికొలస్ మదురో తిరుగులేని మెజారిటీ సాధించి అధికారాన్ని నిలబెట్టుకున్నారు. అలాంటి వెనిజులాలో ఆరేళ్ల అనంతరం ఆదివారం మళ్లీ అధ్యక్ష ఎన్నికలు జరగనున్నాయి. కానీ పరిస్థితులు మాత్రం ఎప్పట్లా లేవు! విపక్షాలన్నీ ఒక్కతాటిపైకి వచ్చి మదురోపై ఉమ్మడి అభ్యర్థిని నిలబెట్టాయి. విపక్షాల ప్రచార సభలకు జనం విరగబడుతున్నారు. ఎన్నికల ప్రక్రియపై ఎప్పుడూ లేనంత ఆసక్తి, ఉత్సుకత వారిలో కనిపిస్తున్నాయి. దాంతో అంతర్జాతీయ సమాజం కూడా ఈసారి ఎన్నికలను అత్యంత ఆసక్తితో వీక్షిస్తోంది. ఇన్ని మార్పులకు కారణం ఒక్క మహిళ. ఒకే ఒక్క మహిళ. మదురోకు ముచ్చెమటలు పోయిస్తున్న ఆమే...విపక్ష నేత మరియా కొరీనా మచాడో.

అనర్హత వేటేసినా...

వెనిజులా అధ్యక్ష ఎన్నికల బరిలో 10 మంది ఉన్నారు. ప్రధాన పోటీ 61 ఏళ్ల మదురో, విపక్షాల ఉమ్మడి అభ్యర్థి ఎడ్మండో గొంజాలెజ్ రూపంలో ఇద్దరి మధ్య కేంద్రీకృతమైంది. కానీ అసలు పోటీలోనే లేని 56 ఏళ్ల మచాడో పేరు మాత్రమే దేశమంతటా మారుమోగిపోతోంది! ఎన్నికల ప్రచారం పొడవునా ఆమే సెంటరాఫ్ అట్రాక్షన్‌గా నిలిచారు. అటు అధికార యునైటెడ్ సోషలిస్ట్ పార్టీ ఆఫ్ వెనిజులా, ఇటు విపక్ష 'యూనిటరీ ప్లాట్‌ఫాం' కూటమి ప్రచారమంతా ఆమెనే కేంద్రంగా చేసుకుని సాగడం విశేషం. ముఖ్యంగా మదురో ప్రసంగాలన్నీ ఆద్యంతం మచాడోను విమర్శిస్తూనే సాగాయి. ఆమె ఎన్నికల పోటీకి దూరమైన వైనమూ ఆసక్తికరమే. విపక్ష అభ్యర్థిని తేల్చేందుకు గతేడాది జరిగిన ప్రైమరీలో దేశవ్యాప్తంగా జనం వెల్లువలా వచ్చి మచాడోకు ఓటేశారు. దాంతో ఆమె రికార్డు స్థాయిలో ఏకంగా 93 శాతం ఓట్లు సాధించారు. ఆ వెంటనే ప్రభుత్వం ఆమెపై అవినీతి ఆరోపణలు మోపి ఎన్నికల్లో పోటీకి అనర్హురాలిగా ప్రకటించింది. విపక్ష ప్రైమరీనే చట్టవిరుద్ధంగా ప్రకటించింది. మచాడో మద్దతుదారులైన నాయకులు, జర్నలిస్టులు, హక్కుల నేతలు తదితరులందరినీ జైలుపాలు చేసింది. ప్రభుత్వ గుప్పెట్లో ఉన్న సుప్రీంకోర్టు కూడా వేటునే సమర్థించింది. అయినా మచాడో వెనక్కు తగ్గకుండా పెద్ద జనాకర్షణ శక్తి లేని మాజీ దౌత్యవేత్త గొంజాలెజ్‌ను తనకు బదులుగా రేసులో దించారు. తనపై వేటునే అతి పెద్ద ప్రచారాస్త్రంగా మలచుకుని సుడిగాలి ప్రచారంతో హోరెత్తించారు. మదురో ప్రభుత్వ అవినీతి, అస్తవ్యస్త పాలనపై ఆమె విమర్శలకు ప్రజల నుంచి విపరీతమైన స్పందన లభించింది. దాంతో అందరి దృష్టీ ఆదివారం జరిగే పోలింగ్ మీదే కేంద్రీకృతమైంది.

- సాక్షి, నేషనల్ డెస్క్


విపక్షాల ఉమ్మడి అభ్యర్థి గొంజాలెజ్

40 లక్షల మంది ఓటర్లపై 'వేటు'

వెనిజులా మొత్తం ఓటర్లే 2.1 కోట్లు. వారిలో 40 లక్షల మందికి పైగా విదేశాల్లో ఉన్నారు. మదురో పాలనపై వారిలో తీవ్ర అసంతృప్తి నెలకొన్న నేపథ్యంలో వారెవరూ ఓటేసే వీల్లేకుండా ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకుంది. లెక్కలేనన్ని కొత్త నిబంధనలు తేవడంతో ప్రవాసుల్లో 69 వేల మంది మాత్రమే ఓటింగ్‌కు అర్హత పొందారు!

బస్సు డ్రైవర్ నుంచి అధికార పీఠం దాకా...

నికొలస్ మదురో మోరోస్. ఒకప్పుడు సాదాసీదా బస్సు డ్రైవర్. అనంతరం కార్మిక సంఘాల నేతగా మారారు. మెల్లిగా రాజకీయంగా ఒక్కో మెట్టే ఎక్కుతూ అధ్యక్ష పీఠం దాకా ఎదిగారు. 2000లో నేషనల్ అసెంబ్లీకి ఎన్నికవడం మదురో కెరీర్లో కీలక మలుపు. వెనిజులా చరిత్రలో అత్యంత జనాకర్షక నేతగా పేరొందిన హ్యూగో చావెజ్ అభిమానం చూరగొనడంతో ఆయన దశ తిరిగింది. చావెజ్ హయాంలో నేషనల్ అసెంబ్లీ స్పీకర్‌గా, విదేశాంగ మంత్రిగా చేసి 2012లో దేశ ఉపాధ్యక్షుడయ్యారు. ఏడాదికే చావెజ్ క్యాన్సర్ బారిన పడ్డారు. 2013లో మదురోను తన తాత్కాలిక వారసునిగా ప్రకటించి మరణించారు. మదురో గద్దెనెక్కుతూనే అధ్యక్ష పదవికి తూతూ మంత్రంగా ప్రత్యేక ఎన్నికలు జరిపించి తనకు 50 శాతానికి పైగా ఓట్లొచ్చాయని ప్రకటించుకున్నారు. నాటినుంచి నేటిదాకా అధికారంలో కొనసాగుతున్నారు. ఆయన 11 ఏళ్ల పాలనలో దేశం అన్ని రంగాల్లోనూ కుప్పకూలిందంటూ జనం ఆగ్రహంగా ఉన్నారు. కొన్నేళ్లుగా మదురోపై దేశవ్యాప్తంగా వ్యతిరేకత తీవ్రతరమవుతోంది.

నీతిఆయోగ్ భేటీకి ఆరుగురు సీఎంలు దూరం

న్యూఢిల్లీ: హస్తినలో శనివారం జరగబోయే నీతి ఆయోగ్ పాలకమండలి భేటీని విపక్ష 'ఇండియా' కూటమి పార్టీలకు చెందిన ఆరుగురు సీఎంలు బహిష్కరించారు. కేంద్ర బడ్జెట్‌లో తమ రాష్ట్రాలకు నిధుల కేటాయింపులో తీవ్ర వివక్ష చూపారంటూ ఈ నిర్ణయం తీసుకున్నారు. వీరిలో కాంగ్రెస్‌పాలిత రాష్ట్రాల సీఎంలు రేవంత్‌రెడ్డి (తెలంగాణ), సిద్ధరామయ్య (కర్ణాటక), సుఖ్వీందర్ సింగ్ సుఖూ (హిమాచల్ ప్రదేశ్)తో పాటు ఎంకే స్టాలిన్ (తమిళనాడు), విజయన్ (కేరళ), భగవంత్ మాన్ (పంజాబ్) ఉన్నారు. ఢిల్లీ ప్రభుత్వమూ భేటీని బాయ్‌కాట్ చేసింది.

ప్రణాళికా సంఘమే కావాలి: మమత

పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ చీఫ్ మమతా బెనర్జీ మాత్రం భేటీలో పాల్గొంటానని స్పష్టంచేశారు. ''బడ్జెట్ కేటాయింపుల్లో విపక్షాలపాలిత రాష్ట్రాలపై మోదీ సర్కార్ వివక్షను భేటీలో ప్రస్తావిస్తా. బెంగాల్‌లో విభజన రాజకీయాలు తెస్తూ పొరుగురాష్ట్రాలతో వైరానికి వంతపాడుతున్న కేంద్రాన్ని కడిగేస్తా. నీతి ఆయోగ్ ప్రణాళికలు ఒక్కటీ అమలుకావడం చూడలేదు. ప్రణాళికా సంఘంలో ఒక విధానమంటూ ఉండేది. రాష్ట్రాల సూచనలకు విలువ ఇచ్చేవారు. నీతిఆయోగ్‌లో మా మాట వినే అవకాశం లేదు. పట్టించుకుంటారన్న ఆశ అస్సలు లేదు. అందుకే ప్రణాళికా సంఘాన్ని పునరుద్ధరించాలి'' అని మమత అన్నారు.

నేడు మోదీ నేతృత్వంలో భేటీ

2047 ఏడాదికల్లా అభివృద్ధి చెందిన దేశంగా భారత్‌ను తీర్చిదిద్దే లక్ష్యంతో కేంద్రప్రభుత్వం తీసుకునే నిర్ణయాలపై చర్చించేందుకు నేడు ప్రధాని మోదీ అధ్యక్షతన 9వ నీతిఆయోగ్ పాలకమండలి సమావేశం జరగనుంది. ఈ భేటీకి కేంద్రమంత్రులు, పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, లెఫ్టినెంట్ గవర్నర్లు హాజరుకానున్నారు. అయితే పుదుచ్చేరి ముఖ్యమంత్రి ఎస్.రంగస్వామి ఈ భేటీకి రావట్లేదని తెలుస్తోంది. పుదుచ్చేరిలో రంగస్వామికి చెందిన ఏఐఎన్ఆర్‌సీ పార్టీ బీజేపీతో కలిసి సంకీర్ణ ప్రభుత్వాన్ని నడుపుతోంది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రజాజీవనాన్ని మెరుగుపరిచేందుకు కేంద్ర, రాష్ట్రాలు ఎలా మరింత సమన్వయంతో పనిచేయాలనే అంశాలనూ ఈ భేటీలో చర్చించనున్నారు. వికసిత భారత్‌కు దార్శనిక పత్రం రూపకల్పనకు తీసుకోవాల్సిన చర్యలను ఈ సమావేశంలో చర్చించనున్నారు. ఈ క్రతువులో రాష్ట్రాల పాత్రపై విస్తృతస్థాయిలో చర్చ జరగనుందని ప్రభుత్వం ఒక ప్రకటనలో పేర్కొంది. గత ఏడాది డిసెంబర్‌లో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శుల మూడో జాతీయ సదస్సులో చేసిన సిఫార్సులనూ సమావేశంలో పరిశీలించనున్నారు.


కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ శుక్రవారం లక్నోకు వెళ్తూ సుల్తాన్‌పూర్ శివార్లలో చెప్పులు కుట్టే దుకాణం వద్ద ఆగారు. దుకాణదారు రామ్ చేత్‌తో మాటలు కలిపారు. ఆయనతో కలిసి కూల్ డ్రింక్ తాగారు.

షొలిమేరల నుంచే హెచ్చరిస్తున్నా...
పాక్ కుట్రలు ఫలించవు

- విజయ్ దివస్ సందర్భంగా ప్రధాని కార్గిల్ సందర్శన
- అమర జవాన్లకు ఘనంగా నివాళులు

ద్రాస్ (లద్దాఖ్): కార్గిల్ యుద్ధంలో చావుదెబ్బ తిన్నా పాకిస్తాన్‌కు ఇంకా బుద్ధి రాలేదంటూ ప్రధాని నరేంద్ర మోదీ మండిపడ్డారు. ఉగ్రవాదం ముసుగులో పరోక్ష యుద్ధాలతో ఇప్పటికీ కవ్వింపు చర్యలకు దిగుతోందని దుయ్యబట్టారు. 25వ కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా శుక్రవారం ఆయన లద్దాఖ్‌లో పర్యటించారు. ద్రాస్‌లోని కార్గిల్ యుద్ధ స్మారకం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి అమర జవాన్లకు నివాళులర్పించారు. వారి కుటుంబీకులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా పాక్‌కు తీవ్ర హెచ్చరికలు చేశారు. ''1999లో కార్గిల్ యుద్ధంలో మన సైనిక వీరుల శౌర్యం ముందు పాక్ ముష్కరులు మోకరిల్లారు. అయినా ఆ దేశం ఎన్నో వికృత యత్నాలకు పాల్పడింది. అవన్నీ దారుణంగా విఫలవుతున్నా గుణపాఠం నేర్వడం లేదు. పొలిమేరల నుంచి వారికి నేరుగా వినబడేలా హెచ్చరిస్తున్నా. ఉగ్ర మూకల దన్నుతో పన్నుతున్న ఇలాంటి కుట్రలు సాగవు. ముష్కరులను మన సైనిక దళాలు నలిపేస్తాయి. ఉగ్రవాదాన్ని కూకటివేళ్లతో పెకిలించివేస్తాం'' అన్నారు. పాతికేళ్ల కింద కార్గిల్ యుద్ధ సమయంలో ఓ సామాన్యునిగా సైనికుల మధ్య గడిపే అదృష్టం తనకు దక్కిందని మోదీ గుర్తు చేసుకున్నారు. భూతల స్వర్గమైన కశ్మీర్‌లో ఆర్టికల్ 370 రద్దు తర్వాత శాంతిభద్రతలు నెలకొంటున్నాయన్నారు. సైనికులకు ఇవ్వాల్సిన పెన్షన్ నిధులను ఆదా చేసుకునేందుకే అగ్నిపథ్ పథకం తెచ్చారన్న విపక్షాల విమర్శలను మోదీ తీవ్రంగా ఖండించారు.


విజయ్ దివస్ సందర్భంగా ద్రాస్‌లో మాట్లాడుతున్న మోదీ

అది సైన్యాన్ని మరింత బలోపేతం చేసేందుకు, నిత్యం యువ రక్తం ఉండేలా, సదా యుద్ధ సన్నద్ధంగా ఉండేలా చూసేందుకు తెచ్చిన పథకమన్నారు. ''వేల కోట్ల కుంభకోణాలతో సైన్యాన్ని బలహీనపరిచిన వాళ్లే ఇప్పుడిలా దేశ భద్రతకు సంబంధించిన సున్నితమైన అంశంపై మతిలేని విమర్శలకు దిగడం సిగ్గుచేటు. వన్ ర్యాంక్ వన్ పెన్షన్‌పై తప్పుడు వాగ్దానాలు చేసింది కూడా వారే. మేం విజయవంతంగా అమలు చేస్తున్నాం'' అన్నారు.

టన్నెల్‌లో మోదీ 'బ్లాస్ట్'

లేహ్‌కు అన్ని వాతావరణ పరిస్థితుల్లోనూ బయటి ప్రపంచంతో సంబంధాలు కల్పించనున్న షింకున్ లా టన్నెల్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. వర్చువల్‌గా తొలి బ్లాస్ట్ చేసి పనులను ప్రారంభించారు. 15,800 అడుగుల ఎత్తులో నిర్మిస్తున్న ఈ ట్విన్ ట్యూబ్ టన్నెల్ పొడవు 4.1 కి.మీ. ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన ప్రాంతంలో ఉన్న సొరంగంగా నిలవనుంది.

'విజయ్ దివస్'లో ముర్ము

న్యూఢిల్లీ: విజయ్ దివస్ సందర్భంగా అమర జవాన్లకు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఘనంగా నివాళులర్పించారు. ''1999లో ఉగ్రవాదుల ముసుగులో కశ్మీర్ మంచుకొండల్లోకి చొరబడ్డ పాక్ సైన్యాన్ని మన సైనిక దళాలు అసమాన శౌర్య సాహసాలతో చావు దెబ్బ తీశాయి. ఆ క్రమంలో అమరుడైన ప్రతి సైనికునికీ శిరసు వంచి అభివాదం చేస్తున్నా'' అని పేర్కొన్నారు. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, ఆర్మీ చీఫ్ జనరల్ అనిల్ చౌహాన్ తదితరులు కూడా నివాళులర్పించారు.

మోదీపై విపక్షాల ధ్వజం

సైన్యం కోరిన మీదటే అగ్నిపథ్ తెచ్చామంటూ మోదీ పచ్చి అబద్ధాలు చెప్పారని విపక్షాలు విమర్శించాయి. విజయ్ దివస్ ప్రసంగంలో కూడా అబద్ధాలు చెప్పి అమర జవాన్లను అవమానించారంటూ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే దుయ్యబట్టారు. ఏ ప్రధానీ ఇలా దిగజారలేదంటూ ధ్వజమెత్తారు. ఈ పథకం ప్రస్తావనతో ఆశ్చర్యపోయామని నాటి ఆర్మీ చీఫే చెప్పారని కాంగ్రెస్ పేర్కొంది. సైన్యం సామర్థ్యాన్ని పెంచేందుకు, యువ రక్తం నింపేందుకు అగ్నిపథ్ పథకం తెచ్చామనడం ద్వారా మన సైనికులను మోదీ ఘోరంగా అవమానించారని తృణమూల్ కాంగ్రెస్, శివసేన (యూబీటీ) తదితర పార్టీలు దుయ్యబట్టాయి.

ఫ్రాన్స్‌లో దుండగుల దుశ్చర్య

- ఒలింపిక్స్ ప్రారంభమైన రోజే హైస్పీడ్ రైలు నెట్‌వర్క్‌పై దాడి
- నిలిచిపోయిన రైళ్ల రాకపోకలు

పారిస్: ఒలింపిక్స్ క్రీడలకు ఆతిథ్యం ఇస్తున్న ఫ్రాన్స్‌లో గుర్తు తెలియని వ్యక్తులు విధ్వంసానికి పాల్పడ్డారు. హైస్పీడ్ రైలు నెట్‌వర్క్‌ను లక్ష్యంగా చేసుకొని దాడులకు దిగారు. భారత కాలమానం ప్రకారం శుక్రవారం రాత్రి 11 గంటలకు క్రీడోత్సవాలు ప్రారంభం కాగా, దుండగుల దుశ్చర్య కారణంగా ఉదయం నుంచే పలు ప్రాంతాల్లో రైళ్ల రాకపోకలు నిలిచిపోయాయి. కొన్ని ఆలస్యంగా నడిచాయి. మారుమూల ప్రాంతాల్లో సిగ్నల్ సబ్ స్టేషన్లపై దాడి చేశారు. కేబుళ్లు తెంపేశారు. ఫలితంగా ఫ్రాన్స్‌తో పాటు యూరప్‌లోని పలు ప్రాంతాల నుంచి పారిస్‌కు రైల్వే సేవలు నిలిపివేయాల్సి వచ్చింది. వేలాది మంది ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రైళ్లలో వెళ్లాల్సిన ఒలింపిక్ క్రీడాకారులను బస్సుల్లో పారిస్‌కు తరలించారు. ఒలింపిక్స్ ప్రారంభమైన రోజే పథకం ప్రకారం జరిగిన ఈ చర్యల వెనుక కుట్ర ఉన్నట్లు అనుమానిస్తున్నారు. వామపక్షవాద మిలిటెంట్లు లేదా పర్యావరణ పరిరక్షణ ఉద్యమకారులు ఈ దాడులకు పాల్పడినట్లు భావిస్తున్నారు. తమ డిమాండ్లను ప్రపంచం దృష్టికి తీసుకురావాలన్నదే వారి ఎత్తుగడ కావొచ్చని చెబుతున్నారు. అయితే, ఒలింపిక్ క్రీడలతో ఈ దాడులకు ప్రత్యక్ష సంబంధం లేదని భావిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. క్రీడలను అడ్డుకోవాలన్నది దుండగుల ఆలోచన కాకపోవచ్చని తెలిపారు. హైస్పీడ్ రైలు నెట్‌వర్క్‌ను స్తంభింపజేసిన దుండగులను గుర్తించేందుకు దర్యాప్తు ప్రారంభించారు. నేరం రుజువైతే వారికి పదేళ్ల నుంచి 20 ఏళ్ల దాకా జైలు శిక్షపడే అవకాశం ఉందని చెప్పారు. తాజా ఘటనలపై ఫ్రాన్స్ ప్రధానమంత్రి గాబ్రియెల్ అటాల్ స్పందించారు. ఇవి ముందస్తు పథకం ప్రకారం జరిగిన దాడులేనని చెప్పారు. ఉత్తర, తూర్పు, పశ్చిమ ప్రాంతాల నుంచి పారిస్‌కు దారితీసే రైలు మార్గాలను లక్ష్యంగా చేసుకొని దాడులకు పాల్పడ్డారని తెలిపారు. పారిస్‌కు వెళ్లే రైళ్లను అడ్డుకోవాలన్నదే వారి ఉద్దేశంగా కనిపిస్తోందన్నారు. దుండగుల కోసం గాలింపు ప్రారంభమైందన్నారు. మధ్యాహ్నం తర్వాత రైళ్ల రాకపోకలు కొనసాగాయని రవాణా మంత్రి పాట్రిస్ వెర్‌గ్రిటే చెప్పారు. ఒలింపిక్స్ సందర్భంగా ముష్కరులు విధ్వంసానికి పాల్పడే అవకాశం ఉందని ఫ్రాన్స్ నిఘా వర్గాలు నెల రోజుల క్రితమే హెచ్చరించాయి.


పారిస్‌లోని ఓ లోకల్ రైల్వేస్టేషన్లో రైళ్ల కోసం ప్రయాణికుల ఎదురుతెన్నులు

61 నుంచి 17కు

- నీట్-యూజీలో పడిపోయిన టాప్ ర్యాంకర్ల సంఖ్య
- రీ-రివైజ్డ్ జాబితా విడుదల

న్యూఢిల్లీ: సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు నీట్-యూజీ ప్రవేశపరీక్ష ఫలితాల రీ-రివైజ్డ్ తుది జాబితాను ఎన్‌టీఏ శుక్రవారం విడుదల చేసింది. ఐదు మార్కులు తీసేయడంతో టాప్ ర్యాంకర్ల సంఖ్య 61 నుంచి 17కు పడిపోయింది. ఫిజిక్స్‌లో ప్రశ్నకు నాలుగో ఆప్షన్ సరైనదని ఐఐటీ ఢిల్లీ నిపుణుల బృందం తేల్చింది. దాంతో అందరి ర్యాంకులు మారిపోయాయి. గతంలో 67 మంది 720కి 720 మార్కులు సాధించారని ప్రకటించారు. ఆరుగురికి గ్రేస్ మార్కులను తీసేయడంతో టాపర్లు 61కి తగ్గారు. తాజాగా వారి సంఖ్య 17కు తగ్గింది.

టాప్ 100 జాబితా..

రీ-రివైజ్డ్ జాబితా ప్రకారం టాప్-100 జాబితాలో 17 మంది 720కి 720 మార్కులు సాధించారు. ఆరుగురు 716 మార్కులు సాధించారు. 77 మంది 715 మార్కులు సాధించారు. కేరళ, చండీగఢ్, తమిళనాడు, పంజాబ్, బిహార్, పశ్చిమబెంగాల్ నుంచి తలొకరు, రాజస్తాన్ నుంచి నలుగురు, మహారాష్ట్ర నుంచి ముగ్గురు, ఢిల్లీ, ఉత్తరప్రదేశ్ నుంచి చెరొకరు.. 17 మంది టాపర్లుగా నిలిచారు. వీరిలో నలుగురు అమ్మాయిలు! టాప్-100లో అమ్మాయిలు 22 మంది ఉన్నారు. స్కోర్‌కార్డులు, కౌన్సిలింగ్‌కు తాజా సమాచారం కోసం exams.nta.ac.inను చూడాలని ఎన్‌టీఏ పేర్కొంది.

మెక్సికో డ్రగ్ లార్డ్ అరెస్ట్

అమెరికాకు చిక్కిన జంబాడా

- ఎల్‌చాపో కుమారుడు జోక్విన్ గుజ్మాన్ కూడా
- మభ్యపెట్టి వారి విమానాన్ని అమెరికాలో ల్యాండ్ చేసిన వైనం

వాషింగ్టన్: మెక్సికోలో మాదకద్రవ్యాల వ్యాపారంతో వేలకోట్ల రూపాయల నేరసామ్రాజ్యాన్ని విస్తరించిన డ్రగ్ లార్డ్ ఇస్మాయిల్ 'ఎల్ మాయో' జంబాడా గార్షియా ఎట్టకేలకు అమెరికా పోలీసులకు చిక్కాడు. 76 ఏళ్ల జంబాడా వాస్తవానికి విమానంలో వేరే ప్రాంతానికి వెళ్లాల్సి ఉండగా అతనికి తెలీకుండా చాకచక్యంగా ప్రైవేట్ విమానాన్ని అమెరికాలో ల్యాండ్ చేశారు. గురువారం టెక్సాస్ రాష్ట్రంలోని ఎల్ పాసో సిటీ శివారులోని చిన్న ఎయిర్‌పోర్ట్‌లో ల్యాండ్ అయిన అదే విమానంలో ఉన్న డ్రగ్ లార్డ్ ఎల్‌చాపో కుమారుడు జోక్విన్ 'ఎల్ చాపో' గుజ్మాన్(38)నూ పోలీసులు అరెస్ట్‌చేసి గుర్తు తెలియని ప్రాంతానికి తీసుకెళ్లి విచారిస్తున్నారు. దశాబ్దాలుగా జంబాడా అరెస్ట్‌కోసం అమెరికా ప్రయత్నిస్తోంది. అతని జాడ చెప్తే రూ.125 కోట్ల నజరానా ఇస్తామని గతంలో ప్రకటించింది. 'అమెరికాలోకి వందల కోట్ల డాలర్ల విలువైన ఫెంటానిల్, మెథాంఫెటమైన్ డ్రగ్స్‌ను సరఫరా చేస్తూ అమెరికా యువతను మాదకద్రవ్యాల మత్తులో ముంచేసిన నేరానికి వీరికి కఠిన శిక్ష పడనుంది' అని ఎఫ్‌బీఐ డైరెక్టర్ క్రిస్టఫర్ అన్నారు. రియల్‌ఎస్టేట్ వ్యాపార నిమిత్తం వెళ్తున్నామని అబద్ధం చెప్పి జంబాడాను జోక్విన్ గుజ్మానే విమానం ఎక్కించాడని విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి.


జంబాడా

అత్యంత హింసాత్మక, శక్తివంత 'సినోలా కార్టెల్'

మాదకద్రవ్యాల అక్రమ తయారీ, ఎగుమతికి ప్రపంచ కేంద్రస్థానంగా నిలిచే మెక్సికోలో అత్యంత హింసాత్మక, శక్తివంతమైన డ్రగ్స్ ముఠాల్లో సినోలా కార్టెల్ కూడా ఒకటి. దీనిని ఎల్ చాపో గుజ్మాన్, జంబాడా, మరొకరు సంయుక్తంగా స్థాపించి డ్రగ్స్‌ను విచ్చలవిడిగా అమ్మడం మొదలెట్టారు. వందల కోట్ల డ్రగ్స్ సామ్రాజ్యానికి అధిపతిగా కొనసాగిన జాక్విన్ అర్చివాల్డో గుజ్మాన్ లోయెరా (ఎల్‌చాపో)ను 2019లో మెక్సికో ప్రభుత్వం అరెస్ట్‌చేసి అమెరికాకు అప్పగించడంతో అక్కడే జీవితకాలకారాగార శిక్ష అనుభవిస్తున్నారు. దీంతో ఎల్ చాపో కుమారులు రంగంలోకి దిగి అక్రమ వ్యాపారాన్ని మరింత విస్తరించారు. అమెరికా సహా విదేశాలకు సరకు అక్రమ రవాణా మొత్తం జంబాడా కనుసన్నల్లో జరుగుతోంది. ప్రత్యర్థి డ్రగ్స్ ముఠా సభ్యులు చిక్కితే వారి తల నరకడం, చర్మం ఒలిచేయడం, శరీరాన్ని ముక్కలుగా నరకడం వంటి హేయమైన నేరాలకు పాల్పడటం అక్కడి ముఠాలకు మామూలు విషయం.

బిల్లులు ఎందుకు ఆపేశారో చెప్పండి

కేంద్ర హోంశాఖ, కేరళ, బెంగాల్ గవర్నర్ల కార్యదర్శులకు సుప్రీం నోటీసులు



న్యూఢిల్లీ: కేరళ, పశ్చిమ బెంగాల్ శాసనసభల్లో ఆమోదించిన బిల్లులకు ఆయా రాష్ట్రాల గవర్నర్లు అంగీకారం తెలియజేయకుండా సుదీర్ఘకాలం పెండింగ్‌లో పెట్టడం పట్ల సుప్రీంకోర్టు ఆశ్చర్యం వ్యక్తం చేసింది. గవర్నర్ల వైఖరిని సవాలు చేస్తూ కేరళ, పశ్చిమ బెంగాల్ ప్రభుత్వాలు వేర్వేరుగా దాఖలు చేసిన పిటిషన్లను ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణకు స్వీకరించింది. కేంద్ర హోం శాఖకు, కేరళ గవర్నర్ ఆరిఫ్ మొహమ్మద్ ఖాన్, బెంగాల్ గవర్నర్ ఆనందబోసు కార్యదర్శులకు శుక్రవారం నోటీసులు జారీ చేసింది. బిల్లులను ఎందుకు పెండింగ్‌లో కొనసాగిస్తున్నారో మూడు వారాల్లోగా వివరణ ఇవ్వాలని ఆదేశించింది. అలాగే పిటిషన్‌లో కేంద్ర హోంశాఖను సైతం ఒక పార్టీగా చేర్చాలని బెంగాల్ ప్రభుత్వానికి సూచించింది. తమ రాష్ట్ర అసెంబ్లీలో ఆమోదించిన బిల్లులకు గవర్నర్ అంగీకారం తెలియజేయడం లేదంటూ కేరళ ప్రభుత్వం ఈ ఏడాది మార్చి నెలలో సుప్రీంకోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే.

బీజేపీ చౌకబారు ప్రచారం కోసమే!

పరువు నష్టం కేసుపై రాహుల్ వ్యాఖ్యలు, కోర్టుకు హాజరు



సుల్తాన్‌పూర్(యూపీ): కేవలం చౌకబారు ప్రచారం కోసమే బీజేపీ నేతలు తనపై పరువు నష్టం వేశారని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ మండిపడ్డారు. శుక్రవారం ఆయన సుల్తాన్‌పూర్‌లోని ఎంపీ-ఎమ్మెల్యే కేసులను విచారించే ప్రత్యేక కోర్టులో హాజరయ్యారు. తాను ఎవరిపైనా పరువు నష్టం కలిగించేంతటి ఆరోపణలు చేయలేదని జడ్జి శుభమ్ వర్మ ఎదుట తెలిపారు. దీంతో, జడ్జి కేసు తదుపరి విచారణను ఆగస్ట్ 12వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు తెలిపారు. అదే రోజు రాహుల్ వాంగ్మూలాన్ని రికార్డు చేస్తామని చెప్పారు. రాహుల్ కోర్టుకు రానవసరం లేదని పేర్కొన్నారు. అనంతరం కోర్టు వెలుపల రాహుల్ మీడియాతో మాట్లాడారు. బీజేపీ నేతలు చౌకబారు ప్రచారం కోసమే తనపై కేసు వేశారన్నారు.

రాహుల్ కొత్త చిరునామా..!

న్యూఢిల్లీ: లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి సునహరీ బాగ్ రోడ్‌లోని ఐదో నంబర్ బంగ్లాకు మారే అవకాశాలు కనిపిస్తున్నాయి. కేబినెట్ హోదా కలిగిన ప్రతిపక్ష నేతకు నిబంధనల ప్రకారం టైప్-8 బంగ్లాను కేటాయించాల్సి ఉంటుంది. రాహుల్ గాంధీకి సునహరీ బాగ్‌లోని ఐదో నంబర్ బంగ్లాను కేటాయించినట్లు హౌస్ కమిటీ వర్గాలు శుక్రవారం తెలిపాయి.

ఆక్స్‌ఫర్డ్ చాన్సలర్ పదవికి ఇమ్రాన్ పోటీ!



ఇస్లామాబాద్/లండన్: పాకిస్తాన్ మాజీ ప్రధానమంత్రి ఇమ్రాన్‌ఖాన్ విఖ్యాత ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ చాన్సలర్ పదవికి పోటీపడనున్నారు. ప్రస్తుతం జైల్లో ఉన్న ఇమ్రాన్ ఆన్‌లైన్ బ్యాలట్ విధానంలో జరిగే ఎన్నికల్లో పాల్గొంటారని అంతర్జాతీయ వ్యవహారాల్లో ఆయనకు సలహాదారుడైన వ్యాపారవేత్త సయ్యద్ జుల్ఫీ బుఖారీ శుక్రవారం జియో న్యూస్‌కు తెలిపారు. ఇమ్రాన్ ఆక్స్‌ఫర్ యూనివర్సిటీ పూర్వ విద్యార్థి. ఎకనమిక్స్, పొలిటికల్ సైన్స్ చదివారు. 2005-2014 దాకా ఆయన బ్రాడ్‌ఫోర్డ్ యూనివర్సిటీ చాన్సలర్‌గా పనిచేశారు. ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ చాన్సలర్ పదవికి గౌరవ హోదా.. పూర్వ విద్యార్థులు దీని కోసం పోటీపడటానికి అర్హులు. రాజకీయ నాయకులకు ఈ పదవి దక్కడం ఆనవాయితీగా వస్తోంది. బ్రిటన్ మాజీ ప్రధానులు టోనీ బ్లెయిర్, బోరిస్ జాన్సన్‌లు కూడా ఈసారి పోటీలో ఉన్నారు.

ఎస్పీ ఆఫీసు ఎదుట రాజ్యాంగ స్తూపం



లక్నో: లక్నోలోని సమాజ్‌వాదీ పార్టీ(ఎస్పీ) ప్రధాన కార్యాలయం ఎదుట రాజ్యాంగ స్తూపం(సంవిధాన్ మాన్‌స్తంభ్) ఏర్పాటైంది. శుక్రవారం జరిగిన ఒక కార్యక్రమంలో ఎస్పీ నేతల సమక్షంలో ఆ పార్టీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ ఒక స్తూపంపై రాజ్యాంగ ప్రతిని ఉంచడం ద్వారా రాజ్యాంగ స్తూపాన్ని ఆవిష్కరించారు. 'ఒకప్పటి కొల్హాపూర్ మహారాజు ఛత్రపతి సాహూ తన సంస్థానంలో మహాత్మా జ్యోతిబా పూలే కలలుగన్న రిజర్వేషన్ల అమలును సరిగ్గా ఇదే రోజున ప్రారంభించారు. అందుకే జూలై 26వ తేదీన రాజ్యాంగ స్తూపాన్ని ఏర్పాటు చేసినట్లు అనంతరం అఖిలేశ్ 'ఎక్స్'లో పేర్కొన్నారు.

భర్త తర్వాత భార్య

కర్ణాటక చీఫ్ సెక్రటరీగా శాలినీ రజనీష్



బెంగళూరు: ఒక రాష్ట్రానికి ప్రధాన కార్యదర్శిగా పనిచేయడమంటే.. ప్రభుత్వానికి కళ్లు, చెవులు అన్నీ తానై వ్యవహరించడం. కర్ణాటకలో ఈ కీలక పోస్టును భర్త తర్వాత భార్య చేపట్టే అరుదైన రికార్డును రజనీష్ గోయల్, శాలినీ రజనీష్‌లు దక్కించుకున్నారు. ప్రస్తుతం చీఫ్ సెక్రటరీగా ఉన్న రజనీష్ గోయల్ ఈనెల 31న పదవీ విరమణ చేయనున్నారు. ఆయన స్థానంలో నూతన ప్రధాన కార్యదర్శిగా శాలినిని నియమిస్తూ కర్ణాటక ప్రభుత్వం శుక్రవారం నిర్ణయం తీసుకుంది. 1989 ఐఏఎస్ బ్యాచ్ టాపర్ అయిన శాలిని గ్రామీణాభివృద్ధిలో పీహెచ్‌డీ చేశారు. మేనేజ్‌మెంట్, వ్యక్తిత్వ వికాసం, మహిళా సాధికారికతలపై పలు పుస్తకాలు రచించారు. రజనీష్ దంపతులకంటే ముందు కర్ణాటకలో మరో జంట కూడా ప్రధాన కార్యదర్శులుగా పని చేసింది. 20 ఏళ్ల కిందట బి.కె.భట్టాచార్య, ఆయన భార్య థెరెసా భట్టాచార్యలు ఇద్దరూ సీఎస్‌లుగా చేశారు.

మద్దతు ధరపై కమిటీ: శివరాజ్ సింగ్



న్యూఢిల్లీ: పంటలకు కనీస మద్దతు ధర(ఎంఎస్పీ)పై శుక్రవారం రాజ్యసభలో ప్రతిపక్షాలు తీవ్ర అలజడి సృష్టించాయి. సభా కార్యకలాపాలకు అడ్డుతగిలాయి. ఎంఎస్పీకి చట్టబద్ధత కల్పించాలంటూ నినాదాలతో హోరెత్తించాయి. ప్రశ్నోత్తరాల సమయంలో కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ మాట్లాడుతూ రైతాంగం సంక్షేమానికి ప్రభుత్వం చేపట్టిన చర్యలు వివరించారు. కనీస మద్దతు ధర వ్యవస్థను బలోపేతం చేసేందుకు కమిటీ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా మద్దతు ధరపై నిర్ణయం తీసుకుంటామని అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ కంటే రైతుల శ్రేయోభిలాషి ఇంకెవరూ ఉండరని వెల్లడించారు. ఎంఎస్పీకి చట్టబద్ధత గురించి మాట్లాడకుండా దాటవేశారు. దీంతో కాంగ్రెస్ ఎంపీలు జైరామ్ రమేశ్, రణదీప్ సూర్జేవాలా సహా విపక్ష ఎంపీలు అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినదించారు.

కమలకు ఒబామా మద్దతు



వాషింగ్టన్: అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డెమొక్రటిక్ అభ్యర్థిగా పోటీకి దిగుతున్న కమలా హారిస్‌కు సొంత పార్టీ నుంచి మద్దతు నానాటికీ పెరుగుతోంది. మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా సైతం ఆమెకు అండగా నిలిచారు. అమెరికాకు కమలా హారిస్ అద్భుతమైన అధ్యక్షురాలు అవుతారని ప్రశంసల వర్షం కురిపించారు. తాను, తన భార్య మిషెల్ కలిసి ఆమె అభ్యర్థిత్వాన్ని బలపరుస్తున్నామని, తోడుగా ఉంటామని చెప్పారు. ఎన్నికల్లో కమల విజయం కోసం తాను చేయగలిగినదంతా చేస్తామని ప్రకటించారు. ఈ మేరకు ఒబామా శుక్రవారం 'ఎక్స్'లో పోస్టు చేశారు. అధ్యక్ష ఎన్నికల రేసు నుంచి తప్పుకుంటున్నట్లు ఆదివారం జో బైడెన్ ప్రకటించిన తర్వాత డెమొక్రటిక్ అభ్యర్థిగా కమలా హారిస్ పేరు తెరపైకి వచ్చింది. కానీ, ఆమెకు బరాక్ ఒబామా వెంటనే మద్దతు తెలియజేయపోవడం పట్ల రకరకాల ఊహాగానాలు చెలరేగాయి. కమల అభ్యర్థిత్వం పట్ల ఒబామా అయిష్టంగా ఉన్నారంటూ వార్తలొచ్చాయి. కానీ, అదంతా వట్టిదేనని తేలిపోయింది. కమలతో తాము ఇప్పటికే ఫోన్‌లో మాట్లాడామని ఒబామా 'ఎక్స్'లో వెల్లడించారు. ఆమెకు తమ పూర్తి మద్దతు ఉంటుందన్నారు. దేశం ప్రస్తుతం సంక్లిష్ట పరిస్థితులు ఎదుర్కొంటున్న తరుణంలో కమల విజయం కోసం తాము శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు. కమలను చూసి తాను గర్విస్తున్నానని, వచ్చే ఎన్నికల్లో ఆమె చరిత్రాత్మక విజయం సాధించడం తథ్యమని మిషెల్ ఒబామా పేర్కొన్నారు. తనకు మద్దతు ప్రకటించిన ఒబామా దంపతులకు కమలా హారిస్ కృతజ్ఞతలు తెలియజేశారు.

సాక్షి
హైదరాబాద్
శనివారం । 27 । జూలై । 2024



గోరఖ్‌పూర్ టు హైదరాబాద్
ఉత్తరప్రదేశ్ నుంచి నగరానికి వచ్చిన మతి స్థిమితం లేని మహిళకు ఎర్రగడ్డ మానసిక వైద్యశాల వైద్యులు చికిత్స అందించి ఆమె కుటుంబీకులకు సమాచారం ఇచ్చారు. -8లో



రూ.150 కోట్లకు కుచ్చుటోపీ?
మలక్‌పేట గంజిలో చింతపండు కమీషన్ వ్యాపారం చేస్తున్న కాలేరు శ్రీనివాస్ రైతులను, వ్యాపారులను మోసం చేసి రూ.150 కోట్లతో పరారయ్యాడు. -8లో

వాతావరణం
గరిష్టం/కనిష్టం
28.0/23.0

నగరంలో ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడ చిరుజల్లులు కురిసే అవకాశముంది. గరిష్టంగా 28, కనిష్టంగా 23 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు కావచ్చు.

ఉస్మానియా ఆస్పత్రి ఖాళీ

పాత భవనానికి తాళం వేసి నేటికి 4 ఏళ్లు

- ఇటీవల 60 మంది వైద్యులు బదిలీ
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న రోగులు



అఫ్జల్‌గంజ్: పేదల పెద్దాసుపత్రిగా పేరుగాంచిన ఉస్మానియా జనరల్ ఆస్పత్రి పాత భవనానికి తాళం వేసి నేటికి నాలుగేళ్లు పూర్తవుతాయి. పాత భవనం మూసివేయడంతో ఆస్పత్రిలో స్థలాభావంతో అందుబాటులో ఉన్న స్థలంలోనే బెడ్లు సర్దుబాటు చేసి రోగులకు నాణ్యమైన వైద్య చికిత్సలు అందిస్తున్న ఉస్మానియా ఆస్పత్రికి ఇటీవల జరిగిన వైద్యుల బదిలీలు మూలిగే నక్కపై తాటికాయ పడ్డ చందంగా మారింది. నాలుగేళ్ల క్రితం కురిసిన భారీ వర్షాలకు ఉస్మానియా ఆస్పత్రి పాత భవనంలోకి నీరు రావడంతో ఉన్నతాధికారుల ఆదేశాలతో అప్పటి ఆస్పత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ పాండూ నాయక్ నేతృత్వంలోని పరిపాలన విభాగం అధికారులు పాత భవనానికి 2020, జూలై 27న తాళం వేశారు. అనంతరం ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నాగేందర్ కులీకుతుబ్‌షా భవనంలో నూతన షెడ్డును ఏర్పాటు చేసి రోగులకు సర్దుబాటు చేశారు. కాగా.. తాజాగా వైద్య శాఖలో జరిగిన బదిలీల్లో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బి.నాగేందర్‌తో పాటు నిష్ణాతులైన దాదాపు 22 మంది ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లతో కలిపి దాదాపు 60 మంది వైద్యులను ఒకేసారి బదిలీ చేయడంతో ఆస్పత్రి మనుగడ ప్రశ్నార్థకంగా మారిందని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



పాత భవనానికి తాళం (ఫైల్)



బిగ్ సైజ్.. లగ్జరీ!

విస్తీర్ణం, విలాసవంతం వైపే మొగ్గు

- ఖరీదైన ఇళ్లపైనే నగరవాసుల ఆసక్తి
- పశ్చిమ హైదరాబాద్‌లోనే కొనుగోళ్లు ఎక్కువ
- బాచుపల్లి, కొండాపూర్, పుప్పాల్‌గూడల్లోని ప్రాపర్టీలకు డిమాండ్
- ఏప్రిల్- జూన్‌లో నగరంలో 19,574 యూనిట్ల అమ్మకం
- వీటి విలువ దాదాపు రూ.11,953 కోట్లు
- 'స్క్వేర్ యార్డ్స్' తాజా నివేదికలో వెల్లడి

ఏప్రిల్- జూన్‌లో నగరంలో విక్రయమైన గృహాలు

	క్యూ2, 2023	క్యూ1, 2024	క్యూ2, 2024	ఏడాదిలో వృద్ధి (శాతంలో)	త్రైమాసికంలో వృద్ధి (శాతంలో)
గృహాల సంఖ్య	17,693	18,766	19,574	11	4
గృహాల విలువ	9,410	11,150	11,953	27	7

సాక్షి, సిటీబ్యూరో:

కరోనా తర్వాత గృహ కొనుగోలుదారుల అభిరుచిలో మార్పులు వచ్చాయి. ఎక్కువ విస్తీర్ణమైన, ఖరీదైన ఇళ్ల కొనుగోళ్లపైనే నగరవాసులు ఎక్కువ మక్కువ చూపుతున్నారు. వర్క్ ఫ్రం హోమ్, ఆధునిక వసతులు వంటి కారణంగా విలాసవంతమైన ఇళ్లలో ఉండేందుకు ఇష్టపడుతున్నారని స్క్వేర్ యార్డ్స్ నివేదిక వెల్లడించింది. భాగ్యనగరంలో ఈ ఏడాది ఏప్రిల్-జూన్ త్రైమాసికం (క్యూ2)లో రూ.11,953 కోట్ల విలువ చేసే 19,574 గృహాలు అమ్ముడుపోయాయని పేర్కొంది. గతేడాది ఇదే కాలంతో పోలిస్తే గృహ విక్రయాలలో 11 శాతం, విలువల్లో 27 శాతం వృద్ధి నమోదయింది. అదే జనవరి-మార్చి మధ్యలో రూ.11,150 కోట్ల విలువ చేసే 18,766 యూనిట్లు అమ్ముడయ్యాయి.

ఎక్కువ విస్తీర్ణం ఇళ్లకు డిమాండ్..

పెద్ద సైజు ప్రాపర్టీలకు నగరవాసులు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. నగరంలో ఈ ఏడాది క్యూ2లో 2.9 కోట్ల చదరపు అడుగులు (చ.అ.) విస్తీర్ణంలోని గృహాలు అమ్ముడుపోయాయి. గతేడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది 15 శాతం ఎక్కువ. ఇక.. విస్తీర్ణాల వారీగా చూస్తే.. 2024 క్యూ2లో అమ్ముడుపోయిన గృహాలలో 1,000-1,500 చ.అ. విస్తీర్ణం ఉన్న యూనిట్ల వాటా 45 శాతంగా ఉన్నాయి. 1,500-3,000 చ.అ. ఇళ్ల వాటా 37 శాతం, 3 వేల చ.అ. కంటే విస్తీర్ణమైన గృహాల వాటా 3 శాతం, 500-1,000 చ.అ.యూనిట్ల వాటా 14 శాతం, 500 చ.అ.లోపు ఇళ్ల వాటా 1 శాతంగా ఉన్నాయి.

బాచుపల్లిలోనే ఎక్కువ..

ఈ క్యూ2లో విక్రయమైన గృహాలలో 55 శాతం రూ.50 లక్షల లోపు ధర ఉన్నవి అమ్ముడుపోగా.. 28 శాతం రూ.50 లక్షల నుంచి రూ.కోటి, 14 శాతం రూ.1-2 కోట్లు, రూ.2 కోట్లకు పైగా ధర ఉన్న లగ్జరీ ఇళ్లు 3 శాతంగా ఉన్నాయి. శరవేగమైన అభివృద్ధి, ఇళ్ల విలువల పెరుగుదల, రోడ్లు, మంచినీరు, విద్యుత్ వంటి మెరుగైన మౌలిక వసతులు, ఔటర్ రింగ్ రోడ్డు, విమానాశ్రయం తదితర కారణంగా బాచుపల్లి, కొండాపూర్, పుప్పాలగూడ, కోకాపేట ప్రాంతాలలో గృహాల కొనుగోళ్లకు నగరవాసులు ఆసక్తి చూపించారు. అత్యధికంగా బాచుపల్లిలో 1,010 యూనిట్లు అమ్ముడుపోయాయి. కొండాపూర్‌లో రూ.729 కోట్ల విలువ చేసే ప్రాపర్టీలు ఖరీదయ్యాయి.

ప్రాంతాల వారీగా గృహాలు విక్రయాలు

	గృహాల సంఖ్య	విలువ (రూ.కోట్లలో)
మొత్తం హైదరాబాద్	19,574	11,953
పశ్చిమ	9,058	6,979
మధ్య	1,756	1,332
తూర్పు	2,973	1,195
ఉత్తర	2,407	1,009
దక్షిణ	2,005	851
సికింద్రాబాద్	1,375	587

పశ్చిమ హైదరాబాద్‌లో..

ఐటీ సంస్థలకు కేంద్ర బిందువైన పశ్చిమ హైదరాబాద్‌లోని ప్రాపర్టీలకు డిమాండ్ ఎక్కువగా ఉంది. కొనుగోలుదారులే కాకుండా పెట్టుబడిదారులు కూడా మాదాపూర్, గచ్చిబౌలి, తెల్లాపూర్ వంటి వెస్ట్ హైదరాబాద్‌లో కొనేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. ఈ ఏడాది క్యూ2లో అమ్ముడుపోయిన ఇళ్లలో 46 శాతం వాటా పశ్చిమ హైదరాబాదే ఉందంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. ఈ ప్రాంతంలో రూ.6,979 కోట్ల విలువ చేసే 9,058 ఇళ్లు అమ్ముడుపోయాయి. ఆ తర్వాత ఈస్ట్‌లో 15 శాతం, మధ్య హైదరాబాద్‌లో 11 శాతం, తూర్పులో 10 శాతం అమ్మకాలు జరిగాయి.



నాణ్యత, ఆధునిక వసతులు

నిర్మాణంలో నాణ్యత పాటించడంతో పాటు గడువులోగా పూర్తి చేసి కొనుగోలుదారులకు అప్పగించడం, ఆధునిక వసతులు తదితరాల కారణంగా నగరవాసులు అపర్ణా, ప్రెస్టీజ్, బ్రిగేడ్, అరబిందో, డీఎస్ఆర్, ఈఐపీఎల్ వంటి బ్రాండెడ్ డెవలపర్ల ప్రాజెక్ట్‌లలో కొనుగోళ్లకు ఆసక్తి చూపిస్తున్నారు.

– దేబయన్ భట్టాచార్య, ప్రిన్సిపల్ పార్టనర్, స్క్వేర్ యార్డ్స్

నిమ్స్‌లో త్వరలో డిజిటల్ ఓపీ టోకెన్ సిస్టమ్



లక్డీకాపూల్: నిమ్స్‌లో ఓపీ సేవలు పొందేందుకు వస్తున్న రోగులు పడుతున్న అవస్థలపై యాజమాన్యం స్పందించింది. డిజిటలైజేషన్ విధానంలో టోకెన్లు అందించేందుకు కసరత్తు చేపట్టింది. ఓపీడీ, స్పెషాలిటీ బ్లాక్‌లలో ప్రత్యేకంగా ఓపీ కియోస్క్‌లను అందుబాటులోకి తీసుకువస్తోంది. వీటి నుంచి నేరుగా ఓపీ టోకెన్ తీసుకునే వెసులుబాటును కల్పిస్తోంది. ఈ వినూత్న ప్రయోగం సత్ఫలితాలను ఇస్తే అన్ని విభాగాలకు ఓపీ కియోస్క్‌లను ప్రవేశ పెట్టాలన్న యోచనలో యాజమాన్యం ఉంది. కొద్ది రోజుల వ్యవధిలోనే నిమ్స్‌కు కియోస్క్ సేవలు అందుబాటులోకి రానున్నామని నిమ్స్ డైరెక్టర్ నగర బీరప్ప తెలిపారు. అంతే కాకుండా 3 గంటల్లోపే వైద్య పరీక్షల నివేదికలు రోగుల సెల్‌కే అందించనున్నట్లు చెప్పారు. ఆన్‌లైన్‌లో స్లాట్ బుకింగ్ సదుపాయాన్ని సద్వినియోగపర్చుకోవాలన్నారు. సెల్‌ఫోన్‌కి వచ్చిన సమాచారంలో చూపించిన సమయానికంటే 15 నిమిషాలు ముందు వస్తే..సకాలంలో ఓపీ సేవలు పొందవచ్చన్నారు.

భలే.. భలే బడ్జెట్

జీహెచ్ఎంసీ కార్యాలయంలో సంబరాలు



లక్డీకాపూల్: రాష్ట్ర బడ్జెట్‌లో బల్దియాకు రూ.3,065 కోట్ల కేటాయింపుపై జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం సంబరాలు జరిపారు. కార్యక్రమంలో నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతా శోభన్ రెడ్డి, పలువురు కార్పొరేటర్లు పాల్గొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. బాణాసంచా కాల్చి.. మిఠాయిలు పంచారు. ఈ సందర్భంగా మేయర్ గద్వాల్ విజయలక్ష్మి మాట్లాడుతూ.. రాష్ట్ర బడ్జెట్‌లో హైదరాబాద్ నగరాభివృద్ధికి రూ.10 వేల కోట్లు కేటాయించడం ఎంతో హర్షణీయమని పేర్కొన్నారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా నగర మౌలిక సదుపాయాల కల్పనపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. మెట్రో విస్తరణ, మూసీ అభివృద్ధి, ఔటర్ రింగ్ రోడ్డు వరకు జీహెచ్ఎంసీ విస్తరణకు హైడ్రా ఏర్పాటు నగరాభివృద్ధికి ఎంతో ఉపయుక్తమవుతుందన్నారు.

లక్ష్యం మేరకు ఆస్తి పన్ను వసూళ్లు

కమిషనర్ ఆమ్రపాలి

లక్డీకాపూల్: లక్ష్యం మేరకు ఆస్తి పన్ను వసూళ్లకు చర్యలు తీసుకోవాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి సూచించారు. శుక్రవారం జోనల్ అడిషనల్ కమిషనర్లతో నిర్వహించిన టెలీ కాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడారు. సీఆర్ఎంపీ ద్వారా చేపట్టిన రోడ్లకు సంబంధించి ఏజెన్సీలతో చేసుకున్న ఒప్పందం డిసెంబర్ వరకు గడువు ఉందన్నారు. దీంతో పెండింగ్‌లో ఉన్న మెయింటెనెన్స్ పనులను వెంటనే పూర్తి చేయించాలని జోనల్ కమిషనర్లను ఆదేశించారు. ఏజెన్సీ ఒప్పందంలో ఉన్న అంశాలకు పెండింగ్ పనులను పూర్తి చేయాలన్నారు. డెంగీ నియంత్రణ అవగాహన కార్యక్రమాలను మరింత ముమ్మరం చేయాలని కమిషనర్ ఆమ్రపాలి సూచించారు. కమ్యూనిటీ హాళ్లకు సంబంధించిన వివరాలు సర్కిళ్ల వారీగా నివేదిక సమర్పించాలని కమిషనర్ ఆదేశించారు.

అనుమతి లేకుండా శిల్పారామం పేరు, లోగోను ఉపయోగించొద్దు

మాదాపూర్: నిర్దిష్ట అనుమతి లేకుండా శిల్పారామం పేరు, లోగోను ఇతరులు ఉపయోగిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని శిల్పారామం ప్రత్యేక అధికారి జి.కిషన్‌రావు పేర్కొన్నారు. శిల్పారామం ఆర్ట్స్ క్రాఫ్ట్స్ అండ్ కల్చరల్ సొసైటీ మాదాపూర్ , U/r23(2) రూల్56(1)ట్రేడ్‌మార్క్ చట్టం 1999. భారత ప్రభుత్వంలో రిజిస్టర్ అయ్యిందన్నారు. ఇకపై శిల్పకళా వేదిక, సంప్రదాయ వేదిక, రాక్‌హైట్స్, మౌంటెన్ హైట్స్ బుకింగ్‌లు ఆన్‌లైన్ ద్వారానే బుక్ చేసుకోవాలని తెలిపారు. www.shilparamam.inలో సంప్రదించవచ్చని ఆయన సూచించారు.

లోతట్టు.. గట్టెక్కు!

వరదల నియంత్రణకు కేంద్రం నిధులు



హైదరాబాద్ సహా ఆరు నగరాలకు..

- రూ.2514.36 కోట్లు ఇవ్వాలని నిర్ణయం
- అమిత్‌షా అధ్యక్షతన జరిగిన భేటీలో ఆమోదం
- హర్షం వ్యక్తం చేస్తున్న నగరవాసులు

సాక్షి, సిటీబ్యూరో: వానాకాలం వచ్చిందంటే చాలు నగరంలో అనేక ప్రాంతాల ప్రజలు భయం గుప్పిట్లో బతుకుతుంటారు. చిన్నపాటి వర్షం పడితేనే లోతట్టు ప్రాంతాలు చిగురుటాకులా వణుకుతుంటాయి. 2000వ సంవత్సరంలో 40 వేల కుటుంబాలు వరదకు ప్రభావితమయ్యాయి. 2020లో దాదాపు 37 వేల కుటుంబాలు అల్లకల్లోలమయ్యాయి. నిలువ నీడ లేకుండా ఇల్లూ వాకిలీ వదిలి సురక్షిత ప్రాంతాల్లో తలదాచుకోవాల్సి వచ్చింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఈ పరిస్థితిలో ఎటువంటి మార్పూ రాలేదు. వరదలు రావడం .. ఇళ్లల్లోకి నీళ్లు చేరడం.. సిబ్బంది వచ్చి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడం.. వరదలు తగ్గగానే మళ్లీ ఎవరిళ్లకు వాళ్లు వెళ్లిపోవడం.. ఏటా జరిగే తంతు కానీ.. పూర్తి స్థాయిలో వరదలు రాకముందే సమగ్రమైన ప్రణాళికతో లోతట్టు ప్రాంతాల్లో నియంత్రణ చర్యలు తీసుకుంటే ప్రజలకు ఎంతో మేలు జరుగుతుంది. వారి ఇబ్బందులు కూడా తగ్గుతాయి. అందుకే కేంద్రం హైదరాబాద్‌కు నిధుల విడుదల కేటాయిస్తూ నిర్ణయం తీసుకుంది.

కేంద్ర హోం మంత్రి అమిత్‌షా నేతృత్వంలో ఇటీవల జరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో హైదరాబాద్ సహా ఆరు నగరాలకు వరదల నియంత్రణకు, అందుకు తగ్గ నిర్మాణాల కోసం నిధులు కేటాయించేందుకు ఆమోదం తెలిపింది. నగరాల్లోని వరదలకు చెక్ పెట్టే సంకల్పంతో నేషనల్ డిజాస్టర్ మిటిగేషన్ నిధులు (ఎన్‌డీఎంఎఫ్), నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ నిధుల నుంచి రూ.2,514.36 కోట్లు కేటాయించనుంది. హైదరాబాద్‌తో పాటు ముంబై, కోల్‌కతా, బెంగళూరు, అహ్మదాబాద్, పుణె నగరాలకు ఈ నిధులు కేటాయించింది. ఇందులో మన భాగ్యనగరానికి సుమారు రూ.300 నుంచి రూ.500 కోట్ల వరకు వచ్చే అవకాశముందని పురపాలకశాఖ ఉన్నతాధికారి ఒకరు 'సాక్షి'కి తెలిపారు.

ఎలా వినియోగిస్తారో?

జీహెచ్ఎంసీతో పాటు చుట్టుపక్కల గ్రామాల్లో విపత్తులను నియంత్రించేందుకు కొత్తగా 'హైడ్రా'అమల్లోకి వచ్చింది. కేంద్రం తాజాగా విడుదల చేయబోయే నిధులను ఎలా వినియోగిస్తారనే దానిపై ఆసక్తికరంగా మారింది. సాధారణంగా వరదలు వచ్చాక సహాయక చర్యలు చేపడితే ఎవరికీ ఉపయోగం లేదనేది అందరికీ తెలిసిన వాస్తవం. ఎందుకంటే ఏటా వచ్చే వరదలతో సహాయక చర్యలు పునరావృతం అవుతాయే తప్ప.. శాశ్వత పరిష్కారం మాత్రం దొరకదు. అందుకే ఇప్పుడు విడుదల చేయబోయే నిధులను వరదల సమస్యను శాశ్వతంగా పరిష్కరించే దిశగా వినియోగించుకుంటే బాగుంటుందని నిపుణులు, నగరవాసులు అభిప్రాయపడుతున్నారు.



యువ ఆపద మిత్ర..

ఇక.. రాష్ట్రంలోని వరద ప్రభావిత జిల్లాల్లో కూడా విపత్తు నిర్వహణ చేపట్టేందుకు యువ ఆపద మిత్ర పథకానికి కూడా కేంద్రం ఆమోదం తెలిపింది. ఈ పథకానికి రూ.470.50 కోట్లు కేటాయిస్తూ నిర్ణయం తీసుకుంది. దేశంలోని 315 జిల్లాల్లో ఈ పథకం అమలు చేయనున్నారు. ఈ పథకం కింద 1300 మందిని ఆపద మిత్ర వలంటీర్లుగా శిక్షణ అందిస్తారు. అంతేకాకుండా ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్, ఎన్‌వైకేఎస్ నుంచి 2.37 లక్షల మంది వలంటీర్ల సేవలను విపత్తు నిర్వహణ కోసం వినియోగించుకుంటారు.



కార్గిల్ వీరులారా జోహార్

శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా శుక్రవారం కార్గిల్ వీరులకు ఘనంగా నివాళులర్పించారు. బొల్లారం ఆర్మీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు ఎయిర్‌పోర్టు విలేజ్‌లో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్గిల్ విజయ గాథ నృత్య రూపకాన్ని ప్రదర్శించారు. – శంషాబాద్

ప్రాణాలు తీసిన ఓవర్ టేక్

డివైడర్‌ను, ఫార్మా కంపెనీ బస్సును ఢీకొన్న కారు

- పల్టీ కొట్టి.. స్కూటీకి తగిలి బోల్తాపడిన ఇన్నోవా
- ఇద్దరు యువ సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల దుర్మరణం
- కారు మితిమీరిన వేగమే ప్రమాదానికి కారణం
- శామీర్‌పేట జినోమ్‌వ్యాలీ ఠాణా పరిధిలో ఘటన

శామీర్‌పేట్: మితిమీరిన వేగం.. నిర్లక్ష్యం.. ఇద్దరు యువ సాఫ్ట్‌వేర్ ఉద్యోగులను బలిగొంది. ముందు వెళ్తున్న వాహనాన్ని ఓవర్‌టేక్ చేసే క్రమంలో మొదట రోడ్డు డివైడర్‌ను ఢీకొని ఆ తర్వాత ఫార్మా కంపెనీ బస్సును ఢీకొట్టిన ప్రమాదంలో కారులోని ఇద్దరూ దుర్మరణం చెందారు. ఈ ఘటన శుక్రవారం నగర శివారులోని శామీర్‌పేట మండలం జినోమ్ వ్యాలీ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తూంకుంట మున్సిపాలిటీ హకీంపేటకు చెందిన మోహన్ (25), మౌలాలీకి చెందిన దీపిక(23) స్నేహితులు. మాదాపూర్ మైండ్ స్పేస్‌లోని ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో వీరు పని చేస్తున్నారు. శుక్రవారం ఉదయం 6 గంటల ప్రాంతంలో ఇన్నోవా కారులో కరీంనగర్- హైదరాబాద్ రాజీవ్ రహదారి తుర్కపల్లిలో అల్పాహారం తిని తిరిగి వెళ్తున్నారు. ఈ క్రమంలో లాల్‌గడి మలక్‌పేట విమల ఫీడ్స్ వద్ద.. ముందు వెళ్తున్న వాహనాన్ని వీరి కారు ఓవర్ టేక్ చేయబోయి డివైడర్‌ను ఢీకొట్టి.. శామీర్‌పేట నుంచి తుర్కపల్లి వైపు వస్తున్న బయోలాజికల్ ఫార్మా కంపెనీకి చెందిన బస్సుతో పాటు స్కూటీని ఢీకొని పల్టీలు కొట్టి నుజ్జునుజ్జయింది. ఈ ప్రమాదంలో ఇన్నోవా కారులో ప్రయాణిస్తున్న మోహన్, దీపిక అక్కడికక్కడే మృతి చెందారు. బయోలాజికల్ కంపెనీకి చెందిన బస్సులో ప్రయాణిస్తున్న 10 మందితో పాటు, స్కూటీపై వెళ్తున్న ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మోహన్, దీపిక మృతదేహాలను గాంధీ మార్చురీకి పంపించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రమాద స్థలాన్ని పరిశీలించిన డీసీపీ..

ప్రమాద స్థలాన్ని మేడ్చల్ జోన్ డీసీపీ కోటిరెడ్డి, పేట్ బషీరాబాద్ ఏసీపీ రాములు, అల్వాల్ ట్రాఫిక్ ఏసీపీ వెంకట్‌రెడ్డి, ట్రాఫిక్ సీఐ హన్మంత్‌రెడ్డి పరిశీలించారు. ఇన్నోవా కారు అతివేగమే ప్రమాదానికి కారణమని ప్రాథమిక దర్యాప్తులో తెలుస్తోందని పోలీసులు అంచనా వేస్తున్నారు.

చాకచక్యంగా వ్యవహరించిన బస్సు డ్రైవర్..

ఇన్నోవా కారు అతివేగంతో వచ్చి ఢీకొన్న ఘటనలో ఫార్మా కంపెనీ బస్సు డ్రైవర్ అప్రమత్తంగా వ్యవహరించడంతో భారీ ప్రమాదం తప్పింది. ఆ సమయంలో బస్సులో 44 మంది ఉన్నారు. కారు ఢీ కొనడంతో బస్సును డ్రైవర్ ఎడమవైపు చెట్ల పొదల్లోకి తీసుకెళ్లాడు. బస్సులో ఉన్నవారిలో 10 మంది స్వల్ప గాయాలతో బయటపడ్డారు.



చెట్లలోకి దూసుకెళ్లిన ఫార్మా కంపెనీ బస్సు



రోడ్డు పక్కన మోహన్, దీపిక మృతదేహాలు



మోహన్, దీపిక (ఫైల్)



ఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న డీసీపీ



సీఎంను కలిసిన మేయర్

హైదరాబాద్ మహా నగరాభివృద్ధికి రూ.10 వేల కోట్లు, గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌కు రూ.3,065 కోట్ల బడ్జెట్‌ను కేటాయించినందుకు సీఎం రేవంత్‌రెడ్డికి మేయర్ విజయలక్ష్మి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈమేరకు సచివాలయంలో శుక్రవారం డిప్యూటీ మేయర్, కాంగ్రెస్ కార్పొరేటర్లు సీఎంను కలిసి పుష్పగుచ్ఛం అందించి ధన్యవాదాలు తెలియజేశారు. – సాక్షి, సిటీబ్యూరో

ఫొటో ట్రేడ్ ఎక్స్‌పో ప్రారంభం



ఫొటో ట్రేడ్ ఎక్స్‌పోను ప్రారంభిస్తున్న చిన్నారెడ్డి

మన్సూరాబాద్: తెలంగాణ ఫొటో అండ్ వీడియో గ్రాఫర్స్ సంక్షేమ సంఘం, ఫొటో టిక్ సంయుక్తాధ్వర్యంలో మన్సూరాబాద్ కేబీఆర్ కన్వెన్షన్‌లో ఏర్పాటు చేసిన ఫొటో ట్రేడ్ ఎక్స్‌పోను శుక్రవారం రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు, మాజీ మంత్రి చిన్నారెడ్డి, మాజీ మంత్రి వి. శ్రీనివాస్‌గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా చిన్నారెడ్డి మాట్లాడుతూ.. ఫొటో అండ్ వీడియో గ్రాఫర్స్ సంక్షేమ సంఘానికి ప్రభుత్వం నుంచి సహాయ సహకారాలు అందేలా కృషి చేస్తానన్నారు. సీఎంతో చర్చించి అందరికీ గుర్తింపు కార్డులు ఇచ్చేలా ప్రయత్నిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నేత కాచం సత్యనారాయణ గుప్తా, ఫొటో అండ్ వీడియో గ్రాఫర్స్ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్కే హుస్సేన్, రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు సుంకిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఫొటో టిక్ అధినేత అభిమన్యురెడ్డి, పరమేష్, హెచ్ఎస్ నగేష్, ఆస్కార్, వీరేందర్, శైలేందర్, నాగరాజు, జయమాధురి, తులసి, విజయలక్ష్మి, శారద, రేణుక, నిర్మల, జంగారెడ్డి, నరేందర్‌రెడ్డి, రామకృష్ణ, చంద్రశేఖర్, లక్ష్మారెడ్డి, సంజీవ్, మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'హెచ్ఆర్‌డీసీఎల్ పనులపై విచారణ చేపట్టాలి'

సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) పరిధిలో రోడ్లు, డ్రైనేజీ పనుల కోసం నాలుగు సంస్థలు పనిచేస్తున్నప్పటికీ..2017లో అప్పటి ప్రభుత్వం దురుద్దేశంతో హైదరాబాద్ రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (హెచ్ఆర్‌డీసీఎల్)ను ఏర్పాటు చేసిందని ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ ఆరోపించింది. ఈ కార్పొరేషన్ గుట్టుచప్పుడు కాకుండా వేల కోట్ల ప్రభుత్వ పూచీకత్తుతో అప్పులు తీసుకొని, వారికి ఇష్టం వచ్చిన వారికి కాంట్రాక్టులు కట్టబెడుతున్నారని అధ్యక్షుడు ఎం.పద్మనాభరెడ్డి ఆరోపించారు. హెచ్ఆర్‌డీసీఎల్ కార్యకలాపాలను తక్షణమే నిలుపుదల చేయాలని, మొదటి, రెండో దశల్లో ఈ కార్పొరేషన్ చేపట్టిన పనులు, ఖర్చులను సమీక్షించి, విచారణకు ఆదేశించాలని డిమాండ్ చేశారు.

బోనం ఎత్తిన తహసీల్దార్ షేక్ ఫర్హీన్



ఆషాఢ మాసం బోనాల జాతరను పురస్కరించుకొని లాల్‌దర్వాజా సింహవాహిని మహంకాళి అమ్మవారికి శుక్రవారం సంగారెడ్డి తహసీల్దార్ షేక్ ఫర్హీన్ సమర్పించారు. ఆలయానికి భక్తుల తాకిడి పెరిగింది. – చాంద్రాయణగుట్ట

ఐఎంఎంఎంతో మొదలై ఐఎంలోకి!

ఉగ్రవాది సయ్యద్ మక్బూల్ నేపథ్యం ఇది
- దిల్‌సుఖ్‌నగర్ జంట పేలుళ్లలోనూ ఆరోపణలు
- అనారోగ్యంతో 'గాంధీ'లో గురువారం మృతి



సయ్యద్ మక్బూల్ (ఫైల్)

సాక్షి, సిటీబ్యూరో: అనారోగ్య కారణాలతో గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ చనిపోయిన ఉగ్రవాది సయ్యద్ మక్బూల్ 'ఉగ్ర ప్రస్థానం' ఇండియన్ ముస్లిం మొహమ్మది ముజాహిదీన్‌తో (ఐఎంఎంఎం) మొదలై ఇండియన్ ముజాహిదీన్ (ఐఎం) వరకు చేరింది. కొన్నేళ్లుగా చర్లపల్లి కేంద్ర కారాగారంలో శిక్ష అనుభవిస్తున్న ఇతడు కిడ్నీలు విఫలం కావడంతో చనిపోయాడు. 2013లో దిల్‌సుఖ్‌నగర్‌లోని ఏ-1 మిర్చి సెంటర్, 107 బస్టాప్ వద్ద చోటు చేసుకున్న జంట పేలుళ్ల కేసులోనూ అనుమానితుడిగా ఉన్నాడు. మహారాష్ట్రంలోని ధర్మాబాద్‌కు చెందిన మక్బూల్ వరంగల్ వాసి ఆజం ఘోరీ (2000లో జగిత్యాలలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో హతమయ్యాడు) ఏర్పాటు చేసిన ఐఎంఎంఎం మాడ్యూల్‌లో కీలకపాత్ర పోషించాడు. 1999లో నగరంలో జరిగిన మాణిక్‌ప్రభు మెడికల్ హాల్ యజమాని దేవేందర్ హత్య కేసులో అరెస్టు అయినా..నిర్దోషిగా బయటపడ్డాడు. 2000లో జరిగిన సిద్ధి అంబర్‌బజార్‌లోని మహాలక్ష్మీ జ్యువెలర్స్ యజమాని మహావీర్ ప్రసాద్ మోడి హత్య కేసులో మరోసారి జైలుకు వెళ్లాడు. ఈ కేసులో కింది కోర్టు మక్బూల్ సహా 16 మందికి జీవితఖైదు విధించగా..ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఈ కేసులో బెయిల్ పొంది బయటకు వచ్చిన మక్బూల్ అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు. మహారాష్ట్రలోని నాందేడ్ సహా వివిధ ప్రాంతాల్లో సంచరించి 2011లో భార్య, ఇద్దరు పిల్లలతో సహా పాతబస్తీలోని షాహిన్‌నగర్‌కు వచ్చి స్థిరపడ్డాడు.

ఇమ్రాన్ సాయంతో ఐఎంలోకి...

నాందేడ్‌లో తలదాచుకున్న సమయంలో కామన్ ఫ్రెండ్ ద్వారా అదే ప్రాంతానికి చెందిన ఇమ్రాన్ ఖాన్‌తో పరిచయం ఏర్పడింది. ఇతడి ద్వారానే మక్బూల్ ఉగ్రవాద సంస్థ ఐఎంలో సభ్యుడిగా మారాడు. అప్పటి నుంచి రియాజ్ భత్కల్, ఇక్బాల్ భత్కల్‌లకు ప్రధాన అనుచరుడిగా మారిపోయిన మక్బూల్ వారి ఆదేశాల మేరకు పని చేశాడు. మానవబాంబుల్ని తయారు చేసి దాడులు చేయాలని నిర్ణయించిన భత్కల్ బ్రదర్స్ తమ తొలి టార్గెట్‌గా బీహార్‌లో ఉన్న బుద్ధగయ ప్రాంతాన్ని ఎంచుకుని ఆ విషయంలో మక్బూల్ సహా ఐదుగురికి చెప్పారు. ఔరంగాబాద్ శివార్లలో ఉన్న ఫామ్‌హౌస్‌లో మక్బూల్ కొన్ని బాంబులు తయారు చేసి ట్రయల్స్ కూడా పూర్తి చేశాడు. 2012 జూన్ మొదటి వారంలో పుణేలోని ఎరవాడ జైల్లోని అండా సెల్‌లో ఐఎం ఉగ్రవాది ఖతీల్ సిద్దిఖీ హత్య జరిగింది. దీన్ని తీవ్రంగా పరిగణించిన భత్కల్ బ్రదర్స్ తొలి టార్గెట్‌గా పుణేను ఎంచుకుని అదే విషయం మక్బూల్‌కు చెప్పారు. మానవబాంబుగా మారే 'ఫిదాయీ' లభించకపోవడంతో వరుస పేలుళ్లకు పాల్పడ్డారు. ఈ కేసులో ఢిల్లీ స్పెషల్ సెల్ పోలీసులకు ఆధారాలు లభించడంతో అదే ఏడాది అక్టోబర్‌లో షాహిన్‌నగర్‌లో పండ్ల వ్యాపారిగా చెలామణి అవుతున్న మక్బూల్‌ను అరెస్టు చేసి తీసుకువెళ్లారు. ఇతడి విచారణ నేపథ్యంలోనే రియాజ్, ఇక్బాల్ భత్కల్స్ ఆదేశాల మేరకు హైదరాబాద్‌లోనూ రెక్కీ చేసినట్లు, ఇమ్రాన్ ఖాన్‌తో కలిసి హైదరాబాద్ వచ్చి, ద్విచక్ర వాహనంపై జనసమర్ధ ప్రాంతాలైన దిల్‌సుఖ్‌నగర్, బేగంబజార్, అబిడ్స్ ప్రాంతాల్లో రెక్కీలు నిర్వహించినట్లు అంగీకరించాడు. దీంతో ఇతడు దిల్‌సుఖ్‌నగర్ జంట పేలుళ్లలో అనుమానితుడిగా మారాడు. అయితే ఆధారాలు లభించకపోవడంతో అభియోగాలు మోపలేదు. నగరంలో నమోదైన కేసుల్లో పీటీ వారెంట్‌పై తెచ్చి విచారించారు. ఓ కేసులో జీవితఖైదు పడటంతో చర్లపల్లి కేంద్రాగారంలో ఉంచారు. నెల రోజుల క్రితం స్టంట్ వేసినప్పటికీ... కిడ్నీలు పాడవటంతో మరోసారి గాంధీ ఆస్పత్రిలో చేర్చారు. మక్బూల్ చికిత్స పొందుతూ గురువారం చనిపోయాడు.

రూ.150 కోట్లకు కుచ్చు టోపీ?

ఓ చింతపండు వ్యాపారి నిర్వాకం
- వ్యాపారులు, రైతులకు నిలువెత్తు మోసం
- సీసీఎస్‌లో ఫిర్యాదు
- 84 మంది వ్యాపారులకు ఐపీ నోటీసులు



వివరాలు వెల్లడిస్తున్న బాధితులు

చాదర్‌ఘాట్: అందర్నీ నమ్మించి నిలువునా మోసం చేశాడో వ్యాపారి. పలువురు వ్యాపారులు, రైతులను దాదాపు రూ.150 కోట్లకు ముంచేశాడు. వివరాల్లోకి వెళ్తే..రాష్ట్రంలోనే నెం.1 చింతపండు కమీషన్ ఏజెంట్‌గా పేరొంది..గత 15 సంవత్సరాల నుంచి మలక్‌పేట గంజిలో లక్ష్మీప్రసన్న ట్రేడింగ్ కంపెనీ పేరుతో చింతపండు కమీషన్ వ్యాపారం చేస్తున్న కాలేరు శ్రీనివాస్ రైతులను, వ్యాపారులను మోసం చేసి దాదాపు రూ.150 కోట్ల రూపాయలతో పరారయ్యాడు. బాధితులు దేవత అశోక్, దేవర రాజేశ్వర్, శ్రీ శ్రీనివాస్ అండ్ కంపెనీ, తదితర బాధితులు గంజి కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కాలేరు శ్రీనివాస్ గత రెండు నెలల నుంచి రైతులకు తెలియకుండా వ్యాపారుల వద్ద, వ్యాపారులకు తెలియకుండా రైతుల వద్ద కమీషన్ వ్యాపారం పేరుతో దాదాపు 180 మంది వద్ద రూ.150 కోట్ల రూపాయలు అప్పు చేశాడు. అనంతరం పరారయ్యాడని బాధితులు తెలిపారు. సరూర్‌నగర్‌లోని అతని ఇంటి వద్దకు వెళ్లగా ఇంటికి తాళం వేసి ఉందని తెలిపారు.

వారం క్రితం ఐపీ నోటీసులు..

విషయం తెలుసుకునే లోపే దాదాపు 84 మందికి ఐపీ నోటీసులు వచ్చాయని బాధితులు తెలిపారు. చిన్నా చితక అంటే రూ.25 లక్షల లోపు వారికి ఐపీ నోటీసులు రాలేదని, కోటి రూపాయలు అప్పు ఉన్న వారికి మాత్రమే ఐపీ నోటీసులు పంపించారని తెలిపారు. అదేవిధంగా కర్ణాటక రైతులకు 25 లక్షల లోపు అప్పు ఇచ్చిన వారు దాదాపు 60 మంది ఉన్నారని తెలిపారు. కాలేరు శ్రీనివాస్‌పై చాదర్‌ఘాట్ పోలీస్ స్టేషన్‌లో కొంత మంది కలిసి ఫిర్యాదు చేస్తే, తిరిగి అతను తనను చంపటానికి ప్రయత్నిస్తున్నారని రివర్స్ ఫిర్యాదు చేశాడని తెలిపారు. దాంతో చాదర్‌ఘాట్ పోలీసులు సీసీఎస్‌కు వెళ్లాలని సూచించారు. సీసీఎస్ పోలీసులకు బాధితులు వారంరోజుల క్రితం కాలేరు శ్రీనివాస్‌పై ఫిర్యాదు చేయగా..అందరు కలిసి ఒకే దరఖాస్తు ఇస్తే కేసు నమోదు చేస్తామన్నారని తెలిపారు.

షిర్డీ-కాకినాడ రైలులో నగర మహిళ హ్యాండ్‌బ్యాగ్ చోరీ

సికింద్రాబాద్: షిర్డీ-కాకినాడ రైలు దొంగతనం ఘటనలో తన హ్యాండ్ బ్యాగు చోరీకి గురైందని నగరానికి చెందిన మహిళ శుక్రవారం సికింద్రాబాద్ జీఆర్‌పీ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసుల కథనం ప్రకారం..నగరంలోని అన్నోజిగూడకు చెందిన భార్గవి సాఫ్ట్‌వేర్ ఇంజినీర్. షిర్డీకి వెళ్లిన ఆమె..నగరానికి షిర్డీ-కాకినాడ రైలులో తిరుగు ప్రయాణమైంది. మార్గమధ్యంలో తన హ్యాండ్‌బ్యాగ్ చోరీకి గురైన విషయాన్ని రైలు బీదర్ ప్రాంతానికి చేరుకున్నాక గుర్తించింది. రైలు సికింద్రాబాద్‌కు చేరుకున్నాక రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేసింది. 5 గ్రాముల డైమండ్ రింగ్, కొన్ని అమెరికా డాలర్లు, రిస్ట్‌వాచ్ మొత్తంగా రూ.60 వేల విలువచేసే వస్తువులు తన బ్యాగులో ఉన్నట్టు ఫిర్యాదులో పేర్కొంది. కేసు నమోదు చేసుకున్న సికింద్రాబాద్ రైల్వే పోలీసులు మహారాష్ట్ర రైల్వే పోలీసులకు బదిలీ చేయనున్నట్టు తెలిపారు.

సినీ నటుడు అమన్‌సింగ్‌పై లైంగిక దాడి కేసు

సనత్‌నగర్: పెళ్లి చేసుకుంటానని నమ్మించి..యువతిపై పలుమార్లు లైంగిక దాడికి పాల్పడిన సినీనటుడిపై బేగంపేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..బేగంపేట శ్యాంలాల్ బిల్డింగ్స్ సమీపంలో నివసించే మహిళ (34)కు బేగంపేట బ్రాహ్మణవాడిలో నివసించే సినీ నటుడు అమన్‌సింగ్ (27)తో జిమ్‌లో పరిచయం అయ్యింది. అదికాస్తా ప్రేమగా మారింది. ఈ క్రమంలో 2023 అక్టోబర్‌లో మహిళను తన ఫ్లాట్‌కు పిలిచిన అమన్‌సింగ్ పెళ్లి చేసుకుంటానని నమ్మించి లైంగికదాడికి పాల్పడ్డాడు. ఆ తర్వాత కూడా వీరు చాలాసార్లు కలుసుకున్నారు. తనకు డబ్బులు అవసరం ఉందని చెప్పి అమన్‌సింగ్ యువతి వద్ద రూ.15 లక్షలు కూడా తీసుకున్నాడు. అప్పటి నుంచి ఆమెను తప్పించుకుని తిరుగుతున్నాడు. పెళ్లి చేసుకోవాలని అడిగితే తన వద్ద ఉన్న ఫొటోలు, వీడియోలు ఉన్నాయని, వాటిని సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తానని బాధితురాలిని బెదిరించాడు. దీంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని బేగంపేట పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

గ్రేటర్ ఈస్ట్‌లో నిర్మాణ రంగానికి మంచి అవకాశాలు



అసోసియేషన్ యూత్ వింగ్ లోగోను లాంచ్ చేస్తున్న దృశ్యం

నాగోలు: గ్రేటర్ ఈస్ట్‌లో నిర్మాణ రంగానికి అనుకూల అవకాశాలు ఉన్నాయని ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ (ఐజీబీసి) చైర్మన్ శేఖర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కొత్తపేటలో గ్రేటర్ ఈస్ట్ జోన్ బిల్డర్స్ అసోసియేషన్ యూత్ వింగ్ లాంచింగ్ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా శేఖర్ రెడ్డి, తెలంగాణ బిల్డర్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు ప్రభాకర్ రావు, క్రెడాయ్ ఈసీ మెంబర్ ఎం.శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిర్మాణ రంగంలో కొత్తగా వస్తున్న సెకండ్ జనరేషన్ వారికి యూత్ వింగ్ లాంచ్ ద్వారా అనేక విషయాలు తెలుసుకొనే అవకాశం ఉందన్నారు. అతి తక్కువ ధరలోనే నాణ్యమైన నిర్మాణాలు వినియోగదారులకు అందించేందుకు ఇలాంటి ప్లాట్ ఫారం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. అనంతరం యూత్ వింగ్ అధ్యక్షునిగా టి.విక్రమ్, జనరల్ సెక్రటరీగా మేఘన, ట్రెజరర్‌గా అక్షయ్ సాదును ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ ఈస్ట్ జోన్ బిల్డర్స్ అసోసియేషన్ చైర్మన్ టి.నరసింహారావు, అధ్యక్షుడు మారం సతీష్ కుమార్, జనరల్ సెక్రెటరీ మల్కాజిగిరి రవీంద్ర కుమార్, ట్రెజరర్ పి.ఉపేందర్, ఉపాధ్యక్షులు బి.పాండురంగారెడ్డి, ఎం.శ్రీకాంత్, సి.శ్యామ్ కిరణ్, సత్యంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గోరఖ్‌పూర్ టు హైదరాబాద్


సైకోసిస్‌తో మతిస్థిమితం కోల్పోయిన యూపీ మహిళ
- దాదాపు నాలుగు నెలల క్రితం హైదరాబాద్‌కు చేరిక
- పోలీసుల ద్వారా ఎర్రగడ్డలోని మానసిక వైద్యశాలకు
- చికిత్స చేసి భద్రంగా ఆమె కుటుంబీకులకు అప్పగింత
- గతంలోనూ ఇలాంటి సేవలు చేసిన ఆస్పత్రి వైద్యులు



సోనీని కుటుంబీకులకు అప్పగిస్తున్న వైద్యులు

సాక్షి, సిటీబ్యూరో: మతి స్థిమితం లేని కారణంగా ఉత్తరప్రదేశ్ నుంచి హైదరాబాద్ వచ్చేసి దిక్కుతోచని స్థితిలో తమ వద్దకు వచ్చిన మహిళకు ఎర్రగడ్డ మానసిక వైద్యశాల వైద్యుల బృందం ప్రత్యేక శ్రద్ధతో చికిత్స అందించింది. కోలుకున్న ఆమె నుంచి వివరాలు సేకరించి కుటుంబీకులకు సమాచారం ఇచ్చారు. శుక్రవారం అక్కడ నుంచి వచ్చిన కుమారైకు బాధితురాలిని అప్పగించారు. గోరఖ్‌పూర్‌కు చెందిన సోనీ (35) కొన్నేళ్లుగా సైకోసిస్ అనే మానసిక వ్యాధి బారినపడింది. కుటుంబీకులకు చెప్పకుండా గోరఖ్‌పూర్‌లోని ఇంటి నుంచి బయటకు వచ్చేసిన సోనీ అనేక ప్రాంతాలు తిరిగి చివరకు ఈ ఏడాది జనవరిలో నగరానికి చేరుకుంది. గోల్కొండ పరిసరాల్లో తిరుగుతూ, దొరికింది తింటూ నిలువ నీడ లేకుండా గడిపింది. ఈమెను గమనించిన స్థానిక పోలీసులు దాదాపు నాలుగు నెలల క్రితం న్యాయస్థానం ద్వారా ఎర్రగడ్డలోని మానసిక వైద్యశాలకు తరలించారు. ప్రాథమిక పరీక్షల నేపథ్యంలో సోనీ సైకోసిస్ బారినపడినట్లు గుర్తించారు. ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్‌గా ఉన్న ప్రొఫెసర్ డాక్టర్ అనిత రాయిరాల పర్యవేక్షణలో డాక్టర్ కె.సుధారాణి, డాక్టర్ సింధూరి సోనీకి వైద్యం చేశారు. ఇటీవల ఈ వ్యాధి నుంచి కోలుకున్న సోనీ తన పేరు, భర్త పేరుతో పాటు గోరఖ్‌పూర్ స్వస్థలం అంటూ చెప్పారు. దీంతో ఎర్రగడ్డ మానసిక వైద్యశాల డాక్టర్లు ఈ వివరాలను గోరఖ్‌పూర్ పోలీసులకు తెలిపారు. ఆమె ఫొటోను సైతం వాట్సాప్‌లో పంపి కుటుంబీకులను కనిపెట్టాల్సిందిగా కోరారు. అక్కడ ఆరా తీసిన ఆ పోలీసులు ఎట్టకేలకు సోనీ భర్త రాంభచత్‌తో పాటు ఆమె కుటుంబీలను కనిపెట్టారు. వాళ్లకు హైదరాబాద్ నుంచి వైద్యులు పంపిన ఫొటో చూపించగా... గుర్తించారు. ఎర్రగడ్డ ఆస్పత్రి వైద్యులకు వీడియో కాల్ చేసిన కుటుంబీకులు సోనీని చూసి గుర్తించారు. శుక్రవారం నగరానికి వచ్చిన వారికి ఎర్రగడ్డ మానసిక వైద్యశాల వైద్యులు సోనీని అప్పగించారు. కాగా మానసిక రోగులకు అవసరమైన వైద్యం అందిస్తే వారి వ్యాధి నిరోధించడం సాధ్యమేనని, సరైన వైద్యం అందిస్తే ఎంతో మంది బాగయ్యే అవకాశం ఉందని ఎర్రగడ్డ మానసిక వైద్యశాల ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ అనిత రాయిరాల చెప్పారు.

దుర్గం చెరువులో దూకి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఆత్మహత్య



బాలాజీ (ఫైల్)

గచ్చిబౌలి: డ్యూటీ నుంచి బయటకు వెళ్లిన ఓ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ దుర్గం చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ సీహెచ్ వెంకన్న తెలిపిన ప్రకారం..ముషీరాబాద్ గంగపుత్ర కాలనీలో నివాసం ఉండే ఎం.బాలాజీ(25) రాయదుర్గం నాలెడ్జీ సిటీలోని ఓ ఐటీ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పని చేస్తున్నాడు. ఈ నెల 24న దయం 9.30 గంటలకు డ్యూటీ కోసం ఇంటి నుంచి బయలుదేరాడు. ప్రతి రోజు డ్యూటీ ముగించుకొని రాత్రి 9.30 గంటలకు ఇంటికి వచ్చేవాడు. కానీ ఆరోజు తిరిగి రాలేదు. దీంతో స్నేహితులు, బంధువుల వద్ద వాకబు చేసినా ఆచూకీ లభ్యం కాలేదు. గురువారం తెల్లవారుజామున 2.30 గంటలకు సోదరుడు శ్రీనాథ్ రాయదుర్గం పీఎస్‌లో ఫిర్యాదు చేయడంతో మిస్సింగ్ కేసు నమోదు చేశారు. కంపెనీలో తన సీట్‌లోనే సెల్ ఫోన్ ఉంచి రాత్రి 8.30 గంటలకు లాగ్‌అవుట్ అయ్యాడు. నాలెడ్జీ సిటీలోని సీసీ కెమెరాలను పరిశీలించగా ఐటీసీ కోహినూర్ ఎదురుగా ఉన్న స్ట్రీట్ ఫుడ్ స్టాల్స్ వద్ద తిరుగుతున్నట్లుగా కనిపించాడు. అటు నుంచి కేబుల్ బ్రిడ్జి కింది వైపు వెళ్లినట్లు పోలీసులు గుర్తించారు. శుక్రవారం సాయంత్రం దుర్గం చెరువులో శవమై తేలగా మెడలో ఉన్న ఐడీ కార్డు ఆధారంగా బాలాజీని గుర్తించారు. బాలాజీ కొంత కాలంగా ఓ యువతిని ప్రేమించినట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది.

ఐకమత్యంగా ఉంటేనే సమస్యలు పరిష్కారం

మహిళా క్యాంటీన్లపై దృష్టి పెట్టండి



ఎన్‌బీటీనగర్ కమ్యూనిటీ హాల్‌లో సమావేశం అయిన మహిళా సమాఖ్య సభ్యులు

బంజారాహిల్స్: ఐకమత్యంగా ఉంటనే సమస్యలు త్వరితంగా పరిష్కారం అవుతాయని అధికారులు మహిళా సమాఖ్యలకు సూచించారు. శుక్రవారం జీహెచ్‌ఎంసీ జూబ్లీహిల్స్ సర్కిల్–18 పరిధి కిందికి వచ్చే బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, షేక్‌పేట డివిజన్ల మహిళా సమాఖ్యల సమావేశం బంజారాహిల్స్ రోడ్డునెంబర్–12లోని ఎన్‌బీటీనగర్ కమ్యూనిటీ హాల్‌లో జరిగింది. సర్కిల్ పరిధిలోని 32 స్లమ్ లెవల్ ఫెడరేషన్లు ఈ సమావేశంలో పాల్గొన్నాయి. టౌన్ లెవల్ ఫెడరేషన్ (టీఎల్‌ఎఫ్) మీటింగ్‌లో సర్కిల్–18 యూసీడీ, డీపీఓ ఆశావిరోనిక అధ్యక్షతన జరిగింది. కమ్యూనిటీ ఆర్గనైజర్లు రాంబాబు, బుచ్చమ్మలు కూడా ఇందులో పాల్గొన్నారు. ఇటీవల ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహిళా శక్తి క్యాంటీన్ల విషయంలో సమాఖ్య ప్రతినిధులతో అధికారులు చర్చించారు. ఈ మహిళా క్యాంటీన్ల ఏర్పాటు వల్ల ప్రయోజనాలను వివరించారు. మంచి స్థలం అందుబాటులో ఉంటే ఈ క్యాంటీన్లు ఏర్పాటు చేసుకోవడం ద్వారా ఉపాధి పొందవచ్చని వెల్లడించారు. రూ.15 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు రుణాలు తీసుకోవడం ద్వారా ఈ క్యాంటీన్లు ఏర్పాటు చేసుకునే అవకాశం ఉంటుందని వెల్లడించారు. అలాగే సమ సమాఖ్యలన్నీ ఆడిటింగ్ పూర్తి చేసుకోవాలని సమావేశంలో తీర్మానించారు. మహిళా సమాఖ్యల ఆధ్వర్యంలో కొనసాగుతున్న మహిళా గ్రూపులు, రుణాలు ఎదుర్కొంటున్న సమస్యలు తదితర అంశాల మీద ఈ సమావేశంలో చర్చించారు. అందరూ ఐకమత్యంగా ఉండి తమ సమస్యలు పరిష్కరించుకోవాలని, సక్రమంగా రుణాలు చెల్లించడం ద్వారా మరింత రుణం పొందవచ్చని అధికారులు సూచించారు.

నేటి నుంచి ఇండియన్ సిల్క్ గ్యాలరీ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వినయ్‌కుమార్, శ్రీనివాసరావు

శ్రీనగర్‌కాలనీ: సిల్క్, కాటన్, లెనిన్ వస్త్రాల్లో వందశాతం నాణ్యతకు వేదికగా ఇండియన్ సిల్క్ గ్యాలరీ ఎగ్జిబిషన్ నిలుస్తుందని, చేనేత కళాకారులు నేరుగా తమ ఉత్పత్తులను వినియోగదారులకు అందించే చిరునామాగా తాము ఈ ఎగ్జిబిషన్‌ను శ్రీనగర్‌కాలనీలోని సత్యసాయినిగమాగమంలో శనివారం నుంచి ఏర్పాటు చేస్తున్నామని నిర్వాహకులు వినయ్‌కుమార్, శ్రీనివాసరావు పేర్కొన్నారు. శ్రీనగర్‌కాలనీలో ఇండియన్ సిల్క్ గ్యాలరీ ఎగ్జిబిషన్‌కు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. వివాహాది శుభకార్యాలకు, బోనాలు, వరలక్ష్మీవ్రతాలకు ప్రత్యేక వస్త్రాలను, అంతేకాకుండా దేశంలో ప్రముఖ రాష్ట్రాలకు చెందిన చెందేరి, కోల్‌కటా, ఉప్పాడ, జమ్దాని, కాంత, బెనారస్, గద్వాల్, గుజరాత్, టసర్, పోచంపల్లి, ఇక్కత్, కాశ్మీరితో పాటు పలు ఫ్యాన్సీ డిజైనరీ, వన్‌గ్రామ్ గోల్డ్ ఆభరణాలు వినియోగదారులకు అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు. ఈ ఎగ్జిబిషన్ ఆగస్టు 5 వరకూ ఉదయం 9 నుంచి రాత్రి 10 వరకూ అందుబాటులో ఉంటుందని తెలిపారు.

అన్విత్రాగ్రూప్‌కు 'మాస్టర్ ఆఫ్ డెవలప్‌మెంట్ ఎక్స్‌లెన్స్ అవార్డు-2024 '



సినీనటి శృతిహాసన్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న అన్వితా ఎండీ అచ్యుతరావు

బంజారాహిల్స్: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తో పాటు డల్లాస్, దుబాయ్‌లలో నిర్మాణ రంగంలో గణనీయమైన విజయాలు నమోదు చేస్తున్న అన్వితాగ్రూప్ మరో అరుదైన రికార్డును సొంతం చేసుకుంది. అవుట్ లుక్ బిజినెస్ స్పాట్ లైట్ రియాల్టీ అవార్డుల కార్యక్రమంలో మాస్టర్ ఆఫ్ డెవలప్‌మెంట్ ఎక్స్‌లెన్స్ అవార్డు–2024ను సొంతం చేసుకుంది. హోటల్ తాజ్‌కృష్ణా హోటల్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ప్రముఖ సినీ కథానాయిక శృతిహాసన్ చేతుల మీదుగా అన్వితా గ్రూపు ఎండీ అచ్యుతరావు బొప్పన ఈ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా రియల్‌ఎస్టేట్ ఇండస్ట్రీలో నూతన ఆవిష్కరణ స్వీకరణ అనే అంశంపై జరిగిన చర్చలో అచ్యుతరావు బొప్పన మాట్లాడుతూ నూతనత్వాన్ని స్వాగతిస్తూ అంతర్జాతీయ పోకడలకు అనుగుణంగా మార్పుకు సిద్ధం కావాలన్నారు. వినియోగదారుని ఆసక్తికి అనుగుణంగా భవన నిర్మాణాలు సాగినప్పుడు మంచి ఫలితాలు ఉంటాయన్నారు. అన్వితా గ్రూపు రానున్న కాలంలో కోటి చదరపు అడుగుల విస్తీర్ణాన్ని వినియోగదారులకు అందుబాటులోకి తీసుకురానున్నదని వివరించారు. చర్చలో హానరల్ హోమ్స్ డైరెక్టర్ స్వప్నకుమార్, నీమ్స్ బోరో గ్రూపు ఎండీ కృష్ణభార్గవ, అవుట్ లుక్ బిజినెస్ ఎడిటర్ సుచేతనారాయ్, అన్వితా గ్రూపు డైరెక్టర్లు సరిత కాకర్ల, అనూప్ బొప్పన, అన్విత బొప్పన తదితరులు పాల్గొన్నారు.

సామాన్యులకు ఇబ్బందులు కలగనివ్వొద్దు

ట్రాఫిక్ ఏసీపీ హరిప్రసాద్



బంజారాహిల్స్ ట్రాఫిక్ పోలీసులకు సూచనలిస్తున్న ఏసీపీ హరి ప్రసాద్

బంజారాహిల్స్: వీఐపీలు ప్రధాన రూట్లలో ప్రయాణించే సమయంలో సామాన్యులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని పంజగుట్ట ట్రాఫిక్ ఏసీపీ కట్టా హరిప్రసాద్ సూచించారు. శుక్రవారం ఆయన బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కు జంక్షన్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా బంజారాహిల్స్ ట్రాఫిక్ పోలీసులకు తగు సూచనలు చేశారు. వీఐపీలో అవతలి వైపు రూట్‌లో ప్రయాణిస్తున్నప్పుడు ఇటు వైపు ఉన్న ప్రజలను ఆపావద్దని వారిని యథావిధిగా ముందుకు వెళ్ళనివ్వాలని సూచించారు. లేదంటే వీఐపీలు వెళ్ళిపోయిన తర్వాత చాలా సేపటి వరకు రెండు వైపుల రోడ్లు ట్రాఫిక్ స్తంభించిపోతున్నదని సామాన్యులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. సాధారణ ప్రజలు ఇబ్బందులు పడకుండా ఒక వైపు ట్రాఫిక్ ఫ్లో ను వెళ్ళే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు.

సమస్యలు పరిష్కరించాలని ఏబీవీపీ నిరసన



నిరసన కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు

బంజారాహిల్స్: ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్పులను వెంటనే విడుదల చేయాలని, ప్రభుత్వ కళాశాలల్లో, విశ్వ విద్యాలయాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలంటూ ఏబీవీపీ ఆధ్వర్యంలో శుక్రవారం సైఫాబాద్ సైన్స్ కళాశాల కేంద్రంగా నిరసన కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్రంలో పెండింగ్‌లోని రూ. 7,000 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్పులను విడుదల చేయాలని ఈ సందర్భంగా ఏబీవీపీ నేతలు డిమాండ్ చేశారు. ఇక నుంచి స్కాలర్‌షిప్పులను రూ.3 వేలకు పెంచి ఇవ్వాలన్నారు. ఎంఈఓ, డీఈఓలతో పాటు మెగా డీఎస్సీ రిక్రూట్‌మెంట్ నిర్వహించి ఉపాధ్యాయుల కొరత తీర్చాలని, అటెండర్, స్కావెంజర్లను నియమించాలన్నారు. ఇంజినీరింగ్ మేనేజ్‌మెంట్ సీట్ల భర్తీని ఆన్‌లైన్‌లో నిర్వహించాలి, అక్రమంగా డొనేషన్లు వసూలు చేస్తున్న వారిని శిక్షించాలని డిమాండ్ చేశారు.

సైనికుల సేవలు గొప్పవి

లోక్‌దళ్ పార్టీ జాతీయ కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు పీవీ రాజేశ్వరరావు

లిబర్టీ: దేశ భద్రత, ప్రజల రక్షణ కోసం భారత సైన్యం చేస్తున్న సేవలు ఎంతో గొప్పవని లోక్‌దళ్ పార్టీ జాతీయ కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు పీ.వీ. రాజేశ్వరరావు అన్నారు. శుక్రవారం కార్గిల్ విజయ్ దివస్‌ను పురస్కరించుకొని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసి సభలో ఆయన మాట్లాడుతూ భారత సైన్యం పాకిస్థాన్ సైన్యాన్ని ఎదుర్కొని కార్గిల్ యుద్ధంలో విజయం సాధించిందని పేర్కొన్నారు. ప్రాణాలను సైతం లెక్క చేయకుండా భారత సైన్యం పాకిస్థాన్ సైన్యం కుట్రలను, కుతంత్రాలను తిప్పి గొట్టి భారత పతాకాన్ని ఎగురవేసిందన్నారు. ఈ కార్యక్రమంలో పి.వి.శ్రీనివాసరావు, సంకీర్త పాల్గొన్నారు.

సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం

హిమాయత్‌నగర్: రాష్ట్రంలోని రైతులకు రుణమాఫీ చేసి, బడ్జెట్‌లో బీసీలకు రూ.9200 కోట్లు కేటాయించినందుకు బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు గండిచెర్వు వెంకన్న గౌడ్ ఆధ్వర్యంలో శుక్రవారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్ నుంచి బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించి ప్రభుత్వానికి, సీఎంలకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గాదగొని మహేష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు నేరేటి మల్లేష్ యాదవ్, గుర్రాల పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆఖరి మజిలీలో అంతులేని సమస్యలు..!

- డంపింగ్ యార్డును తలపించేలా శ్మశానవాటిక
- శ్మశాన వాటికకు వచ్చే వారికి తీవ్ర ఇబ్బందులు
- పరిష్కరించాలని ప్రజలు వినతి



శ్మశాన వాటికలో కూలిపోయిన ప్రహరీ గోడ

రహమత్‌నగర్: కూలిన ప్రహరీ గోడ.. తలుపులు లేని స్నానపు గదులు..ఏపుగా పెరిగిన చెట్లు..అపరిశుభ్రంగా మారిన దిగుడుబావి.. చెత్తాచెదారంతో బోరబండ సైట్3 శ్మశాన వాటిక ఆఖరి మజిలీకి తీసుకొచ్చే వారికి స్వాగతం పలుకుతోంది. దీంతో అంత్యక్రియలు నిర్వహించేందుకు వచ్చే వారికి ఇబ్బందులు తప్పడం లేదు. ఈ ప్రాంతంలోనే అతి పెద్ద శ్మశాన వాటికగా పేరున్న ఈ వైకుంఠధామంలో రెండు డివిజన్లకు చెందిన దాదాపు 54 బస్తీలకు చెందిన మరణించిన వారిని కాష్టం, ఖననం చేస్తుంటడం విశేషం.



తలుపులు లేని స్నానపు గదులు

శ్మశాన వాటికలో సమస్యల తిష్ట....

బోరబండ సైట్ 3 శ్మశాన వాటికలో సమస్య తిష్ట వేశాయి. ప్రహరీ గోడ కూలి పోయింది. దానికి తోడు శ్మశాన వాటికలో వ్యర్థాలు నిండిపోయి డంపింగ్ యార్డునే మరిపించే విధంగా మారిపోయింది. స్నానాల గదులకు తలుపులు లేక దుర్గంధాన్ని వెదజల్లుతున్నాయి. దీంతో మహిళలు స్నానాలు ఆచరించేందుకు నానా ఇబ్బందులు పడుతున్నాయి. ప్రజల సౌకర్యార్థం నిర్మించిన దిగుడు బావిని శుభ్రం చేయకపోవడంతో చెత్తా చెదారంతో నిండిపోయి ప్రమాదకరంగా మారింది. శ్మశాన వాటికలో ఏపుగా చెట్లు పెరగడంతో పాములు ఇతర విష క్రిమికీటకాలు నిలయంగా మారింది. గత కొంతకాలంగా పరిస్థితి ఇలానే ఉంటడటంతో అంత్యక్రియలకు వచ్చే ప్రజలు శ్మశాన వాటిక నిర్వాహకులపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రహరీ కూలి పోవడంతో శ్మశాన వాటికను మందుబాబులకు అడ్డాగా చేసుకుంటున్నారు. ఇక్కడ జరిగిన అనేక సంఘటలపై ఇది వరకు బోరబండ పీఎస్‌లో కేసులు నమోదు కూడా నమోదు అయ్యాయి. ఇప్పటికైనా బోరబండ సైట్ 3 శ్మశాన వాటికలో ఉన్న సమస్యలను పట్టించుకోవాలని బస్తీ వాసులు కోరుతున్నారు. దాదాపు ఐదు ఎకరాల విస్తీర్ణంలో ఈ ప్రాంత వాసులకు ఎంతో ఉపయోగకరంగా ఉన్న అతిపెద్ద శ్మశాన వాటిపై దృష్టి సారించాలని వారు ప్రజా ప్రతినిధులను కోరుతున్నారు.



పేరుకుపోయిన వ్యర్థాలు

ప్రత్యేక శ్రద్ధ వహిస్తాం



సైట్3 శ్మశాన వాటిక అభివృద్ధిపై తాము ప్రత్యేక శ్రద్ధ వహిస్తాం. శ్మశాన వాటిక అభివృద్ధిపై రెండు డివిజన్‌కు చెందిన ప్రజలతో చర్చించి ఒక నివేదిక రుపొందిస్తాం. వైకుంఠధామాన్ని సుందరంగా తీర్చిదిద్దుతాం. వారం రోజుల్లోపు తాను రహమత్‌నగర్ కార్పొరేటర్ సీఎస్ రెడ్డి జీహెచ్‌ఎంసీ అధికారులతో కలసి పర్యటించి సమస్యల పరిష్కారానికి ఒక ప్రణాళిక రూపొందిస్తాం.
– బాబా ఫషియుద్దీన్, కార్పొరేటర్ బోరబండ

లోకయుక్త ద్వారా అభివృద్ధి పనులు



తమ సంఘం చేసిన వినతి మేరకు బోరబండ సైట్ 3 శ్మశాన వాటికకు లోకయుక్త న్యాయస్థానం ద్వారా రూ. 1 కోటి 75 లక్షల నిధులు మంజూరయ్యాయి. వాటికి వివిధ రకాలైన అభివృద్ధి పనులకు కేటాయించారు. ప్రస్తుతం కొన్ని పనులు కొసాగుతున్నాయి. ఇంకా చాలా వరకు చేయాల్సి ఉంది. ఈ దిశగా రహమత్‌నగర్, బోరబండ కార్పొరేటర్లు స్పందించాలి. – వేముల యాదయ్య. పీజేఆర్ ఎస్పీఆర్‌హిల్స్ బస్తీ అధ్యక్షుడు

టికెట్లు ఆన్‌లైన్‌లో బుక్ చేయించుకుని మోసం

వెంగళరావునగర్: టికెట్లు ఆన్‌లైన్‌లో బుక్ చేయించుకుని ట్రావెల్స్ నిర్వాహకుడిని మోసగించిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం...మాడిశెట్టి రాజు గత రెండేళ్ళుగా అమీర్‌పేట మైత్రీవనం సమీపంలో ట్రావెల్స్ వ్యాపారం చేస్తుంటాడు. ఈనెల 2న అతనికి కళ్యాణ్ అనే వ్యక్తి ఫోన్ చేసి తాను అపోలో ఆసుపత్రిలో డాక్టర్‌నని, నీవు బాగా తెలుసని మాటలు కలిపాడు. అనంతరం ఈనెల 23న ఢిల్లీలో ఆపరేషన్ ఉందని నాలుగు టికెట్లు బుక్ చేయించుకున్నాడు. అనంతరం విజయవాడకు, తర్వాత బెంగుళూరుకు, హోటల్ రూం ఇలా రూ.లక్షా 7వేల 500 వరకు నగదు ఇవ్వకుండా బుక్ చేయించుకున్నాడు. డబ్బులు అడిగితే వారం తర్వాత ఇస్తానని నమ్మించాడు. అనంతరం తన నెంబర్‌ను బ్లాక్ చేశాడని బాధితుడు మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఫోన్ నెంబర్ ఇవ్వనందుకు అసభ్య ప్రవర్తన

వెంగళరావునగర్ : ఫోన్ నెంబర్ ఇవ్వనందుకు యువతిపై గుర్తు తెలియని యువకుడు అసభ్యంగా ప్రవర్తించిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... మధురానగర్ హాస్టల్‌లో నివసించే సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ఈ నెల 24న మధ్యాహ్నం హోటల్‌కు వెళ్ళి వస్తున్న సమయంలో గుర్తు తెలియని యువకుడు వచ్చి ఆమెను ఫోన్ నెంబర్ అడిగాడు. ఆమె నిరాకరించింది. దాంతో ఆ యువకుడు ఆమె పట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. అతనిపై చర్యలు తీసుకోవాలంటూ బాధితురాలు మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

డైరెక్టర్ ఇంటిపై దాడి

వెంగళరావునగర్: సినిమా ఛాన్స్‌లు కావాలంటూ ఓ వ్యక్తి డైరెక్టర్ ఇంటిపై దాడి చేసిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. వెంగళరావునగర్‌కు చెందిన జె.మోహనకాంత్ సినిమా డైరెక్టర్‌గా చేస్తూ కృష్ణకాంత్ పార్క్ వద్ద మధ్యాహ్న భోజనం విక్రయిస్తుంటాడు. ఈ క్రమంలో మోహనకాంత్‌కు సాయిరెడ్డి పరిచయం అయ్యాడు. ఆ తరువాత మోహనకాంత్ ఇంటి అడ్రస్ తెలుసుకున్న సాయిరెడ్డి పలుసార్లు ఇంటికి వెళ్లాడు. ఈ క్రమంలో ఈనెల 25వ తేదీన మోహనకాంత్ ఇంటికి వచ్చిన సాయిరెడ్డి తనకు సినిమా ఛాన్స్‌లు కావాలంటూ నానా హంగామా చేసి ఫ్రిజ్, టీవీ, వాషింగ్ మెషిన్ తదితర వస్తువులను పగులగొట్టాడు. దీంతో బాధితుడు మోహన్‌కాంత్ మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదును దర్యాప్తు చేస్తున్నారు.

మార్కెట్లోకి క్లియర్ ప్రీమియం వాటర్

బంజారాహిల్స్: ప్యాకేజ్డ్ వాటర్ సెగ్మెంట్‌లో అగ్రగామిగా ఉన్న క్లియర్ ప్రీమియం వాటర్‌ను శుక్రవారం నగర విపణిలోకి విడుదల చేశారు. బంజారాహిల్స్‌లో జరిగిన కార్యక్రమంలో క్లియర్ ప్రీమియం వాటర్ వ్యవస్థాపక సీఈఓ నయన్‌షా మాట్లాడుతూ నాణ్యమైన, స్వచ్ఛమైన నీటిని అందించాలనే ఉద్దేశంతో క్లియర్ ప్రీమియం వాటర్‌ను అందుబాటులోకి తీసుకురావడం జరిగిందన్నారు. పారదర్శకతతో పాటు నాణ్యతకు పెద్దపీట వేయడం జరుగుతుందన్నారు.

పర్యావరణ సమతుల్యానికి మొక్కలు నాటుదాం



అంబేద్కర్ వర్శిటీ క్యాంపస్‌లో మొక్కలు నాటుతున్న సుధారాణి తదితరులు

బంజారాహిల్స్: పర్యావరణ సమతుల్యానికి ప్రతి ఒక్కరం మొక్కలు నాటుదామని విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి రిజిస్ట్రార్ సుధారాణి కోరారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వ విద్యాలయంలో యునైటిడ్ వేఫ్ హైదరాబాద్, వెల్స్ ఫార్గో సహకారంతో కౌన్సిల్ ఫర్ గ్రీన్ రివాల్యూషన్ సంయుక్తంగా శుక్రవారం క్యాంపస్‌లో మొక్కలు నాటారు. కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా పచ్చటి కవచాన్ని పెంచేందుకు యునైటిడ్ వే ఆఫ్ హైదరాబాద్, వెల్స్ ఫార్గో అధికారులు, వలంటీర్లు గత మూడు రోజులుగా సుమారు 1800 మొక్కలు క్యాంపస్‌లో నాటారు. ఈ సందర్భంగా సుధారాణి మాట్లాడుతూ జీవరాశుల మనుగడ చెట్లపైనే ఆధారపడి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ ఇంజినీర్ లక్ష్మీప్రసాద్, కౌన్సిల్ ఫర్ గ్రీన్ రివల్యూషన్ అధికారి అన్నమయ్య తదితరులు పాల్గొన్నారు.

సందడిగా బోనాల వేడుకలు



బంజారాహిల్స్: భారతీయ విద్యాభవన్స్ ఆత్మకూరి రామారావు స్కూల్‌లో బోనాల పండుగ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. చిన్నారులు సంప్రదాయ వేషధారణలతో పాఠశాలకు వచ్చి బోనాల శోభను తీసుకువచ్చారు. పోతరాజుల వేషాలతో ఆకట్టుకన్నారు. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం మాట్లాడుతూ మన సంస్కృతీ సంప్రదాయాలను నేటితరం విద్యార్థులకు తెలియజేయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. తెలంగాణ సంస్కృతీకి బోనాలు ప్రతీకగా నిలుస్తాయన్నారు. విద్యార్థులు సంప్రదాయ దుస్తుల్లో బోనాలను ఎత్తుకుని ఎంతో ముచ్చటగొల్పారన్నారు.

రాష్ట్ర బడ్జెట్‌లో మైనార్టీలకు పెద్దపీట



సయ్యద్ బుర్హనుద్దీన్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న నాయకులు

బంజారాహిల్స్: కేంద్ర ప్రభుత్వం మైనార్టీ సంక్షేమం కోసం రూ.3 వేల కోట్లు కేటాయిస్తే ఒక్క తెలంగాణ ప్రభుత్వం మాత్రం రాష్ట్ర బడ్జెట్‌లో మైనార్టీ సంక్షేమానికి రూ.3 వేల కోట్లు కేటాయించిందని, తెలంగాణ బడ్జెట్ దేశ చరిత్రలో నిలిచిపోతుందని రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ మైనార్టీ నేత, కర్ణాటక ఏఐసీసీ పరిశీలకులు సయ్యద్ బుర్హనుద్దీన్ అన్నారు. రాష్ట్ర బడ్జెట్‌లో మైనార్టీలకు పెద్దపీట వేసినందుకు శుక్రవారం జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన మైనార్టీ నేతలు సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా బుర్హనుద్దీన్ మాట్లాడుతూ మైనార్టీల సంక్షేమం కోసం తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. బడ్జెట్‌లో వ్యవసాయానికి, గ్రేటర్ అభివృద్ధికి, మైనార్టీ సంక్షేమానికి సముచిత స్థానం కల్పించారని, ఇంత మంచి బడ్జెట్‌ను జనరంజకంగా అందజేసిన సీఎం రేవంత్‌రెడ్డికి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్కకు ఈ సందర్భంగా తెలంగాణ మైనార్టీల తరుపున కృతజ్ఞతలు తెలిపారు.

ఉత్తమ తెలుగు జర్నలిస్టులకు అవార్డుల ప్రదానం



పంజగుట్ట: తెలుగు జర్నలిస్టుల సంక్షేమ సంఘం, తెలంగాణ జర్నలిస్టుల సంక్షేమ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో జర్నలిజంలోని పలు విభాగాల్లో ఉత్తమ సేవలు అందించిన జర్నలిస్టులకు అవార్డులు అందివ్వనున్నట్లు ఆయా సంఘాల ప్రతినిధులు తెలిపారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఉత్తమ తెలుగు జర్నలిస్టు అవార్డు –2024 గ్రహీతల పేర్లు ప్రకటించారు. తెలుగు జర్నలిస్టుల సంక్షేమ సంఘం తెలంగాణ గౌరవాధ్యక్షులు మిద్దెల జితేందర్, వ్యవస్థాపక అధ్యక్షులు మేడవరపు రంగనాయకులు, తెలంగాణ జర్నలిస్టుల సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు ఆనంచిన్ని వెంకటేశ్వరరావులు మాట్లాడుతూ ఆగస్టులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి షెడ్యూల్ ఖరారు కాగానే రవీంద్రభారతిలో అవార్డుల ప్రదానోత్సవం జరుపుతామని తెలిపారు. 40 రంగాల్లో తాము దరఖాస్తులకు ఆహ్వానించగా 1600 దరఖాస్తులు వచ్చాయని అందులో 40 మందిని గుర్తించినట్లు తెలిపారు. 41వ అవార్డు జీవిత సాఫల్య పురస్కారాన్ని సీనియర్ పాత్రికేయుడు పాశం యాదగిరికి ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఆయా సంఘాల ప్రతినిధులు గజ్జల శ్రీనివాస్, గిలకత్తుల శ్రీనివాస్, బోడపాటి సుబ్బారావు, బాపట్ల కృష్ణమోహన్, చుండూరు శ్రీనివాస్ పాల్గొన్నారు.

రసాయనాలతో కూడిన ఆహారంతోనే సగం రోగాలు

మంత్రి పొన్నం ప్రభాకర్



బంజారాహిల్స్: రసాయనాలతో కూడిన ఆహారం తినడం వల్ల రోగాల బారిన పడుతున్నామని, వాతావరణ కాలుష్యం మరింతగా ఇబ్బంది పెడుతుందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శుక్రవారం బంజారాహిల్స్‌లోని రాడిసన్ బ్లూ ప్లాజా హోటల్‌లో 'ఏబీపీ దేశం హెల్త్ కాన్‌క్లేవ్–2024' కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో వైద్య రంగంలో తెలంగాణ అగ్రగామిగా ఉందని, గ్రామీణ స్థాయి వరకు ఎంబీబీఎస్ డాక్టర్లను తీసుకువెళ్లడం జరిగిందన్నారు. అమెరికా, ఆస్ట్రేలియా ఇలా ఏ దేశం వెళ్లినా మన దగ్గర ఉత్పత్తి అయ్యే మెడిసిన్ వాడే పరిస్థితి ఉందన్నారు. ఆరోగ్యానికి సంబంధించి డాక్టర్లుగా, సైంటిస్టులుగా తెలంగాణ ముందుందన్నారు. 30–40 సంవత్సరాల లోపు వారికి కిడ్నీ ఫెయిల్యూర్ కేసులు వస్తున్నాయని, డయాలసిస్ కేసులు అధికంగా వస్తున్నాయని, సీఎం సహాయ నిధికి వచ్చే సీఎంఆర్ఎఫ్, ఎల్‌ఓసీ అప్లికేషన్ ట్రీట్‌మెంట్ కేసులు చూస్తే ఆశ్చర్యం వేస్తోందన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా వ్యాధికి సంబంధించిన పరిశోధనలు ఇంకా పెరగాలన్నారు. ఏబీపీ న్యూస్ మేకర్ మాత్రమే కాకుండా ఇలాంటి సామాజిక కార్యక్రమాల్లో పాల్గొనడం శుభసూచకమన్నారు. హైదరాబాద్‌లో మెడికల్ హబ్ ఏర్పాటు చేసి రాబోయే కాలంలో మరింత అభివృద్ధి చేస్తామన్నారు. మెడికల్ టూరిజం ఏర్పాటు చేయడానికి ప్రణాళికలు రూపుదిద్దుకుంటున్నాయన్నారు.

ఘనంగా కార్గిల్ విజయ్ దివస్



అమరవీరులకు నివాళులు అర్పిస్తున్న ప్రిన్సిపాల్ లక్ష్మణ్‌నాయక్

బంజారాహిల్స్: సైఫాబాద్ సైన్స్ కాలేజీలో శుక్రవారం కార్గిల్ విజయ్ దివస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆపరేషన్ వి జయ్ కార్గిల్‌లో భాగంగా అమరవీరులకు ఈ సందర్భంగా ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జె. లక్ష్మణ్‌నాయక్, ఎన్‌సీసీ క్యాడెట్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి పెద్దపీట



బాధిత కుటుంబ సభ్యులకు ఎన్‌ఓసీ అందిస్తున్న సీఎస్ రెడ్డి

రహమత్‌నగర్ : తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తున్నారని రహమత్‌నగర్ కార్పొరేటర్ సీఎస్‌రెడ్డి అన్నారు. డివిజన్‌లోని హెచ్‌ఎఫ్‌నగర్‌కు చెందిన ఫర్హానా బేగం కుటుంబ సభ్యులకు సీఎంఆర్‌ఎఫ్ ద్వారా మంజూరైన రూ 2.50 లక్షల ఎన్‌ఓసీని శుక్రవారం తన కార్యాలయంలో అందేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా అనేక మంది పేద ప్రాణాలు నిలబడుతున్నాయన్నారు.

స్కూల్ బ్యాగులు పంపిణీ చేసిన విజయారెడ్డి



పంజగుట్ట: పీజేఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమాజిగూడ డివిజన్ పరిధిలోని ఎమ్.ఎస్.మక్తా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు శుక్రవారం టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, పీజేఆర్ ఫౌండేషన్ చైర్మన్ పి.విజయారెడ్డి స్కూల్ బ్యాగుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత శిఖరాలకు ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఎస్.కె.షరీఫ్, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

బోనాలకు ముఖ్యమంత్రికి ఆహ్వానం



సీఎం రేవంత్‌రెడ్డిని ఆహ్వానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

ఖైరతాబాద్: వందల ఏళ్ల చరిత్ర ఉన్న ఖైరతాబాద్ మహంకాళి అమ్మవారి ఆలయంలో ఆదివారం నిర్వహించే బోనాల ఉత్సవాలకు హాజరుకావాలని కోరుతూ ఆలయ కమిటీ సభ్యులు శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి ఆహ్వానం అందజేశారు. ఎన్నో ఏళ్లుగా ఖైరతాబాద్‌లో సికింద్రాబాద్ తర్వాత ఎంతో ఘనంగా నిర్వహించే ఈ ఉత్సవాలకు ముఖ్యమంత్రికి ఆహ్వానం అందించామని, ఆయన హాజరవుతానని తెలిపినట్లు ఆలయ చైర్మన్ భవానికృష్ణయాదవ్, అధ్యక్షుడు శ్రీశైలం యాదవ్, ప్రధాన కార్యదర్శి మధుకర్ యాదవ్ తెలిపారు. సీఎంతో పాటు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్‌తో పాటు నాయకులు పాల్గొంటారని తెలిపారు. ఆదివారం బోనాల ఉత్సవాలు, సోమవారం రంగం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో మహంకాళి అమ్మవారి దేవాలయం ఆర్గనైజర్ సెక్రటరీలు రాముయాదవ్, లక్ష్మణ్‌యాదవ్, అనిల్, రాజ్‌కిరణ్, సుజిత్‌తో పాటు ఆలయ పూజారి కృష్ణస్వామి ఉన్నారు.

డబ్ల్యూటీఐటీసీకి అరుదైన ఆహ్వానం



మలేషియాలో ఇండియన్ హైకమిషనర్ బీఎన్‌రెడ్డితో డబ్ల్యూటీఐటీసీ చైర్మన్ సందీప్‌కుమార్ మక్తాల

రాయదుర్గం: వరల్డ్ తెలుగు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ కౌన్సిల్(డబ్ల్యూటీఐటీసీ)కి ప్రతిష్టాత్మకమైన ఆహ్వానం లభించింది. డబ్లూటీఐటీసీ చైర్మన్ సందీప్‌కుమార్‌మక్తాల శుక్రవారం మలేషియా ఇండియన్ హైకమిషనర్ బీఎన్ రెడ్డితో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. మలేషియాలో జరగబోయే ఏషియన్(అసోసియేషన్ ఆఫ్ సౌత్‌ఈస్ట్ ఏషియన్ నేషన్స్) సమ్మిట్‌లో డబ్ల్యూటీఐటీసీ కీలకంగా వ్యవహరించనుంది. ఈ ఏషియన్‌లో బ్రూనై, కంబోడియా, ఇండోనేషియా, ఫిలిప్పీన్స్, సింగపూర్, థాయిలాండ్, వియత్నాం పాల్గొనే ఈ సమ్మిట్‌లో తెలుగు స్టార్టప్‌లను ప్రపంచవ్యాప్తంగా విస్తరించేలా డబ్ల్యూటీఐటీసీ వేదికగా నిలువనుంది. భవిష్యత్తులో పరస్పర సహకారాలు, టీకన్సల్ట్ సేవలు తదితర వాటిపై సందీప్‌కుమార్‌మక్తాల, బీఎన్‌రెడ్డి చర్చించారు. టీకన్సల్ట్ పనితీరు తెలుసుకున్న బీఎన్‌రెడ్డి డబ్ల్యూటీఐటీసీ-ఏషియన్ సమ్మిట్-2025ను మలేషియాలో నిర్వహించాలని ఆయన కోరారు. ప్రాంతీయ ఆర్థిక సమగ్రత పెంచడానికి, సాంకేతిక సహకారాన్ని మెరుగుపర్చుకునేందుకు, దేశాల మధ్య వాణిజ్య ప్రయోజనాలను పెంచేందుకు ఈ సమ్మిట్ ఉపయోగపడుతుందని వారు అభిప్రాయపడ్డారు.

శాకంబరిగా కీసరగుట్ట అమ్మవారు



కీసర: ఆషాఢ మాసం శుక్రవారం సందర్భంగా కీసరగుట్టలో కొలువైన శ్రీభవానీ శివదుర్గ అమ్మవారు శాకంబరి దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. దేవాలయంలో ఆషాఢ శుక్రవారం సందర్భంగా శ్రీభవానీ శివదుర్గ అమ్మవార్లకు శాకంబరిదేవీ అలంకరణ, ప్రత్యేక పూజను శుక్రవారం కనుల పండువగా నిర్వహించారు. ఆలయ చైర్మన్ తటాకం నాగలింగం, ఈఓ సుధాకర్‌రెడ్డి, పూజారులు సత్యనారాయణశర్మ, బల్‌రాంశర్మ, మోత్కురు రవిశర్మ, తటాకం రవిశర్మ, ఫణీందర్‌శర్మ, బన్ని పంతులు తదితరులు పాల్గొన్నారు.

నేడు రామకృష్ణ మఠంలో జాతీయ విద్యా సదస్సు



కవాడిగూడ: లోయర్ ట్యాంక్‌బండ్‌లోని రామకృష్ణ మఠం స్వర్ణోత్సవ వేడుకల సందర్భంగా శనివారం భారత దేశం విద్యా విజన్, విద్యావేత్తల పాత్ర అనే అంశంపై జాతీయ స్థాయి వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు రామకృష్ణ మఠం అధ్యక్షులు స్వామి బోధమయానంద తెలిపారు. సదస్సుకు వివిధ విద్యా సంస్థలకు చెందిన వెయ్యి మందికిపైగా ఉపాధ్యాయులు, పలువురు విద్యావేత్తలు హాజరుకానున్నారని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ తెలంగాణ డైరెక్టర్ డాక్టర్ బీఎస్ మూర్తి, స్వామి ముక్తిదానంద హాజరు కానున్నారని వారు తెలిపారు. స్వర్ణోత్సవ వేడుకల్లో విద్యార్థులు, భక్తులు పాల్గొని మూర్తిత్రయం కృపపొందాలని స్వామి బోధమయానంద కోరారు.

లాల్‌దర్వాజా బోనాలకు ప్రత్యేక బస్సులు

సాక్షి, సిటీబ్యూరో: పాతబస్తీ లాల్‌దర్వాజా బోనాల ఉత్సవాల సందర్భంగా ఈ నెల 28వ తేదీన వివిధ మార్గాల నుంచి ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. సికింద్రాబాద్, ఈసీఐఎల్, రాజేంద్రనగర్, జీడిమెట్ల, ఉప్పల్, ఎల్‌బీనగర్, బీహెచ్‌ఈఎల్, పటాన్‌చెరు, మెహదీపట్నం తదితర ప్రాంతాల నుంచి 100 బస్సులను అదనంగా ఏర్పాటు చేయనున్నారు.


30న దాశరథి, సినారె జయంతి వేడుకలు

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో సీల్‌వెల్ కార్పొరేషన్, శృతిలయ ఫౌండేషన్ల ఆధ్వర్యంలో ఈ నెల 30వ తేదీన రవీంద్రభారతిలో దాశరథి సినారెల జయంతి వేడుకలను నిర్వహిస్తున్నట్లు ప్రముఖ గాయని ఆమని శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ జి.చిన్నారెడ్డికి సినారె ఆత్మీయ పురస్కారం అందజేస్తారు. దాశరథి సాహితీ పురస్కారాన్ని కేంద్ర సాహిత్య అకాడమి సలహా మండలి సభ్యులు నాళేశ్వరం శంకరం అందుకోనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమానికి రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, ప్రొఫెసర్ కోదండరాంతో పాటు పలువురు ప్రముఖులు హాజరవుతారని, సినీ సంగీత విభావరి ఉంటుందని తెలిపారు.

ఇక ఎదురుచూపులేనా..?

నత్తనడకన భూవినియోగ మార్పిడి

- సుమారు 65 దరఖాస్తులు పెండింగ్
- అరకొరగా అనుమతులు
- కన్జర్వేషన్ జోన్ నుంచి రెసిడెన్షియల్‌కు మార్పు
- ఏడు నెలలుగా పడిగాపులు



సాక్షి, సిటీబ్యూరో: తుర్కయంజాల్ పరిధిలోని ఇంజాపూర్, మునగనూరు, తొర్రూర్ తదితర ప్రాంతాల పరిధిలో వందల ఎకరాల భూములు కన్జర్వేషన్ జోన్‌లో ఉన్నాయి. ఈ ఊళ్లు అవుటర్ రింగ్ రోడ్డు లోపలే ఉన్నాయి. కన్జర్వేషన్ జోన్‌లో ఉండటంతో ఎలాంటి అభివృద్ధికి నోచుకోవడం లేదు. రైతులు వాటిని విక్రయించలేకపోతున్నారు. కొనుగోలు చేసిన నిర్మాణ సంస్థలు సైతం భూవినియోగ మార్పిడి అనుమతులు లభించకపోవడం వల్ల ఎలాంటి నిర్మాణాలు చేపట్టడం లేదు. ఒక్క తుర్కయంజాల్ పరిధిలోనే కాదు. హైదరాబాద్ మహానగర అభివృద్ధి సంస్థ(హెచ్ఎండీఏ) పరిధిలోని వివిధ ప్రాంతాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. కొత్త ప్రభుత్వం కొలువుదీరి ఏడు నెలలు గడుస్తున్నా ఛేంజ్ ఆఫ్ లాండ్ యూజ్ (సీఎల్‌యూ) సర్టిఫికెట్ దరఖాస్తుల పరిశీలన నత్తనడకన సాగుతోంది. దీంతో రియల్ ఎస్టేట్, నిర్మాణ రంగాల్లో స్తబ్ధత నెలకొంది. గత ప్రభుత్వ హయాంలో భూవినియోగ మార్పిడి అనుమతుల్లో అక్రమాలు జరిగినట్లు అప్పట్లో ఆరోపణలు రావడంతో దరఖాస్తుల పరిశీలనను పూర్తిగా నిలిపివేశారు. కానీ ఆ తర్వాత అనుమతులకు అవకాశం కల్పించినప్పటికీ ఆచితూచి అడుగులు వేస్తున్నారు. దీంతో అనుమతుల్లో తీవ్ర జాప్యం నెలకొంటోంది. నిర్మాణరంగం అభివృద్ధికి విఘాతం కలుగుతోందని రియల్ రంగానికి చెందిన నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. హెచ్ఎండీఏ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో 65 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్లు సమాచారం.

మాస్టర్ ప్లాన్ మాయాజాలం..

హెచ్ఎండీఏ మాస్టర్ ప్లాన్-2013 ప్రకారం 70 మండలాల్లో ఉన్న భూమిని 11 జోన్లుగా విభజించారు. మాస్టర్‌ప్లాన్ ప్రకారం రెసిడెన్షియల్, మల్టీపర్పస్, కమర్షియల్, కన్జర్వేషన్ (వ్యవసాయ ఆధారిత), ఫారెస్ట్ తదితర జోన్లుగా గుర్తించారు. 2013 నాటికి కన్జర్వేషన్ జోన్‌లో ఉండి నిరుపయోగంగా ఉన్న భూములను ఇతర జోన్లలోకి మార్చుకొనేందుకు అవకాశం కల్పించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు నగరం అనూహ్యంగా విస్తరించింది. అవుటర్‌కు వెలుపల కూడా నిర్మాణరంగం విస్తరించింది. కానీ మాస్టర్‌ప్లాన్ కారణంగా అవుటర్ లోపల ఉన్న భూముల వినియోగ మార్పిడిలో జాప్యం వల్ల నష్టం వాటిల్లుతోంది. అప్పట్లో వ్యవసాయ భూములుగా ఉన్నవి ఆ తర్వాత నిరుయోగంగా మారాయి. పడావు భూములయ్యాయి. అదే సమయంలో చుట్టుపక్కల నివాస ప్రాంతాలు, వాణిజ్య మండలాలు భారీగా విస్తరించాయి. ఈ క్రమంలో వ్యవసాయ ఆధారిత భూములను ఇతర జోన్లలోకి మార్చుకొనేందుకు ప్రభుత్వం వెసులుబాటు కల్పించింది. అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకున్న అనంతరం భూమి వినియోగ మార్పిడికి ఆమోదించేందుకు మున్సిపల్‌శాఖ మంత్రి నేతృత్వంలో వివిధ విభాగాలతో కమిటీని ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మున్సిపల్‌శాఖ బాధ్యతలను కూడా పర్యవేక్షిస్తున్న దృష్ట్యా సీఎల్‌యూ కమిటీకి ఆయనే నేతృత్వం వహించాల్సి ఉంటుంది. గత ప్రభుత్వ హయాంలో వచ్చిన వందల కొద్దీ దరఖాస్తుల్లో కొన్నింటిని పరిష్కరించగా ఇంకా కొన్ని పెండింగ్‌లో ఉన్నాయి. మరోవైపు ఈ ఏడు నెలల్లో మరిన్ని కొత్త దరఖాస్తులు వచ్చాయి. అప్పట్లో పరిష్కారం లభించని వాళ్లు ఇప్పటికీ పడిగాపులు కాస్తున్నారు.

అక్రమ అనుమతుల వల్లే జాప్యమా..?

111 (ట్రిబుల్ వన్) జీవో పరిధిలో ఉన్న కొన్ని గ్రామాల్లో కన్జర్వేషన్ జోన్‌లో ఉన్న భూములను కమర్షియల్, రెసిడెన్షియల్, మల్టీపర్పస్ జోన్లలోకి మారుస్తూ అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఇచ్చిన అక్రమ అనుమతులు వివాదాస్పదంగా మారాయి. ఒక్క వట్టినాగులపల్లి ప్రాంతంలోనే కేవలం వారం, పది రోజుల్లో వందకు పైగా సీఎల్‌యూలను ఇచ్చారు. ఇందుకోసం నిబంధనలను ఉల్లంఘించి హడావుడిగా సీఎల్‌యూలను విడుదల చేసినట్లు అప్పట్లో ఆరోపణలు వెల్లువెత్తాయి. ఎన్నికల కోడ్ అమల్లోకి రావడానికి ముందు కూడా ఇలా పెద్ద సంఖ్యలో అడ్డగోలుగా అనుమతులను ఇచ్చారు. దీంతో సీఎల్‌యూ కోసం గతంలో ఇచ్చిన అనుమతులను పరిశీలించడంతో పాటు పెండింగ్‌లో ఉన్నవాటికి కూడా సమగ్రంగా పరిశీలించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అప్పట్లో అక్రమ అనుమతులు ఇవ్వడం వల్లే ఇప్పుడు దరఖాస్తుల పరిశీలన, అనుమతుల ప్రక్రియలో జాప్యం చోటుచేసుకుంటుందని అధికారులు చెబుతున్నారు.

నిర్మాణాలు ఊపందుకోవడం కష్టం

ఈ జాప్యం కారణంగా నిబంధనల మేరకు దరఖాస్తు చేసుకొని, అన్ని విధాలుగా మార్పిడికి అర్హతలు ఉన్న వాళ్లు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుంది. ఐదారేళ్లుగా వారికి పడిగాపులు తప్పడం లేదు. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోనే సీఎల్‌యూ అనుమతులను ఇవ్వాల్సి ఉంటుంది. కానీ ఇప్పటి వరకు సీఎం ఆ దిశగా సీరియస్‌గా దృష్టి సారించడం లేదని షాద్‌నగర్ ప్రాంతానికి చెందిన ఓ రియల్టర్ విస్మయం వ్యక్తం చేశారు. 'పార్లమెంట్ ఎన్నికల అనంతరం అనుమతులు లభించవచ్చని ఆశించాం. కానీ ఈ ప్రక్రియ ఇంకా నత్తనడకనే సాగుతోంది' అని చెప్పారు. ఛేంజ్ ఆఫ్ ల్యాండ్ యూజ్ అనుమతులు లభిస్తే తప్ప అవుటర్ చుట్టుపక్కల గేటెడ్ కమ్యూనిటీలు, బహుళ అంతస్తుల భవనాల నిర్మాణాలు ఊపందుకోవడం కష్టమని రియల్టర్లు, నిర్మాణ సంస్థల ప్రతినిధులు అభిప్రాయపడుతున్నారు.

నగరంలో నేడు..

- లోయర్ ట్యాంక్‌బండ్‌లోని రామకృష్ణ మఠం స్వర్ణోత్సవ వేడుకల సందర్భంగా భారత దేశం విద్యా విజన్, విద్యావేత్తల పాత్ర అనే అంశంపై జాతీయ స్థాయి వర్క్‌షాప్ జరుగుతుంది. సదస్సుకు వివిధ విద్యా సంస్థలకు చెందిన ఉపాధ్యాయులు, పలువురు విద్యావేత్తలు హాజరుకానున్నారు.
- మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహించే వారాంతపు కార్యక్రమాల్లో భాగంగా సాయంత్రం 5.30 గంటల నుంచి ఆంపీ థియేటర్‌లో భరతనాట్య నృత్యమాలిక ప్రదర్శన జరుగుతుంది.
- మాదాపూర్ శిల్పారామంలో సాయంత్రం 6.30 గంటలకు తరంగిణి కథక్ కేంద్ర 3వ వార్షికోత్సవ వేడుకలు జరుగుతాయి. ఈ సందర్భంగా కథక్ నృత్యాంశాల ప్రదర్శనను నిర్వహిస్తారు.

చరిత్రాత్మక క్రీడా బడ్జెట్



సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ కె.శివసేనారెడ్డి

గన్‌ఫౌండ్రీ: క్రీడారంగ చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా చరిత్రాత్మక బడ్జెట్ కేటాయించినందుకు యావత్ తెలంగాణ క్రీడా సమాజం ధన్యవాదాలు తెలియజేస్తుందని స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ కె.శివసేనారెడ్డి అన్నారు. ఎల్బీస్టేడియంలో సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి శుక్రవారం పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం క్రీడారంగాన్ని విస్మరించిందని, కానీ నేడు క్రీడల సంక్షేమానికి నూతన బాటలు వేస్తూ రూ.326 కోట్ల బడ్జెట్‌ను కేటాయించినట్లు తెలిపారు. క్రీడారంగ చరిత్రలో ఇది సువర్ణ అధ్యాయమని కొనియాడారు. రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన బడ్జెట్ అంచెలంచెలుగా అన్ని క్రీడా విభాగాలను అభివృద్ధి చేస్తామని, గ్రామీణ క్రీడాకారుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ అథారిటీ ఉప సంచాలకులు అనురాధ, చంద్రారెడ్డి, రవీందర్, సుజాత, సూర్యలతతో పాటు క్రీడాకారులు పాల్గొన్నారు.

మహిళలకు ఇచ్చిన హామీలు ఏమాయె..?



బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న బీజేపీ మహిళా మోర్చా నాయకులు

- హామీలకు బడ్జెట్‌లో కేటాయింపులేవి..?
- అంబేద్కర్ విగ్రహం వద్ద బీజేపీ మహిళా మోర్చా నిరసన

కవాడిగూడ: కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో మహిళల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించారని బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు మేకల శిల్పారెడ్డి ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీ పథకాల్లో భాగంగా మహిళలకు ఇస్తామన్న నెలకు రూ.2,500, పద్దెనిమిది ఏళ్లు నిండిన మహిళలకు స్కూటీలను అందజేస్తామని ఇచ్చిన హామీలకు బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోవడం మహిళలను మోసం చేయడమే అన్నారు. బడ్జెట్‌లో మహిళల సంక్షేమాన్ని విస్మరించినందుకు నిరసనగా బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో శుక్రవారం లోయర్ ట్యాంక్‌బండ్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా శిల్పారెడ్డి మాట్లాడుతూ.. మహాలక్ష్మి పథకం కింద ప్రతి మహిళలకు నెలకు రూ.2,500, కల్యాణ లక్ష్మి పథకం కింద తులం బంగారం, స్కూటీ వాహనం ఇస్తామని గొప్పలు చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి వాటిని మరిచిపోయారని ఆమె ధ్వజమెత్తారు. నిరసన అనంతరం అసెంబ్లీ వైపు వెళ్తున్న మహిళా మోర్చా నాయకులను వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించారు.

రాష్ట్రపతి నిలయంలో కార్గిల్ విజయ్ దివస్



కార్గిల్ విజయ్ దివస్ కార్యక్రమంలో మేజర్ జనరల్ అఖిలేష్ కుమార్ తదితరులు

రసూల్‌పురా: బొల్లారం రాష్ట్రపతి నిలయంలో కార్గిల్ విజయ్ దివస్‌ను శుక్రవారం నిర్వహించారు. జీవోసీ, 54వ ఇన్‌ఫాంట్రి డివిజన్ మేజర్ జనరల్ అఖిలేష్ కుమార్, ఆయన సతీమణి సుదీప్తా ఝా, హకీంపేట ఎయిర్ కమాండింగ్ అధికారి ఎయిర్ కమాండర్ పంకజ్ జైన్ ఆయన సతీమణి అనిత జైన్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కార్గిల్ యుద్ధంలో వైమానిక దళం పోషించిన ప్రముఖ పాత్రను ఎయిర్ కమాండింగ్ అధికారి పంకజ్ జైన్ విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. వాల్‌పై నివాళి సందేశాలు, దేశభక్తి థీమ్‌తో రంగోలీ పోటీలు నిర్వహించారు. పలు పాఠశాలల విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అనంతరం అమరవీరులపై డాక్యుమెంటరీ చిత్రాన్ని ప్రదర్శించారు. రాష్ట్రపతి నిలయం పరిపాలనాధికారి రజనీప్రియ మాట్లాడుతూ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పదవీ బాధ్యతలు చేపట్టి రెండేళ్లు పూర్తికావడంతో సెప్టెంబర్ 16 వరకు సాయుధ దళాలకు ప్రవేశ టిక్కెట్లు రద్దు చేస్తున్నట్లు ప్రకటించినట్లు తెలిపారు. సికింద్రాబాద్ రాష్ట్రపతి నిలయంతో పాటు రాష్ట్రపతి నివాస్(మషోబ్రా, సిమ్లా) రాష్ట్రపతి భవన్ సందర్శించే అవకాశం ఉందని చెప్పారు. ఈ అవకాశాన్ని సాయుధ బలగాలు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ కేడెట్లు, 48 పాఠశాలల, కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

కార్గిల్ వీరులకు సైనికాధికారుల నివాళి



అమర సైనికులకు నివాళులర్పిస్తున్న మేజర్ జనరల్ రాకేష్ మనోచా

రసూల్‌పురా: కార్గిల్ విజయ్ దివస్‌ను పురస్కరించుకుని సికింద్రాబాద్ పరేడ్ మైదానంలోని అమర సైనిక స్తూపం వద్ద ఆర్మీ ఉన్నతాధికారులు అమరులైన సైనికులకు శుక్రవారం నివాళులర్పించారు. తెలంగాణ, ఆంధ్ర సబ్ ఏరియా(టాసా) ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జనరల్ ఆఫీసర్, మేజర్ జనరల్ రాకేష్ మనోచా ముఖ్య అతిథిగా హాజరై పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. సైనికాధికారులు, వివిధ జిల్లాల నుంచి హాజరైన సైనిక సంక్షేమ సంఘాల సభ్యులు, మాజీ సైనికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయుధాలు, శక్తివంతమైన గన్స్, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం కలిగిన మైన్స్, బుల్లెట్ ప్రూఫ్ జాకెట్స్, బైనాక్యూలర్స్, రాడర్ వ్యవస్థ, రైఫిల్స్, కమ్యూనికేషన్ సిగ్నలింగ్ పరికరాలను ప్రదర్శించారు.



శిఖర హారతి.. శోభాయమానం..

ఆషాఢ మాసం బోనాల జాతర ఉత్సవాల్లో భాగంగా లాల్‌దర్వాజా సింహవాహిని మహంకాళి అమ్మవారి ఆలయ శిఖర హారతి కార్యక్రమం శుక్రవారం రాత్రి కన్నుల పండువగా కొనసాగింది. వేలాది మంది మహిళా భక్తులు హాజరై శిఖరానికి ఒకేసారి హారతి ఇవ్వడంతో ఆధ్యాత్మికత ఉట్టిపడింది.

– చాంద్రాయణగుట్ట

హెచ్ఎండీఏలో బోనాల ఉత్సవాలు



అమీర్‌పేట్‌లోని హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్ఎండీఏ)లో బంగారు మైసమ్మ అమ్మవారి బోనాల ఉత్సవాలు శుక్రవారం ఘనంగా జరిగాయి. హెచ్ఎండీఏ ఉద్యోగుల సంఘం నిర్వహించిన ఈ ఉత్సవాల్లో వివిధ విభాగాలకు చెందిన ఉన్నతాధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

– సాక్షి, సిటీబ్యూరో

జేఎన్‌టీయూలో వర్షపు నీటి సంరక్షణ వ్యవస్థ భేష్



వినూత్న వర్షపు నీటి సంరక్షణ వ్యవస్థను సందర్శించిన విదేశీ ప్రతినిధులు

పరిశీలించిన 18 దేశాల ప్రతినిధులు

కేపీహెచ్‌బీకాలనీ: భారతదేశం, అభివృద్ధి చెందని దేశాల మధ్య ద్వైపాక్షిక ఒప్పందం ప్రకారం గచ్చిబౌలిలోని పర్యావరణ రక్షణ శిక్షణ, పరిశోధనా సంస్థలో వాతావరణ మార్పు, సుస్థిర అభివృద్ధి అనే అంశంపై ఈ నెల 23 నుంచి ఆగస్టు 5వ తేదీ వరకు రెండు వారాల పాటు శిక్షణ కార్యక్రమం ఉంటుంది. ఇందులో భాగంగా శ్రీలంక, నేపాల్, ఖాట్మండు, కంబోడియా వంటి 18 దేశాల ప్రతినిధులు జేఎన్‌టీయూహెచ్‌లోని వినూత్న వర్షపు నీటి సంరక్షణ వ్యవస్థలను శుక్రవారం సందర్శించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో నీటిని పొదుపు చేసేందుకు వర్షపు నీటి సంరక్షణ అవసరాన్ని నీటి వనరులు, రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ ప్రొఫెసర్ డా. ఎంవీఎస్ఎస్ గిరిధర్ వివరించారు. జేఎన్‌టీయూ క్యాంపస్‌ను జీరో డిశ్చార్జ్, జీరో మెయింటెనెన్స్ రెయిన్ వాటర్ స్ట్రక్చర్లుగా మార్చడానికి రెయిన్‌వాటర్ హార్వెస్టింగ్ వినూత్న ఆలోచనను వివరించారు. ఈ సందర్భంగా డా.గిరిధర్‌ను విదేశీ ప్రతినిధులు ప్రశంసించారు. ఇదే విధానాన్ని తమ దేశాల్లో అమలు చేస్తామని తెలిపారు. రెక్టర్, రిజిస్ట్రార్, ప్రిన్సిపల్, సివిల్ ఇంజినీరింగ్ డిపార్టుమెంట్ హెడ్ గిరిధర్‌ను అభినందించారు.

గుండెపోటుతో ఆస్పత్రి వాచ్‌మెన్ మృతి



విశ్వనాథ్(ఫైల్)

ముషీరాబాద్: ఆస్పత్రిలో విధులు నిర్వర్తించేందుకు వచ్చిన ఉద్యోగికి గుండెపోటు రావడంతో అక్కడే కుప్పకూలి మృతి చెందాడు. ఈ ఘటన ముషీరాబాద్ ప్రభుత్వ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(యూపీహెచ్‌సీ)లో శుక్రవారం చోటుచేసుకుంది. కవాడిగూడకు చెందిన విశ్వనాథ్(58) ముషీరాబాద్ యూపీహెచ్‌సీలో 13ఏళ్లుగా వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. ఆయనకు భార్య ఇద్దరు కుమారులు ఉన్నారు. ఉదయం విధులకు హాజరైన విశ్వనాథ్ ఆస్పత్రి ప్రాంగణంలో కుప్పకూలాడు గమనించిన వైద్య సిబ్బంది ఆయనకు సీపీఆర్ చేసి చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి మృతి చెందాడని తెలిపారు. అందరిని ఎంతో ఆప్యాయంగా పలకరించే అతడు మృతి చెందడంతో వైద్య సిబ్బంది కంటతడి పెట్టారు.

బుల్లి రైటర్..

మిస్టరీ ఆఫ్ ది మిస్సింగ్ జ్యువెల్స్' బై దైవిక్

పదేళ్ల వయస్సులోనే పుస్తకం రచించిన విద్యార్థి



సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని మంథన్ స్కూల్లో ఐదో తరగతి చదువుతున్న దైవిక్ (10) 'మిస్టరీ ఆఫ్ ది మిస్సింగ్ జ్యువెల్స్' పేరుతో పుస్తకాన్ని రచించారు. ఈ పుస్తకం బ్రిబుక్స్‌లో లిస్ట్ అయినట్లు ప్రిన్సిపాల్ సుర్జీత్ సింగ్ శుక్రవారం తెలిపారు. ఆభరణాల తయారీకి ప్రసిద్ధిగాంచిన నగరంలోకి ప్రవేశించే చోరుడు దొంగతనం చేయడం, ఆ మిస్టరీని ఛేదించి చోరీ ఆభరణాలను యువరాజు రికవరీ చేయడం నేపథ్యంలో సాగుతుంది. పుస్తక ప్రియుల ప్రశంసలు అందుకున్న దైవిక్ ఇటీవల బ్రిబుక్స్ నుంచి ప్లాటినం రచయిత సర్టిఫికెట్ పొందారు. దైవిక్ మాట్లాడుతూ 'పుస్తకాలు చదవడం చాలా ఇష్టం. కల్పిత కథలపై ప్రత్యేక ఆసక్తి ఉంది. మా అమ్మ ప్రోత్సాహంతోనే పుస్తకం రాశా. గతంలో చదివిన అనేక కల్పిత కథల పుస్తకాల నుంచి పొందిన ప్రేరణతోనే దీన్ని రాశా. దైవిక్ తల్లి సౌజన్య మాట్లాడుతూ 'దైవిక్ పౌరాణిక కథలపై ఆసక్తి చూపేవాడు. ట్రేసీ వెస్ట్, థియా స్టిల్టన్ రచనలను అమితంగా ఇష్టపడేవాడు. కథలు రాసే అలవాటుని పుస్తకం రాసేలా ప్రేరేపించా. పుస్తకాలు చదవడం, రాయడమే కాదు బ్యాడ్మింటన్ కూడా అడతాడు. క్రీడల్లోనూ అనేక బహుమతులు గెలుచుకున్నాడు. చదువులోనూ ముందుండే దైవిక్ గణితంలో అనేక ప్రశంసలు అందుకున్నాడు' అన్నారు. సుర్జీత్ సింగ్ మాట్లాడుతూ 'దైవిక్ ప్రతిభ అమోఘం. అతడిని చూస్తుంటే గర్వంగా ఉంది. క్రమశిక్షణ, అంకితభావం ఉన్న విద్యార్థి. మంథన్ స్కూల్లో అవుట్ ఆఫ్ ది బాక్స్ ఎడ్యుకేషన్ సిస్టమ్‌తో విద్యార్థుల ప్రతిభను వెలికి తీయడానికి ప్రయత్నిస్తుంటాం' అని అన్నారు.

ఐఎమ్‌డీబీ నెంబర్ వన్‌గా కల్కి

సాక్షి, సిటీబ్యూరో: ప్రపంచవ్యాప్తంగా చలన చిత్రాలకు, టీవీ షోస్‌కు సంబంధించిన రేటింగ్స్‌లో పేరొందిన ఐఎమ్‌డీబీ సంస్థ ప్రకటించిన అత్యంత ప్రజాదరణ పొందిన 10 భారతీయ చిత్రాల రేటింగ్స్‌లో టాలీవుడ్ స్టార్ ప్రభాస్ హీరోగా, దర్శకుడు నాగ్ అశ్విన్ రూపొందించిన చిత్రం కల్కికి తొలిస్థానం దక్కింది. ఈ విషయాన్ని సంస్థ నగర ప్రతినిధులు ఓ ప్రకటనలో తెలిపారు. కగా రెండో స్థానంలో మళయాల చిత్రం మంజుమల్ బాయ్స్ నిలవగా మొత్తం ఐదు హిందీ చిత్రాలు, రెండు తెలుగు, మూడు మళయాల చిత్రాలు చోటు దక్కించుకున్నాయి. అదే విధంగా అత్యధిక సంఖ్యలో ప్రేక్షకులు ఎదురు చూస్తున్న సీక్వెల్స్ జాబితాలో పుష్ప–2 అగ్రస్థానంలో నిలవడం విశేషం.



7 నిమిషాల్లో అంబులెన్స్..

ఓల్టా యాప్‌లో తక్షణ సహాయానికి ఎస్ఓఎస్ బటన్

మెరుగైన భద్రత సేవలకు ఓల్టా, టెన్ సంయుక్త భాగస్వామ్యం

సాక్షి, సిటీబ్యూరో: అత్యవసర పరిస్థితుల్లో కేవలం 7 నిమిషాల్లోనే అంబులెన్స్ సేవలు అందేలా ప్రణాళికలు రూపొందిస్తుంది నగరానికి చెందిన రైడ్–హెయిలింగ్ యాప్ 'ఓల్టా'. ఇందులో భాగంగా భద్రతను మెరుగుపరచడమే లక్ష్యంగా ఓల్టా, టోటల్ ఎమర్జెన్సీ నెట్‌వర్క్ (టెన్)తో భాగస్వామ్యాన్ని ప్రకటించింది. ఓల్టా యాప్ వ్యవస్థాపకులు శశికాంత్ కనపర్తి మాట్లాడుతూ.. డ్రైవర్లకు ఎలాంటి కమీషన్ లేకుండా (0% కమీషన్) రైడ్‌లను అందించడంతో పాటు అధునాతన ఎస్ఓఎస్ బటన్‌ను చేర్చామని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో ఈ సాంకేతికత టోటల్ ఎమర్జెన్సీ నెట్‌వర్క్ ఆధ్వర్యంలోని అంబులెన్స్ సేవలకు తక్షణమే అనుసంధానమయ్యేలా రూపొందించామని, ఒక క్లిక్‌తో తక్షణ సహాయ సేవలను అందిస్తుందని పేర్కొన్నారు. ప్రస్తుతం 15 నిమిషాల్లోనే అంబులెన్స్ సేవలను అందిస్తున్నామని టెన్ ఎండీ వెంకట కిషోర్ బాబు మానేపల్లి తెలిపారు. కొత్తగా చేర్చిన అధునాతన సాంకేతికతతో 7 నిమిషాల్లోనే అంబులెన్స్‌ను స్పాట్‌కు పంపడమే లక్ష్యమన్నారు. వైద్య పరిభాషలో దీనిని 'గోల్డెన్ అవర్' అని పిలుస్తారన్నారు. వోల్టా యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్న ప్రతి ఒక్కరికీ ఈ ఫీచర్ అందుబాటులో ఉంటుందని అన్నారు.

హైదరాబాద్‌కు బ్రియన్ ఆడమ్స్

సాక్షి, సిటీబ్యూరో: భాగ్యనగరవాసులను ఉర్రూతలూగించేందుకు ప్రముఖ కెనెడియన్ పాప్‌స్టార్ బ్రియన్ ఆడమ్స్ సిద్ధమవుతున్నారు. ఈ ఏడాది డిసెంబర్‌లో ఇండియాలో ఆయన పర్యటించనున్నారు. ఇందులో భాగంగా డిసెంబర్ 16న హైదరాబాద్‌లో ఆయన ప్రదర్శన ఉండనుంది. 1993 నుంచి ఇప్పటివరకూ ఆరుసార్లు భారత్‌లో పర్యటించారు. 2011లో చివరిసారిగా ఇండియా వచ్చారు. ఈ ఏడాది భారత్ రాబోతుండటంతో సంగీత అభిమానులకు పండగే అని చెప్పొచ్చు. టికెట్లు ఆగస్టు 7 నుంచి అందుబాటులోకి రానున్నాయి. డిసెంబర్ 10న మేఘాలయలోని షిల్లాంగ్‌లో ప్రదర్శన ఇవ్వనున్నారు. ఆ తర్వాత గురుగ్రామ్, ముంబై, బెంగళూరులో షో నిర్వహించనున్నారు. చివరగా హైదరాబాద్‌లో ప్రదర్శన ఇచ్చి గ్రాండ్‌గా టూర్‌ను ముగించనున్నారు.

వేసవి ముగిసినా ఆగని ఎండలతో సతమతమైన నగరవాసులకు..

ఊహించని మధురానుభూతులను అందిస్తోంది ఈ మాన్‌సూన్ సీజన్. నగరాన్ని నింపేసిన నాన్‌స్టాప్ ముసురు, రోజులో ఒక్కసారైనా పలకరించకుండా ఉండలేని తొలకరి చిరు జల్లులు సినిమాల్లో చూపించే రొమాంటిక్ ఫీలింగ్‌ను తలపిస్తుంది. ఇలాంటి ఆహ్లాదకరమైన వాతావరణం కొనసాగుతుంటే ఎప్పుడెప్పుడు వారాంతం వస్తుందా అని ఎదురు చూస్తున్నారు పలువురు నగరవాసులు. ఎందుకంటే వీకెండ్ ట్రిప్స్‌కు మాన్‌సూన్ సీజన్ మంచి సమయం. అందుకే.. ఒత్తిడితో సతమతమయ్యే ఉద్యోగులు నగర జీవనానికి చెక్ పెడుతూ వీకెండ్ ట్రిప్పులకు చెక్కేస్తున్నారు. ముఖ్యంగా టెక్కీలు, యువత బృందాలుగా నగర శివార్లకు, ఇతర ప్రకృతి ప్రదేశాలకు ప్రయాణమవుతున్నారు. ఈ నేపథ్యంలో పలు పర్యాటక ప్రదేశాల.. గురించి తెలుసుకుందాం..


- సాక్షి, సిటీబ్యూరో

నగరంపై కురుస్తున్న తొలకరి జల్లులు..

ప్రకృతి ప్రదేశాలు, జలపాతాలు, ట్రెక్కింగ్‌కు ఆసక్తి..

వీకెండ్ ట్రిప్స్ ఆస్వాదిస్తున్న నగర వాసులు

2, 3 గంటల ప్రయాణంతో అద్భుత ప్రదేశాలు



వీకెండ్ జాయ్

మాన్‌సూన్‌లో మైమరపిస్తున్న ప్రకృతి అందాలు



నగర శివార్లకు గంట, రెండు గంటల ప్రయాణమున్న ప్రకృతి ప్రదేశాలను సందర్శించడానికి యువకులు ప్రత్యేకంగా బైక్ రైడ్‌లు, కార్ డ్రైవ్‌లు చేస్తున్నారు. ఇందులో భాగంగా అనంతగిరి హిల్స్, శామీర్‌పేట్ లేక్, నర్సాపూర్ ఫారెస్ట్, రత్నగిరి ఫోర్ట్, మృగవాణి అరణ్య పార్కులకు చలో అంటున్నారు. ముఖ్యంగా ఈ మధ్య కాలంలో నిర్మించిన కొండపోచమ్మ సాగర్, మల్లన్న సాగర్‌కు నగరవాసుల సందర్శన పెరిగింది.

ఫొటో స్పాట్‌గా పోచమ్మ, మల్లన్న సాగర్లు..

నగరానికి 50 నుంచి 100 కి.మీ దూరంలోనే ఈ రెండు భారీ జలాశయాలూ ఉండటంతో వీకెండ్ ట్రిప్స్‌కు హాట్‌స్పాట్స్‌గా మారాయి. ఈ రెండు ప్రాంతాలు ఫొటో షూట్‌లకు స్వర్గధామాలుగా మారాయి. ఈ సీజన్‌లో విరివిగా సందర్శించే ప్రదేశాల్లో నాగార్జున సాగర్ కూడా ఒకటి. ఐతే ఇదే ప్రాంతంలో వైజాగ్ స్ట్రీట్‌కు కూడా ఈ మధ్య పర్యాటకుల సంఖ్య పెరిగింది. ఓ 3 గంటల ప్రయాణం మనది కాదు అనుకునే యువతరం వరంగల్ దగ్గర్లోని లక్నవరం లేక్‌ను కూడా ఆల్‌టైం ఫేవరెట్ స్పాట్‌గా భావిస్తున్నారు.



ట్రెక్కింగే టాప్..

నగరవాసులు అత్యంత ఇష్టపడే వినోద కార్యక్రమాల్లో ట్రెక్కింగ్ టాప్‌లో ఉంటోంది. ఈ అభిలాషను గమనించి నగర శివార్లలో పాతికకు పైగా ట్రెక్కింగ్ స్పాట్స్ తయారు చేశారు. ముఖ్యంగా అనంతగిరి హిల్స్, షాద్‌నగర్, శామీర్‌పేట్ వంటి ప్రాంతాల్లో ట్రెక్కింగ్‌తో పాటు, వసతి సౌకర్యాలు కల్పిస్తున్న రిసార్టులు ఎన్నో వెలిశాయి. రాత్రిళ్లు బార్బెక్యూ ఫుడ్, ఉదయం సమయంలో ట్రెక్కింగ్‌తో ఈ మాన్‌సూన్‌ను ఆస్వాదిస్తున్నారు ప్రకృతి ప్రియులు.

ముందే మాన్‌సూన్ సీజన్.. తొలకరి వర్షాలకు చెరువులు, నదులు నిండుకుండలా మారాయి. ఎక్కడ చూసినా పచ్చదనం పరవశిస్తుంది. ఈ నేపథ్యంలో నగరవాసులు ఎక్కువగా జలపాతాలను చూసేందుకు, వాటిలో తడిసి ముద్దయ్యేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. నగరానికి 120 నుంచి 180 కి.మీ దూరంలో పలు వాటర్ ఫాల్స్ ఉండటంతో వాటిని ఈ వీకెండ్స్‌లో ప్లాన్ చేసుకుంటున్నారు. ఇందులో భాగంగా ములుగు జిల్లాలోని బొగత జలపాతం, ఆదిలాబాద్ కుంటాల, పొచ్చెర, నాగర్ కర్నూల్ మల్లెల తీర్థం, భీముని పాదం, నగరానికి కూత వేటు దూరంలో ఉన్నటువంటి అంతరగంగ (ఎల్‌బీ నగర్ నుంచి 20 కి.మీ) వంటి జలపాతాలను సందర్శిస్తున్నారు. ఎత్తయిన కొండ నుంచి అద్భుతంగా జాలువారే నాగర్ కర్నూల్‌లోని సలేశ్వరం, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని ముత్యాల జలపాతాలు ఉన్నప్పటికీ వాటిని సందర్శించడానికి ప్రస్తుతం సరైన సమయం కాదని పలువురు పర్యాటక ప్రేమికులు చెబుతున్నారు.



మనసొక ఋతువే..

మనిషి మనస్సు ఋతువులతో పాటు.. తన అనుభూతులనూ మార్చుకుంటుంది. ఆ అనుభూతులను ఆస్వాదించేందుకు పర్యాటకం ఓ సాధనమవుతుంది. మారుతున్న కాలాలకు అనువుగానే మనం కూడా ఋతువులను, ఆయా ఋతువుల సందర్భంగా కనిపించే ప్రకృతి సోయగాలను ఆస్వాదించాలి. ఈ హాబీలో భాగంగానే వీకెండ్ వచ్చిందంటే చాలు ప్రకృతిలోకి తొంగి చూసేందుకు పలువురు ఔత్సాహికులు ప్రయాణిస్తున్నారు. ఫ్రెండ్స్‌తో, సహోద్యోగులతో ఈ ట్రిప్స్ మంచి ఉల్లాసాన్ని, మరచిపోలేని అనుభూతులను పంచుతున్నాయి. వారం క్రితం సన్నని చిరుజల్లుల్లో వెళ్లిన అనంతగిరిహిల్స్ ప్రయాణం ఇంకా మర్చిపోలేకపోతున్నాను. హైదరాబాద్ సమీపంలో ఉన్న ప్రకృతి ప్రదేశాలన్నీ చాలా సురక్షితమైనవి కావడం మన అదృష్టం. – నవీన్, సాఫ్ట్‌వేర్ ఉద్యోగి

జలపాతాల చెంతకు యువ తరంగాలు...





ఈ వారం.. ఈవెంట్ల సారం..

సాక్షి, సిటీబ్యూరో: వరుస వానల అనంతరం నగరంలో వాతావరణం ఆహ్లాదంగా మారడంతో సిటీలో ఈవెంట్లు కూడా ఊపందుకున్నాయి. విభిన్న అభిరుచులకు అనుగుణంగా వారాంతాన్ని వినోదభరితం చేసుకోవాలని కోరుకునే వారిని అలరించేందుకు విభిన్న రకాల కార్యక్రమాలను ఈవెంట్ ఆర్గనైజర్లు నిర్వహిస్తున్నారు. వాటిలో కొన్ని...



సంగీత కచేరి..

కర్ణాటక సంగీతాన్ని ఆస్వాదించాలనుకునేవారి కోసం.. జూబ్లీహిల్స్‌లోని ది మూన్‌షైన్ ప్రాజెక్ట్‌లో శనివారం కచ్చేరి ప్రాజెక్ట్ పేరిట సంగీత ప్రదర్శన నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమం సాయంత్రం 4గంటల నుంచి ప్రారంభం కానుంది. పేటీఎమ్ ద్వారా ఎంట్రీలు కొనుగోలు చేయాలి.

హరిణిరావు లైవ్..



నగరానికి చెందిన హిందుస్తానీ క్లాసికల్ సింగర్ హరణిరావు లైవ్ కన్సర్ట్‌లో పాల్గొంటున్నారు. బంజారాహిల్స్‌లోని సప్తపర్ణి 20వ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా నిర్వహిస్తున్న ఈ ప్రదర్శన శనివారం రాత్రి 7.30 గంటలకు ప్రారంభం కానుంది. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ హరిదాస్, ఉప్కార్ గోడ్బలేలు వాయిద్య సహకారం అందిస్తున్నారు. బుక్ మై షో ద్వారా ఎంట్రీలు అందుబాటులో ఉన్నాయి.

బ్యాడ్ డ్రాయింగ్...

చిత్రకళ అంటే బాగా గీసేవారికి మాత్రమే సొంతం కాదు... ఆలోచనలు ఉన్న ప్రతి ఒక్కరిలో ఆర్ట్ ఉంటుందని నమ్మే వారి కోసం బ్యాడ్ డ్రాయింగ్ ఈవెంట్ అందుబాటులోకి వచ్చింది. నచ్చిన గీతలతో వచ్చిన ఆకారం ద్వారా తమలోని అంతర్గత కళాభిరుచిని సంతృప్తి పరచుకోవాలనుకునేవారి కోసం బేగంపేట్‌లోని ట్రయిలింగ్ ఐవీ కేఫ్‌లో సాయంత్రం 4గంటల నుంచి ఈ కార్యక్రమం ఉంటుంది. బుక్ మై షో ద్వారా ప్రవేశాలను పొందవచ్చు.

నియర్లీ నైస్ గై..

పేరెంట్స్ డే ని పురస్కరించుకుని పెద్దల అంచనాలకు, పిల్లల ఆచరణకు మధ్య అంతరాలను ఆధారంగా చేసుకుని హాస్య ప్రియుల కోసం నియర్లీ నైస్ గై ఈవెంట్ నిర్వహిస్తున్నారు. స్టాండప్ కమెడియన్ సాయికిరణ్ ప్రధాన ఆకర్షణగా గచ్చిబౌలిలోని కామెడీ థియేటర్ హైదరాబాద్‌లో రాత్రి 6గంటల నుంచి ఈ కార్యక్రమం ఉంటుంది. పేటీఎమ్ ఇన్‌సైడర్ ద్వారా ఎంట్రీలు లభిస్తాయి.

మండాల ఆర్ట్ వర్క్‌షాప్...

ఆధ్యాత్మికతతో పెనవేసుకున్న మండాల ఆర్ట్ పట్ల నగరవాసుల్లో వ్యక్తమవుతున్న ప్రత్యేక ఆసక్తిని దృష్టిలో పెట్టుకుని ఆ చిత్రకళ నేర్చుకునేవారి కోసం వర్క్‌షాప్ నిర్వహిస్తున్నారు. ఈ సనాతన కళకు సంబంధించిన చరిత్రతో మొదలుపెట్టి మెళకువల దాకా ఈ వర్క్‌షాప్‌లో తెలుసుకోవచ్చు. ఈ కార్యక్రమం జూబ్లీహిల్స్‌లోని బాఫ్ బీన్స్ కాఫీ అండ్ ఆర్ట్ లో ఆదివారం నిర్వహిస్తున్నారు. మధ్యాహ్నం 2గంటల నుంచి ప్రారంభం అవుతుంది. పేటీఎమ్ ఇన్‌సైడర్‌లో ఎంట్రీలు లభిస్తాయి.



ముగిసిన అసోచామ్-షార్జా సమావేశాలు

సాక్షి, సిటీబ్యూరో: షార్జా ప్రభుత్వం 'ది అసోసియేటెడ్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఆఫ్ ఇండియా' (అసోచామ్) ఆధ్వర్యంలో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో వ్యాపార అవకాశాలను వృద్ధి చేసుకోవడంపై నగరంలోని ఐటీసీ కాకతీయ హోటల్‌లో నిర్వహించిన బి2బి సమావేశాలు ముగిశాయి. ఈ సందర్భంగా యుఎఇ, మధ్య ప్రాచ్య దేశాల్లో పెట్టుబడి అవకాశాలు, పన్నుల వ్యవస్థ, గంట వ్యవధిలో కంపెనీల నమోదు ఎలా.. తదితర అంశాలపై కీలక సూచనలను నిపుణులు అందించారు. కార్యక్రమం విజయవంతమైందని, 85 ప్రముఖ సంస్థలకు చెందిన ప్రతినిధులు హాజరయ్యారని నిర్వాహకులు తెలిపారు.





నోరూరిస్తున్న కూర్గ్ వంటకాల ఫుడ్ ఫెస్టివల్

తయారు చేస్తున్న చెఫ్ స్మితకుట్టయ్యబొప్పండ



షరటాన్‌లో ఫ్లేవర్స్ ఆఫ్ కూర్గ్

రాయదుర్గం: నగరవాసులకు అద్భుతమైన సువాసనలు, ఉత్సాహభరిత రుచులైన 'కూర్గ్ వంటకాలు' వెచ్చని ఆతిథ్యాన్ని అందిస్తున్నాయి. నానక్‌రాంగూడలోని ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతంలోని షరటాన్ హోటల్లో ప్రముఖ చెఫ్ స్మితకుట్టయ్యబొప్పండ చెఫ్‌పిన్ సహకారంతో కూర్గ్ వంటకాలను అందించేందుకు ఏర్పాట్లు చేశారు. 'ఫ్లేవర్స్ ఆఫ్ కూర్గ్' పేరిట కూర్గ్ వంటకాలను ఈనెల 29 వరకూ నగరవాసులకు రుచి చూసే అవకాశం కల్పిస్తున్నారు. ప్రతిరోజు మధ్యాహ్నం, రాత్రి వేళల్లో ఈ వంటకాలను నగరవాసులకు అందుబాటులో ఉంచనున్నారు. ఈ ఫుడ్‌ఫెస్టివల్లో పాండికూర (కూర్గ్ పోర్క్ కర్రీ), అక్కి రోటీ (రైస్ రోటీ), వెదురు షూట్ కర్రీ, వంటి రుచికరమైన సంప్రదాయ వంటకాలు, కోలీకర్రీ (చికెన్ కర్రీ) వంటివి అందించేందుకు ఏర్పాట్లు చేశారు. కాగా సుగంధ రుచుల నుంచి సంప్రదాయ కొడవ కాఫీ రిఫ్రెష్‌రుచి వరకూ ప్రతి వంటకం కూర్గ్ యొక్క పచ్చని ప్రకృతి దృశ్యాలు, శక్తివంతమైన సాంస్కృతిక చరిత్ర యొక్క వేడుకగా ఈ ఫుడ్‌ఫెస్టివల్ నిర్వహిస్తున్నారు. మధ్యాహ్నం 12.30 గంటల నుంచి 3 గంటల వరకూ, రాత్రి 7 గంటల నుంచి 11 గంటల వరకూ ఫుడ్‌ఫెస్టివల్ అందుబాటులో ఉంటుంది. మరిన్ని వివరాలకు ఫోన్ నెంబర్ 73373 58581లో సంప్రదించాలి.

భవ్య భారత నిర్మాణంలో ఉపాధ్యాయులదే కీలకపాత్ర

- స్వామి బోధమయానంద



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న స్వామి బోధమయానంద

కవాడిగూడ: భవ్యభారత నిర్మాణంలో ఉపాధ్యాయులదే కీలక పాత్ర అని హైదరాబాద్ రామకృష్ణ మఠం మాజీ అధ్యక్షుడు స్వామి బోధమయానంద పేర్కొన్నారు. ఆధునిక సవాళ్లకు సనాతన పరిష్కారాలను చూపేందుకు స్వామి వివేకానంద బోధనలు తోడ్పడతాయన్నారు. లోయర్ ట్యాంక్‌బండ్‌లోని రామకృష్ణ మఠం ఆధ్వర్యంలో శనివారం జాతీయ విద్యా సదస్సు జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హైదరాబాద్ ఐఐటీ డైరెక్టర్ డాక్టర్ బీఎస్ మూర్తి, రామకృష్ణ మఠం మాజీ అధ్యక్షుడు స్వామి బోధమయానంద హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రామకృష్ణ మఠం ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న 600 పాఠశాలలు, విద్యాసంస్థల్లోని ఉపాధ్యాయులు, స్వామీజీలు ఈ దిశగా కృషి చేస్తున్నారని తెలిపారు. అనంతరం హైదరాబాద్ ఐఐటీ డైరెక్టర్ డాక్టర్ బీఎస్ మూర్తి మాట్లాడుతూ విద్యార్థులకు నచ్చిన కోర్సును ఎంపిక చేసుకునే స్వేచ్ఛ ఉండాలన్నారు. 18 ఏళ్లకు ప్రధానిని ఎన్నుకునే హక్కు వస్తుందని, కానీ నచ్చిన కోర్సు ఎంపిక చేసుకునే హక్కు మాత్రం లేకుండా పోయిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వికసిత భారతాన్ని సాధించాలంటే విద్యాసంస్థలు పరిశ్రమలతో కలిసి పనిచేయాలని ఆయన సూచించారు. అనంతరం రామకృష్ణ మఠం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. ఈ సదస్సు ద్వారా తాము ఎంతో ప్రయోజనం పొందామని వారు పేర్కొన్నారు.

నూతన టెక్నాలజీని అందిపుచ్చుకోవాలి

- రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య



ఫొటో ట్రేడ్ ఎక్స్‌పోలో రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య

మన్సూరాబాద్: ఫొటో అండ్ వీడియోగ్రఫీలో వస్తున్న నూతన టెక్నాలజీని ఫొటో అండ్ వీడియో గ్రాఫర్లు అందిపుచ్చుకోవాలని రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య స్పష్టం చేశారు. తెలంగాణ ఫొటో అండ్ వీడియోగ్రాఫర్ల సంక్షేమ సంఘం, ఫొటో టెక్ సంయుక్త ఆధ్వర్యంలో మన్సూరాబాద్‌లోని కేబీఆర్ కన్వెన్షన్‌లో జరుగుతున్న ఫొటో ట్రేడ్ ఎక్స్‌పోను శనివారం ఆయనతో పాటు భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి సందర్శించారు. ఫొటో ట్రేడ్ ఎక్స్‌పోలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించి నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ కృష్ణ, సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్కే హుస్సేన్, వ్యవస్థాపక అధ్యక్షుడు సంకిరెడ్డి వెంకట్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి రాపర్తి శ్రీనివాస్‌గౌడ్, ఫొటో టెక్ అధినేత అభిమన్యు రెడ్డి, శైలేందర్, జయమాధురి, తులసి పాల్గొన్నారు.

ఆకట్టుకున్న చేనేత వస్త్ర ప్రదర్శన



చేనేత వస్త్ర ప్రదర్శనను ప్రారంభిస్తున్న వాణి విదేహ

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నంబర్–12లోని కళింగ కల్చరల్ హాల్‌లో ఏర్పాటైన హ్యాండ్‌లూమ్ ఇండియా చేనేత వస్త్ర ప్రదర్శనను మిస్ యూనివర్స్ ఏపీ ఫస్ట్ రన్నరప్ 2024 వాణీ విదేహ ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె ఇక్కడ చేనేతకారులు ఏర్పాటు చేసిన వస్త్రోత్పత్తులను తిలకిస్తూ, చేనేతకారులతో వాటి తయారీ విధానం, ప్రత్యేకత తెలుసుకున్నారు. నిర్వాహకులు జయేష్‌గుప్తా మాట్లాడుతూ.. 29వ తేదీ వరకు కొనసాగుతున్న ప్రదర్శనలో 14 రాష్ట్రాల నుంచి చేనేతకారులు తమ ఉత్పత్తులను అందుబాటులో ఉంచారని వివరించారు.

నోరో వైరస్‌తో జాగ్రత్త

సాక్షి, సిటీబ్యూరో: నోరో వైరస్ గురించి ఎక్స్(ట్విట్టర్) వేదికగా జీహెచ్ఎంసీ నగర ప్రజలను అప్రమత్తం చేసింది. ఈ వైరస్ సోకకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించింది. కలుషిత నీరు, ఆహారం వల్ల ఈ వైరస్ సోకే అవకాశం ఉన్నందున వాటి విషయంలో జాగ్రత్తగా ఉండాలని, కాచి చల్లార్చి వడపోసిన నీటిని తాగాలని, చేతులను సబ్బుతో శుభ్రం చేసుకోవాలని సూచించింది. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని క్రిమిసంహారక మందులతో శుభ్రం చేసుకోవాలని తెలిపింది. చలిజ్వరం, వాంతులు, విరేచనలు, నీరసం, కడుపునొప్పి, డీహైడ్రేషన్ వ్యాధి లక్షణాలని తెలిపింది.

కేంద్ర మంత్రులు రాజీనామా చేయాలి



కేంద్రమంత్రుల చిత్రపటాలను దహనం చేస్తూ..

ఉస్మానియా యూనివర్సిటీ: బడ్జెట్‌లో తెలంగాణకు మోదీ ప్రభుత్వం మొండి చేయి చూపినందుకు నిరసనగా కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ తమ పదవులకు రాజీనామా చేయాలని టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్ డిమాండ్ చేశారు. బడ్జెట్ కేటాయింపులో రాష్ట్రానికి ఒక్క రూపాయికూడా ప్రకటించనందుకు నిరసనగా మంత్రుల చిత్రపటాలను దహనం చేశారు. కేంద్రం నుంచి నిధులు తీసుకరాలేకపోయిన మంత్రులను తెలంగాణలో తిరగనివ్వబోమని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ ఓయూ అధ్యక్షులు మెడ శ్రీను, అభి, వినయ్‌కుమార్, శివ, సుమన్‌గౌడ్, రాకేష్, నవీన్ పాల్గొన్నారు.

ఆగస్టు 29 నుంచి ఎలక్ట్రిక్ ఎక్స్‌పో

బంజారాహిల్స్: సికింద్రాబాద్ ఎలక్ట్రిక్ ట్రేడర్స్ అసోసియేషన్ (సెటా) ఆగస్టు 29 నుంచి 31వ తేదీ వరకు మూడు రోజుల పాటు హైటెక్స్‌లో ఎలక్ట్రిక్ ఎక్స్‌పో నిర్వహిస్తోందని, జాతీయ స్థాయిలో పేరొందిన ఎలక్ట్రిక్ కంపెనీలు, బ్రాండ్‌లు ఇందులో తమ ఉత్పత్తులను ప్రదర్శిస్తాయని, దక్షిణ భారతదేశంలోనే అతిపెద్ద ఎలక్ట్రిక్ ఎక్స్‌పో ఇదేనని సెటా అధ్యక్షుడు సురేష్‌జైన్ తెలిపారు. బంజారాహిల్స్‌లోని పార్క్ హయత్ హోటల్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఎక్స్‌పోలో సుమారు 180 వరకు స్టాళ్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. సెక్రటరీ జీత్‌సేథ్, ఉపాధ్యక్షుడు బిజూపంచారత్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఎండీఏ ప్లానింగ్‌లో

బదిలీలు షురూ..

- ఆన్ డెప్యూటేషన్‌పై పనిచేస్తున్న వారికి స్థానచలనం
- త్వరలో అంతర్గత బదిలీలు
- జోన్ల విస్తరణ దిశగా అడుగులు..
- ప్లానింగ్ విభాగం బలోపేతంపై సర్కార్ దృష్టి



సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ మహా నగరాభివృద్ధి సంస్థ(హెచ్ఎండీఏ) ప్రణాళికా విభాగంలో బదిలీల ప్రక్రియ మొదలైంది. ఆన్ డెప్యూటేషన్‌పై పనిచేస్తున్న పలువురు ప్లానింగ్ అధికారులను ప్రభుత్వం వివిధ విభాగాలకు బదిలీ చేసింది. అలాగే ఆయా స్థానాల్లో కొత్తవారికి అవకాశం కల్పించింది. త్వరలో పూర్తిస్థాయిలో అంతర్గత బదిలీల ప్రక్రియను చేపట్టనున్నారు. ప్లానింగ్ విభాగంలో ఘట్‌కేసర్ జోన్ అధికారిగా పనిచేస్తున్న ప్రభాకర్‌రెడ్డిని హైదరాబాద్ మెట్రో రైల్‌కు బదిలీ చేశారు. శంషాబాద్ ప్లానింగ్ అధికారిగా పనిచేస్తున్న రాంరెడ్డి కొత్తగా ఏర్పాటైన హైడ్రాకు బదిలీ అయ్యారు. అలాగే శంకర్‌పల్లి జోన్‌లో పనిచేస్తున్న కోటేశ్వర్‌రావు అనే మరో అధికారిని కరీంనగర్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీకి బదిలీ చేశారు. అలాగే వారి స్థానంలో జీహెచ్ఎంసీ నుంచి టౌన్‌ప్లానింగ్ అధికారి శ్రీనివాస్, హైదరాబాద్ మెట్రో రైల్ నుంచి రాజశేఖర్, కరీంనగర్ నుంచి సుభాష్ అనే మరో ముగ్గురు అధికారులు హెచ్ఎండీఏకు బదిలీ అయ్యారు. మరోవైపు అసిస్టెంట్ ప్లానింగ్ అధికారిగా పనిచేస్తున్న సుమిత్ర హెచ్ఎండీఏ నుంచి జీహెచ్ఎంసీకి బదిలీ కాగా, ఆమె స్థానంలో జీహెచ్ఎంసీ నుంచి రాహుల్ అనే మరో అధికారి హెచ్ఎండీఏకు బదిలీ అయ్యారు. అలాగే జీహెచ్ఎంసీలో పనిచేస్తున్న ప్రసాద్‌రావు, మల్లికార్జున్‌రావు అనే మరో ఇద్దరు అధికారులు చీఫ్ ప్లానింగ్ అధికారులుగా హెచ్ఎండీఏకు రానున్నట్లు సమాచారం. ఈ మేరకు ప్రభుత్వం బదిలీ ఉత్తర్వులను విడుదల చేసింది. బదిలీ అయిన వారు ఒకటి, రెండు రోజుల్లో విధులు చేరనున్నారు. హెచ్ఎండీఏ పరిధిని ట్రిబుల్ ఆర్ వరకు విస్తరించే దిశగా ప్రభుత్వం ఇప్పటికే చర్యలు చేపట్టింది. ఈ క్రమంలోనే ప్రణాళికా విభాగంలో ఆన్ డెప్యూటేషన్‌పై పని చేస్తున్న వారిని బదిలీ చేసినట్లు అధికారులు చెబుతున్నారు. అనంతరం సంస్థాగతంగా ప్లానింగ్‌తో సహా అన్ని విభాగాలను బలోపేతం చేయనున్నట్లు సమాచారం.

జోన్‌ల విస్తరణ..

ప్రస్తుతం హైదరాబాద్ చుట్టుపక్కల జిల్లాలు, మున్సిపాలిటీలు, గ్రామ, నగర పంచాయతీల పరిధిలో సుమారు 7,200 చదరపు కిలోమీటర్ల వరకు హెచ్ఎండీఏ విస్తరించింది. ట్రిపుల్ ఆర్ వరకు పరిధి పెంచడం వల్ల మరో 3000 చదరపు కిలోమీటర్లు అదనంగా పెరిగే అవకాశం ఉంది. దీంతో ప్లానింగ్ విభాగం పరిధి కూడా పెరగనుంది. ఇందుకు అనుగుణంగా సిబ్బంది సంఖ్యను పెంచాలని కోరుతూ అధికారులు ఇప్పటికే ప్రతిపాదనలు పంపారు. సిబ్బంది కొరత వల్ల ప్రస్తుతం ఉన్న నాలుగు జోన్లలోనే ఫైళ్ల పరిష్కారంలో జాప్యం చోటుచేసుకుంటోంది. పనిభారం వల్ల అధికారులు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు. కొత్త వారిని నియమిస్తే తప్ప ట్రిపుల్ ఆర్‌కు అనుగుణంగా జోన్ల విస్తరణ సాధ్యం కాదని అధికారులు భావిస్తున్నారు. ప్రస్తుతం ప్రణాళికా విభాగంలో శంకర్‌పల్లి, ఘట్‌కేసర్, మేడ్చల్, శంషాబాద్ జోన్లు ఉన్నాయి. లే అవుట్లు, భవన నిర్మాణాలు, ఆక్యుపెన్సీలు, టీడీఆర్‌లు, ఎల్ఆర్ఎస్‌లు తదితర అనుమతులన్నీ ప్రస్తుతం ఈ నాలుగు జోన్ల నుంచే లభిస్తున్నాయి. దశాబ్దకాలంగా హెచ్ఎండీఏ పరిధి అనూహ్యంగా నాలుగు రెట్లు పెరిగింది. కానీ ఇందుకు అనుగుణంగా జోన్లు, ప్లానింగ్ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది మాత్రం పెరగలేదు. ప్రస్తుతం ఉన్న 4 జోన్లను 6 నుంచి 8కి పెంచడంతో పాటు అదనపు సిబ్బంది నియామకం కూడా చేపట్టాల్సి ఉందని అధికారులు పేర్కొంటున్నారు. ఇప్పుడు ఉన్న 4 జోన్లను 8కి పెంచాలని అధికారులు భావిస్తున్నారు. ఈ దిశగా ఇప్పటికే ప్రణాళికలను సిద్ధం చేశారు.

అభివృద్ధి సమంగా..

హైదరాబాద్ మహానగర విస్తరణ వల్ల హెచ్ఎండీఏ బాధ్యతలు మరింత పెరగనున్నాయి. తాజా బడ్జెట్‌లోనూ ప్రభుత్వం నగర శివారు ప్రాంతాల్లో టౌన్‌షిప్స్ ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించింది. దీంతో కొత్తగా టౌన్‌షిప్‌ల కోసం ప్రణాళికలను రూపొందించడం, లే అవుట్లను సిద్ధం చేయడం వంటి కార్యక్రమాల్లో ప్రణాళికా విభాగం కీలకంగా పని చేయాల్సిన ఉంటుంది. అలాగే రోడ్లు, రవాణా, మౌలిక సదుపాయాల విస్తరణ, లాజిస్టిక్ హబ్‌లను ఏర్పాటు చేయడం వంటి ప్రాజెక్టులను హెచ్ఎండీఏ చేపట్టనుంది. ఇందుకు అనుగుణంగా హెచ్ఎండీఏను మరింత బలోపేతం చేయనున్నారు. 'భవిష్యత్తు అవసరాల మేరకు నగర నిర్మాణం కోసం అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేసే విధంగా హెచ్ఎండీఏ కార్యాచరణ ప్రణాళికలు ఉంటాయని ఒక అధికారి అభిప్రాయపడ్డారు.

మోడల్ ఎఫ్‌సీఐగా మార్చేందుకు నిర్ణయం

చర్లపల్లి ఎఫ్‌సీఐని సందర్శించిన కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి, ఎంపీ ఈటల



చర్లపల్లి పారిశ్రామికవాడలోని ఎఫ్‌సీఐని సందర్శిస్తున్న కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి

కుషాయిగూడ: చర్లపల్లి భారత ఆహార సంస్థ(ఎఫ్‌సీఐ)ని కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌తో కలిసి శనివారం సందర్శించారు. తెలుగు రాష్ట్రాల్లో అతి పెద్దదైన చర్లపల్లి ఎఫ్‌సీఐని కేంద్ర ప్రభుత్వం మోడల్ ఎఫ్‌సీఐగా తీర్చిదిద్దాలన్న నేపథ్యంలో మంత్రి ఎఫ్‌సీఐ పర్యటనకు వచ్చారు. ఎఫ్‌సీఐని సందర్శించిన ఆయన గోదాం స్థితిగతులను తెలుసుకున్నారు. లక్ష టన్నుల సామర్థ్యం కలిగిన చర్లపల్లి ఎఫ్‌సీఐని భవిష్యత్తులో మోడల్ ఎఫ్‌సీఐగా మార్చడంపై ఎఫ్‌సీఐ జనరల్ మేనేజర్ ప్రభాకర్, జిల్లా, ఏరియా మేనేజర్లతో సమీక్ష నిర్వహించారు. అనంతరం ఎఫ్‌సీఐ శ్రామిక్ యూనియన్ ప్రతినిధులు మంత్రి, ఎంపీని కలిసి వినతి పత్రం అందజేశారు. ఎఫ్‌సీఐలో పనిచేస్తున్న కార్మికులను పర్మినెంట్ చేయడంతో పాటు నార్త్ ఇండియాలో కార్మికులకు అందజేస్తున్న అన్ని రకాల బెనిఫిట్స్‌ను సౌత్‌లోనూ అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో శ్రామిక్ యూనియన్ సెంట్రల్ కమిటీ సభ్యులు టి.ఐలయ్య, ఎం.నర్సింహ, కె.శ్రీనివాస్, బి.మల్లేశ్‌తో పాటు ప్రతినిధులు జి.ఐలయ్య, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

బదిలీలను పారదర్శకంగా నిర్వహించడాన్ని స్వాగతిస్తున్నాం

- తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం



మాట్లాడుతున్న తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం ప్రతినిధులు

సుల్తాన్‌బజార్: వైద్య ఆరోగ్యశాఖలో బదిలీలను పారదర్శకంగా ప్రభుత్వం నిర్వహించడంపై తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం హర్షం వ్యక్తం చేసింది. ఈ మేరకు కోఠి డీఎంఈ ఆవరణలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బరిగల రమేష్, పల్లం ప్రవీణ్, లాలుప్రసాద్ రాథోడ్, నరహరి మాట్లాడారు. గత పదేళ్ల బదిలీలు లేక వైద్యులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారన్నారు. జీఓ 80 ప్రకారం.. 4 సంవత్సరాలు సర్వీస్ పూర్తి చేసిన వైద్యులను 40 శాతానికి మించకుండా ప్రభుత్వం బదిలీలు చేపట్టడంపై వారు హర్షం వ్యక్తం చేశారు. బదిలీలపై గుర్తింపులేని కొన్ని వైద్య సంఘాలు చేసిన ఆరోపణలను తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అంతేగాకుండా బదిలీలు జరిగే క్రమంలో డైరెక్టర్ ఆఫ్ హెల్త్, వైద్య విధాన పరిషత్, డీఎంఈలలో ఉద్యోగులను సీనియార్టీలలో, కొన్ని క్యాడర్లలో తప్పిదాలు జరిగాయని, వాటిని వెంటనే గుర్తించి కమిషనర్ ఆధ్వర్యంలో పారదర్శకంగా డాక్టర్ల బదిలీలు అన్ని క్యాడర్లలో నిర్వహించారన్నారు. జీఓ నంబర్–3171ల మల్టీజోన్ 1, 2లలో జోనల్ బదిలీలలో నర్సింగ్, ఇతర సిబ్బంది సీనియార్టీ దృష్టిలో జాప్యం జరిగినందున దాన్ని గుర్తించి బదిలీలు జరుగుతున్నాయన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డికి, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు వారు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో డాక్టర్ రావూఫ్, డాక్టర్ రాథోడ్, డాక్టర్ సంతోష్, డాక్టర్ వినోద్ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో నేడు..

- మాదాపూర్‌లోని శిల్పారామం ఆంఫి థియేటర్‌లో సాయంత్రం 5.30గంటలకు కువైట్‌కి చెందిన నాట్యవేద చల్లా వేదవల్లి ప్రసాద్ అధ్వర్యంలో కూచిపూడి నృత్య ప్రదర్శన జరుగుతుంది.
- ఆషాఢమాసం బోనాల జాతర ఉత్సవాల్లో భాగంగా ఉదయం పాతబస్తీలోని పల ఆలయాల్లో బోనాల సంబరాలు జరుగుతాయి. ఉత్సవాల్లో ఆయా దేవాలయాల్లో అమ్మవార్లకు మంత్రులు పట్టువస్త్రాలు సమర్పిస్తారు.
- అంబర్‌పేట్ దేవస్థాన సేవా సమితి అధ్వర్యంలో మహంకాళి దేవాయం, పోచమ్మ దేవాలయాల్లో బోనాల వేడుక జరుగుతుంది.
- ప్రొఫెసర్ జయశంకర్ 13వ స్మారకోపన్యాసం బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో జరుగుతుంది.

అంతరిక్షంలో అద్భుతాలెన్నో..

- రాష్ట్రపతి నిలయంలో అవుట్ రిచ్ కార్యక్రమం
- విద్యార్థులకు అవగాహన కల్పించిన ఎన్ఆర్ఎస్‌సీ



చంద్రయాన్ విశేషాలను తెలుసుకుంటున్న పాఠశాలల విద్యార్థులు

రసూల్‌పురా: బొల్లారం రాష్ట్రపతి నిలయంలో నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ సహకారంతో ఆగస్టు 23న జాతీయ అంతరిక్ష దినోత్సవం పురస్కరించుకుని విద్యార్థుల కోసం శనివారం అవుట్ రిచ్ కార్యక్రమం శనివారం నిర్వహించారు. నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ డైరెక్టర్ డా.ప్రకాష్ చౌహాన్, కేంద్రీయ విద్యాలయ సంఘటన్ అసిస్టెంట్ కమిషనర్ జి.కృష్ణవేణి ముఖ్య అతిథులుగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. అనంతరం మిస్సైల్ మ్యాన్ ఆఫ్ ఇండియా డా.ఏపీజే. అబ్దుల్ కలామ్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఉపగ్రహాల ద్వారా ప్రదేశాన్ని ట్రాక్ చేయడం, గ్లోబల్ నావిగేషన్ సపోర్ట్ సిస్టమ్, శాటిలైట్ సర్వర్ల ద్వారా ఏటీఎంల పనితీరు, వాతావరణ ఉపగ్రహాల ద్వారా వాతావరణ నివేదికలు, రిమోట్ సెన్సింగ్ ఉపగ్రహాల ద్వారా తుఫాన్ల సమాచారం తదితర అంశాల గురించి పాఠశాలల విద్యార్థులకు వివరించారు. కేవీ సంఘటన్ అసిస్టెంట్ కమిషనర్ కృష్ణవేణి మాట్లాడుతూ చంద్రయాన్–3 చంద్రుడిపై విజయవంతంగా దక్షిణ ధ్రువం వైపు ల్యాండింగ్ సందర్భంగా ఆగస్టు 23న జాతీయ అంతరిక్ష దినోత్సవంగా జరుపుకుంటున్నామని చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్రపతి పరిపాలనాధికారి రజనీప్రియ, సుమారు మూడు వేల మంది విద్యార్థులు పాల్గొన్నారు.

'లాల్‌దర్వాజ' నిధులను

కొత్త అకౌంట్‌లో డిపాజిట్ చేయండి

- దేవాదాయ శాఖ అధికారులకు హైకోర్టు ద్విసభ్య ధర్మాసనం ఆదేశం
- సింగిల్ జడ్జి తుది తీర్పు మేరకు తదుపరి చర్యలు తీసుకోవాలని వెల్లడి

సాక్షి, హైదరాబాద్: లాల్‌దర్వాజా సింహవాహిని మహంకాళి ఆలయ బోనాలను ఆచారాల మేరకు ఎప్పటిలాగే ఈ నెల 28, 29 తేదీల్లో నిర్వహించాలని దేవాదాయ శాఖ అధికారులను హైకోర్టు ద్విసభ్య ధర్మాసనం ఆదేశించింది. ఈ కొత్త బ్యాంక్ అకౌంట్ తెరిచి రెండు రోజుల్లో వచ్చిన ఆదాయాన్ని అందులో డిపాజిట్ చేసేలా చర్యలు తీసుకోవాలని దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్‌కు స్పష్టం చేసింది. ఆ అకౌంట్‌ను అతనే నిర్వహించాలని చెప్పింది. మరోసారి ఇరు పక్షాల వాదనలు వినాలని సింగిల్ జడ్జిని ఆదేశిస్తూ.. నిధులపై అందులో తీర్పు మేరకు చర్యలు ఉంటాయని వ్యాఖ్యానించింది. దేవాదాయ అధికారులతో కుమ్మక్కై కొందరు లాల్‌దర్వాజ శ్రీసింహవాహిని మహంకాళి ఆలయ నిధుల దుర్వినియోగానికి పాల్పడుతున్నారంటూ భక్తుడు గోవింద్‌కుమార్ 2023 నవంబర్ 17న కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు. దీనిపై విచారణ జరిపిన అసిస్టెంట్ కమిషనర్.. నిధుల దుర్వినియోగం, అక్రమాలు జరుగుతున్నట్లు ఫిబ్రవరి 1న నివేదిక అందజేశారు. అయినా దీనికి కారకులైన వారిపై ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో గోవింద్ హైకోర్టును ఆశ్రయించి పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన సింగిల్ జడ్జి.. 'ఫిబ్రవరి 1న దేవాదాయ అసిస్టెంట్ కమిషనర్ ఇచ్చిన నివేదిక ప్రకారం అధికారులు చర్యలు చేపట్టాలి. లాల్‌దర్వాజా శ్రీసింహవాహిని మహంకాళి ఆలయ నిధులు దుర్వినియోగం కాకుండా కొత్త బ్యాంక్ అకౌంట్ తెరవాలి. జూలై 28, 29 తేదీల్లో జరిపే బోనాల పండగ సమయంలో సేకరించే నిధులు కొత్త అకౌంట్‌లో అధికారులు డిపాజిట్ చేసేలా చర్యలు చేపట్టాలి' అని ఈ నెల 12న ఆదేశాలు జారీ చేశారు. ఈ ఆదేశాలను కొట్టివేయాలని కోరుతూ సింహవాహిని మహంకాళి ఆలయ ట్రస్ట్ అప్పీల్ దాఖలు చేసింది. ఈ అప్పీల్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ జూకంటి ధర్మాసనం విచారణ చేపట్టింది. వాదనలు విన్న న్యాయమూర్తి.. ట్రస్ట్ వాదనలు వినకుండా తీర్పు ఇవ్వడంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ సింగిల్ జడ్జి ఆదేశాలను కొట్టివేసింది. మరోసారి విచారణ జరిపి ఇరుపక్షాల వాదనలు వినాలని సింగిల్ జడ్జిని ఆదేశించింది.

ప్రతిభ ఎవరి సొత్తు కాదు

- హైకోర్టు న్యాయమూర్తి సుధ

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ప్రతిభ ఎవరి సొత్తు కాదని విద్యార్థులు తాము ఎంచుకున్న రంగంలో నైపుణ్యతను సాధిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి సుధ అన్నారు. అంబేద్కర్ లా కాలేజీలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న మ్యూట్ కోర్టు పోటీల ముగింపు కార్యక్రమం జరిగింది. ఇందులో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి 16 బ్యాచీలు పాల్గొనగా పెండెకంటి లా కాలేజీ హైదరాబాద్‌కు ప్రథమ బహుమతి, అంబేద్కర్ లా కాలేజీ వైజాగ్‌కు ద్వితీయ బహుమతి లభించింది. విజేతలకు బహుమతులు అందజేసిన ఆమె మాట్లాడుతూ సాధారణ, పేద, మధ్య తరగతి ప్రజలకు సక్రమంగా న్యాయం అందేలా యువ న్యాయవాదులు కృషి చేయాలని సూచించారు. మ్యూట్ కోర్టుల ద్వారా విద్యార్థులకు కోర్టులో జరిగే కార్యక్రమాలపై అవగాహన పెరుగుతుందన్నారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీస్తుందని సూచించారు. కార్యక్రమంలో ఓయూ సీనియర్ ప్రొఫెసర్ జి.బి.రెడ్డి, యూనివర్సిటీ లా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రాధికాయాదవ్, సీనియర్ ప్రొఫెసర్ మహేంద్రకుమార్ బండారి, ప్రొఫెసర్ కె.వి.ఎస్.శర్మ, అంబేద్కర్ విద్యా సంస్థల కార్యదర్శి వివేక్‌వెంకటస్వామి, సహాయ కార్యదర్శి రమణ, డైరెక్టర్ రిషికాంత్, లా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సృజన తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ వర్సిటీలో డిగ్రీ, పీజీ ప్రవేశాలు

సాక్షి, సిటీబ్యూరో: బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో డిగ్రీ, పీజీ కోర్సులు, లైబ్రరీ సైన్స్‌లో డిగ్రీ, పీజీ, పలు సర్టిఫికెట్ కోర్సుల్లో 2024–25 విద్యా సంవత్సరానికి ప్రవేశాలు జరగనున్నాయి. ఆయా కోర్సుల్లో తెలంగాణలోని స్టడీ సెంటర్లలో చేరేందుకు విద్యార్హతలు, ఫీజు, కోర్సులు తదితర వివరాలను www.braouonline.in; www.braou.ac.inలో పొందొచ్చని అధికారులు వెల్లడించారు. ద్వితీయ, తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు కూడా ట్యూషన్ ఫీజును చెల్లించాలని, అంతకు ముందు చేరిన విద్యార్థులు సకాలంలో ఫీజు చెల్లించలేక పోయిన వారు కూడా ఆగస్టు 18 లోపు ట్యూషన్ ఫీజును ఆన్‌లైన్‌లో చెల్లించాలని తెలిపారు. సమాచారం కోసం 7382929570/580, 040–23680290/291/294/295 టోల్‌ఫ్రీ నెం.18005990101లో సంప్రదించాలని సూచించారు.

రెవెన్యూ శాఖలో పోస్టింగ్‌లు

సాక్షి, సిటీబ్యూరో: సాధారణ బదిలీల్లో భాగంగా వివిధ జిల్లాల నుంచి హైదరాబాద్‌కు వచ్చిన తహసీల్దార్లు, నాయబ్ తహసీల్దార్లు, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్లు, సీనియర్ అసిస్టెంట్లకు పోస్టింగ్ ఇస్తూ జిల్లా రెవెన్యూశాఖాధికారి శనివారం ఆదేశాలు జారీ చేశారు. 8 మంది తహసీల్దార్లు, 23 మంది నాయబ్ తహసీల్దార్లు, 13 మంది రెవెన్యూ ఇన్స్‌పెక్టర్లు, 36 మంది సీనియర్ అసిస్టెంట్లకు కలెక్టరేట్‌లోని వివిధ విభాగాలతో పాటు రెవెన్యూ డివిజన్, తహసీల్దార్ ఆఫీసుల్లో పోస్టింగ్‌లు కేటాయించారు.

మహిళా ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కమిటీ

సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్ఎంసీ స్వచ్ఛ భారత్ మిషన్(ఎస్‌బీఎం)లో పనిచేస్తున్న ఓ మహిళా ఉద్యోగినిని ప్రేమ పేరుతో, ఇతర మహిళలను ఇతర విధాలుగా వేధించిన ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి సోమభరత్ భాగోతం వెల్లడైన నేపథ్యంలో జీహెచ్ఎంసీలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగుల సమస్యల్ని గుర్తించేందుకు, వాటి పరిష్కారానికి కమిషనర్ ఆమ్రపాలి చర్యలు చేపట్టారు. ఇందుకుగాను ముగ్గురు మహిళా అధికారులతో కమిటీని ఏర్పాటు చేశారు. రెవెన్యూ, ఐటీ అడిషనల్ కమిషనర్ స్నేహ శబరీష్, పరిపాలన విభాగం అడిషనల్ కమిషనర్ జి.నళినీపద్మావతి, హెల్త్ విభాగం అడిషనల్ కమిషనర్ ఎస్.పంకజను కమిటీ సభ్యులుగా నియమించారు. దీంతోపాటు మరో రెండు కమిటీలను ఆమ్రపాలి నియమించారు. జోన్ల పరిధిలో హార్టికల్చర్, తదితర పనులు త్వరితంగా జరిగేందుకు ఎంపానెల్ కోసం తగిన అర్హతలున్న కాంట్రాక్టర్లు, ఆర్కిటెక్టులను ఎంపిక చేసేందుకు విధివిధానాల రూపకల్పనకు కమిటీని ఏర్పాటు చేశారు. ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్‌పాటిల్, యూబీడీ అడిషనల్ కమిషనర్ డా.ఎస్.సునందరాణి, చార్మినార్ జోనల్ కమిషనర్ టి.వెంకన్నను ఈ కమిటీ సభ్యులుగా నియమించారు. నగర వ్యాప్తంగా ఎక్కువకాలం మన్నికగా ఉండేలా సుందరీకరణ పనులు చేపట్టేందుకు, సదరు పనుల్ని జోన్ల వారీగా గుర్తించేందుకు ఖైరతాబాద్, కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్లు అనురాగ్‌జయంతి, అపూర్వ్ చౌహాన్, ఆర్.ఉపేందర్‌రెడ్డితో మరో కమిటీని నియమించారు.

30 నుంచి ఇంటింటి సర్వే

- జీఐఎస్ మ్యాపింగ్‌లో భాగంగా..
- ప్రజలు సహకరించాలని జీహెచ్ఎంసీ విజ్ఞప్తి

సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్ నగరంలో ఆస్తులు, యుటిలిటీల జీఐఎస్ మ్యాపింగ్ సర్వేలో భాగంగా ఇంటింటి సర్వే జూలై 30 నుంచి ప్రారంభం కానుంది. తొలుత ఉప్పల్, హయత్‌నగర్, హైదర్‌నగర్, కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీకాలనీ, మియాపూర్, చందానగర్ ప్రాంతాల్లో ఈ సర్వే జరగనుందని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి పేర్కొన్నారు. ఈ సర్వేలో భాగంగా శాటిలైట్ సర్వే పూర్తి కాగా, డ్రోన్ సర్వే జరుగుతోంది. మరోవైపు ఇంటింటి సర్వే చేపట్టనున్నారు. ప్రజలకు మెరుగైన సేవలు, వనరుల నిర్వహణ కోసం జీహెచ్ఎంసీ చేపట్టిన ఈ సర్వేకు ఇళ్లలో నివసిస్తున్నవారు, యజమానులు సహకరించాల్సిందిగా కోరారు. సర్వే సిబ్బంది కోరిన సమాచారాన్ని తెలియజేయాలన్నారు. పట్టణ నిర్వహణ, అభివృద్ధి పనుల కోసం తప్ప ఈ సర్వేను ఇతరత్రా వినియోగించబోమని, సర్వే వివరాలు అత్యంత గోప్యంగా ఉంటాయని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్ట్ వల్ల అన్ని ఆస్తులు, యుటిలిటీల వివరాలు కచ్చితంగా మ్యాపింగ్ చేయడం వల్ల భౌగోళికంగా గుర్తించడం సులభమవుతుందని, సమాచారం పారదర్శకంగా ఉంటుందని తెలిపారు. ఆస్తిపన్నుకు సంబంధించి ప్రజల సమస్యల పరిష్కారంలోనూ ఇది ఉపకరిస్తుందని, ఆన్‌లైన్ చెల్లింపులు మరింత సులభం కాగలవని పేర్కొన్నారు. హై రిజల్యూషన్ మ్యాపింగ్ వల్ల రోడ్లు, పార్కులతో పాటు ఇతరత్రా సదుపాయాల వివరాలు స్పష్టంగా తెలుస్తాయని పేర్కొన్నారు.

- ఇంటింటికీ సర్వే కోసం వచ్చే సిబ్బందికి దిగువ సమాచారం అందించి సహకరించాలని కోరారు.
- భవన నిర్మాణ అనుమతి వివరాలు
- చివరిసారి చెల్లించిన ఆస్తిపన్ను రసీదు
- నల్లా బిల్లు
- విద్యుత్ బిల్లు
- యజమాని ఐడీ వివరాలు
- ట్రేడ్ లైసెన్స్ నంబర్ (కమర్షియల్ భవనాలకు)

ఇండిగో ఎయిర్‌లైన్స్‌కు వాత

రూ.80 వేలు చెల్లించాలని వినియోగదారుల కమిషన్ ఆదేశం

సిటీ కోర్టులు: ప్రయాణికుడి లగేజీని అందించడానికి 17 రోజుల సమయం తీసుకున్న ఇండిగో ఎయిర్‌లైన్స్ తీరును హైదరాబాద్ జిల్లా వినియోగదారుల కమిషన్ తప్పుబట్టింది. ఎయిర్‌లైన్స్ సిబ్బంది పూర్తి బాధ్యతారాహిత్యంగా వ్యవహరించారని స్పష్టం చేసింది. 17 రోజులపాటు ప్రయాణికుడు పడిన వేదన, సౌకర్యానికి పరిహారం చెల్లించాల్సిందేనని తేల్చిచెప్పింది. లగేజీ లేకపోవడంతో కొనుగోలు చేసిన వస్తువులకు రూ.50 వేలు, పరిహారంతో పాటు కోర్టు ఖర్చులకు మరో రూ.30 వేలు చెల్లించాలని ఆదేశించింది. ఈ మేరకు హైదరాబాద్–1 కమిషన్ అధ్యక్షులు బి.ఉమా వెంకట సుబ్బలక్ష్మి, సభ్యులు సి.లక్ష్మీ ప్రసన్న, డి.మాధవీలతతో కూడిన బెంచ్ ఇటీవల తీర్పునిచ్చింది.

వివరాల్లోకి వెళ్తే..

నగరంలోని బంజారాహిల్స్ ప్రాంతానికి చెందిన సయ్యద్ జావేద్ అఖ్తర్ జైది.. ఇండిగో ఎయిర్‌లైన్స్‌లో గతేడాది జూన్ 27న జెద్దా నుంచి హైదరాబాద్‌కు ప్రయాణించారు. తన బ్యాగులను చెకిన్ లగేజీలో వేశారు. అయితే విమానం హైదరాబాద్ చేరినా అందులో ఆయన బ్యాగులు కనిపించలేదు. దీంతో ఇండిగో నిర్వాహకులకు ఫిర్యాదు చేయగా 12 గంటల్లో బ్యాగులను అందిస్తామని హామీ ఇచ్చింది. అయితే 12 గంటలు కాదు కదా.. 24 గంటలు గడిచినా ఆ బ్యాగులను అందించలేదు. ఆ బ్యాగులను 17 రోజులు తర్వాత వారికి అందజేసింది. నిత్యం వాడుకునే అన్ని వస్తువులు ఆ బ్యాగుల్లో ఉండటంతో అఖ్తర్ జైది తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. అవసరమైన వస్తువులను తిరిగి కొనుగోలు చేయాల్సి వచ్చింది. ఇండిగో ఎయిర్‌లైన్స్ సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా తన లగేజీ అందించడానికి 17 రోజుల సమయం పట్టిందంటూ ఆయన వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించారు. ఈ మేరకు విచారణ చేపట్టిన కమిషన్ బాధితుడికి పరిహారం చెల్లించాలంటూ తీర్పు ఇచ్చింది.

స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల వేతన బకాయిలు చెల్లించండి

లక్డీకాపూల్: రాష్ట్రంలో స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు చేసిన పనులకు సంబంధించిన బిల్లులతో పాటు గౌరవ వేతన బకాయిలను వెంటనే చెల్లించాలని తెలంగాణ పంచాయతీరాజ్ చాంబర్ అధ్యక్షుడు చింపుల సత్యనారాయణరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ ఏడాది ఫిబ్రవరి, జూలై మాసాల్లోనే పంచాయతీ, మండల పరిషత్, జిల్లా పరిషత్‌లకు పదవీ కాలం ముగిసిందన్నారు. ఇప్పటికైనా బకాయిలను తక్షణమే చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాల్సిందిగా కోరుతూ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్కకు వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ విషయంలో చొరవ తీసుకోవాలని మంత్రి సీతక్కను కోరినట్లు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో చాంబర్ ప్రధాన కార్యదర్శి బాదేపల్లి సిద్దార్థ, కార్యదర్శి మందిపాల్ వెంకట్, సలహాదారు పప్పుస్కూరు అశోక్‌రావు తదితరులు ఉన్నారు.

గ్రీన్ ఆఫీసులు!



హైదరాబాద్‌లో 63% కార్యాలయాలు హరిత భవనాలే

- గ్రేడ్-ఏ ఆఫీసు స్పేస్‌లకు ఎల్‌ఈఈడీ, ఐజీబీసీ గుర్తింపులు
- దేశంలోనే రెండో స్థానంలో నగరం
- నగరంలో 9.59 కోట్ల చ.అ.ల్లో గ్రీన్ ఆఫీస్ స్పేస్‌లు
- ఈ భవనాల్లో ఇంధన వినియోగం, నిర్వహణ వ్యయం తక్కువ

సాక్షి, హైదరాబాద్: మన దేశంలో కాలుష్య కారకాలను విడుదల చేసే రంగాల్లో రియల్ ఎస్టేట్ రెండో స్థానంలో ఉంది. శిలాజ ఇంధనాల దహనం, సీఓ2, వేడి వంటి 39 శాతం కర్బన ఉద్గారాలు స్థిరాస్తి రంగం నుంచే విడుదలవుతున్నాయి. ఈ నేపథ్యంలో పర్యావరణ అనుకూలమైన భవన నిర్మాణాలు అనివార్యమైన పరిస్థితి ఏర్పడింది. 2070 నాటికి నెట్ జీరో ఉద్గారాలను సాధించాలనే కేంద్రం లక్ష్యాన్ని చేరుకోవాలంటే పర్యావరణ అనుకూలమైన హరిత భవనాలు అత్యంత కీలక పాత్ర పోషిస్తాయి.

- లీడర్‌షిప్ ఎనర్జీ అండ్ ఎన్విరాన్‌మెంటల్ డిజైన్ (ఎల్‌ఈఈడీ), ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ (ఐజీబీసీ) ధృవీకరణ పొందిన భవనాలను పర్యావరణ అనుకూలమైన హరిత భవనాలుగా పరిగణిస్తారు. ప్రస్తుతం దేశంలోని ఏడు ప్రధాన నగరాల్లో 88.85 కోట్ల చదరపు అడుగులు (చ.అ.)లలో 1,362 గ్రేడ్-ఏ కార్యాలయ భవనాలు ఉన్నాయి. ఇందులో 65 శాతం అంటే 57.77 కోట్ల చ.అ.లలో 805 భవనాలు గ్రీన్ సర్టిఫికేషన్ పొందినవేనని వెస్టియన్ తాజా అధ్యయనం వెల్లడించింది.

‘గ్రీన్’ ఖరీదైనవే..

గ్రీన్ సర్టిఫికెట్ పొందిన భవనాల్లో 47 శాతం భవనాలు 5 లక్షల చ.అ. విస్తీర్ణం లోపు ఉన్నవే. ఇక, 19 శాతం 10 లక్షల చ.అ. కంటే ఎక్కువ విస్తీర్ణం ఉన్న భవనాలున్నాయి. లక్ష చ.అ. కంటే తక్కువ విస్తీర్ణం ఉన్న కార్యాలయ భవనాలకు గ్రీన్ సర్టిఫికెట్ చాలా తక్కువ. ఎందుకంటే ఈ తరహా నిర్మాణాలు చిన్న, మధ్య తరహా డెవలపర్లు నిర్మిస్తుండటంతో స్థిరత్వ పద్ధతులకు తక్కువ ప్రాధాన్యత ఇస్తుంటారు. గ్రీన్ సర్టిఫైడ్ పొందిన భవనాల అద్దెలు ఖరీదైనవే. సాధారణ కార్యాలయాలతో పోలిస్తే వీటిల్లో అద్దె సగటున 12–14 శాతం ప్రీమియంగా ఉంటాయి.

రెండో స్థానంలో హైదరాబాద్..

గ్రేడ్-ఏ గ్రీన్ ఆఫీస్ స్పేస్‌లలో దేశంలోనే హైదరాబాద్ రెండో స్థానంలో ఉంది. అత్యధికంగా బెంగళూరులో 17.2 కోట్ల చ.అ.ల్లో హరిత కార్యాలయాలు ఉన్నాయి. భాగ్యనగరంలో 15.29 కోట్ల చ.అ.ల్లో గ్రేడ్-ఏ ఆఫీస్ స్పేస్ ఉండగా.. ఇందులో 63 శాతం అంటే 9.59 కోట్ల చ.అ.ల్లో గ్రీన్ స్పేస్ ఆఫీసులే ఉన్నాయి. గ్లోబల్ కంపెనీలు, బహుళ జాతి సంస్థలు మన దేశంలో కార్యాలయాల స్థాపనకు, పెట్టుబడులకు ఆసక్తి చూపిస్తున్న నేపథ్యంలో దేశీయ డెవలపర్లు అంతర్జాతీయ హరిత ప్రమాణాలకు అనుగుణమైన భవనాలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు.

గ్రేడ్-ఏ ఆఫీసులకు డిమాండ్



బహుళ జాతి ఐటీ కంపెనీల నుంచి గ్రేడ్-ఏ ఆఫీసులకు డిమాండ్ ఎక్కువగా ఉంది. డబుల్ హైట్ సీలింగ్, ప్రీమియం ఫినిషింగ్, నాణ్యమైన సౌకర్యాలు, తగినంత పార్కింగ్ స్పేస్, ధారాళమైన వెంటిలేషన్ వంటి కారణంగా గ్రీన్ ఆఫీస్ బిల్డింగ్‌లకు ఆదరణ పెరుగుతోంది.

– ప్రశాంత్ రావు,
డైరెక్టర్, పౌలోమీ ఎస్టేట్స్

అత్యధికంగా 23–25 శాతం అధిక ధరలతో బెంగళూరు తొలి స్థానంలో ఉండగా.. ఆ తర్వాత హైదరాబాద్‌లో 13–15 శాతం, చెన్నైలో 12–14 శాతం, ముంబైలో 10–12 శాతం, పుణేలో 8–10 శాతం, ఎన్‌సీఆర్‌లో 6–8 శాతం, కోల్‌కతాలో 3–4 శాతం ప్రీమియం ధరలుంటాయి.

ప్రయోజనాలివీ:

- సాధారణ భవనాలతో పోలిస్తే గ్రేడ్-ఏ కార్యాలయాలకు నిర్వహణ వ్యయం తక్కువ అవడమే కాకుండా నీరు, విద్యుత్ ఆదా అవుతుంది.
- భవనం లోపలికి స్వచ్ఛమైన గాలి, సూర్యరశ్మి ప్రసరణతో ఆరోగ్యకరమైన వాతావరణంలో ఉద్యోగులు పని చేసుకునే వీలుంటుంది. దీంతో ఉత్పాదకత పెరుగుతుంది.
- భవనాల నుంచి కర్బన ఉద్గారాల విడుదల తగ్గుతుంది. హరిత భవనాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి రాయితీలు అందుతాయి.
- పర్యావరణ స్పృహ, బాధ్యతతో కంపెనీలకు సామాజిక గుర్తింపుతో పాటు బ్రాండ్ ఇమేజ్ పెరుగుతుంది.
- గ్రీన్ బిల్డింగ్‌లలో ఆక్యుపెన్సీ ఎక్కువగా ఉంటుంది. అలాగే సాధారణ ఆఫీసులతో పోలిస్తే హరిత భవనాల యజమానులకు అధిక అద్దెలు వస్తాయి. అలాగే దీర్ఘకాలంలో భవనాల విలువలు మరింత పెరుగుతాయి.

నగరాల వారీగా గ్రేడ్-ఏ ఆఫీసు స్పేస్‌లు (చ.అ. కోట్లలో)

నగరం	మొత్తం ఆఫీసు స్పేస్	గ్రేడ్-ఏ ఆఫీసు స్పేస్	శాతం
బెంగళూరు	27.02	17.2	64
హైదరాబాద్	15.29	9.59	63
ముంబై	14.79	9.04	61
ఎన్‌సీఆర్	12.97	9.02	70
చెన్నై	8.26	6.83	83
పుణే	7.78	4.38	56
కోల్‌కత్తా	2.74	1.69	62

రియల్టీకి బడ్జెట్ దన్ను!



సాక్షి, హైదరాబాద్: ప్రతికూల పరిస్థితుల్లో ఉన్న హైదరాబాద్ రియల్ ఎస్టేట్ రంగానికి రాష్ట్ర బడ్జెట్ దన్నుగా నిలిచిందని భారత స్థిరాస్తి డెవలపర్ల సమాఖ్య (క్రెడాయ్) హైదరాబాద్ అభిప్రాయపడింది. నగరాభివృద్ధి కోసం ప్రభుత్వం దూరదృష్టితో బడ్జెట్‌ను కేటాయించిందని క్రెడాయ్ ప్రతినిధులు తెలిపారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి హైదరాబాద్‌లో మౌలిక సదుపాయాల కల్పనకు, మెట్రో, మూసీ వంటి కీలక ప్రాజెక్ట్‌ల అభివృద్ధి కోసం రూ.10 వేల కోట్లు కేటాయించడం హర్షించదగ్గ పరిణామం అని కొనియాడారు. రీజినల్ రింగ్ రోడ్డు వరకు హైదరాబాద్ విస్తరణతో స్థిరాస్తి రంగానికి కొత్త అవకాశాలకు ఆస్కారం ఏర్పడిందని పేర్కొన్నారు.

బ్రాండ్ హైదరాబాద్..



హైదరాబాద్‌ను ప్రగతిశీల పట్టణ కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని ఈ బడ్జెట్ కేటాయింపులే స్పష్టం చేస్తున్నాయి. ట్రిబుల్ ఆర్ నిర్మాణానికి రూ.1,525 కోట్లను కేటాయించడంతో కనెక్టివిటీ మరింత మెరుగవుతుంది. దీంతో ప్రధాన నగరంలో ట్రాఫిక్ రద్దీ గణనీయంగా తగ్గుతుంది. మూసీ సుందరీకరణ కోసం రూ.1,500 కోట్ల కేటాయింపులతో పర్యావరణ సుస్థిరత సాధ్యమవుతుంది. అలాగే మూసీ చుట్టూ పర్యాటక రంగం అభివృద్ధి, వాణిజ్య సముదాయాలతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఏర్పడతాయి. స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటుతో యువతలో నైపుణ్యం పెరుగుతుంది. దీంతో బ్రాండ్ హైదరాబాద్ విస్తృతమవుతుంది.

– వీ రాజశేఖర్‌రెడ్డి,
ప్రెసిడెంట్, క్రెడాయ్ హైదరాబాద్

మెరుగైన ప్రజా రవాణా..



నగరంలో మౌలిక సదుపాయాలకు ప్రభుత్వం పెద్ద పీట వేసింది. కొత్త మార్గాలలో మెట్రో, ఎంఎంటీఎస్‌లకు బడ్జెట్ కేటాయింపులతో ప్రజా రవాణా మెరుగవుతుంది. కంటోన్మెంట్‌లో రోడ్ల విస్తరణ, ఎలివేటెడ్ కారిడార్‌ల కోసం భూ బదిలీ వంటి వాటితో నగర ఉత్తర ప్రాంతాలలో కనెక్టివిటీ పెరుగుతుంది. దీంతో స్థిరాస్తి అభివృద్ధికి అవకాశాలు ఏర్పడతాయి. పర్యావరణహితమైన నగరాభివృద్ధి కోసం ప్రభుత్వం కట్టుబడి ఉంది. ఇందులో భాగంగానే వంద ఎలక్ట్రిక్ చార్జింగ్ స్టేషన్ల ఏర్పాటు, టీజీఈవీ మొబైల్ యాప్ వంటివి ఇందుకు ఉదాహరణ.

– జగన్నాథరావు,
సెక్రటరీ, క్రెడాయ్ హైదరాబాద్

నగరంలో జీసీసీ జోష్!

- 34.6 లక్షల చ.అ. ఆఫీసు స్పేస్ లావాదేవీలు
- ఇందులో 49% వాటా ఐటీ రంగానిదే
- నైట్‌ఫ్రాంక్ ఇండియా, 3ఏఐ సంయుక్త నివేదిక వెల్లడి

సాక్షి, హైదరాబాద్: దేశంలో గతేడాది 1.96 కోట్ల చ.అ.లుగా ఉన్న గ్లోబల్ కెపబులిటీ సెంటర్ల (జీసీసీ) ఆఫీసు లావాదేవీలు 2027 నాటికి 2.6 కోట్ల చ.అ.లకు చేరనున్నాయి. 2018లో 1.69 కోట్ల చ.అ.లుగా ఉండగా.. 16 % వృద్ధిని నమోదైంది. ఎనిమిది ప్రధాన నగరాల్లో జీసీసీల 6,667 ఆఫీసు ఒప్పందాలు పూర్తయ్యాయని నైట్‌ఫ్రాంక్ ఇండియా, 3ఏఐ సంయుక్త నివేదిక వెల్లడించింది.

- ప్రపంచవ్యాప్తంగా ప్రతిభ, వనరులు, నైపుణ్యాన్ని వినియోగించుకొని బహుళ జాతి సంస్థలు ఏర్పాటు చేసే కేంద్రాలను గ్లోబల్ కెపాబులిటీ సెంటర్లు అంటారు. సాధారణంగా జీసీసీలు బడా కంపెనీలకు పరిశోధన మరియు అభివృద్ధి (ఆర్ అండ్ డీ), ఐటీ, అవుట్ సోర్సింగ్, ఇంజనీరింగ్ వంటి సేవలను అందిస్తుంటాయి. దేశంలోని మొత్తం జీసీసీ ఆఫీసు లావాదేవీల్లో ఎక్కువగా హైదరాబాద్‌లోనే జరిగాయి. నగరంలో 34.6 లక్షల చ.అ. లావాదేవీలు పూర్తయ్యాయి. ఇందులో ఐటీ, ఐటీఈఎస్ రంగాల వాటానే 49 శాతం కంటే ఎక్కువగా ఉంది. నగరంలో 2018–23 మధ్య 713 జీసీసీ ఆఫీసు స్పేస్ డీల్స్ జరిగాయి. వీటిల్లో అత్యధికంగా 509 ఒప్పందాలు 50 వేల చ.అ. లోపు ఉన్న ఆఫీసు స్థలాలే. 112 డీల్స్ 50 వేల నుంచి లక్ష చ.అ. మధ్య ఉండగా.. 92 ఒప్పందాలు లక్ష చ.అ. కంటే విస్తీర్ణమైన ఆఫీసు స్పేస్‌లున్నాయి. రంగాల వారీగా చూస్తే.. బీఎఫ్ఎస్ఐ 26%, కన్సల్టింట్ 15%, హెల్త్‌కేర్ 10%, ఇతర రంగాల వాటా 7%గా ఉన్నాయి.

విలాసవంతం!

- ముంబైలో ఖరీదైన ప్రాపర్టీల విక్రయాలు
- రూ.12,300 కోట్ల అల్ట్రా లగ్జరీ యూనిట్లు సేల్

సాక్షి, హైదరాబాద్: దేశ ఆర్థిక రాజధాని ముంబై ఖరీదైన స్థిరాస్తి విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. సంపన్న వర్గాలకు కేరాఫ్ అడ్రస్ అయిన ముంబైలో రూ.10 కోట్లు, అంతకంటే ఎక్కువ ధర ఉన్న అల్ట్రా లగ్జరీ గృహాలు అత్యధికంగా విక్రయమయ్యాయి. ఈ ఏడాది తొలి ఆరు నెలల్లో (హెచ్1) రూ.12,300 కోట్లు విలువ చేసే అల్ట్రా లగ్జరీ యూనిట్లు అమ్ముడుపోయాయి. గతేడాది హెచ్1లోని రూ.11,400 కోట్లతో పోలిస్తే 8 శాతం మేర పెరిగాయని ఇండియా సోత్‌బైస్ ఇంటర్నేషనల్ రియాల్టీ నివేదిక వెల్లడించింది.

- 80 శాతం అల్ట్రా లగ్జరీ విక్రయాలు గోరెగావ్ ఈస్ట్, వర్లీ, మహాలక్ష్మి, ప్రభాదేవి, ముంబై సెంట్రల్, మలబార్ హిల్, బాంద్రా వెస్ట్, లోయర్ పరేల్, టార్డియో, బైకుల్లా ప్రాంతాల్లోనే జరిగాయి. ముంబైలో గత 12 నెలల్లో 1,040 లగ్జరీ యూనిట్లు అమ్ముడుపోయాయి. వీటిని ఎక్కువగా 35–55 ఏళ్ల మధ్య వయస్సున్న వారే కొనుగోలు చేయడం గమనార్హం. అత్యధికంగా 2 వేల నుంచి 4 వేల చ.అ. మధ్య విస్తీర్ణం ఉన్న గృహాలు విక్రయమయ్యాయి.
- ఈ ఏడాది హెచ్1లో పాలిస్టర్ లిమిటెడ్ చైర్మన్ అనిల్ గుప్తా మలబార్ హిల్‌లోని లోధా మలబార్‌లో రూ.270 కోట్లతో అపార్ట్‌మెంట్‌ను కొన్నారు. ఇదే ప్రాంతంలో రాక్‌సైడ్ అపార్ట్‌మెంట్‌లో రూ.156.5 కోట్లతో రేఖా జున్‌జున్‌వాలా, వర్లీలో ఒబెరాయ్ 360 వెస్ట్‌లో రూ.116.4 కోట్లతో వ్రాతిక గుప్తా, జుహులో రూ. గిర్ధర్ లాల్ బావ్రీ రూ.101 కోట్లతో జీ+1 బంగ్లా కొనుగోలు చేశారు.



యుద్ధం చూద్దాం...

25 ఏళ్ల కార్గిల్

కార్గిల్ వార్‌లో భారత పతాకం విజయగర్వంతో నిలబడి 25 ఏళ్లు. వీరులు శూరులై ప్రాణాలను చిరునవ్వుతో త్యాగం చేసి ఎందరో సైనికులు అమరులైతే మనకా విజయం సిద్ధించింది. వారి కథలు గాథలు తలుచుకోవాల్సిన సమయం ఇది. అందుకై 'రజత్ జయంతి వర్ష్' పేరుతో ఉత్సవాలు సాగుతున్నాయి. ఆ యుద్ధ సమయపు తెగువను బాలీవుడ్ గొప్పగా చూపించింది. ఆ సినిమాలను పిల్లలకు చూపించాలి ఈ వీకెండ్.

పాతికేళ్లంటే కనీసం మూడుతరాలు వచ్చి ఉంటాయి. దేశం దాటిన క్లిష్ట పరిస్థితులు ఏ తరానికి ఆ తరం స్ఫూర్తిదాయకంగా అందిస్తూ ఉండాలి. అప్పుడే ఆ స్ఫూర్తిని కొత్తతరం అందిపుచ్చుకుంటూ ఉంటుంది. అనూహ్యంగా మన ప్రాంతంలో చొరబడి వాస్తవాధీన రేఖ దగ్గర 1999లో టైగర్ హిల్‌ను ఆక్రమించింది పాకిస్తాన్. వారిని వెనక్కు తరిమి కొట్టడానికి భారత సైన్యం రంగంలో దిగింది. మే 2 నుంచి జూలై 26 వరకు అంటే రెండు నెలల మూడు వారాల రెండు రోజుల పాటు ఈ యుద్ధం సాగింది. ఆక్రమిత ప్రాంతం కొండ కావడంతో పై నుంచి శత్రువులు సులభంగా దాడి చేసే పరిస్థితి ఉండటంతో ఈ యుద్ధం ఒక సవాలుగా మారింది. అయినా సరే మన ఆర్మీ, ఎయిర్ ఫోర్స్ కలిసి విజయం సాధించాయి. తర్వాతి కాలంలో ఈ యుద్ధ నేపథ్యంలో ఎంతో సాహిత్యం, పుస్తకాలు, సినిమాలు వచ్చాయి. వాటిలో బాలీవుడ్ నుంచి వచ్చిన ముఖ్యమైన సినిమాలు ఇవి... 1) లక్ష్య 2) షేర్ షా 3) ఎల్‌ఓసి కార్గిల్ 4) గుంజన్‌సక్సేనా 5. ధూప్.

1. లక్ష్య (2004)

లక్ష్య రహితమైన ఒక యువకుడు కార్గిల్ యుద్ధంలో దేశానికి సేవ చేయడమే తన లక్ష్యం అని గ్రహించడమే 'లక్ష్య'. హృతిక్ రోషన్ నటించిన ఈ సినిమాలో అమితాబ్, బొమన్ ఇరాని, ఓం పురి వంటి ఉద్దండులు నటించారు. పెద్దగా బాధ్యత పట్టని హృతిక్ రోషన్ తన స్నేహితుడు రాస్తున్నాడని డిఫెన్స్ సర్వీస్ అకాడెమీ పరీక్షలు రాసి ఇండియన్ మిలటరీ అకాడెమీలో సీట్ తెచ్చుకుంటాడు. కాని ట్రయినింగ్ అతని వల్ల కాదు. పారిపోయి వస్తాడు. అయితే అందరూ అతణ్ణి తక్కువ దృష్టితో చూసే సరికి ఈసారి పట్టుదలగా వెళ్లి ట్రయినింగ్ పూర్తి చేసి పంజాబ్ బెటాలియన్‌కు ఎంపికవుతాడు. అదే సమయంలో కార్గిల్ యుద్ధం మొదలవుతుంది. ఆ యుద్ధంలో 1000 అడుగుల కొండ మొనపై ఉన్న పాకిస్తాన్ యూనిట్‌ను కడతేర్చడానికి భారత సైన్యం నుంచి బయలుదేరిన 12 మందిలో హృతిక్ కూడా ఒకడు. వీరిలో ఆరుగురు మరణించినా పాకిస్తాన్ యూనిట్‌ను ధ్వంసం చేసి విజయం సాధిస్తారు. ఫర్హాన్ అక్తర్ దర్శకత్వం వహించిన ఈ సినిమా విడుదల సమయంలో ఆదరణ పొందకపోయినా తర్వాత కల్ట్ క్లాసిక్‌గా నిలిచింది. చాలా మంది కుర్రాళ్లను సైన్యంలో చేరేందుకు ఈ సినిమా ప్రేరేపించింది.

2. షేర్‌షా (2021)

'యుద్ధానికి వెళుతున్నాను. మన దేశపతాకాన్ని ఎగరేసి వస్తాను లేదా అందులో చుట్టబడైనా వస్తాను' అని చెప్పిన ఆర్మీ ఆఫీసర్ విక్రమ్ బాత్ర బయోపిక్ షేర్‌షా. కార్గిల్ యుద్ధంలో ఊరికే అరాకొరా శత్రువులను నేల రాల్చడం తన తత్వం కాదని 'ఏ దిల్ మాంగే మోర్' తన నినాదమని అందరు శత్రువులను నామరూపాల్లేకుండా చేస్తానని చెప్పిన విక్రమ్ బాత్ర అలాగే చేసి మన పతాకం ఎగురవేసి ప్రాణాలు కోల్పోయాడు. సిద్దార్థ్ మల్హోత్ర, కియారా అద్వానీ నటించిన ఈ సినిమా కోవిడ్ కారణంగా అమెజాన్‌లో స్ట్రీమ్ అయ్యింది. తమ ప్లాట్‌ఫామ్ మీద అత్యధికులు వీక్షించిన సినిమా షేర్‌షా అని అమెజాన్ తెలిపింది. తుపాకీ గుళ్ల మరఫిరంగుల ఫీంకారాలు మాత్రమే వినపడే యుద్ధ రంగంలో సైనికుల మానసిక స్థితి, వారు ప్రదర్శించే స్థయిర్యం ఎలా ఉంటుందో ఈ సినిమాలో చూడాలి. కార్గిల్ వీరునికి గొప్ప నివాళి ఈ సినిమా.

3.ఎల్‌ఓసి కార్గిల్ (2003)


1997లో 'బోర్డర్' వంటి సూపర్‌హిట్ తీసిన జె.పి.దత్తా కార్గిల్‌వార్ మీద తీసిన 4 గంటల 15 నిమిషాల సుదీర్ఘమైన సినిమా ఎల్‌ఓసి కార్గిల్. వాస్తవాధీన రేఖను దాటి పాకిస్తాన్ సైన్యం కార్గిల్‌లో తిష్ట వేశాక వివిధ దళాలు ఎన్ని విధాలుగా కార్యరంగంలో దిగుతాయి సైనిక తంత్రాలు ఎలా ఉంటాయి ఆఫీసర్లకు వారి దళాలకు సమన్వయం ఎలా ఉంటుందో ఇవన్నీ దాదాపుగా తెలియాలంటే ఈ సినిమా తీయాలి. నిడివి రీత్యా ప్రేక్షకులు ఈ సినిమాను చూడలేకపోయినా దర్శకుడు పట్టుబట్టి అలాగే ఉంచేశాడు. సంజయ్ దత్, అజయ్ దేవగణ్, సన్నీ డియోల్, సునీల్ శెట్టి, అభిషేక్ బచ్చన్ వంటి భారీ తారాగణం ఈ సినిమాలో ఉంది.

4. గుంజన్ సక్సేనా (2020)

'కార్గిల్ గర్ల్'గా ఖ్యాతి గడించిన ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ హెలికాప్టర్ పైలట్ గుంజన్ సక్సేనా బయోపిక్ ఇది. ఉత్తర్‌ప్రదేశ్‌లో జన్మించిన గుంజన్ పైలట్ కావాలని కలలు కంది. ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ అమ్మాయిలకు అప్పుడే ప్రవేశం కల్పించినా ట్రయినింగ్ సమయంలో ఆ మగవాళ్ల ప్రపంచంలో సవాళ్లు ఎదుర్కొంది గుంజన్. 1996లో భారతదేశ తొలి ఎయిర్‌ఫోర్స్ మహిళా పైలట్లలో ఒకరైన గుంజన్ 1999లో కార్గిల్‌లో చురుకైన పాత్ర పోషించింది. యుద్ధ సమయంలో గాయపడిన వారిని బేస్ క్యాంప్‌కు తరలించి వైద్యం అందించడంలో లెక్కకు మించి చక్కర్లు కొట్టింది. మిస్సయిల్స్‌కు అందితే ప్రాణాలు చెల్లాచెదురవుతాయని తెలిసినా ఆమె సాహసం కొనసాగింది. జాన్వీ కపూర్ నటించిన ఈ సినిమా అమ్మాయిలకు సమాన అవకాశాలు అన్నింటా కావాలని చెబుతుంది.

5. ధూప్ (2003)

యుద్ధంలో బలిదానం ఇచ్చిన వీరులను శ్లాఘించడం సరే నిజ జీవితంలో వారి కుటుంబం ఎటువంటి గౌరవాన్ని పొందుతోంది అని ప్రశ్నించే సినిమా ధూప్. కార్గిల్ యుద్ధంలో మరణించిన కెప్టెన్ అనుజ్ నయ్యర్ కుటుంబం ఎదుర్కొన్న పరిస్థితులను ఆధారం చేసుకుని ఈ సినిమా తీశారు. అనుజ్ మరణించాక ప్రభుత్వం వారికి ఒక పెట్రోల్ బంక్ కేటాయిస్తుంది. కుటుంబ సభ్యులు ఇందుకు మొదట నిరాకరించినా కొడుకు స్మృతిని నిలబెట్టడానికి



ఇదొక మార్గమని భావించి అందుకు అంగీకరిస్తుంది. అయితే అక్కడి నుంచే కథ మొదలవుతుంది. ప్రభుత్వం కేటాయించిన పెట్రోల్ బంక్ వాస్తవ రూపం దాల్చాలంటే ఎన్ని లంచాలు, ఎన్ని అడ్డంకులు, ఎన్ని అవమానాలు ఎదురవుతాయో ఈ సినిమా చూపిస్తుంది. చివరకు కుటుంబం పెట్రోల్ బంక్ సాధించి దానికి 'కార్గిల్ హైట్స్' అని పేరు పెడుతుంది. అమరుల రుణం తీర్చుకునే దారిలో ప్రభుత్వం, పౌరులు మరింత బాధ్యతతో వ్యవహరించాలని చెప్పే చిత్రం ఇది. ఓంపురి,రేవతి తారాగణం.



"సియాచిన్ మాది" అంటోంది పాకిస్థాన్. "కాదు, మాది" అంటోంది భారత్. ప్రపంచంలోనే అతి ఎత్తైయిన ఈ యుద్ధక్షేత్రంలో రెండు దేశాల సైన్యాలు దశాబ్దాలుగా ఘర్షణ పడుతూనే ఉన్నాయి. భారత్ నలభై ఏళ్ల క్రితమే 'ఆపరేషన్ మేఘదూత్' పేరుతో సైనిక చర్య జరిపి సియాచిన్‌పై నియంత్రణ సాధించినా.. పాక్ తన పట్టు వీడటం లేదు. ఈ పరిస్థితిని "చక్కబరచటానికి" భారత సైన్యం ఇటీవలే సియాచిన్ డ్యూటీకి ప్రత్యేకంగా ఒక ఆర్మీ ఆఫీసర్‌ను పంపింది. ఆ ఆఫీసరే.. సుప్రీత. కెప్టెన్ సుప్రీత. సియాచిన్‌పైకి వెళ్లిన తొలి మహిళా సేనాని!

సియాచిన్ పైకి మహిళా సేనాని!

భారత సైన్యంలో 40 విభాగాలు ఉంటాయి. 14 ప్రధాన ఉప-విభాగాలు ఉంటాయి. ఈ ఉప విభాగాలను 'కోర్స్' అంటారు. వాటిల్లో ఒకటి 'కోర్స్ ఆఫ్ ఆర్మీ ఎయిర్ డిఫెన్స్'. అందులో సైనికాధికారిగా విధులు నిర్వర్తిస్తుంటారు కెప్టెన్ సుప్రీత.

సముద్ర మట్టానికి 18,875 అడుగుల ఎత్తున, హిమాలయాల్లోని తూర్పు కారకోరం పర్వత శ్రేణుల్లో ఉంటుంది సియాచిన్ గ్లేసియర్. నది గడ్డ కట్టినట్లుగా ఉండే ఆ ప్రాంతంలో కెప్టెన్ సుప్రీతకు డ్యూటీ పడింది! ఈ నెల 18నే.. వెళ్లి చేరారు. సియాచిన్ గ్లేసియర్‌లో విధులు నిర్వర్తిస్తున్న తొలి ఉమన్ ఆర్మీ ఎయిర్ డిఫెన్స్ ఆఫీసర్‌గా రికార్డు సృష్టించారు.

ఈ ఏడాది గణతంత్ర వేడుకల్లో.. ఒక అరుదైన విషయం అందరి దృష్టినీ ఆకర్షించింది. కొత్తగా పెళ్లయిన ఒక యువ జంటలో – భర్త ఒక సైనిక దళానికి, భార్య మరొక దళానికి నేతృత్వం వహించారు! భర్తది తమిళనాడు. భార్యది కర్ణాటక. అనుకోకుండా ఇద్దరికీ ఢిల్లీ వేడుకల్లో దళాలను పరేడ్ చేయించే అవకాశం వచ్చింది. ఆ భర్త.. మేజర్ జెర్రీ బ్లైజ్. ఆ భార్య.. కెప్టెన్ సుప్రీత. అసలు మహిళలు ఆర్మీలోకి రావటమే గొప్ప సంగతైతే, సుప్రీత అక్కడి నుంచి సియాచిన్ వరకు 'ఎదగటం' చెప్పుకోదగ్గ విశేషం. భారత సైన్యంలో ఆమె కెరీర్ 2021లో లెఫ్టినెంట్‌గా మొదలైంది. చెన్నైలోని 'ఆఫీసర్స్ ట్రెనింగ్ అకాడమీ (ఒ.టి.ఎ.)లో ఆమె శిక్షణ పొందారు. కాలేజ్‌లో ఎన్సీసీతో మొదలైన ఆమె దేశ రక్షణ దళ ప్రయాణం.. ముందు వరుస యుద్ధ క్షేత్రం వరకు దృఢచిత్తంతో ముందుకు సాగింది.

సుప్రీత మైసూర్ అమ్మాయి. అక్కడి కృష్ణరాజనగరంలోని సెయింట్ జోసెఫ్ స్కూల్లో చదివారు. మైసూరులోనే మరిమల్లప్ప ప్రీ-యూనివర్శిటీ కాలేజ్‌లో బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ చదవటానికి ముందు, జె.ఎస్.ఎస్. లా కాలేజ్‌లో డిగ్రీ చేశారు. ఆమె తండ్రి తిరుమల్లేశ్ మైసూరు దగ్గరి తలాకాడులో పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్. తల్లి నిర్మల గృహిణి. ఆర్మీపై తనకున్న ఇష్టాన్ని గౌరవించిన తన తల్లిదండ్రుల ప్రోత్సాహంతో సుప్రీత ఎన్సీసీలో ఎయిర్ వింగ్ 'సి' సర్టిఫికెట్ సాధించారు. న్యూఢిల్లీలోని కర్తవ్యపథ్ (రాజ్‌పథ్)లో రిపబ్లిక్ డే పరేడ్ సందర్భంగా కర్ణాటక-గోవా నడిపించారు. 2016లో ఆలిండియా వాయు సైనిక్ క్యాంప్‌లో కర్ణాటకకు ప్రాతినిధ్యం వహించారు. ఇండియన్ ఆర్మీలో లెఫ్టినెంట్ అయ్యాక సియాచిన్‌ను అధిరోహించటానికి మళ్లీ ఓ.టి.ఎ.లో చేరారు. శిక్షణలో భాగంగా ఆమెను వ్యూహాత్మకంగా ప్రాధాన్యం కలిగిన అనంత్‌నాగ్, జబల్పూర్, లేహ్ ప్రాంతాలకు పంపించారు. ఆ శిక్షణను విజయవంతంగా పూర్తి చేశారు సుప్రీత.

సుప్రీత, బ్లేజ్‌ల వివాహం గత ఏడాదే జరిగింది. సుప్రీత మామగారు రిటైర్డ్ కల్నల్ రిచర్డ్ బ్లెయిజ్. సుప్రీత అత్తగారు లెఫ్టినెంట్ కల్నల్ విజయలక్ష్మి. పుట్టినింటి, మెట్టినింటి రెండూ ప్రోత్సాహాలు సుప్రీత కెరీర్‌కు కలిసి వచ్చాయనే అనుకోవాలి. అంతకంటే కూడా ఆమె దీక్ష, పట్టుదల.

అయ్యయ్యో! బార్బీకి ఏమైంది?!

బ్లైండ్ డాల్

కంగారు పడకండి. బార్బీకి ఏం కాలేదు. బార్బీ స్ట్రాంగ్ గర్ల్. ఈసారి ఇంకో స్ట్రాంగ్ గర్ల్ రూపంలో అవతరించిందంతే. ఆ రూపమే.. "బ్లైండ్ డాల్"! చూపు లేని బొమ్మ!! ఆ..! చూపు లేకపోవటం శక్తి అవుతుందా? ఎందుక్కాదూ? చూపు లేకపోవటం, చూడలేకపోవటం వేర్వేరు కదా. చూపు ఉండీ పక్క మనిషి నిస్సహాయతను పట్టించుకోని వాళ్లకు ఏం శక్తి ఉన్నట్లు? చూపు లేకున్నా సాటి మనిషి హృదయాన్ని అర్థం చేసుకోగలిగిన వాళ్లకు ఏం శక్తి లేనట్లు?

బార్బీ.. అమ్మాయిల మనసెరిగిన బొమ్మ. డాక్టర్ బార్బీకి.. మెడిసిన్ చదవాలని కలలు కనే అమ్మాయిల మనసు తెలుసు. ఆస్ట్రోనాట్ బార్బీకి.. అంతరిక్షంలో పరిశోధనలు చేయాలని ఉవ్విళ్లూరే అమ్మాయిల ఆశలకు ఎన్ని రెక్కలు ఉంటాయో తెలుసు. నల్లజాతి బార్బీకి.. రంగు కారణంగా నల్ల జాతి మహిళలు ఎదుర్కొంటున్న తీవ్ర వివక్ష ఎలా ఉంటుందో తెలుసు.

ఇంకా.. మిస్ యూనివర్స్ బార్బీ, ప్రెసిడెంట్ బార్బీ, పైలట్ బార్బీ, వీల్ చెయిర్ బార్బీ, ప్రొస్థెటిక్ లెగ్ బార్బీలన్నీ వివిధ వృత్తులు, ప్రవృత్తులు, స్థితి గతులకు ప్రతీకగా ఉండి, ఆడపిల్లలకు స్ఫూర్తిని, సహానుభూతిని అందిస్తున్నవే. 1959తో తొలి బార్బీ మార్కెట్‌లోకి వచ్చింది మొదలు ఇప్పటి వరకు 1000 రకాలకు పైగానే బార్బీ డాల్స్ అమ్మాయిలకు ఆత్మ బంధువులయ్యాయి. ఆ క్రమంలో తాజాగా ఆవిర్భవించిన కారణజన్మురాలే.. ''బ్లైండ్ డాల్''. కారణ జన్మురాలా! అవును. కారణ జన్మురాలే. బాలికల్ని మానసికంగా శక్తివంతుల్ని చేయాలన్నదే ఆ కారణం. మాటెల్ కంపెనీ తన 'స్ఫూర్తిదాయకమైన మహిళలు' సిరీస్‌లో భాగంగా 2021లో 'హెలెన్ కెల్లర్' రూపంలో బార్బీని తయారు చేసినప్పటికీ, ఫ్యాషనబుల్‌గా తెచ్చిన తొలి బ్లైండ్ బార్బీ మాత్రం ఇదే.



బ్లైండ్ బార్బీ : బొమ్మే కాదు, బాక్సు కూడా ప్రత్యేకమే.

అంధులైన వారిని కూడా కలుపుకుని పోయేలా ఈ 'బ్లైండ్ బార్బీ' రూపొందింది. ఇందుకోసం బార్బీ బొమ్మల కంపెనీ 'మాటెల్'.. 'అమెరికన్ ఫౌండేషన్ ఫర్ బ్లైండ్'తో చేతులు కలిపింది. ఈ కొత్త బార్బీ డాల్ పింక్ శాటిన్ టీ షర్టు, పర్పుల్ ట్యూల్ స్కర్టు ధరించి ఉంటుంది. చేతిలో తెలుపు, ఎరుపు రంగుల స్టిక్ ఉంటుంది. పిల్లల్లో స్వీయ వ్యక్తీకరణను, ఆత్మదృఢత్వాన్ని పెంపొందించేందుకు బ్లైండ్ బార్బీని తెచ్చామని మాటెల్ కంపెనీ చెబుతోంది. అంతే కాదు, ఈ కొత్త బార్బీ ప్యాకింగ్ కూడా విలక్షణంగా ఉంది. బాక్సు మీద బార్బీ అనే అక్షరాలను బ్రెయిలీ లిపిలో ముద్రించారు. బ్రిటన్ యువతి లూసీ ఎడ్వర్డ్స్ ఈ బొమ్మకు ప్రచారకర్త. ఆమె తన 11 ఏళ్ల వయసులో కుడి కంటి చూపు కోల్పోయారు. 17 ఏళ్ల వయసులో రెండో కంటి చూపు కూడా క్షీణించింది. ''ఈ బొమ్మ నా సర్వస్వం. ఇది నా దగ్గర ఉంటే నేను ఒంటరినన్న భావనే నాలో కలగదు..'' అంటున్నారు లూసీ తన చేతిలోని బ్లైండ్ బార్బీని హృదయానికి హత్తుకుంటూ. ఇంకోమాట.. ''అయ్యయ్యో'' అనిపించుకోవటంస్ట్రాంగ్ గర్ల్‌కి అస్సలు ఇష్టం ఉండదట. లూసీ అంటారు.

రియాలిటీ

నిమిషానికి ముగ్గురు బాలికలు బలవంతంగా పెళ్లి బంధంలో చిక్కుకుంటున్నారు. బాల్య వివాహాలను 1929లోనే నిషేధించింది ప్రభుత్వం. మరింత కట్టుదిట్టం చేస్తూ కఠినమైన శిక్షలతో 'ప్రొహిబిషన్ ఆఫ్ చైల్డ్ మ్యారేజ్ యాక్ట్ - 2006'ను తెచ్చింది. అయినప్పటికీ ఏడాదికి 16 లక్షల బాల్య వివాహాలు జరుగుతున్నాయని అంచనా. నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వే నిర్వహించిన సర్వే చెబుతున్నదిదీ. తాజా అధ్యయనాలు చెబుతున్న మరో వాస్తవం ఏమిటంటే... 20- 24 ఏళ్ల వివాహిత మహిళలను పెళ్లి నాటికి వాళ్ల వయసు ఎంతని అడిగితే వారిలో 23.3 శాతం మంది పద్దెనిమిదేళ్లలోపే పెళ్లయినట్లు చెప్పారు.

బాల్యానికి పెళ్లి బంధనం



ప్రతీకాత్మక చిత్రం

- కోవిడ్‌కు ముందు 27 శాతంగా ఉన్న బాల్యవివాహాలు కోవిడ్ సమయంలో 33 శాతానికి పెరిగాయి. ఇది దేశ సరాసరి లెక్క. తెలుగు రాష్ట్రాల పరిస్థితి కూడా ఇందుకు మినహాయింపుగా ఏమీ లేదు.
- ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ఆర్ 'బాల్య వివాహ రహిత జిల్లా'గా మార్చిన కలెక్టర్‌లకు అవార్డులు ప్రకటించారు. అప్పుడు వరంగల్ జిల్లా కలెక్టర్ జిల్లాలో బాల్యవివాహం జరగకుండా నివారించి అవార్డు అందుకున్నారు.
- ఒకప్పుడు తమిళనాడులో బాల్యవివాహాలు ఎక్కువగా ఉండేవి. జయలలిత ముఖ్యమంత్రిగా బాల్యవివాహాలను నివారణ కోసం ఆడపిల్లలకు డిగ్రీ వరకు ఉచిత విద్య, స్కాలర్‌షిప్‌ల వంటి చర్యలు తీసుకున్నారు. ఇప్పుడు ఆ రాష్ట్రం దేశ సరాసరి కంటే చాలా మెరుగ్గా ఉంది.
- కర్నాటక రాష్ట్రం కూడా ప్రత్యేకంగా బడ్జెట్ కేటాయించి రిటైర్డ్ జడ్జ్ ఆధ్వర్యంలో బాల్యవివాహాలకు వ్యతిరేకంగా చైతన్యవంతం చేస్తూ ప్రచారం నిర్వహించి సమాజంలో మార్పు తెచ్చుకుంది.
- అస్సాం, వెస్ట్ బెంగాల్ రాష్ట్రాల్లో ఆడపిల్లలకు పదేళ్లలోపే పెళ్లి చేసే ఆచారం ఉండేది. అస్సాం ఇప్పుడు ప్రత్యేక దృష్టి పెట్టింది. చాలా వేగంగా మెరుగైన ఫలితాలను సాధిస్తోంది.
- బాల్య వివాహాలను అరికట్టాలంటే... ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్, హెల్త్, ఎడ్యుకేషన్, పోలీస్, రెవెన్యూ... ఈ ఐదు ప్రభుత్వ విభాగాలు సమన్వయంతో పని చేయాలి.

- వాకా మంజులారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

తొలి లెక్క పాఠశాల నుంచే!

కోవిడ్ సమయంలో 1098 హెల్ప్‌లైన్‌కి 5,500 కాల్స్ వచ్చాయి. బాల్యవివాహం బారిన పడుతున్న అమ్మాయిలు, వారి స్నేహితుల నుంచి వచ్చిన ఫోన్ కాల్స్ అవి. ఫోన్ కాల్స్ కూడా రాకుండా జరిగిపోయిన పెళ్లిళ్లు ఎన్నో. కోవిడ్ తర్వాత స్కూళ్లు తెరుచుకున్నప్పుడు తిరిగి స్కూల్‌కి వచ్చిన అమ్మాయిల లెక్క ఏ శాఖ దగ్గరా లేదు. పంచాయితీ సెక్రటరీ గ్రామస్థాయి చైల్డ్ మ్యారేజ్ ప్రొహిబిషన్ ఆఫీసర్. పాఠశాల రిజిస్టర్ నుంచి మొదలు పెడితే కచ్చితమైన లెక్కలు రాబట్టవచ్చు. ప్రాథమిక పాఠశాల నుంచి హైస్కూల్‌కి కొనసాగే వాళ్లు 63 శాతం మాత్రమే. టెన్త్ పాసయిన అమ్మాయిల్లో కాలేజ్‌కెళ్లేవాళ్లు పాతిక శాతం మాత్రమే. మండలాల్లో కూడా కాలేజ్‌లు పెడితే ఆడపిల్లలందరూ చదువుకోగలుగుతారు. చదువుకుంటే బాల్య వివాహాలు వాటంతట అవే ఆగిపోతాయి. సామాజిక కార్యకర్తగా ఇరవై వేల బాల్య వివాహాలను ఆపగలిగాను. కొందరు మాత్రం మేము రాత్రంతా కాపు కాసి తెల్లవారు జామున అలా పక్కకు వెళ్లగానే తాళి కట్టించేసే వాళ్లు. బాల్యవివాహాలకు వ్యతిరేకంగా నేను స్వయంగా 78 కేసులు వేశాను. ఒక్క కేసులోనూ దోషులకు శిక్ష పడలేదు.



- మమతా రఘువీర్, సోషల్ యాక్టివిస్ట్

హెల్దీ డైట్ **మొరింగా రోటీ-దాల్**





డాక్టర్ కరుణ
న్యూట్రిషనిస్ట్ & వెల్‌నెస్ కోచ్

కావలసినవి: మల్టీ గ్రెయిన్ పిండి – కప్పు; మునగ ఆకులు– కప్పు; నూనె– టేబుల్ స్పూన్; ఉప్పు – రుచిని బట్టి; నీరు – అర కప్పు.

తయారీ: ● మునగాకు కడిగి చిల్లుల పాత్రలో వేయాలి ● ఒక పాత్రలో పిండి, ఉప్పు, మునగాకు వేసి కలిపి నీటిని పోస్తూ ముద్ద చేయాలి ● పిండిని వత్తి పెనం మీద నూనె వేస్తూ రెండు వైపులా కాల్చుకుంటే మొరింగా రోటీ రెడీ.

మొరింగా దాల్ కోసం... కందిపప్పు – కప్పు, మునగాకు– కప్పు, పచ్చిమిర్చి– 2, వెల్లుల్లి రేకలు–2, నిమ్మరసం– టీ స్పూన్, ఉప్పు– పావు టీ స్పూన్, పసుపు– చిటికెడు, నూనె– టేబుల్ స్పూన్, ఆవాలు– పావు టీ స్పూన్, జీలకర్ర – పావు టీ స్పూన్, ఇంగువ– చిటికెడు– వెన్న– టేబుల్ స్పూన్

తయారీ: పప్పును ఉడికించి మెదిపి పక్కన ఉంచాలి. బాణలిలో వెన్న వేడి చేసి ఆవాలు, జీలకర్ర, వెల్లుల్లి, పచ్చిమిర్చి, పసుపు, ఉప్పు, ఇంగువ, మునగాకు వేసి రెండు నిమిషాల సేపు మగ్గనివ్వాలి. కప్పు నీరు పోసి ఉడికించి మెదిపిన పప్పు కలిపి ఐదు నిమిషాల సేపు ఉడికించి నిమ్మరసం కలిపి దించేయాలి.

పోషకాలు: ● పప్పులో... ప్రొటీన్‌లు–10.36 గ్రా, ఫైబర్ –8.7 గ్రా. ● **రోటీలో...** ప్రొటీన్‌లు– 3 గ్రా, కార్బోహైడ్రేట్‌లు , విటమిన్‌లు – 15 గ్రా, మునగాకులో క్యాల్షియం, మాంగనీస్, మెగ్నీషియం, ఐరన్, జింక్ వంటి మినరల్స్‌తోపాటు డైటరీ ప్రొటీన్‌లు, ఫైబర్‌లు సమృద్ధిగా ఉంటాయి. అంతేకాదు... మునగాకులో యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. హిమోగ్లోబిన్ శాతం పెంచి రక్తహీనత సమస్యను తగ్గిస్తుంది.

*** వర్క్ ప్లేస్**

స్త్రీలే ఎక్కువ ఒత్తిడికి గురవుతున్నారు



భారతదేశంలోని చాలా మంది వర్కింగ్ మహిళలు అనుమానిస్తున్న విషయాన్ని ఇటీవలి అధ్యయనం వెల్లడించింది. మెంటల్ హెల్త్ ప్లాట్‌ఫామ్ యువర్ దోస్త్ 'ఉద్యోగుల భావోద్వేగ స్థితి' పేరుతో ఒక తాజా నివేదికను విడుదల చేసింది. 5,000 కంటే ఎక్కువ మంది భారతీయులను సర్వే చేసింది. ఆఫీసుల్లో ఒత్తిడికి సంబంధించి మన దృష్టి కోణాన్ని మార్చే అంతర్దృష్టిని వెలికితీసింది.

కార్యాలయాల్లో పనిచేసే దాదాపు మూడు వంతుల (72.2 శాతం) మంది మహిళలు అధిక ఒత్తిడి స్థాయిలను నివేదించారు. దీనికి విరుద్ధంగా, పురుషులను 'ఒత్తిడి'కి సంబంధించిన ప్రశ్న అడిగినప్పుడు వారిలో 53.64 శాతం మంది అధిక ఒత్తిడి స్థాయిలను అనుభవిస్తున్నారని చెప్పారు. అధిక శాతం స్త్రీలు పని - జీవిత సమతుల్యత లోపాన్ని నివేదించారు. 12 శాతం మంది పురుషులతో పోలిస్తే 18 శాతం మంది మహిళలు వ్యక్తిగత, వృత్తిపరమైన సమతూకం కోసం కష్టపడుతున్నారని చెప్పారు. మహిళల ప్రధాన ఒత్తిడికి కారణం తగినంత గుర్తింపు లేకపోవడం, ధైర్యంగా ఉండకపోవడం, భయం వంటి సమస్యలతో ఉన్నట్టు గమనించారు. ఆందోళనకరంగా 20 శాతం మంది మహిళలు ఎప్పుడూ నీరసంగా ఉన్నట్టు నివేదించగా, 9.27 శాతం మంది పురుషులు మాత్రమే అదే భావాన్ని పంచుకున్నారు.

వయసు-ఒత్తిడి

ఉద్యోగుల 'ఎమోషనల్ వెల్‌నెస్ స్టేట్' నివేదిక ప్రకారం మిగతా వారితో పోల్చితే 21– 30 మధ్య వయసు గల ఉద్యోగులు, కార్మికులు అత్యంత ఒత్తిడికి గురవుతున్నారు. 21– 30 సంవత్సరాల మధ్య వయసు గల 64.42 శాతం మంది ఉద్యోగులు, కార్మికులు తీవ్రస్థాయి ఒత్తిడిని అనుభవిస్తున్నట్టు నివేదించారు. 31 నుంచి 40 సంవత్సరాల మధ్య వయసు గల 59.81 శాతం మంది కార్మికులు కూడా ఇదే విధమైన సమస్యను నివేదించారు.

తక్కువ ఒత్తిడికి గురైన వయసు సమూహం 41 నుండి 50 సంవత్సరాలు. ఈ వయసు గ్రూపులో 53.5 శాతం మంది ఉద్యోగులు మాత్రమే కార్యాలయంలో

> తగినంత గుర్తింపు లేకపోవడం, ధైర్యంగా ఉండకపోవడం, భయం వంటి సమస్యలతో మహిళలు ప్రధానంగా ఒత్తిడికి గురవుతున్నట్టు మెంటల్ హెల్త్ ప్లాట్‌ఫారమ్ 'యువర్ దోస్త్' తాజా నివేదికలో వెల్లడించింది.

అధిక స్థాయి ఒత్తిడిని ఎదుర్కొంటున్నట్టు నివేదించారు. వర్క్‌ప్లేస్ డైనమిక్స్‌లో మార్పు, రిమోట్, హైబ్రిడ్ వర్క్ మోడల్స్ పరిమాణం, 21 – 30 ఏళ్ల జనాభాపై ప్రభావం చూపింది. వారికి మద్దతుగా, సంస్థలు రెగ్యులర్ కమ్యూనికేషన్, ఎంగేజ్‌మెంట్‌కు ప్రాధాన్యత ఇవ్వాలి' అని చీఫ్ సైకాలజీ ఆఫీసర్ డాక్టర్ జిని గోపీనాథ్ అన్నారు.

ఐటీ అండ్ మాన్యుఫాక్చరింగ్, రవాణా, సిబ్బంది నియామకాలు, టెక్ అండ్ మీడియా, లీగల్ సర్వీస్, బిజినెస్ కన్సల్టింగ్, సేవల రంగాలలోని ఉద్యోగులను సర్వే చేసిన తర్వాత ఈ ఫలితాలు వెల్లడి చేశారు.

● పేరెంటింగ్

నిన్న మొన్నటి వరకు పిల్లల విషయంలో జంటలు 'మేమిద్దరం, మాకిద్దరు' అనేవారు. ఇప్పుడు ముఖ్యంగా పట్టణ జంటలు 'ఒక్కరు చాలు' అనేస్తున్నారు. తోబుట్టువులు లేకుండా ఏకైక సంతానం అయితే అతిగారాబం వల్ల చెడిపోతారా? తల్లిదండ్రులపైన ఆ సంతానం అతిగా అధారపడటం జరుగుతుందా? ఒక్కరే సంతానం ఉంటే వారి పెంపకంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి? మారుతున్న తల్లిదండ్రుల ఆలోచనా సరళి, పెంపకంలో సమతుల్యతను పాటించడంలో నిపుణుల అభిప్రాయాలు తెలుసుకోవడమూ ముఖ్యమే! రేపు పేరెంట్స్ డే సందర్భంగా...

సింగిల్‌గానైనా... సింహంలాగా...

'ఒక్కడే పిల్లవాడు ఉంటే చెడిపోతాడు, ఏదైనా పంచుకోవడం ఎలా నేర్చుకుంటాడు? వయసయ్యాక తోడు ఎవరూ ఉండరు..' ఇలాంటి మాటలు అమ్మ, అమ్మమ్మ, అత్త, పెద్దమ్మలు... పై హెచ్చరికలను చేస్తూ ఉంటారు. అందుకే, త్వరగా రెండవ బిడ్డను ప్లాన్ చేసుకోమని చెబుతూనే ఉంటారు. కానీ, నేటి కాబోయే తల్లిదండ్రులు ఈ మాటలను పట్టించుకోవడంలేదు. 'తోబుట్టువులు లేకుండా పెరిగే అబ్బాయి/అమ్మాయి స్వీయ–కేంద్రీకృత ఒంటరివాడు అని 70ల నుండి నిర్వహించిన బహుళ అధ్యయనాలు సూచిస్తున్నాయి. అయితే, పెరుగుతున్న పట్టణ జంటలు దీర్ఘకాల మూస పద్ధతులను మనం తొలగించాల్సిందే అని భావిస్తున్నారు.

ఒంటరిగా ఉండని మార్గాలు అన్వేషిస్తున్నారు

సుసాన్ న్యూమాన్ న్యూయార్క్ మనస్తత్వవేత్త, 'పేరెంటింగ్ యాన్ ఓన్లీ చైల్డ్' రచయిత కూడా. 'నేటి తల్లిదండ్రులు తమ ఏకైక సంతానం ఒంటరిగా ఉండని మార్గాల్లో పెంచడం గురించి చాలా అవగాహనను కలిగి ఉన్నారు' అని వివరిస్తారు.

ఐటి కంపెనీలో జాబ్ చేసే వివేక్, శాన్వి ఇద్దరూ తీరికలేకుండా ఉంటారు. 'కెరియర్‌కి ఇబ్బంది అవుతుంది కదా అని మేమిద్దరం మా పాపను దూరంగా ఉంచం. ఆమెకు అవసరమైనప్పుడే వస్తువులను కొనుగోలు చేస్తాం. మేం ఒకసారి 'నో అంటే నో' అనే సమాధానం ఆమెకు బాగా తెలుసు. ఒంటరిగా పెరిగిన పిల్లలు స్వార్థంగా ఉంటారని, తమ బొమ్మలను, వస్తువులను వేరేవాళ్లతో పంచుకోవడంలో ఇబ్బంది పడతారనే విషయం నిజం కాదు. మా ఇంటికి అతిథులు వారి పిల్లలతో కలిసి వచ్చినప్పుడల్లా తన వస్తువులను ఆడుకోవడానికి ఇస్తుంది. అలా చాలా మంది పిల్లలకు నా కూతురు ఇష్టమైన అక్క కూడా' అని ఆనందంగా చెబుతుంది శాన్వి. 40 ఏళ్ల వ్యాపారవేత్త అయిన నిఖిత తన పదమూడేళ్ల కొడుకు గురించి చెబుతూ 'ఎవ్వరైనా సరే పిల్లల గురించి తమదైన బాణీలో అంచనాలు వేయడం మానాలంటు'న్నారు.



ప్రతీకాత్మక చిత్రం

సామాజికంగా ముందడుగు!!

హెచ్‌ఆర్ కంపెనీలో మేనేజర్‌గా వర్క్ చేసే అన్షు 'మా అబ్బాయి స్నేహితులను టీమ్ లీడర్‌గా జాగ్రత్తగా చూసుకుంటాడు. క్రీడా జట్టులో భాగం కావడం మా అబ్బాయికి బాగా సహాయపడింది. క్రమం తప్పకుండా అనాథ శరణాలయాలకు తీసుకెళ్తూ ఇతరుల పట్ల దయగా, సానుభూతితో ఉండేలా చూస్తాం.' అని చెబుతుంది. 'నా చిన్నతనంలో, ప్రతి ఒక్కరికీ తోబుట్టువులు ఉండటం వల్ల నేను కొన్నిసార్లు బాధపడేదాన్ని. కష్టకాలం వచ్చినప్పుడు ఆదుకునేందుకు తోబుట్టువులు ఉండాలి అనుకునేదాన్ని. కానీ, నాకు ఫ్రెండ్స్ ఎక్కువ. దీంతో ఆ లోటు ఎప్పుడూ లేదు. ఒంటరి పిల్లలు సామాజికంగా ముందుకు వెళతారు. నా కూతురుని అలాగే పెంచుతున్నందుకు ఆనందంగా ఉంది' అని వివరిస్తుంది.

పిల్లలు ఎంతమంది ఉన్నారు అనేది కాదు, ఎంత బాగా పెంచగలుగుతున్నాం అనేది నేటి తల్లిదండ్రుల మాట. తమ జీవితాన్ని ఆనందించాలనే ఆలోచనతో పాటు తమ ఏకైక సంతానంతో తోబుట్టువులాగే మార్గదర్శకులుగా ఉండాలని కోరుకుంటున్నారు.

– నిర్మలారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

ఏకైక సంతానం అయితే...



మారుతున్న పరిణామాలనూ అర్థం చేసుకోవాల్సిందే. అయితే, పిల్లలు 'ఒంటరి' అనిపించకుండా చుట్టూ ఉన్నవారితో కలిసిపోయేలా, స్నేహబృందాన్ని ఏర్పరుచుకునేలా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలి. * తరచూ పర్యటనలు చేయడం వల్ల పిల్లల్లో ఒంటరి భావన కలగదు * ఒక్కరే కదా అని అతి గారాబం చేస్తుంటారు. ఒంటరి పిల్లల విషయంలో ఉన్న ఈ 'అతి'ట్యాగ్ గురించి అలెర్ట్‌గా ఉండాలి. * పిల్లల్లో వ్యతిరేక భావనలను ఎప్పుడైనా బయటకు కనిపించినా వాటిని పాజిటివ్ దృక్పథంగా మార్చేయగలగాలి. * క్రీడల్లో పాల్గొనేలా చేస్తే స్కూల్ ఫ్రెండ్స్, స్పోర్ట్స్ టీమ్స్‌తో బిజీగా ఉంటారు. * పిల్లల సెలవు రోజులను ఎంపిక చేసుకొని వారితో కలిసి తమ కమ్యూనిటీలో కార్యక్రమాలను చేపట్టడం, పాల్గొనడం వంటివి చేయాలి.

– జ్యోతిరాజ, సైకాలజిస్ట్, లైఫ్‌స్కిల్స్ ట్రైనర్



లైఫ్@360

● గరం చాయ్

ఇది ఇంటెం'టీ' కథ

'గంట సేపట్నుంచి ఒకటే తలనొప్పి... ఉదయం టీ తాగలేదని ఇప్పుడు గుర్తుకొస్తోంది' అంటూ టీ కోసం వంటగది వైపు నడవడం మనలో చాలా మందికి అలవాటే. 'ఆఫీసు పనితో బుర్ర వేడెక్కిపోయింది. వేడి వేడి టీ తాగాలి' అంటూ క్యాంటీన్ వైపు నడిచే ఉద్యోగులూ మనకెరుకే.

ఒక కప్పు (150మిల్లీ లీటర్లు) కాఫీలో 80–120 మిల్లీగ్రాముల కెఫీన్ ఉంటుంది. అదే మోతాదు ఇన్‌స్టంట్ కాఫీ అయితే కెఫీన్ 50 నుంచి 65 మిల్లీగ్రాములకు మించదు. అంతే మోతాదు టీలో 30–65 మి.గ్రా కెఫీన్ మాత్రమే ఉంటుంది. కాబట్టి కాఫీతో పోలిస్తే టీ తక్కువ హాని కలుగుతుందనే చెప్పాలి.





ఇదేంటి... టీ తాగకపోతే తలనొప్పి వస్తుందా? తలనొప్పి వచ్చినప్పుడు టీ తాగితే తగ్గిపోతుందా? టీకి తలనొప్పి మధ్య ఉన్న ఈ బంధం ఏమిటి? ఇది మనం టీతో అల్లుకున్న అనుబంధమేనా లేక సాంకేతికంగా సంబంధం ఉందా... అంటే టీకి తలనొప్పికి నేరుగా ఎటువంటి సంబంధం లేదంటున్నారు వైద్యనిపుణులు.

● 'చాయ్‌లో తలనొప్పి తగ్గించే ఔషధాలు ఉన్నట్లు ఏ వైద్యగ్రంథంలోనూ లేదు. అయితే దేహంలో నీరు తగ్గి తలనొప్పి వచ్చినప్పుడు టీ తాగడం వల్ల కొంత మేర నీరు అందడం వల్ల తలనొప్పి తాత్కాలికంగా తగ్గుతుంది. అయితే డీహైడ్రేషన్ కారణంగా వచ్చిన తలనొప్పి తగ్గడానికి దేహానికి తగినంత నీరు అందడమే పరిష్కారం' అన్నారు ముంబయిలోని సీనియర్ ఫిజీషియన్ డాక్టర్ రూహీ పిర్జాదా.

● 'టీ తాగేటప్పుడు ఆ వెచ్చటి ఆవిరి శ్వాసనాళాల్లోకి వెళ్లి సైనసైటిస్ కారణంగా ఏర్పడిన అసౌకర్యాన్ని తగ్గిస్తుంది. శ్వాస హాయిగా పీల్చుకోగలగడం వల్ల సైనసైటిస్ కారణంగా వచ్చిన తలనొప్పి తగ్గుతుంది' అన్నారు ఉత్తరప్రదేశ్, నొయిడాలోని న్యూరాలజిస్ట్ డాక్టర్ జ్యోతి బాల శర్మ. అలాగే కొన్ని అధ్యయనాలు బ్లాక్ టీలోని కెఫీన్ తలనొప్పి తగ్గడానికి దోహదం చేస్తుందని అభిప్రాయం వ్యక్తం చేశాయి. నిజానికి కెఫీన్ రక్తనాళాలను సంకోచితపరుస్తుంది. దాంతో తలనొప్పి లక్షణాలను అదుపులో ఉన్నట్లవుతుంది. క్రమం తప్పకుండా టీ లేదా కాఫీ తాగే వాళ్లలో ఆ సమయానికి రక్తనాళాలు వ్యాకోచానికి గురవుతాయి. దాంతో తలనొప్పి కలుగుతుంది. అంటే నిజానికి టీ, కాఫీలు తలనొప్పి తగ్గించడానికే కాదు, రావడానికి కూడా కారణమే.

● మామూలు టీ కంటే మసాలా టీ తాగితే తలనొప్పి త్వరగా తగ్గుతుందనే అభిప్రాయం కూడా మనలో ఉంది. తేయాకుతోపాటు అల్లం, యాలకులు, దాల్చిన చెక్క వేసిన టీల వల్ల తలనొప్పి తగ్గడానికి వాటిలోని సహజమైన ఔషధగుణాలు దోహదం చేస్తాయి. ఉదాహరణకు అల్లం మైగ్రేన్ తలనొప్పిని తగ్గిస్తుంది. అలాగే దాల్చిన చెక్క, యాలకుల టీ నుంచి సువాసన సాంత్వన కలుగుతున్న భావనను పెంపొందించవచ్చు. ఈ టీలు పని ఒత్తిడి లేదా ఇతర ఆలోచనల ఒత్తిడితో వచ్చిన తలనొప్పి నుంచి సాంత్వన కలిగించే అవకాశం లేకపోలేదు. స్థూలంగా పరిశీలిస్తే టీలు తలనొప్పి నుంచి తాత్కాలిక ఉపశమనం కలిగించడానికి దోహదం చేస్తాయి. కానీ తలనొప్పికి చికిత్స చేయలేవని మాత్రం మర్చిపోకూడదు.

– వి.ఎం.ఆర్

ఎప్పుడు తాగాలి

టీ అలవాటైన తర్వాత పూర్తిగా మానడం చాలామందికి సాధ్యం కాకపోవచ్చు. అయితే ఎప్పుడు తాగకూడదో తెలుసుకుంటే కొంతనయం. ఐసీఎమ్‌ఆర్ (ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్) పరిశోధన ప్రకారం ఆహారం తీసుకోవడానికి ఓ గంట ముందు, తర్వాత ఓ గంట వరకు టీ తాగకూడదు. ఈ జాగ్రత్త పాటించకపోతే ఐరన్‌తో కూడిన ఆహారం తీసుకున్నప్పటికీ అది దేహానికి అందక రక్తహీనత బారిన పడాల్సి వస్తుంది. అలాగే నిద్రపోవడానికి ముందు తాగితే నిద్రలేమి కలుగుతుంది. రోజులో చివరి టీ నిద్రపోవడానికి కనీసం నాలుగైదు గంటల ముందే అయి ఉండాలి.

టీ తెచ్చే అనర్థాలివి



మనం ఆహారంలో తీసుకున్న పోషకాలను దేహం గ్రహించకుండా నిలువరిస్తుంది. ముఖ్యంగా ఐరన్‌తోపాటు ఇతర సూక్ష్మపోషకాలను దేహం సక్రమంగా పీల్చుకోలేకపోవడంతో సూక్ష్మపోషకాల లోపానికి గురవుతుంది. గ్యాస్ట్రైటిస్, రెస్ట్‌లెస్‌నెస్, నిద్రలేమి, ఆందోళన, తలనొప్పి వస్తాయి.

స్టడీ

ట్రినిటీ కాలేజీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ న్యూరోసైన్స్ డీన్ ఇయాన్ రాబర్ట్‌సన్ ఎన్నో సంవత్సరాలుగా 'మెదడుపై వయసు ప్రభావం'పై పరిశోధనలు చేస్తున్నాడు. గతంతో పోల్చితే బయోలాజికల్, సైకాలాజికల్‌గా 'వృద్ధాప్యం' మొదలయ్యే వయసు పెరిగిందని అంటాడు ఇయాన్. ఆయన చెబుతున్న దాని ప్రకారం 'వృద్ధాప్యం' 80 సంవత్సరాల నుంచి మొదలవుతుంది. వృద్ధాప్యంలోనూ యూత్‌ఫుల్‌గా కనిపించడానికి ఇయాన్ రాబర్ట్‌సన్ చెప్పిన సలహాలు...

నిత్య యవ్వనం ఇలా...

● ఏరోబిక్ ఫిట్‌నెస్ చాలా ముఖ్యమైనది. మెదడు పనితీరు, నిర్మాణం యాక్టివిటీ ద్వారా ప్రభావితం అవుతాయి. గుండె, శ్వాస వేగం పెరిగేలా చేసే ఏరోబిక్ వ్యాయామాలు చేయాలి. ఉదా: జాగింగ్, స్విమ్మింగ్, వాకింగ్, సైక్లింగ్, తోటపని. ● మానసిక ఉత్తేజం అనేది మెదడుకు శక్తిలా ఉపయోగపడుతుంది. మనసుకు నచ్చిన పని నుంచి ఇది వస్తుంది. ● ఎప్పుడూ ఏదో ఒకటి నేర్చుకోవడం ద్వారా మెదడు చురుగ్గా ఉంటుంది. ● ఒత్తిడి అనేది మెదడుపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. ముఖ్యంగా జ్ఞాపకశక్తి. దీన్ని దృష్టిలో పెట్టుకొని ఒత్తిడికి దూరంగా ఉండాలి. ● ఒంటరితనాన్ని దూరం పెట్టి నలుగురిలో కలవాలి, సామాజిక జీవితం, కొత్త వ్యక్తులతో పరిచయాలు మెదడును చురుగ్గా ఉండేలా చేస్తాయి.
● పండ్లు, కూరగాయలు, చేపలు...ఇలా ఆరోగ్యకరమైన ఆహారంపై దృష్టి పెట్టాలి.



● ఔషధం

అల్లం

అజీర్ణం, మలబద్ధకం సమస్యలతో సతమతమయ్యేవారికి అల్లం మేలు చేస్తుంది. స్త్రీ రుతుక్రమంలో నొప్పి తగ్గేందుకు మొదటి మూడు రోజులు అల్లం తీసుకోవడం ద్వారా సమస్య నుండి ఉపశమనం లభిస్తుంది. సీజనల్‌గా వచ్చే దగ్గు, జలుబు సమస్యలను నిరోధిస్తుంది, తలనొప్పి నుండి ఉపశమనం కలిగిస్తుంది. అల్లం రక్తాన్ని పలుచగా చేస్తుంది కనుక ఇది హృదయ సంబంధ సమస్యలను నివారించడంలో ప్రయోజనకరంగా ఉంటుంది.



సినిమా

రైటర్ నాని?



● నాని

హీరో నాని రైటర్‌గా మారనున్నారా? అంటే అవుననే మాట ఫిల్మ్‌నగర్‌లో వినిపిస్తోంది. తన నిర్మాణ సంస్థ వాల్ పోస్టర్ సినిమా బ్యానర్‌పై దర్శకుడు శైలేష్ కొలనుతో 'హిట్, హిట్ 2' సినిమాలను నిర్మించారు నాని. ఈ రెండు చిత్రాలకు మంచి ప్రేక్షకాదరణ లభించింది. 'హిట్ 2' సినిమా చివర్లో 'హిట్ 3'లో నాని హీరోగా పోలీసాఫీసర్ అర్జున్ సర్కార్ పాత్రలో నటించనున్నట్లుగా మేకర్స్ వెల్లడించిన సంగతి గుర్తుండే ఉంటుంది. ఈ ఏడాదిలోనే 'హిట్ 3' చిత్రీకరణ ప్రారంభం కానుందట. 'హిట్, హిట్ 2' సినిమాలకు దర్శకత్వం వహించిన శైలేష్ కొలనే 'హిట్ 3'ని తెరకెక్కించనున్నారు. కానీ ఈ సినిమాకు నాని కథ–స్క్రీన్‌ప్లే అందించనున్నారని భోగట్టా. మరి.. ఈ సినిమాతో నాని రైటర్‌గా మారతారా? లెట్స్ వెయిట్ అండ్ సీ. మరోవైపు నాని హీరోగా నటించిన 'సరిపోదా శనివారం' సినిమా ఆగస్టు 29న రిలీజ్‌కు రెడీ అవుతోంది. ఇంకా 'దసరా' తర్వాత దర్శకుడు శ్రీకాంత్ ఓదెలతో నాని మరో సినిమా కమిటైన సంగతి తెలిసిందే.

నాకు తప్పుగా అనిపించలేదు



● అమలా పాల్



● కాలేజ్ ఈవెంట్‌లో...

''లెవల్ క్రాస్' మూవీ ప్రమోషన్స్‌లో భాగంగా ఇటీవల ఓ కళాశాలలో జరిగిన ఈవెంట్‌లో పాల్గొన్నాను. ఆ ఈవెంట్‌కి నేను వేసుకుని వెళ్లిన డ్రెస్ నాకు చాలా సౌకర్యంగా అనిపించింది. ఆ దుస్తుల్లో ఆ ఈవెంట్‌కు వెళ్లడం నాకు తప్పుగా అనిపించలేదు'' అని హీరోయిన్ అమలాపాల్ అన్నారు. ఆమె నటించిన తాజా మలయాళ చిత్రం 'లెవల్ క్రాస్' శుక్రవారం (జూలై 26) విడుదలైంది. ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా కేరళలోని ఎర్నాకులంలో ఓ కాలేజ్‌లో నిర్వహించిన ఈవెంట్‌లో పాల్గొన్నారు అమలా పాల్. అయితే ఈ కార్యక్రమంలో ఆమె వేసుకున్న డ్రెస్‌పై తీవ్ర విమర్శలు వచ్చాయి. పొట్టి దుస్తుల్లో కాలేజీకి వెళ్లి విద్యార్థులకు ఏం సందేశం ఇవ్వాలనుకుంటున్నారు? విద్యా సంస్థల్లో జరిగే కార్యక్రమాలకు వెళ్లేటప్పుడు పద్ధతిగా వెళితే బాగుంటుంది? అంటూ అమలా పాల్‌ను ట్రోల్ చేస్తూ విమర్శిస్తున్నారు పలువురు నెటిజన్లు. ఈ విమర్శలపై అమలా పాల్ స్పందిస్తూ– ''కాలేజీలో జరిగిన ఈవెంట్‌లో నేను ధరించిన డ్రెస్ నాకు సౌకర్యంగా అనిపించింది. ఆ డ్రెస్‌లో నన్ను చూడటం విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యంగా అనిపించలేదు. నిజానికి నా దుస్తులను కెమెరాలు ఎలా చూపిస్తాయన్నదే అసలు సమస్య. కాలేజీకి నేను ఆ డ్రెస్ వేసుకుని వెళ్లడం వెనక ఉన్న ఉద్దేశం విద్యార్థుల్లో ఆత్మస్థైర్యాన్ని నింపడానికే. నేను మోడ్రన్ డ్రెస్సులతో పాటు సంప్రదాయ దుస్తులు కూడా ధరిస్తాను'' అన్నారు.

ట్రైలర్ చూస్తే చిన్న సినిమా కాదని అర్థమైంది – సిద్ధు జొన్నలగడ్డ



● సిద్ధు జొన్నలగడ్డ, నిహారిక, యదు వంశీ

''కమిటీ కుర్రోళ్ళు' ట్రైలర్ చూస్తే చిన్న సినిమా కాదని అర్థమైంది. విజువల్స్ బాగున్నాయి. అసలు చిన్న సినిమా పెద్ద సినిమా అనేది ఉండదు. ఓ సినిమాకు తక్కువ ఖర్చు పెడతాం... మరో సినిమాకి ఎక్కువ ఖర్చు పెడతాం... అంతే'' అని హీరో సిద్ధు జొన్నలగడ్డ అన్నారు. నూతన నటీనటులతో యదు వంశీ దర్శకత్వం వహించిన చిత్రం 'కమిటీ కుర్రోళ్ళు'. నిహారిక కొణిదెల సమర్పణలో పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ ఎల్‌ఎల్‌పీ, శ్రీరాధా దామోదర్ స్టూడియోస్‌పై పద్మజ కొణిదెల, జయలక్ష్మి అడపాక నిర్మించారు. ఆగస్టు 9న విడుదల కానున్న ఈ మూవీ ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌ని హైదరాబాద్‌లో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సిద్ధు జొన్నలగడ్డ మాట్లాడుతూ– ''కొత్తవారితో 'కమిటీ కుర్రోళ్ళు' వంటి మంచి చిత్రాన్ని తీయడం మామూలు విషయం కాదు. ఇలాంటి సినిమాని ప్రేక్షకులు పెద్ద హిట్ చేస్తారు'' అన్నారు. ''ఈ సినిమా కోసం మూడేళ్లుగా పని చేస్తున్నాం. అందరూ వారి వారి పాత్రలకు ప్రాణం పోశారు'' అన్నారు నిహారిక. ''నిహారిక, ఫణిగార్లు లేకపోతే ఇంత మంచి సినిమా తీసేవాళ్లం కాదు'' అన్నారు యదు వంశీ. ''మంచి సినిమా తీశాం. అందరూ చూడండి'' అన్నారు నిర్మాత ఫణి అడపాక. ఈ వేడుకలో ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ రమేశ్, మ్యూజిక్ డైరెక్టర్ అనుదీప్ దేవ్, కెమెరామేన్ రాజు మాట్లాడారు.

సస్పెన్స్... థ్రిల్

కృష్ణసాయి, మీనాక్షీ జైస్వాల్ జంటగా నటించిన చిత్రం 'జ్యువెల్ థీఫ్'. పీఎస్ నారాయణ దర్శకత్వం వహించిన ఈ మూవీలో ప్రేమ, అజయ్, శివారెడ్డి, శ్రావణి, శ్వేతారెడ్డి నటించారు. మల్లెల ప్రభాకర్ నిర్మించారు. ఈ చిత్రం టీజర్, ఆడియో లాంచ్ వేడుకకి ముఖ్య అతిథులుగా సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ డీఐజీ అనిల్ మింజ్, ఇన్‌కమ్ ట్యాక్స్ కమిషనర్ జీవన్ లాల్ లవిదియ, అతిథిగా నటి ఎస్తేర్ హాజరై, సినిమా విజయం సాధించాలని ఆకాంక్షించారు. కృష్ణ సాయి మాట్లాడుతూ– 'సస్పెన్స్ థ్రిల్లర్‌గా రూపొందిన చిత్రం 'జ్యువెల్ థీఫ్'' అన్నారు. ''కృష్ణసాయికి తగ్గ కథను పది రోజుల్లోనే పూర్తి చేశాను. అందర్నీ ఆకట్టుకునే సినిమా ఇది'' అన్నారు పీఎస్ నారాయణ. ''ఈ మూవీలో మంచి పాత్ర చేశాను'' అన్నారు నటి ప్రేమ.



● ప్రేమ, కృష్ణసాయి, మీనాక్షి

శతమానం భవతిలా అలరిస్తుంది – నరేశ్ వీకే



● అనురాగ్, నరేశ్ వీకే, తిరువీర్

''శతమానం భవతి' సినిమా ఎన్‌ఆర్‌ఐ ప్రేక్షకులని విశేషంగా ఆకట్టుకుంది. 'వీరాంజనేయులు విహార యాత్ర' కూడా అలానే అలరిస్తుంది. అద్భుతమైన భావోద్వేగాలున్న కథ ఇది'' అని నటుడు నరేశ్ వీకే అన్నారు. అనురాగ్ పలుట్ల దర్శకత్వంలో డా. నరేశ్ వీకే, రాగ్ మయూర్, ప్రియా వడ్లమాని లీడ్ రోల్స్‌లో నటించిన చిత్రం 'వీరాంజనేయులు విహారయాత్ర'. బాపినీడు .బి, సుధీర్ ఈదర నిర్మించిన ఈ సినిమా ఆగస్టు 14న ఈటీవీ విన్ ఓటీటీలో స్ట్రీమింగ్ కానుంది. ఈ సినిమా టీజర్‌ని నటి పవిత్రా లోకేశ్ లాంచ్ చేశారు. ఈ సందర్భంగా నరేశ్ వీకే మాట్లాడుతూ– ''వీరాంజనేయులు విహారయాత్ర' కథ విన్నాక జంధ్యాల, త్రివిక్రమ్, వివేక్ ఆత్రేయలాంటి వినూత్నమైన ఒరవడి అనురాగ్‌లో కనిపించింది. ఇది నాకు గోల్డెన్ జూబ్లీ ఫిల్మ్.. గోల్డెన్ ఫిల్మ్'' అన్నారు. 'హిలేరియస్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన 'వీరాంజనేయులు విహారయాత్ర' నాలుగు కాలాల పాటు గుర్తుంటుంది. ఈ మాట పొగరుతో కాదు ప్రేమతో చెబుతున్నాను'' అన్నారు అనురాగ్ పలుట్ల. ''ఫ్యామిలీ రోడ్ ట్రిప్ నేపథ్యంలో సాగే ఈ మూవీ కొత్తగా ఉంటుంది'' అన్నారు రాగ్ మయూర్. ''మా సినిమాని అందరూ సపోర్ట్ చేయాలి'' అన్నారు ప్రియా వడ్లమాని. ఈ టీజర్ లాంచ్ వేడుకలో డైరెక్టర్ సందీప్ రాజ్, హీరో తిరువీర్, ఈటీవీ విన్ కంటెంట్ హెడ్ నితిన్ చక్రవర్తి, చిత్ర యూనిట్ సభ్యులు పాల్గొన్నారు.

ఓటీటీ ఇది చూడొచ్చు

ఓటీటీలో 'ఇది చూడొచ్చు' అనే చిత్రాలు చాలా ఉంటాయి. ప్రస్తుతం స్ట్రీమింగ్ అవుతున్న వాటిలో 'హాట్ స్పాట్' ఒకటి. ఈ చిత్రం గురించి తెలుసుకుందాం.

మూడు కథల సినిమా



సినిమాలో స్క్రీన్‌ప్లే అన్నది గాలి పటానికి దారం లాంటిది. ఆ దారాన్ని దర్శకుడు సరైన పంథాలో నడిపిస్తే గాలిపటం ప్రేక్షకుల అభిమాన ఆకాశంలో అందనంత ఎత్తు ఎగురుతుంది. స్క్రీన్‌ప్లేలో ఎంత వైవిధ్యం ఉంటే అంత ప్రేక్షకులు దగ్గరవుతారు. నేటి దర్శకులు వాస్తవికతను చూపడానికి విభిన్న కోణాలు ఎంచుకుంటున్నారు. ఆ కోవలో రిలీజ్ అయిన సినిమా 'హాట్ స్పాట్'. సినిమా మాతృక తమిళం అయినా తెలుగు డబ్బింగ్‌తో ఆహా ఓటీటీ ద్వారా అందుబాటులో ఉంది. ఈ సినిమా దర్శకులు విఘ్నేష్ కార్తీక్. ఈ సినిమా మూడు కథల సమ్మిళితం. దర్శకుడు ఒక్కో కథకు ఒక్కో సందేశాన్నివ్వడం గమనార్హం. అలా అని ఇది పూర్తి సందేశాత్మక చిత్రం కాదు. యువతను విపరీతంగా ఆకట్టుకునే సినిమా. ఎందుకంటే దర్శకుడు మొదటి ఫ్రేమ్‌లోనే ఇది అడల్ట్ సినిమా అని చెప్తాడు.

'హాట్ స్పాట్' సినిమాను దర్శకుడు విభిన్న తరహాలో ప్రారంభిస్తాడు. సాధారణంగా ఓ దర్శకుడు ఎలా అయితే నిర్మాత దగ్గర తన కథను ప్రెజెంట్ చేస్తాడో అదే విధంగా ఈ సినిమా మొదలవడం గమనార్హం. ముందుగా చెప్పినట్టు ఈ సినిమాకి మూడు కథలు. ఒక కథకు ఇంకో కథకి అస్సలు సంబంధం వుండదు. ప్రతి కథకు ఓ భావోద్వేగం ఉంటుంది.

● మొదటి కథలో కొత్తగా పెళ్లయిన జంటకు పెళ్లి తరువాత ఇంట్లో వాళ్ళ వల్ల వచ్చే ఇబ్బందులను విభిన్నంగా చూపించారు. ఇక్కడ విభిన్నం అనే కన్నా కొత్త పంథా అని చెప్పవచ్చు. ఈ కథలో కుటుంబ విలువలు అన్న సూత్రాన్ని సరదా సరదా సన్నివేశాలతో అలరించారు.

● రెండో కథ ప్రేమానురాగం అన్న అంశం మీద నడుస్తుంది. ఇద్దరి ప్రేమికుల మధ్య వచ్చే సాధారణ అపోహలను, అపార్థాలను సున్నితమైన పరిష్కారంతో ఎలా దూరం చేశారు అన్నది రొమాంటిక్ యాంగిల్‌లో అద్భుతంగా చిత్రీకరించారు. ఈ రోజుల్లో ఏ సినిమా చూసినా ప్రేక్షకులు తరువాత వచ్చే సన్నివేశం గురించి ఊహించడమో లేదా పక్కనున్న వారితో చర్చించడమో చేస్తారు. కాని ఈ సినిమా చూసేటప్పుడు ప్రేక్షకుడి మనస్సు కథతో మాత్రమే ప్రయాణిస్తుంది.

● మూడో కథ ఆడపిల్లల సంరక్షణ మీద నడుస్తుంది. చిన్న పిల్లాడు మందు వేసుకోనని మారాం చేస్తే వాడికి ఇష్టమైన వంటకం చూపించి మనమెలాగైనా మందు తినిపిస్తాం. అలాగే దర్శకుడు ఈ కథలో తాను చెప్పదలచుకున్న పాయింట్ యువతకు సరైన రీతిలో చేరే విధంగా తెరకెక్కించారు. ఈ కథను చూసిన తరువాత ఎదిగే మన పిల్లల మీద మనం ఎంతో జాగ్రత్తను కనబరుస్తాం. కథ పాయింట్ ప్రకారం ఓ బీద కుటుంబంలోని అమ్మాయి తన ప్రతిభతో ఓ టెలివిజన్ షోకి ఎంపికవుతుంది. ఆ షోలో ఆ అమ్మాయి చాలా రౌండ్స్ గెలిచి ఇంకో రౌండ్ ఉండనగా ఓడిపోతుంది. ఆ అమ్మాయి ఎందుకు ఓడిపోతుంది? ఆ తర్వాత తను ఎదుర్కొన్న పరిస్థితులేంటి? అనే అంశాలతో రియాల్టీ షోల ప్రభావం పిల్లలపై ఎలా ఉంది? అనేది ప్రధానాంశంగా చూపించారు. ఈ సినిమా సందేశం సమాజంలోని ప్రతి ఒక్కరికీ అవసరం.

ఇలా మూడు కథల సమాహారంతో రూపొందిన 'హాట్ స్పాట్' బాధ్యతతో చూడాల్సిన సినిమా.

– ఇంటూరు హరికృష్ణ



తొలి 'డోపీ' దొరికాడు!

ఒలింపిక్స్‌లో ప్రారంభోత్సవ వేడుకలకు ముందే డోపింగ్‌తో ఆటగాడు సస్పెండ్ అయ్యాడు. ఇరాక్‌కు చెందిన జూడో ఆటగాడు సజ్జాద్ సెహెన్ నిషేధిత ఉత్ప్రేరకాలు మెటాన్‌డినోన్, బోల్డెనోన్ తీసుకున్నట్లుగా పరీక్షల్లో తేలింది. మంగళవారం జరిగే పోటీల్లో ఈ జూడో ప్లేయర్ 81 కేజీల విభాగంలో పోటీ పడాల్సి ఉండగా, ఇప్పుడు 'పాజిటివ్'గా దొరికిపోయాడు. దాంతో అతడిని పోటీల నుంచి తప్పించడంతో పాటు ఒలింపిక్స్‌కు సంబంధించిన ఎలాంటి కార్యక్రమంలోనూ పాల్గొనకుండా నిషేధం విధిస్తున్నట్లు ఇంటర్నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఐటీఏ) ప్రకటించింది.

3 ముగ్గురు బ్రెజిల్ ట్రాక్ అండ్ ఫీల్డ్ అథ్లెట్లు ఒలింపిక్స్ ప్రారంభోత్సవం రోజే 'కోర్ట్ ఆఫ్ ఆర్బిట్రేషన్ ఫర్ స్పోర్ట్స్'లో అప్పీల్ నెగ్గి అనూహ్యంగా పారిస్ విశ్వక్రీడలకు అర్హత సంపాదించారు. పోల్ వాల్టర్ లివియా అవన్సిని, రేస్ వాకర్ మ్యాక్స్ బటిస్టా, స్ప్రింటర్ హైగోర్ బెజెరాలకు ముగ్గురు జడ్జిల ప్యానెల్ అనుకూలంగా ఫాస్ట్‌ట్రాక్ తీర్పునిచ్చింది.

ప్రతి అథ్లెట్ దేశానికి గర్వకారణం: మోదీ

పారిస్ ఒలింపిక్స్‌లో పాల్గొంటున్న భారత అథ్లెట్లకు శుభాకాంక్షలు. ప్రతి క్రీడాకారుడు దేశానికి గర్వకారణం. విశ్వ వేదికపై అసాధారణమైన ప్రదర్శనలతో క్రీడాస్ఫూర్తిని ప్రకాశింపజేయండి. మీ ఆటతీరుతో భవిష్యత్తు తరాలకు ఆదర్శంగా నిలవండి.

–నరేంద్ర మోదీ, ప్రధానమంత్రి

లాహిరి లాహిరి లాహిరిలో...

అట్టహాసంగా ఒలింపిక్స్ క్రీడోత్సవం ● ఫ్రెంచ్ పరిమళం గుబాళింపు
సెన్ నదీ తీరం వెంట సాగిన వేడుకలు ● ఆతిథ్య దేశపు ఘనతల ప్రదర్శన



ఈఫిల్ టవర్ సమీపాన చారిత్రక 'ట్రొకార్డో' వద్ద ప్రారంభమైన పరేడ్ సెన్ నదీ తీరం వెంట సాగింది. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమాన్యుయెల్ మాక్రాన్, ఐఓసీ అధ్యక్షుడు థామస్ బాక్‌తో పాటు దాదాపు 100 దేశాలకు చెందిన ప్రతినిధులు ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరయ్యారు. అన్నింటికంటే ముందు సెన్ నదిపై ఉన్న పొంట్ డి ఆస్టర్‌లిజ్ బ్రిడ్జిపై ఫ్రాన్స్ జాతీయ పతాకంలోని ఎరుపు, తెలుపు, నీలి రంగులను వెదజల్లుతూ నయనానందకరంగా కార్యక్రమం మొదలైంది. మిమ్మల్ని కలవడం చాలా ఆనందంగా ఉంది అంటూ ఫ్రెంచ్ భాషలో 'ఎన్‌చాంట్' నినాదంతో పడవలపై ఆటగాళ్ల పరేడ్ మొదలైంది. ఎప్పటిలాగే తొలి ఒలింపిక్స్‌కు వేదికైన గ్రీస్ బృందం అందరికంటే ముందుగా రాగా, ఐఓసీ శరణార్థి టీమ్ దానిని అనుసరించింది. ఫ్రెంచ్ అక్షరమాలలో జట్లు వరుసగా వచ్చాయి. బోట్‌లు వెళుతున్న సమయంలో ఫ్రెంచ్ సంగీతాన్ని నేపథ్యంలో వినిపించారు. అనంతరం ప్రఖ్యాత పాప్ సింగ్ లేడీ గాగా తన ఆటపాటతో అలరించింది.







పారిస్: ప్రారంభోత్సవంలో భాగంగా ఆ తర్వాత ఫ్రాన్స్ దేశపు చరిత్ర, సంస్కృతి, సంగీతం అన్నీ ప్రతిబింబించేలా వరుసగా కార్యక్రమాలు సాగాయి. 80 మంది కళాకారులతో ఫ్రెంచ్ క్యాబరే డ్యాన్స్ 'కెన్ కెన్'ను ప్రదర్శించగా... పారిస్ ఒలింపిక్ క్రీడలను నిర్వహించడంలో పని చేసిన కార్మికులు, సామాన్య ప్రజలకు అంకితం ఇస్తూ 'సింక్రానిసిటీ' పేరుతో షోను ఫ్రాన్స్ పర్యాటక ప్రదేశాల్లో ప్రఖ్యాతమైన 'నోటర్ డేమ్ క్యాథడ్రిల్' వద్ద నిర్వహించారు. ఆపై ఫ్రెంచ్ సాహిత్యం విశేషాలు తెలిపే, ఆ దేశపు ప్రస్థానాన్ని తెలిపే థీమ్‌తో ప్రోగ్రాం జరిగింది. ఈ క్రమంలో ఫ్రెంచ్ విప్లవ కాలపు గీతాలను కూడా వినిపించారు. చారిత్రక ల్యూవ్ మ్యూజియం, మేడలీన్ చిత్రం తదితర కళాఖండాలను గుర్తుకు తెస్తూ వాటిని కళ్లకు కట్టినట్లుగా చూపించారు. ఆ తర్వాత ఫ్రెంచ్ సినిమాకు నీరాజనం అంటూ కార్యక్రమం సాగింది. అనంతరం ఫ్రాన్స్ జాతీయ గీతాన్ని వినిపించారు. ఈ సమయంలో ఫ్రెంచ్ చరిత్రలో పది మంది ప్రముఖ మహిళల బంగారు విగ్రహాలను ప్రదర్శించారు.



78 మందితో మన బృందం...

బోట్‌లపై పరేడ్‌లో 84వ స్థానంలో భారత జట్టు వచ్చింది. ఫ్లాగ్ బేరర్లు పీవీ సింధు, ఆచంట శరత్ కమల్ ముందుండి భారీ జాతీయ పతాకాన్ని ప్రదర్శించగా... ఇతర అథ్లెట్లు కూడా చేతుల్లో చిన్న పతాకాలతో అభివందనం చేశారు. ఒలింపిక్స్‌లాంటి విశ్వ సంబరంలో పాల్గొంటున్న ఆనందం అందరిలోనూ కనిపించింది. దీపిక కుమారి, లవ్లీనా బొర్గొహైన్, మనికా బత్రా, రోహన్ బోపన్న, సుమీత్ నగాల్, శ్రీరామ్ బాలాజీ తదితరులు పరేడ్‌లో భాగమయ్యారు. ప్రారంభోత్సవ వేడుకల్లో భారత్ నుంచి ఆటగాళ్లు, అధికారులు కలిపి మొత్తం 78 మంది పాల్గొన్నారు. భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) అధ్యక్షురాలు పీటీ ఉష, పారిస్ ఒలింపిక్స్‌లో భారత చెఫ్ డి మిషన్ గగన్ నారంగ్ కలిసి ఈ బృందాన్ని ఎంపిక చేశారు. శనివారం పోటీలో పాల్గొనే ప్లేయర్లతో పాటు ఇంకా పారిస్‌కు చేరుకోని అథ్లెట్లు, వెయిట్‌లిఫ్టర్లు, రెజ్లర్లు ఈ కార్యక్రమంలో భాగం కాలేదు. శనివారం తమ పోటీలు లేని షూటర్లు అంజుమ్, సిఫ్ట్ కౌర్, ఐశ్వర్య ప్రతాప్, అనీశ్ కూడా ఈ ఉత్సవంలో పాల్గొన్నారు. భారత హాకీ జట్టు నేడు న్యూజిలాండ్‌తో తలపడనుండటంతో జట్టులోని రిజర్వ్ ఆటగాళ్లు మాత్రమే హాజరయ్యారు.

'తస్వ' డిజైన్లతో...

ప్రారంభోత్సవ కార్యక్రమంలో భారత బృందం ధరించిన డ్రెస్‌లను ప్రముఖ కంపెనీ 'తస్వ' తయారు చేసింది. పురుషుల డ్రెస్‌లలో, మహిళల చీరకట్టులో కూడా అంచులను భారత త్రివర్ణ పతాకపు మూడు రంగులతో డిజైన్ చేశారు. 'తస్వ' కంపెనీ ఆదిత్య బిర్లా గ్రూప్‌నకు చెందినది కాగా... ఇందులో భాగంగా ఉన్న ప్రఖ్యాత ఫ్యాషన్ డిజైనర్ తరుణ్ తహిలియాని పర్యవేక్షణలోనే భారత టీమ్ డ్రెస్ రూపకల్పన జరిగింది. మరో వైపు మన ఆటగాళ్లు పోటీల్లో పాల్గొనే సమయంలో ఉపయోగించే కిట్‌లను ప్రముఖ సంస్థ జిందాల్ గ్రూప్‌నకు చెందిన 'ఇన్‌స్పైర్' రూపొందించింది. జిందాల్ గ్రూప్ గతంలో 2022 కామన్వెల్త్ క్రీడల్లో, 2023 ఆసియా క్రీడల్లో కూడా భారత బృందానికి కిట్ స్పాన్సర్‌గా వ్యవహరించింది. పారిస్ ఒలింపిక్స్‌లో భారత ప్లేయర్లు వాడే స్పోర్ట్స్ కిట్‌లను డిజైనర్ ఆఖిబ్ వాని రూపొందించాడు. నీరజ్ చోప్రా, మనూ భాకర్, మనికా బాత్రా తదితర ఆటగాళ్లు జిందాల్ స్పోర్ట్స్ మేనేజ్‌మెంట్ గ్రూప్‌లో భాగంగా ఉన్నారు.

తొలి రోజు 14 స్వర్ణాల కోసం...

పారిస్: విశ్వ క్రీడల్లో తొలిరోజు 14 స్వర్ణాల కోసం క్రీడాకారులు పోటీపడనున్నారు. ఎనిమిది క్రీడాంశాల్లో మెడల్ ఈవెంట్స్ ఉన్నాయి. డైవింగ్, రగ్బీ సెవెన్స్, షూటింగ్, స్కేట్ బోర్డింగ్ క్రీడాంశాల్లో ఒక్కో స్వర్ణ పతకం కోసం తలపడతారు. స్విమ్మింగ్‌లో అత్యధికంగా నాలుగు స్వర్ణాలు లభిస్తాయి. రోడ్ సైక్లింగ్, ఫెన్సింగ్, జూడో క్రీడాంశాల్లో రెండు చొప్పున పసిడి పతకాలు అందజేస్తారు.



జైస్మిన్, నిఖత్, ప్రీతి, అమిత్, నిశాంత్ దేవ్, లవ్లీనా

భారత బాక్సర్లకు క్లిష్టమైన 'డ్రా'

పారిస్: విశ్వ క్రీడల్లో భారత బాక్సర్లు పతకాలు సాధించాలంటే శక్తివంతమైన 'పంచ్'లు విసరాల్సిందే. టోక్యో ఒలింపిక్స్‌లో 69 కేజీల విభాగంలో కాంస్య పతకం గెలిచిన లవ్లీనా బొర్గొహైన్... తొలిసారి ఒలింపిక్స్‌లో పోటీపడుతున్న రెండుసార్లు ప్రపంచ చాంపియన్ నిఖత్ జరీన్‌తోపాటు ప్రీతి పవార్, జైస్మిన్ లంబోరియాలకు క్లిష్టమైన 'డ్రా' ఎదురైంది. 50 కేజీల తొలి రౌండ్‌లో నిఖత్ జర్మనీ ప్లేయర్ మాక్సీ క్లొట్జెర్‌తో ఆడుతుంది. ఈ బౌట్‌లో గెలిస్తే రెండో రౌండ్‌లో ప్రస్తుత ఆసియా చాంపియన్, వరల్డ్ చాంపియన్ వు యు (చైనా)తో తలపడాల్సి ఉంటుంది. ఈ అడ్డంకిని నిఖత్ దాటితే క్వార్టర్ ఫైనల్లో చుట్‌హమట్ రక్సాట్ (థాయ్‌లాండ్) లేదా సబీనా బొబొకులోవా (ఉజ్బెకిస్తాన్)లలో ఒకరితో ఆడుతుంది. ఇటీవల స్ట్రాండ్జా స్మారక టోర్నీ ఫైనల్లో సబీనా చేతిలో, గత ఏడాది ఆసియా క్రీడల సెమీఫైనల్లో రక్సాట్ చేతిలో నిఖత్ ఓడిపోయింది. ఈసారి 75 కేజీల విభాగంలో పోటీపడుతున్న లవ్లీనా తొలి రౌండ్‌లో సునీవా హాఫ్‌స్టడ్ (నార్వే)తో ఆడుతుంది. క్వార్టర్ ఫైనల్లో లవ్లీనాకు ప్రత్యర్థిగా రెండుసార్లు ఒలింపిక్ పతక విజేత లీ కియాన్ (చైనా) ఎదురుకావచ్చు. గత ఆసియా క్రీడల్లో ఫైనల్లో లీ కియాన్ చేతిలో లవ్లీనా ఓడిపోయింది. జైస్మిన్ (57 కేజీలు) తొలి రౌండ్‌లో నెస్తీ పెటిసియో (ఫిలిప్పీన్స్)తో ఆడుతుంది. తొలి రౌండ్‌లో జైస్మిన్ నెగ్గితే రెండో రౌండ్‌లో యూరోపియన్ చాంపియన్, మూడో సీడ్ అమీనా జిదాని (ఫ్రాన్స్)తో ఆడే అవకాశం ఉంది. ప్రీతి పవార్ (54 కేజీలు) తొలి రౌండ్‌లో వియత్నాం బాక్సర్ వో థి కిమ్ అన్‌తో ఆడుతుంది. మరోవైపు పురుషుల విభాగంలో ఇద్దరు భారత బాక్సర్లు అమిత్ పంఘాల్ (51 కేజీలు), నిశాంత్ దేవ్ (71 కేజీలు) తొలి రౌండ్‌లో 'బై' పొందారు.

బాక్సింగ్

మహిళల 54 కేజీల తొలి రౌండ్ బౌట్: ప్రీతి పవార్ x థి కిమ్ అన్ వో (వియత్నాం); అర్ధరాత్రి గం. 12:05 నుంచి.

రోయింగ్

పురుషుల సింగిల్ స్కల్స్ హీట్స్: బలరాజ్ పన్వర్ (మధ్యాహ్నం గం. 12:30 నుంచి).

టేబుల్ టెన్నిస్

పురుషుల సింగిల్స్ ప్రిలిమినరీ రౌండ్ మ్యాచ్: హర్మీత్ దేశాయ్ x జైద్ అబో యమన్ (జోర్డాన్) రాత్రి గం. 7:15 నుంచి.

టెన్నిస్

పురుషుల డబుల్స్ తొలి రౌండ్: రోహన్ బోపన్న–శ్రీరామ్ బాలాజీ x రోజర్ వాసెలిన్–ఫాబియన్ రెబూల్ (ఫ్రాన్స్) మధ్యాహ్నం గం. 3:30 నుంచి.

విశ్వ క్రీడల ప్రారంభోత్సవం ముగిసింది. ఇక నేటి నుంచి పతకాల వేట మొదలుకానుంది. భారత్ విషయానికొస్తే తొలి రోజు శనివారం షూటింగ్ క్రీడాంశంలో మన షూటర్లు పతకాల కోసం తమ తుపాకీలకు పని చెప్పనున్నారు. 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో భారత్ నుంచి రెండు జోడీలు ముందుగా క్వాలిఫయింగ్‌లో పోటీపడనున్నాయి. క్వాలిఫయింగ్‌లో టాప్–4లో నిలిచిన నాలుగు జోడీలు స్వర్ణ, రజత, కాంస్య పతకాల కోసం పోటీపడతాయి.

గురి అదరాలి... తీపి కబురు వినాలి

నేటి నుంచి భారత షూటర్ల పతకాల వేట

- తొలి రోజు 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్
- బరిలో రెండు భారత జోడీలు

పారిస్: ఒలింపిక్స్ క్రీడల్లో భారత షూటర్లు పతకాలు సాధించి పుష్కరకాలం గడిచింది. చివరిసారి 2012 లండన్ ఒలింపిక్స్‌లో గగన్ నారంగ్ పురుషుల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ వ్యక్తిగత విభాగంలో కాంస్య పతకం సాధించగా... విజయ్ కుమార్ పురుషుల 25 మీటర్ల ర్యాపిడ్ ఫైర్ పిస్టల్ విభాగంలో రజత పతకం గెలిచాడు. ఆ తర్వాత 2016 రియో ఒలింపిక్స్‌లో, 2020 టోక్యో ఒలింపిక్స్‌లో భారత షూటర్లు గురి తప్పారు. ఒక్క పతకం కూడా నెగ్గకుండానే రిక్తహస్తాలతో తిరిగి వచ్చారు. ఈసారి పారిస్ ఒలింపిక్స్‌లో రికార్డుస్థాయిలో భారత్ నుంచి అత్యధికంగా 21 మంది షూటర్లు అర్హత సాధించారు. ప్రతి మెడల్ ఈవెంట్‌లో భారత షూటర్లు బరిలో ఉన్నారు. ఈ నేపథ్యంలో శనివారం షూటర్లకు తొలి పరీక్ష ఎదురుకానుంది. 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో మెడల్ ఈవెంట్ ఉంది. ఈ విభాగంలో భారత్ నుంచి అర్జున్ బబూటా–రమితా జిందాల్ జోడీ... సందీప్ సింగ్–ఇలవేనిల్ వలారివన్ జోడీ పోటీపడతాయి. ఓవరాల్‌గా 28 జోడీలు క్వాలిఫయింగ్‌లో ఉన్నాయి. క్వాలిఫయింగ్ ముగిశాక టాప్–4లో నిలిచిన జోడీలు మెడల్ రౌండ్‌కు అర్హత సాధిస్తాయి. టాప్–2లో నిలిచిన జంటలు స్వర్ణ–రజత పతకాల కోసం... మూడు–నాలుగు స్థానాల్లో నిలిచిన జోడీలు కాంస్య పతకం కోసం పోటీపడతాయి. శనివారమే పురుషుల, మహిళల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ క్వాలిఫయింగ్ ఈవెంట్ జరుగుతుంది.



షూటింగ్

10 మీటర్ల ఎయిర్ రైఫిల్ మిక్స్‌డ్ టీమ్ క్వాలిఫయింగ్: సందీప్ సింగ్/ఇలవేనిల్ వలారివన్; అర్జున్ బబూటా/రమితా జిందాల్ (మధ్యాహ్నం గం. 12:30 నుంచి). ఫైనల్: మధ్యాహ్నం గం. 2 నుంచి

పురుషుల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ క్వాలిఫయింగ్: అర్జున్ సింగ్ చీమా, సరబ్‌జోత్ సింగ్ (మధ్యాహ్నం గం. 2 నుంచి)

మహిళల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ క్వాలిఫయింగ్: మనూ భాకర్, రిథమ్ సాంగ్వాన్ (సాయంత్రం గం. 4 నుంచి).



నేడు భారత క్రీడాకారుల షెడ్యూల్

బ్యాడ్మింటన్

పురుషుల సింగిల్స్ గ్రూప్ 'ఎల్' తొలి లీగ్ మ్యాచ్: లక్ష్య సేన్ x కెవిన్ కార్డన్ (గ్వాటెమాలా) రాత్రి గం. 7:10 నుంచి.

పురుషుల డబుల్స్ గ్రూప్ 'సి' తొలి లీగ్ మ్యాచ్: సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టి x లుకాస్ కోర్వీ–రోనన్ లాబర్ (ఫ్రాన్స్) రాత్రి గం. 8 నుంచి.

మహిళల డబుల్స్ గ్రూప్ 'సి' తొలి లీగ్ మ్యాచ్: అశ్విని పొన్నప్ప–తనీషా క్రాస్టో x కిమ్ సో యోంగ్–కాంగ్ హీ యోంగ్ (దక్షిణ కొరియా) రాత్రి గం. 11:50 నుంచి.

విజయమే లక్ష్యంగా...

నేడు తొలి లీగ్ మ్యాచ్‌లో న్యూజిలాండ్‌తో భారత్ 'ఢీ'

రాత్రి గం. 9 నుంచి స్పోర్ట్స్ 18, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం

పారిస్: మూడేళ్ల క్రితం టోక్యో ఒలింపిక్స్‌లో కాంస్య పతకం సాధించి 41 ఏళ్ల నిరీక్షణకు తెరదించిన భారత పురుషుల హాకీ జట్టు అదే జోరును 'పారిస్'లోనూ కొనసాగించాలనే లక్ష్యంతో ఉంది. నేడు జరిగే పూల్ 'బి' తొలి లీగ్ మ్యాచ్‌లో న్యూజిలాండ్‌తో భారత జట్టు తలపడనుంది. హర్మన్‌ప్రీత్ సింగ్ సారథ్యంలోని టీమిండియా స్థాయికి తగ్గట్టు ఆడితే శుభారంభం చేస్తుంది. పూల్ 'బి'లోనే డిఫెండింగ్ చాంపియన్ బెల్జియం, ఆస్ట్రేలియా, అర్జెంటీనా, ఐర్లాండ్ జట్లున్నాయి. మరోవైపు పూల్ 'ఎ'లో నెదర్లాండ్స్, జర్మనీ, బ్రిటన్, స్పెయిన్, దక్షిణాఫ్రికా, ఫ్రాన్స్ జట్లున్నాయి. లీగ్ దశ మ్యాచ్‌లు ముగిశాక రెండు గ్రూప్‌ల నుంచి టాప్–4లో నిలిచిన జట్లు క్వార్టర్ ఫైనల్ దశకు అర్హత సాధిస్తాయి. న్యూజిలాండ్‌తో మ్యాచ్ తర్వాత భారత జట్టు వరుసగా అర్జెంటీనా (29న), ఐర్లాండ్ (30న), బెల్జియం (ఆగస్టు 1న), ఆస్ట్రేలియా (ఆగస్టు 2న) జట్లతో ఆడుతుంది. పారిస్ ఒలింపిక్స్ తర్వాత అంతర్జాతీయ హాకీకి గుడ్‌బై చెబుతానని ప్రకటించిన మేటి గోల్‌కీపర్ శ్రీజేశ్‌కు వీడ్కోలు కానుకగా పతకం అందించాలని హర్మన్‌ప్రీత్ బృందం పట్టుదలతో ఉంది. అందుబాటులో ఉన్న రికార్డుల ప్రకారం భారత్, న్యూజిలాండ్ జట్లు ఇప్పటి వరకు ముఖాముఖిగా 105 మ్యాచ్‌ల్లో తలపడ్డాయి. 58 మ్యాచ్‌ల్లో భారత్ గెలుపొందగా...30 మ్యాచ్‌ల్లో న్యూజిలాండ్ నెగ్గింది. 17 మ్యాచ్‌లు 'డ్రా'గా ముగిశాయి. శనివారమే జరిగే ఇతర గ్రూప్ 'బి' లీగ్ మ్యాచ్‌ల్లో ఆస్ట్రేలియాతో అర్జెంటీనా... బెల్జియంతో ఐర్లాండ్ తలపడతాయి. గ్రూప్ 'ఎ'లో బ్రిటన్‌తో స్పెయిన్; దక్షిణాఫ్రికాతో నెదర్లాండ్స్; జర్మనీతో ఫ్రాన్స్ ఆడతాయి.



పారిస్ ఒలింపిక్ క్రీడా గ్రామంలో భారత హాకీ జట్టు

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
1,293	429
81,333	24,835

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	17,431	▲	250
డోజోన్స్	40,712	▲	777
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,286	▲	99
డాక్స్	18,418	▲	119
షాంఘై	2,891	▲	4
నికాయ్	37,667	▼	202

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై

బంగారం (24 క్యారట్)		
68,131	▼	96
బంగారం (22 క్యారట్)		
67,858	▼	96
వెండి (కిలో)		
81,271	▼	203

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	83.33	84.35
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	106.55	109.12
€	యూరో	ఎస్‌బీఐ	89.84	92.20
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	53.91	55.10
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	53.96	55.88
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	60.04	64.74
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.43	22.99
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.91	23.69
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.68	12.50

'ఎలక్ట్రిక్' స్కీమ్
మరో రెండు నెలలు



న్యూఢిల్లీ: ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని ప్రోత్సహించేందుకు ఉద్దేశించిన ఎలక్ట్రిక్ మొబిలిటీ ప్రమోషన్ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం మరో 2 నెలలు పొడిగించింది. భారీ పరిశ్రమ శాఖ రూ.500 కోట్ల బడ్జెట్ కేటాయిస్తూ 2024 ఏప్రిల్ 1 నుంచి అమలులోకి తెచ్చిన ఈ పథకం వాస్తవానికి జూలై 31తో ముగియనుంది. ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయంతో ఈ స్కీమ్ సెప్టెంబర్ 30 వరకు కొనసాగనుంది. బడ్జెట్ కేటాయింపులను ప్రభుత్వం మొత్తం రూ.778 కోట్లకు పెంచింది.

విజయ్ మాల్యా
మూడేళ్ల బహిష్కరణ



న్యూఢిల్లీ: విదేశాలకు పరారైన వ్యాపారవేత్త విజయ్‌మాల్యా భారత సెక్యూరిటీస్ మార్కెట్లలో మూడేళ్ల పాటు పాల్గొనకుండా సెబీ నిషేధించింది. 2006 జనవరి నుంచి 2008 మార్చి మధ్య కాలంలో 'మ్యాటర్‌హార్న్ వెంచర్స్' అనే విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్ (ఎఫ్ఐఐ) ద్వారా విజయ్ మాల్యా, తన గ్రూపు కంపెనీలైన హెర్బర్ట్‌సన్స్ లిమిటెడ్, యునైటెడ్ స్పిరిట్స్ లిమిటెడ్‌లో రహస్యంగా లావాదేవీలు జరిపినట్లు సెబీ తేల్చింది. పలు విదేశీ బ్యాంక్ ఖాతాల ద్వారా నిర్వహించినట్లు తేలడంతో సెబీ ఈ చర్య తీసుకుంది.

జియో ఎయిర్‌ఫైబర్
రూ.1,000 డిస్కౌంట్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: రిలయన్స్ జియో ఎయిర్‌ఫైబర్ ఇన్‌స్టలేషన్‌పై రూ.1,000 డిస్కౌంట్ ప్రకటించింది. అన్ని నెలవారీ ప్యాక్‌లపై ఈ ఆఫర్ వర్తిస్తుంది. ప్రస్తుతం కంపెనీ రూ.599, 888, 899, రూ.1,199 ప్యాక్‌లను అందుబాటులో ఉంచింది. ఆగస్ట్ 15 వరకు ఆఫర్ ఉంటుంది. ఏప్రిల్–జూన్ మధ్య 11 లక్షల పైగా కొత్త ఎయిర్‌ఫైబర్ కస్టమర్లు చేరారు. మొత్తం ఎయిర్‌ఫైబర్ యూజర్లు దేశవ్యాప్తంగా 1.2 కోట్ల మంది ఉన్నారు.

మార్కెట్ పోల్‌వాల్ట్!



- సెన్సెక్స్ 1,293 పాయింట్లు జంప్
- నిఫ్టీ 429 పాయింట్లు అప్
- సరికొత్త గరిష్టానికి నిఫ్టీ
- 5 రోజుల నష్టాలకు ఒక్క రోజులో చెక్

గత వారాంతం నుంచి నష్టాల బాటలో సాగుతున్న దేశీ స్టాక్ మార్కెట్లు ఒక్కసారిగా యూటర్న్ తీసుకున్నాయి. భారీ లాభాలతో కదం తొక్కాయి. ఐదు రోజుల్లో వాటిల్లిన నష్టాలను ఒక్క రోజులోనే లాభాలతో మరిపించాయి. దీంతో ఎన్ఎస్ఈ ప్రధాన ఇండెక్స్ నిఫ్టీ చరిత్రాత్మక గరిష్టాన్ని చేరింది.

ముంబై: గత వారం చివర్లో ప్రారంభమైన అమ్మకాలకు ఈ వారం చివర్లో చెక్ పడింది. ఇన్వెస్టర్లు కొనుగోళ్లకు ఆసక్తి చూపడంతో ప్రారంభం నుంచీ మార్కెట్లు బలపడుతూ వచ్చాయి. ట్రేడింగ్ ముగిసేసరికి సెన్సెక్స్ 1,293 పాయింట్లు జంప్‌చేసి 81,333 వద్ద నిలిచింది. ఒక దశలో 1,387 పాయింట్ల (81,427)వరకూ ఎగసింది. ఇక నిఫ్టీ 429 పాయింట్లు దూసుకెళ్లి 24,835 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో 24,861 వరకూ బలపడింది. ఇవి సరికొత్త గరిష్టాలుకావడం విశేషం! ఫలితంగా గత ఐదు రోజుల్లో కోల్పోయిన 1,304 పాయింట్లను సెన్సెక్స్, 395 పాయింట్లను నిఫ్టీ రికవర్ చేసుకున్నాయి. కొత్త డెరివేటివ్ సిరీస్ తొలి రోజు మార్కెట్లు ఉన్నట్టుండి జోరు చూపినట్లు నిపుణులు పేర్కొన్నారు. యూఎస్ జీడీపీ గణాంకాలు ఇన్వెస్టర్లకు జోష్‌నిచ్చినట్లు అభిప్రాయపడ్డారు.

ఓఎన్‌జీసీ మాత్రమే

ఎన్ఎస్ఈలో అన్ని రంగాలూ లాభపడ్డాయి. మెటల్, ఐటీ, ఫార్మా, ఆటో 3–2.5 శాతం మధ్య వృద్ధి చూపాయి. నిఫ్టీ దిగ్గజాలలో ఓఎన్‌జీసీ మాత్రమే ప్రస్తావించదగ్గ స్థాయిలో(1 శాతం) నీరసించగా.. మిగిలిన 49 బ్లూచిప్స్‌లో 40 వరకూ 10–0.5 శాతం మధ్య ఎగశాయంటే కొనుగోళ్ల జోరును అర్థం చేసుకోవచ్చు. ప్రధానంగా శ్రీరామ్ ఫైనాన్స్, సిప్లా, దివీస్, ఎయిర్‌టెల్, అపోలో, అదానీ ద్వయం, విప్రో, టాటా స్టీల్, సన్ ఫార్మా, హెచ్‌సీఎల్ టెక్, ఇన్ఫోసిస్, హిందాల్కో, సీఐఎల్, ఎంఅండ్ఎం, ఐటీసీ 10–2.5 శాతం మధ్య లాభపడ్డాయి.

చిన్న షేర్ల స్పీడ్

మార్కెట్ల బాటలో బీఎస్ఈ మిడ్‌క్యాప్ 2 శాతం, స్మాల్‌క్యాప్ 1 శాతం చొప్పున పెరిగాయి. ట్రేడైన షేర్లలో 2,595 లాభపడగా.. 1,354 నష్టపోయాయి. నగదు విభాగంలో విదేశీ ఇన్వెస్టర్లు రూ. 2,546 కోట్లు, దేశీ ఫండ్స్ రూ. 2,774 కోట్లు చొప్పున ఇన్వెస్ట్ చేశాయి.

వేదాంతా రూ. 4 డివిడెండ్



వేదాంతా ఈ ఏడాదికి రెండో మధ్యంతర డివిడెండ్‌గా షేరుకి రూ. 4 ప్రకటించింది. దీంతో షేరు 3% ఎగసి రూ. 445 వద్ద ముగిసింది.

పేటీఎం అప్పర్ సర్క్యూట్



పేటీఎం పేమెంట్ సర్వీసెస్‌లో రూ.50 కోట్ల పెట్టుబడులకు ఆర్‌బీఐ అనుమతించిదన్న వార్తలతో శుక్రవారం పేటీఎం షేరు అప్పర్ సర్క్యూట్‌ను (10%) తాకి రూ. 509 వద్ద క్లోజయ్యింది. కంపెనీ షేరు ఫిబ్రవరి 8 తర్వాత రూ. 500 మార్కును దాటడం ఇదే తొలిసారి.

ఐటీసీ 20 వేల కోట్ల పెట్టుబడి ప్రణాళిక
ఎఫ్ఎంసీజీ విభాగం భారీ విస్తరణ



న్యూఢిల్లీ: పారిశ్రామిక దిగ్గజం ఐటీసీ తమ కార్యకలాపాలను మరింత బలోపేతం చేసుకోవడంపై దృష్టి పెడుతోంది. ఇందులో భాగంగా ఎఫ్ఎంసీజీ విభాగం సామర్థ్యాలను పెంచుకోవడం, ఆధునీకరించడం, నవకల్పనలపై మధ్యకాలికంగా రూ. 20,000 కోట్లు ఇన్వెస్ట్ చేసే ప్రణాళికల్లో ఉంది. సంస్థ వార్షిక సర్వసభ్య సమావేశంలో చైర్మన్ సంజీవ్‌పురి ఈ విషయాలు తెలిపారు. ప్రతికూలతలు ఉన్నప్పటికీ ప్రత్యర్థి సంస్థలకు దీటుగా పోటీనిచ్చేందుకు వివిధ వ్యాపార విభాగాలపై ఇప్పటికే గణనీయంగా పెట్టుబడులు పెట్టినట్లు ఆయన వివరించారు. అత్యంత వేగంగా ఎదుగుతున్న పెద్ద ఎకానమీగా నిలుస్తున్న భారత్ భవిష్యత్ వృద్ధి అవకాశాలు ఆశావహంగా ఉన్నాయని పురి పేర్కొన్నారు. రాజకీయ, భౌగోళిక ఉద్రిక్తతలతో సర్వత్రా సంక్షోభ పరిస్థితులు నెలకొన్న తరుణంలో వృద్ధి సాధనకు భారతదేశం స్ఫూర్తిమంతమైన దీపస్తంభంలాగా నిలుస్తోందన్నారు. గడిచిన నాలుగేళ్లలో తమ ఆదాయాలు వార్షికంగా 10.8 శాతం వృద్ధి చెంది రూ. 79,000 కోట్ల స్థాయికి చేరుకున్నాయని చెప్పారు. కరోనా మహమ్మారితో తీవ్రంగా దెబ్బతిన్న హోటల్స్, సిగరెట్ వ్యాపారాలు క్రమంగా కోలుకుంటున్నాయని వివరించారు. గత రెండేళ్లుగా సిగరెట్స్ వ్యాపారం 13.5% వార్షిక వృద్ధి నమోదు చేసిందని తెలిపారు.

'సాక్షి ప్లస్' ఈ–పేపర్‌లో ..
ఇంట్రాడే ట్రేడింగ్‌లో నష్టాలే అధికం / చైనా నిపుణులకు వీసాల జోరు పెంచండి



శాన్‌స్టార్ లిస్టింగ్ గుడ్

ఇటీవలే ఐపీవో ముగించుకున్న మొక్కల ఆధారిత స్పెషాలిటీ ప్రొడక్టుల కంపెనీ శాన్‌స్టార్ లిమిటెడ్ ఇష్యూ ధర రూ. 95తో పోలిస్తే తొలిరోజు 12 శాతం ప్రీమియంతో రూ. 106.4 వద్ద లిస్టయ్యింది. బీఎస్ఈలో తదుపరి 34 శాతం జంప్‌చేసి రూ. 128కు చేరింది. చివరికి 21 శాతం లాభంతో రూ. 115 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈలోనూ ఇదేవిధంగా కదిలి రూ. 115 వద్ద స్థిరపడింది. ఐపీవో ద్వారా రూ. 510 కోట్లు సమీకరించిన కంపెనీ మార్కెట్ విలువ రూ. 2,097 కోట్లను తాకింది.

రూ. 7 లక్షల కోట్లు ప్లస్



ఐదు రోజుల నష్టాలకు చెక్ పెడుతూ మార్కెట్లు హైజంప్ చేయడంతో ఒక్క రోజులో బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల విలువ రూ. 7.1 లక్షల కోట్లమేర బలపడింది. దీంతో ఇన్వెస్టర్ల సంపదగా పిలిచే మార్కెట్ విలువ రూ. 4,56,92,671 కోట్లను అధిగమించింది. డాలర్లలో 5.46 ట్రిలియన్లకు చేరింది. వెరసి బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల విలువలో సరికొత్త రికార్డు నమోదైంది.

ఇండస్‌ఇండ్ లాభం ప్లస్
క్యూ1లో రూ. 2,171 కోట్లు



ముంబై: ప్రైవేట్ రంగ దిగ్గజం ఇండస్‌ఇండ్ బ్యాంక్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2024–25) తొలి త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు సాధించింది. ఏప్రిల్–జూన్(క్యూ1)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 2 శాతం స్వల్ప వృద్ధితో రూ. 2,171 కోట్లను తాకింది. గతేడాది(2023–24) ఇదే కాలంలో రూ. 2,124 కోట్లు ఆర్జించింది. నికర వడ్డీ ఆదాయం 11 శాతం పుంజుకుని రూ. 5,408 కోట్లకు చేరింది. ఇతర ఆదాయం 10 శాతం అధికంగా రూ. 2,441 కోట్లను తాకింది. నికర వడ్డీ మార్జిన్లు 4.25 శాతం వద్ద ఫ్లాట్‌గా నమోదయ్యాయి. త్రైమాసికవారీగా స్థూల మొండిబకాయిలు(ఎన్‌పీఏలు) 1.94 శాతం నుంచి 2.02 శాతానికి, నికర ఎన్‌పీఏలు 0.58% నుంచి 0.6 శాతానికి పెరిగాయి. పన్నులు, కంటింజెన్సీలు కాకుండా ప్రొవిజన్లు రూ. 992 కోట్ల నుంచి రూ. 1,050 కోట్లకు పెరిగాయి.

ఫలితాల నేపథ్యంలో ఇండస్‌ఇండ్ షేరు 1.7 శాతం లాభంతో రూ. 1,403 వద్ద ముగిసింది.

ఇండిగో లాభం రూ. 2,729 కోట్లు

న్యూఢిల్లీ: విమానయాన దిగ్గజం ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024–25) తొలి త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు సాధించింది. ఏప్రిల్–జూన్(క్యూ1)లో నికర లాభం 12 శాతం క్షీణించి రూ. 2,729 కోట్లకు పరిమితమైంది. ఇండిగో బ్రాండ్ కంపెనీ గతేడాది(2023–24) ఇదే కాలంలో రూ. 3,091 కోట్లు ఆర్జించింది. అధిక ఇంధన ధరలు, ఇతర వ్యయాలు లాభాలను దెబ్బతీశాయి. అయితే విదేశీ మారక ప్రభావాన్ని మినహాయిస్తే తాజా త్రైమాసికంలో ఇండిగో లాభం రూ. 2,786 కోట్లకు చేరినట్లు కంపెనీ పేర్కొంది. మొత్తం ఆదాయం మాత్రం 18 శాతం ఎగసి రూ. 20,249 కోట్లను తాకింది. మొత్తం వ్యయాలు సైతం 24 శాతం పెరిగి రూ. 17,445 కోట్లకు చేరాయి. వీటిలో ఇంధన ఖర్చులు 23 శాతం పెరిగి రూ. 6,417 కోట్లుగా నమోదయ్యాయి. అంతేకాకుండా విమానాలు, ఇంజిన్ల అద్దె వ్యయాలు రూ. 195 కోట్ల నుంచి రూ. 624 కోట్లకు జంప్‌చేశాయి. జూన్ చివరికల్లా కంపెనీ 18 లీజులతో కలిపి 382 విమానాలను కలిగి ఉంది.

ఇండిగో షేరు 1.4 శాతం ఎగసి రూ. 4,491 వద్ద ముగిసింది.



సాక్షి స్పోర్ట్స్



రిత్విక్ జోడీకి నిరాశ

అట్లాంటా ఓపెన్ ఏటీపీ–250 టెన్నిస్ టోర్నీలో హైదరాబాద్‌కు చెందిన బొల్లిపల్లి రిత్విక్ చౌదరి పురుషుల డబుల్స్ విభాగంలో తొలి రౌండ్‌లోనే నిష్క్రమించాడు. అమెరికాలో జరుగుతున్న ఈ టోర్నీలో తొలి రౌండ్‌లో రిత్విక్–నిక్కీ పునాచా (భారత్) ద్వయం 6–7 (5/7), 4–6తో రెండో సీడ్ నథానియల్ లామోన్స్–జాక్సన్ విత్రో (అమెరికా) జంట చేతిలో పోరాడి ఓడిపోయింది. 81 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో రిత్విక్–నిక్కీ జోడి 10 ఏస్‌లు సంధించింది. రిత్విక్–నిక్కీలకు 4,130 డాలర్ల (రూ. 3 లక్షల 46 వేలు) ప్రైజ్‌మనీ లభించింది.

యూకీ బాంబ్రీ జోడీ పరాజయం

క్రొయేషియా ఓపెన్ ఏటీపీ–250 టెన్నిస్ టోర్నీలో పురుషుల డబుల్స్ క్వార్టర్ ఫైనల్లో టాప్ సీడ్ యూకీ బాంబ్రీ (భారత్)–ఒలివెట్టి (ఫ్రాన్స్) జోడీ 4–6, 6–1, 6–10తో గినార్డ్–గ్రెగోరి జాక్ (ఫ్రాన్స్) జోడీ చేతిలో ఓడిపోయింది. యూకీ–ఒలివెట్టిలకు 9,600 యూరోల (రూ. 8 లక్షల 72 వేలు) ప్రైజ్‌మనీ లభించింది.

శుభారంభంపై భారత్ దృష్టి

- నేడు శ్రీలంకతో తొలి టి20
- యువ ఆటగాళ్ల సత్తాకు పరీక్ష
- తొలిసారి గంభీర్ శిక్షణలో టీమిండియా బరిలోకి
- రాత్రి 7 గంటల నుంచి సోనీ స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం



టి20 సిరీస్ ట్రోఫీతో అసలంక, సూర్యకుమార్

పల్లెకెలె: భారత్ కొత్తకొత్తగా లంక పర్యటనను ప్రారంభించేందుకు సిద్ధమైంది. గతంలో టి20 సారథిగా వ్యవహరించినప్పటికీ సూర్యకుమార్ యాదవ్ ఈసారి గంభీర్ కోచింగ్‌లో నడవడం కొత్తే! టాపార్డర్‌లో రోహిత్ శర్మ, కోహ్లితో పాటు ఆల్‌రౌండర్ జడేజా పొట్టి ఫార్మాట్‌కు గుడ్‌బై చెప్పడంతో ఆ చాలెంజింగ్ స్థానాలు భర్తీ చేసే ఆటగాళ్లకు ఈ సిరీస్ సరికొత్తగా స్వాగతం పలకబోతోంది. మొత్తం పల్లెకెలె వేదికపైనే జరిగే మూడు టి20ల సిరీస్‌లో నేడు తొలి మ్యాచ్ జరుగుతోంది. కొత్త కోచ్ గౌతమ్ గంభీర్ అనుభవం, సూర్యకుమార్ సారథ్యం, సత్తాగల యువ ఆటగాళ్లతో భారత్ సమతూకంగా ఉంది. కొత్త జట్టు మేళవింపుతో శుభారంభంపై దృష్టి సారించింది. కొత్త కోచ్ గురించి కొత్తగా చెప్పుకోవాల్సిందేమీ లేదు. గంభీర్ ఓపెనర్‌గా నిరూపించుకున్నాడు. అంతకుమించి రెండు ప్రపంచకప్ (2007 టి20; 2011 వన్డే) విజయాల్లో కీలకపాత్ర పోషించాడు. అలాగే దీనితో పోల్చలేకపోయినా కూడా... ఐపీఎల్‌లో విజయవంతమైన సారథిగా, అనంతరం మెంటార్‌గానూ కోల్‌కతా నైట్‌రైడర్స్‌కు టైటిళ్లు అందించాడు. కాబట్టి గంభీర్ మార్గదర్శనంపై ఎవరికీ ఏ అనుమానాలు లేవు. అయితే పూర్తిగా యువ ఆటగాళ్లతో కూడిన జట్టును ఏ విధంగా సన్నద్ధం చేస్తారన్నదానిపైనే సర్వత్రా ఆసక్తినెలకొంది.

దుర్భేద్యంగా టీమిండియా

ఈ ఏడాది భారత జట్టు అద్భుతంగా రాణిస్తోంది. ప్రపంచకప్‌లో ట్రోఫీ గెలిచేదాకా జైత్రయాత్ర కొనసాగించింది. ఓవరాల్‌గా ఈ ఏడాది 16 టి20లు ఆడిన భారత్ 15 మ్యాచ్‌ల్లో గెలిచింది. జింబాబ్వేకెళ్లిన ద్వితీయశ్రేణి భారత జట్టు తొలి మ్యాచ్‌లో ఓటమి తప్ప సిరీస్ 4–1తో గెలిచి సత్తా చాటుకుంది. ఓపెనింగ్‌లో యశస్వి, గిల్‌లతో పాటు వన్‌డౌన్‌లో రిషభ్ పంత్ మెరిపిస్తే మిడిలార్డర్‌ను సూర్యకుమార్‌తో పాటు అనుభవజ్ఞుడైన హార్దిక్ పాండ్యా నడిపించగలడు. బౌలింగ్‌లో బుమ్రా కూడా విశ్రాంతిలో ఉండటంతో.... మొత్తం మీద అనుభవజ్ఞుల్లేని టీమిండియాకు ప్రస్తుతం పాండ్యానే పెద్ద దిక్కు. బౌలింగ్‌లో సిరాజ్, అర్ష్‌దీప్ సింగ్‌లు సత్తా చాటితే ఆరంభంలోనే వికెట్లు కూలుతాయి. గంభీర్ ప్లాన్ ముగ్గురు స్పిన్నర్లయితే వాషింగ్టన్ సుందర్, అక్షర్ పటేల్‌లతో పాటు రవి బిష్ణోయ్‌కి చాన్స్ లభిస్తుంది.

లంక ఎదురునిలిచేనా...

స్టార్లు లేకపోయినా భారత్ సత్తాపై ఎవరికీ ఏ అనుమానాల్లేవు. కానీ కొన్నేళ్లుగా శ్రీలంక ప్రదర్శన మాత్రం నిరాశజనకంగా సాగుతోంది. ఇలాంటి జట్టును అనుభవం లేని కెప్టెన్ చరిత్ అసలంక ఏ మేరకు నడిపిస్తాడో చూడాలి. టాపార్డర్‌లో నిసాంక, కుశాల్ మెండిస్ బౌలింగ్‌లో హసరంగ, పతిరణ తప్ప జట్టులో నిలకడగా ఆడే ఆటగాళ్లే కరువయ్యారు. సొంతగడ్డపై అనుకూలత కూడా టి20లకు ఏమాత్రం అక్కరకు రాదు. కాబట్టి భారత్ యువ ఆటగాళ్లతో ఉన్నా... వారిలో ఐపీఎల్ అపారమైన అనుభవాన్నిచ్చింది. ఈ నేపథ్యంలో శ్రీలంక సిరీస్ గెలిచేందుకు కాదు... మ్యాచ్ నెగ్గేందుకే ప్రతిసారీ యుద్ధం చేయక తప్పదు!

జట్లు (అంచనా)

భారత్: సూర్యకుమార్ (కెప్టెన్), యశస్వి, శుబ్‌మన్, రిషభ్ పంత్, హార్దిక్ పాండ్యా, శివమ్ దూబే, సుందర్, అక్షర్, అర్ష్‌దీప్, రవి బిష్ణోయ్/ఖలీల్ అహ్మద్, సిరాజ్. శ్రీలంక: అసలంక (కెప్టెన్), నిసాంక, కుశాల్ మెండిస్, పెరీరా, ఫెర్నాండో, షనక, హసరంగ, తీక్షణ, బినుర ఫెర్నాండో, మదుషంక, పతిరణ.

పిచ్, వాతావరణం

ఇది స్పిన్ వికెట్. నిలదొక్కుకుంటే 180 పైచిలుకు స్కోరు సాధించవచ్చు. అయితే స్పిన్నర్లతో ఇబ్బందులు తప్పవు. శనివారం పగటివేళ వర్షం కురిసే అవకాశముంది. కానీ రాత్రికల్లా తెరిపినిస్తుందని స్థానిక వాతావరణశాఖ తెలిపింది.

విండీస్ 282 ఆలౌట్

బర్మింగ్‌హామ్: ఇంగ్లండ్‌తో జరుగుతున్న చివరిదైన మూడో టెస్టులో వెస్టిండీస్ బ్యాటర్లు బ్రాత్‌వైట్ (61; 8 ఫోర్లు), హోల్డర్ (59; 6 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీలతో ఆదుకున్నారు. దీంతో టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్‌కు దిగిన కరీబియన్ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 75.1 ఓవర్లలో 282 పరుగుల వద్ద ఆలౌటైంది. మిడిలార్డర్‌లో జొషువా సిల్వా (49; 3 ఫోర్లు) కూడా రాణించాడు. ఒక దశలో 76/1గా ఉన్న విండీస్ 115/5 స్కోరు వద్ద కష్టాల్లో పడింది. అనంతరం జొషువా, హోల్డర్‌లు ఆరో వికెట్‌కు 109 పరుగులు జోడించి పరిస్థితి చక్కదిద్దారు. వోక్స్ (3/69) ఈ జోడీని విడగొట్టి విండీస్ పతనానికి శ్రీకారం చుట్టాడు. అట్కిన్సన్ (4/67) కీలకమైన వికెట్లు తీసి విండీస్ ఆట కట్టించాడు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ఆరంభించిన ఇంగ్లండ్ ఆటముగిసే సమయానికి 3 వికెట్లకు 38 పరుగులు చేసింది.


హోల్డర్

భారీ విజయంతో ఫైనల్లోకి భారత్

- సెమీస్‌లో బంగ్లాదేశ్‌పై 10 వికెట్లతో జయభేరి
- రాణించిన రేణుక, రాధ
- స్మృతి మంధాన మెరుపులు
- ఆదివారం శ్రీలంకతో టైటిల్ పోరు

దంబుల్లా: బౌలర్ల క్రమశిక్షణకు బ్యాటర్ల సహకారం తోడవడంతో... భారత మహిళల జట్టు ఆసియా కప్ టి20 టోర్నీ ఫైనల్లోకి ప్రవేశించింది. లీగ్ దశలో సంపూర్ణ ఆధిపత్యంతో నాకౌట్‌కు చేరిన టీమిండియా... శుక్రవారం జరిగిన తొలి సెమీఫైనల్లో 10 వికెట్ల తేడాతో బంగ్లాదేశ్‌ను మట్టికరిపించింది. మహిళల ఆసియాకప్‌లో భారత జట్టు తుదిపోరుకు చేరడం ఇది తొమ్మిదోసారి కాగా.. టి20 ఫార్మాట్‌లో నిర్వహించిన ఐదుసార్లూ ఫైనల్లో అడుగుపెట్టింది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్‌కు దిగిన బంగ్లాదేశ్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 80 పరుగులు చేసింది. కెప్టెన్ నిగార్ సుల్తానా (32), షోర్నా అక్తర్ (19 నాటౌట్) మాత్రమే రెండంకెల స్కోరు చేయగా మిగిలిన వాళ్లు విఫలమయ్యారు. భారత బౌలర్లలో 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' రేణుక, రాధ చెరో మూడు వికెట్లు పడగొట్టారు. అనంతరం లక్ష్యఛేదనలో టీమిండియా 11 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 83 పరుగులు చేసి గెలిచింది. ఓపెనర్లు స్మృతి మంధాన (39 బంతుల్లో 55 నాటౌట్; 9 ఫోర్లు, ఒక సిక్సర్), షఫాలీ వర్మ (26 నాటౌట్) రాణించారు. ఆదివారం జరిగే ఫైనల్లో ఆతిథ్య శ్రీలంక జట్టుతో భారత్ తలపడుతుంది. రెండో సెమీఫైనల్లో శ్రీలంక మూడు వికెట్ల తేడాతో పాకిస్తాన్ జట్టును ఓడించింది.

రేణుక అదుర్స్

మొదట బ్యాటింగ్‌కు దిగిన బంగ్లాకు ఏదీ కలిసి రాలేదు. ఇన్నింగ్స్ తొలి ఓవర్‌లోనే ఓపెనర్ దిలారా అక్తర్ (6)ను అవుట్ చేసిన రేణుక, తన తదుపరి ఓవర్‌లో ఇస్మా (8)ను పెవిలియన్‌కు పంపించింది. ఆరో ఓవర్‌లో ముర్షిదా ఖాతూన్ (4) కూడా వెనుదిరిగింది. దీంతో పవర్‌ప్లే ముగిసేసరికి బంగ్లా 25/3తో నిలిచింది. ఈ మూడు వికెట్లు రేణుక ఖాతాలోకే వెళ్లాయి. ఇక అక్కడి నుంచి బంగ్లా మహిళల జట్టు కోలుకోలేకపోయింది. వరుస విరామాల్లో వికెట్లు కోల్పోయి స్వల్ప స్కోరే చేసింది.

ఇద్దరే కొట్టేశారు

స్వల్ప లక్ష్యఛేదనలో భారత ఓపెనర్లు చెలరేగిపోయారు. స్మృతి, షఫాలీ విజృంభణతో 11 ఓవర్లలోనే భారత జట్టు విజయం సాధించింది. భారత అమ్మాయిలు అదరగొట్టిన చోట బంగ్లా బౌలర్లు ఏమాత్రం ప్రభావం చూపలేకపోయారు. దీంతో స్మృతి ఫోర్లతో స్కోరు బోర్డును పరుగులు పెట్టించింది. ఈ క్రమంలో అర్ధశతకం పూర్తి చేసుకున్న మంధాన .. నాకౌట్ మ్యాచ్‌ల్లో నాలుగో హాఫ్ సెంచరీ తన పేరిట లిఖించుకుంది. అలాగే పొట్టి ఫార్మాట్‌లో అత్యధిక పరుగుల జాబితాలో రెండోస్థానానికి చేరింది.





స్కోరు వివరాలు

బంగ్లాదేశ్ ఇన్నింగ్స్: దిలారా అక్తర్ (సి) ఉమ (బి) రేణుక 6; ముర్షిదా ఖాతూన్ (సి) షఫాలీ (బి) రేణుక 4; ఇస్మా తన్జీమ్ (సి) తనూజ (బి) రేణుక 8; నిగార్ సుల్తానా (సి) దీప్తి (బి) రాధ 32; రుమానా (బి) రాధ 1; రాబియా ఖాన్ (సి) షఫాలీ (బి) పూజ 1; రీతు మోనీ (స్టంప్డ్) రిచా (బి) దీప్తి 5; షోర్నా (నాటౌట్) 19; నహిద (బి) రాధ 0; మారుఫా (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 4; **మొత్తం (20 ఓవర్లలో 8 వికెట్లకు) 80.** **వికెట్ల పతనం:** 1–7, 2–17, 3–21, 4–30, 5–33, 6–44, 7–80, 8–80. **బౌలింగ్:** రేణుక 4–1–10–3, పూజ 4–0–25–1, తనూజ 4–0–16–0, దీప్తి 4–0–14–1, రాధ 4–1–14–3.

భారత్ ఇన్నింగ్స్: షఫాలీ వర్మ (నాటౌట్) 26; స్మృతి (నాటౌట్) 55; ఎక్స్‌ట్రాలు 2; **మొత్తం (11 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా) 83.** **బౌలింగ్:** మారుఫా 2–0–17–0, నహిద 3–0–34–0, జహనారా ఆలమ్ 3–0–17–0, రాబియా ఖాన్ 2–0–10–0, రుమానా అహ్మద్ 1–0–5–0.

9 మహిళల ఆసియాకప్‌లో (వన్డే, టి20 ఫార్మాట్ కలిపి) భారత జట్టు ఫైనల్ చేరడం ఇది తొమ్మిదోసారి. ఇందులో ఏడుసార్లు ట్రోఫీ గెలుచుకుంది. 2018లో రన్నరప్‌గా నిలిచింది.

3 టి20ల్లో భారత మహిళల జట్టు 10 వికెట్ల తేడాతో విజయం సాధించడం ఇది మూడోసారి. ఇటీవల దక్షిణాఫ్రికాపై 85 పరుగుల లక్ష్యాన్ని అజేయంగా ఛేదించిన భారత్.. 2019లో వెస్టిండీస్‌పై 104 పరుగుల టార్గెట్‌ను వికెట్ కోల్పోకుండా అధిగమించింది.

1 టి20 క్రికెట్‌లో రెండుసార్లు 20వ ఓవర్ మెయిడెన్ వేసిన తొలి బౌలర్‌గా రాధ యాదవ్ రికార్డుల్లోకెక్కింది. ఓవరాల్‌గా పురుషుల క్రికెట్‌లో ఎనిమిది మంది. మహిళల క్రికెట్‌లో తొమ్మిది మంది బౌలర్లు ఇన్నింగ్స్ చివరి ఓవర్‌ను మెయిడెన్ చేశారు.

2 మహిళల టీ20ల్లో అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్ల జాబితాలో స్మృతి మంధాన (3433) రెండోస్థానానికి దూసుకెళ్లింది. సూజీ బేట్స్ (4348; న్యూజిలాండ్) టాప్ ర్యాంక్‌లో ఉంది.

1,65,65,130
ఇదీ రాష్ట్రంలో మొత్తం వాహనాల సంఖ్య..

ఏడాదిలో 10.88 లక్షల మేర పెరుగుదల

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో వాహనాల సంఖ్య భారీగా పెరుగుతోంది. ఏడాది కాలంలో ఏకంగా 10.88 లక్షల వాహనాలు కొత్తగా రోడ్లపైకి చేరాయి. ఈ సంవత్సరం మే నాటికి రాష్ట్రంలో 1,65,65,130 వాహనాలు ఉన్నట్టు తాజాగా ప్రభుత్వం సోషియో ఎకనమిక్ ఔట్‌లుక్ నివేదికలో స్పష్టం చేసింది. బడ్జెట్ ప్రతిపాదనలతోపాటు ప్రభుత్వం ఈ నివేదికను శాసనసభకు సమర్పించిన విషయం తెలిసిందే. గత ఏడాది ఇదే సమయానికి రాష్ట్రంలో 1,54,77,512 వాహనాలు ఉన్నాయి. క్రమంగా వాటి పెరుగుదలలో వేగం ఎక్కువైందని తాజా నివేదిక స్పష్టం చేస్తోంది. ఆ నివేదిక గత మే నెల 31న ఉన్న వివరాలను పొందుపర్చింది. జూలై చివరి నాటికి ఆ సంఖ్యలో కనీసం లక్ష వరకు పెరుగుదల నమోదై ఉంటుందని అంచనా.

ద్విచక్ర వాహనాలదే హవా..

ప్రస్తుతం రాష్ట్రంలోని మొత్తం వాహనాల్లో ద్విచక్రవాహనాలదే సింహభాగం. రాష్ట్రంలో 1.21.74,353 స్కూటర్లు, మోటారు సైకిళ్లు, మోపెడ్లు ఉన్నట్టు నివేదిక చెబుతోంది. గతేడాది ఇదే సమయానికి వాటి సంఖ్య 1.13 కోట్లు మాత్రమే. రాష్ట్రవ్యాప్తంగా ఏడాది సమయంలో 10 లక్షలను మించి కొత్త వాహనాలు చేరితే, అందులో ద్విచక్రవాహనాలే 8 లక్షల వరకు ఉండటం విశేషం. ఇప్పుడు చాలా కుటుంబాల్లో రెండు ద్విచక్రవాహనాలు ఉండటం సహజంగా మారింది.

ప్రభుత్వం విడుదల చేసిన జాబితా ప్రకారం..

వాహనాలు	సంఖ్య
ఈ-రిక్షా/ ఈ-కార్ట్స్	244
ప్రైవేట్ సర్వీస్ వాహనాలు	3,135
కాంట్రాక్టు క్యారేజీ వాహనాలు	5,613
స్టేజీ క్యారేజీ వాహనాలు	9,071
మ్యాక్సీ క్యాబ్స్	27,948
విద్యాసంస్థల బస్సులు	29,869
ఇతర వాహనాలు	91,708
మోటార్ క్యాబ్స్	1,36,902
ఆటోరిక్షాలు	4,88,786
గూడ్స్ క్యారేజీ వాహనాలు	6,33,364
ట్రాక్టర్లు, ట్రైయిలర్లు	7,45,231
ద్విచక్ర వాహనాలు	1,21,74,353



ఏమి హైటు.. ఏమి వెయిటు

టిరెక్స్.. మన డైనోసార్ సినిమాల్లో దీనికుండే క్రేజీ వేరు. చురకత్తుల్లా ఉండే 60 పళ్లతో కారును సైతం కరకరలాడించేస్తుంది. ఇప్పటికే దీనికి అరివీర భయంకరమైన బిల్డప్పు ఉండగా.. ఇప్పుడు పరిశోధకులు అంతకుమించి అన్నట్లుగా కొత్త వివరాలు వెల్లడించారు. గతంలో అను కున్నదాని కన్నా.. టిరెక్స్ మరింత భారీగా, పొడ వుగా ఉండేదని అంచనా వేస్తున్నారు. ఇది 39 అడుగుల పొడవు, 8,800 కిలోల బరువు ఉంటుందని గతంలో అనుకున్నారు. అయితే.. పలు పరిశోధనల అనంతరం ఇది 49 అడుగుల పొడవు, ఏకంగా 15 వేల కిలోల బరువు ఉండొచ్చని వారు చెబుతున్నారు. క్వీన్‌మేరీ యూనివర్సిటీ ఆఫ్ లండన్, కెనడియన్ మ్యూజియం ఆఫ్ నేచర్‌కు చెందిన పరిశోధకుల బృందం ఈ మేరకు అంచనా వేసింది.

- సాక్షి సెంట్రల్ డెస్క్

రూపాయి కూడా ఉంచలే.. మీకో దండం!

రంగారెడ్డి జిల్లా మహేశ్వరంలోని ఓ మెస్‌లో చోరీకి వచ్చిన ఓ దొంగ 'ఆవేదన'

ఎంత వెతికినా ఏమీ లభించకపోవడంతో సీసీ కెమెరా ముందు గోడువెళ్లబోసుకున్న వైనం

చివరకు ఓ వాటర్ బాటిల్ తీసుకున్నా రూ. 20 నోటు పెట్టి వెళ్లిన చోరుడు



మెస్‌లోకి ప్రవేశిస్తున్న దొంగ

సాక్షి, హైదరాబాద్: ఎంతో ఆశతో చోరీకి వస్తే ఏమీ దొరక్కపోవడంతో ఓ చోరుడు తెగ ఫీలయ్యాడు! 'ఎంత వెతికినా కనీసం ఒక్క రూపాయి కూడా లేదు... మీకో దండం' అంటూ యజమానులను ఉద్దేశించి అక్కడి సీసీ కెమెరాల వైపు చూస్తూ హావభావాలు ప్రదర్శించాడు. చివరకు ఓ వాటర్ బాటిల్ చోరీ చేసి తిరిగి వెళదామనుకున్నప్పటికీ వెనక్కు వచ్చి టేబుల్‌పై రూ. 20 నోటు పెట్టి మరీ వెళ్లాడు. రంగారెడ్డి జిల్లా మహేశ్వరంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా ఉన్న వినాయక మెస్‌లో గత బుధవారం జరిగిన ఈ విచిత్ర చోరీ యత్నం శుక్రవారం వెలుగులోకి వచ్చింది. ఆస్తి నష్టం లేకపోవడంతో మెస్ నిర్వాహకులు పోలీసులకు ఫిర్యాదు చేయనప్పటికీ ఇందుకు సంబంధించిన సీసీటీవీ క్లిప్పింగ్ సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఈ సన్నివేశం ప్రపంచాన్ని చుట్టేసింది.



ఏమీ దొరకలేదంటూ సీసీ కెమెరా వైపు దండం పెడుతూ..

మండల కేంద్రం కావడంతో..

మహేశ్వరం మండల కేంద్రంలో ఉన్న మెస్ కావడంతో క్యాష్ కౌంటర్‌లో దండిగా కాసులు ఉంటాయనుకున్న దొంగ.. తలకు టోపీ, ముఖానికి టవల్‌తో ప్రధాన ద్వారానికి వేసిన తాళం పగులగొట్టి లోనికి ప్రవేశించాడు. తొలుత క్యాష్ కౌంటర్ వద్ద, ఆ తర్వాత కిచెన్‌లో ఆరు నిమిషాలకుపైగా వెతికినా ఏమీ దొరక్కపోవడంతో నిరాశ చెందాడు. తన ఆవేదనను హావభావాల ద్వారా అక్కడి సీసీ కెమెరాల వైపు చూస్తూ ప్రదర్శించాడు. అనంతరం క్యాష్ కౌంటర్ వెనుక ఉన్న రెండు ఫ్రిజ్‌లలో వెతుకుతూ ఒక దాంట్లోంచి వాటర్ బాటిల్ తీసుకొని రెండు అడుగులు ముందుకు వేశాడు. కానీ ఒక్క రూపాయి కూడా దొరకని మెస్‌లోంచి వాటర్ బాటిల్ చోరీ చేయడానికి మనస్కరించలేదో ఏమో.. తన ప్యాంటు బ్యాక్ పాకెట్ నుంచి పర్సు బయటకు తీసి అందులో నుంచి రూ. 20 తీసి వాటర్ బాటిల్‌ను కొట్టేయలేదు కొనుక్కొని వెళ్తున్నా అన్నట్లుగా చూపుతూ అక్కడి నుంచి వెనుతిరిగాడు.



పర్సు నుంచి రూ. 20 నోటు తీసి పెడుతూ..

'ప్రతీ భారతీయుడు సందర్శించాల్సిన క్షేత్రం'



కోవింద్‌కు జ్ఞాపికను అందజేస్తున్న చినజీయర్ స్వామి. చిత్రంలో మైహోం రామేశ్వరరావు

శంషాబాద్ రూరల్: సమతాస్ఫూర్తి కేంద్రం ప్రతీ భారతీయుడు సందర్శించాల్సిన క్షేత్రమని మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ అన్నారు. రంగారెడ్డి జిల్లా ముచ్చింతల్ శివారులో ఉన్న సమతాస్ఫూర్తి కేంద్రాన్ని ఆయన శుక్రవారం సందర్శించారు. ఇక్కడ ఆయన త్రిదండి శ్రీమన్నారాయణ చినజీయర్ స్వామితో కలసి రామానుజుల స్వర్ణ విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



ఇటీవల కురిసిన వర్షాలకు.. ఐటీడీఏ నిర్మిస్తున్న ఫుట్‌ఓవర్ బ్రిడ్జి వాగులో కూలిన దృశ్యం

కొండాయి..

కష్టం కొండంత

జల ప్రళయానికి ఏడాది

కొండాయి వద్ద 8 మందిని బలిగొన్న బ్రిడ్జి

కొత్త బ్రిడ్జి నిర్మాణం జరగక వానొస్తే.. ఏ అవసరమొచ్చినా 42 కిలోమీటర్లు వెళ్లాల్సిన దుస్థితి

గత ఏడాది జూలై 27న వాన.. వరదై.. జలప్రళయంగా మారి రెండు గ్రామాల్లో బీభత్సం సృష్టించింది. ములుగు జిల్లా కొండాయిలో బ్రిడ్జి దాటుతున్న ఎనిమిది మందిని బలితీసుకుంది. అదే సమయంలో జయశంకర్ భూపాలపల్లి జిల్లా మోరంచపల్లి గ్రామాన్ని ముంచెత్తింది. ఐదుగురు గల్లంతు కాగా, వారిలో ఇద్దరి ఆచూకీ ఇప్పటికీ లభించలేదు. ఆ కుటుంబాలు వారి చివరి చూపునకు నోచుకోకుండా పోయాయి. ఇప్పటికీ ఆయా గ్రామాల్లో పరిస్థితులు ఏమీ మారలేదు. ఇప్పుడు కురుస్తున్న వర్షాలకు కూడా ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బిక్కుబిక్కుమంటున్నారు. ఈ నేపథ్యంలో సాక్షి బృందం ఆ రెండు గ్రామాలను సందర్శించింది.

ఏటూరునాగారం/భూపాలపల్లి అర్బన్/భూపాలపల్లి రూరల్

ఏడాది కాలంగా బ్రిడ్జి నిర్మించని కారణంగా వానొస్తే.. ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం కొండాయి గ్రామస్తులు ఏది కావాలన్నా.. 42 కిలోమీటర్ల దూరంలోని ఏటూరునాగారానికి చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తోంది. అదే కొత్త బ్రిడ్జి నిర్మాణం జరిగి ఉంటే..12 కిలోమీటర్లు ప్రయాణించి ఏటూరునాగారం చేరుకునేవారు. ప్రస్తుతం చుట్టూ తిరగలేక ఇంటి వద్దనే కలోగంజి తాగుతున్నారు. ఊరంతా దోమల బెడద. వర్షాలు వస్తే...వాగు దాటలేక గ్రామంలోనే మగ్గిపోతున్నారు. 2023 జూలై 27వ తేదీ సాయంత్రం 4 తర్వాత భారీ వర్షాలు కొండాయి, మల్యాల గ్రామాలను అతలాకుతలం చేశాయి. ఈ క్రమంలోనే బ్రిడ్జి కూలడంతో దానిపై నడుచుకుంటూ వెళుతున్న 8 మంది (రషీద్, కరింబీ, మజీద్, బీబీ, నజీర్‌ఖాన్, షరీఫ్, మహబూబ్‌ఖాన్, దబ్బగట్ల సమ్మక్క) అసువులు బాశారు. ఏడాది గడిచినా, ఆ విషాదచాయలు అలానే ఉన్నాయి. కొండాయి- దొడ్ల గ్రామాల మధ్య గల జంపన్నవాగుపై నిర్మించి ఉన్న హైలెవల్ బ్రిడ్జి మొత్తం కొట్టుకుపోయింది. ఇప్పటివరకు ఆ ప్రాంతంలో ఎలాంటి బ్రిడ్జి నిర్మాణం జరగలేదు. ఇటీవల ఐటీడీఏ అధికా రులు రూ.35 లక్షలు ఖర్చు చేసి ఏర్పాటు చేస్తున్న ఫుట్ ఓవర్ ఐరన్ బ్రిడ్జి సైతం ఇటీవల వరదలకు కూలిపోయింది. వెల్డింగ్, పిల్లర్లు సైతం ఊడిపోయి వాగులో కలిసిపోయాయి. బ్రిడ్జిని అమర్చే క్రేన్ సైతం వాగులో కూరుకుపోయింది. దీంతో అధికారులు పడవ ఏర్పాటు చేశారు. అత్యవసర సమయంలోనే ఈ పడవను నడుపుతున్నారు. దీంతో కొండాయి, మల్యాల, గోవిందరాజుల కాలనీల్లో ఆకలికేకలు మొదలయ్యాయి. ప్రజలు పచ్చడి మెతుకులతో కాలం వెళ్లదీస్తున్నారు. కొత్త బ్రిడ్జి నిర్మాణం కోసం మంత్రి సీతక్క రూ. 9.50 కోట్లు మంజూరు చేయించింది. కానీ టెండర్లు కాక పనులు మొదలు కాలేదు. దీంతో కొండాయి, మల్యాల, గోవిందరాజుల కాలనీ ప్రజలకు రవాణా సౌకర్యం లేకుండా పోయింది. బ్రిడ్జి నిర్మిస్తే గానీ తమ బతుకులు బాగుపడవని కన్నీటిపర్యంతమవుతున్నారు.



కొండాయి వద్ద కూలిపోయిన నాటి బ్రిడ్జి ఇదే..

ఇప్పుడు ఇలా వెళ్తున్నారు..

కొండాయి నుంచి పది కిలోమీటర్ల దూరంలోని ఊరట్టం నుంచి మేడారం మీదుగా రెండు కిలోమీటర్లు ప్రయాణించి 13 కిలోమీటర్ల దూరంలో ఉన్న తాడ్వాయికి చేరుకోవాలి. అక్కడి నుంచి 17 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఏటూరునాగారం రావాలి. దీంతో కొండాయి, మల్యాల, గోవిందరాజుల కాలనీ ప్రజలు నరకయాతన పడుతూ ప్రయాణిస్తున్నారు. అదే కొండాయి వద్ద బ్రిడ్జి అందుబాటులోకి వస్తే కేవలం 12 కిలోమీటర్లు ప్రయాణించి ఏటూరునాగారం చేరుకుంటారు.

పచ్చడి మెతుకులతో..



కొండాయికి సరైన రోడ్డుమార్గం లేక నిత్యావసర సరుకులు నిండుకొని పచ్చడి మెతుకులతో కాలం వెళ్లదీస్తున్నాం, ఎలాంటి పనులు లేవు. వ్యవసాయం లేదు, కూలీకి పోయేందుకు దారిలేదు. రేషన్ షాపులో ఇచ్చిన దొడ్డుబియ్యం వండుకొని పచ్చడి వేసుకొని ఇంటిల్లిపాది పూట గడుపుతున్నాం.

- కాక ఫణిచందర్, కొండాయి

'మోరంచ'.. మొర ఆలకించేదెవరు?

వాగులో ఐదుగురు గల్లంతు.. ఇప్పటికీ దొరకని ఇద్దరి ఆచూకీ

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో మోరంచ వాగు ఉప్పొంగి ప్రవహించడంతో వాగు పక్కనే ఉన్న మోరంచపల్లి గ్రామం పూర్తిగా కొట్టుకుపోయింది. గ్రామస్తులందరూ ఇళ్లపైకి ఎక్కి ప్రాణాలు కాపాడాలంటూ వేడుకున్నారు. ఐదుగురు వరదలో కొట్టుకుపోగా, ముగ్గురి మృతదేహాలు పంట పొలాల్లో లభించాయి. ఒక మహిళ, యాచకుడి మృతదేహం జాడ ఇప్పటికీ దొరకలేదు. గ్రామంలో ఎవరిని కదిలించినా వరద ప్రమాదాన్ని గుర్తు చేసుకుంటూ కన్నీళ్లు పెడుతున్నారు. మళ్లీ వర్షాలు కురుస్తుండడంతో ఆందోళన చెందుతున్నారు.

ప్రభుత్వ సాయం నామమాత్రమే..

గ్రామంలోని 20 చెంచు కుటుంబాలు సర్వం కోల్పోగా, ప్రభుత్వం సాయం అంతంత మాత్రమే అందింది. ఆ సమయంలో తక్షణ సాయం కింద ప్రతి కుటుంబానికి కేవలం రూ.10వేల నగదు, నిత్యావసర వస్తువులు, పాడి గేదెలు ఇచ్చారు. ఇళ్లు కోల్పోయిన, ఇతర వస్తువులు, పంటలు నష్టపోయిన, వాహనాలు కొట్టుకుపోయిన వారికి ప్రభుత్వం నుంచి ఎటువంటి సాయమూ అందలేదు. మరణించిన ముగ్గురి కుటుంబాలకు పరిహారం రాగా, ఇప్పటికి ఆచూకీ లభించని గడ్డం మహాలక్ష్మి కుటుంబానికి ప్రభుత్వం నుంచి పరిహారం అందలేదు.

ఏడాదైనా నా భార్య ఆచూకీ లేదు..



గత ఏడాది తెల్లవారు జామున వచ్చిన వరదలో కొట్టుకుపోయిన నా భార్య ఆచూకీ ఇప్పటి వరకు లభించలేదు. గుర్తు తెలియని మహిళలు ఎక్కడ చనిపోయి కనిపించినా అక్కడకు వెళ్లి చూశాం. ఇటీవలే నా భార్య సంవత్సరీకం చేశాను. ఒంటరిగా ఉండలేక నా కూతుళ్ల వద్ద ఉంటున్నా.

- గడ్డం శ్రీనివాస్, మృతురాలు మహాలక్ష్మి భర్త



వరద నీటిలో మోరంచపల్లి(ఫైల్)

తాతయ్య, నానమ్మలను కోల్పోయాం



తాత మజీద్, నానమ్మ బీబీతో పాటు కొండాయిలో ఉండే వాళ్లం. గత ఏడాది మా కుటుంబంలో మజీద్, బీబీని వాగు మింగేసింది. ఆ భయంతో ఇప్పుడు ఏటూరు నాగారంలో ఉంటున్నాం. చిన్నషాపు పెట్టు కొని జీవిస్తున్నాం. వర్షాకాలం వచ్చిందంటే ఆ దుర్ఘటన గుర్తుకొస్తుంది.

- రియాజ్ , కొండాయి



కాలు జారితే ఖతం..

హనుమకొండలోని నయీంనగర్ వంతెన నిర్మాణ పనులు కొనసాగుతుండడంతో వాహనదారులు, కాలినడకన వెళ్లేవారికి కష్టాలు తప్పడం లేదు. నయీంనగర్‌లో కళాశాలలు, పాఠశాలలు, ఆస్పత్రులు, షాపింగ్ మాల్స్, బాలికలు, బాలుర వసతి గృహాలతో చాలా రద్దీగా ఉంటుంది. వంతెన చుట్టూ తిరిగి వెళ్లడానికి 2 కిలోమీటర్ల దూరం ఉండటంతో.. విద్యార్థులు, ప్రజలు తాత్కాలికంగా ఏర్పాటు చేసిన ప్రమాదకర మైన కట్టెల నిచ్చెనపై నుంచి నాలా దాటుతున్నారు. వర్షానికి నిచ్చెన తడిసి విరిగిపోయినా, కాలు జారినా నాలాలో కొట్టుకు పోయే ప్రమాదం ఉంది. – సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, హనుమకొండ





వాగులు దాటి వైద్యం..

కన్నాయిగూడెం: ములుగు జిల్లాలో వారం రోజుల నుంచి వర్షాలు కురుస్తుండటంతో వాగులు పొంగిపొర్లుతున్నాయి. వర్షాల కారణంగా జ్వరాలు, ఇతర వ్యాధులు ఎక్కువగా ఉండటంతో వైద్య సిబ్బంది రోగులకు చికిత్స అందించడానికి ఏజెన్సీ గ్రామాల బాటపట్టారు. ఈ క్రమంలో కొండాయి సబ్‌సెంటర్ పరిధి వైద్యుడు ప్రణీత్ కుమార్ తమ సిబ్బందితో కలసి ఏటూరునాగారం నుంచి సర్వాయిరోడ్డు మార్గాన 40కి.మీ. ప్రయాణించి అడవి, వాగులు దాటుకుంటూ మారుమూలన ఉన్న కన్నాయి గూడెం మండలం ఐలాపూర్ గ్రామానికి శుక్రవారం చేరుకున్నారు. స్థానిక ప్రజలకు వైద్యం అందించారు. వారు వస్తున్న క్రమంలో మార్గ మధ్యలో చంటిపిల్లతో వస్తున్న వారికి అడవిలోనే వైద్యం చేశారు.



మందుకొట్టి.. చావగొట్టి

ఎల్లారెడ్డి: డ్రిల్ పీరియడ్‌లో ఆటలాడుకుంటున్న విద్యార్థులను.. మద్యం మత్తులో ఉన్న అటెండర్ చితకబాదడంతో గాయపడ్డారు. కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జరిగిన ఈ సంఘటన వివరాలివి. పాఠశాల డ్రిల్ పీరియడ్‌లో ఆరో తరగతి విద్యార్థులు ఆడుకుంటున్నారు. అదే సమయంలో మద్యం మత్తులో ఉన్న అటెండర్.. వారి వద్దకు వెళ్లి ఎందుకు అల్లరి చేస్తున్నారంటూ కర్రతో ఇష్టమొచ్చి నట్లు కొట్టాడు. దీంతో విద్యార్థులు రామ్, లక్ష్మణ్, అజయ్‌లతో పాటు మరికొందరి ఒంటిపై వాతలు తేలాయి. తీవ్ర నొప్పి తో బాధపడుతున్న రామ్, లక్ష్మణ్, అజయ్‌లను ఉపాధ్యాయులు ఆస్పత్రికి తరలించి, చికిత్స అందించారు. తరచూ విధుల్లో మద్యం తాగుతున్న అటెండర్‌పై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ ప్రతినిధులు డిమాండ్ చేశారు.

రైతు బిడ్డకు రూ. 52 లక్షల ప్యాకేజీతో ఉద్యోగం



తిమ్మాపూర్: కరీంనగర్ జిల్లా రైతు కుటుంబానికి చెందిన ఎం.ఆశ్రితకు బెంగళూరులోని ఎన్విడియా కంపెనీలో రూ.52 లక్షల వార్షిక వేతనంతో ఉద్యోగం దక్కింది. రామడుగు మండలం గోపాలరావుపేట గ్రామానికి చెందిన ఆమె తిమ్మాపూర్‌లో జ్యోతిష్మతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ సైన్స్‌లో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్‌లో బీటెక్ చదివింది. తర్వాత గేట్ పరీక్షలో జాతీయ స్థాయిలో 32వ ర్యాంకు రావడంతో ప్రతిష్టాత్మక ఐఐఎస్సీ-బెంగళూరులో పీజీ సీటు వచ్చింది. అక్కడ ఇటీవల పీజీ పూర్తి చేసిన ఆశ్రితకు ఎన్విడియా సంస్థలో మంచి వేతనంతో ఏఎస్ఐడీ ఇంజనీర్ కొలువు దక్కింది. జ్యోతిష్మతి కాలేజీలో ఈసీఈ విభాగానికి చెందిన మరో విద్యార్థి పుల్లు రాజ్‌కుమార్ రూ.16.85 లక్షల ప్యాకేజీతో క్వాల్ కామ్ ఇండియా కంపెనీలో అసోసియేట్ ఇంజనీర్‌గా ఎంపికయ్యాడు. ఆయన స్వస్థలం కరీంనగర్ జిల్లా దుర్శేడు మండలం గోపాల్‌పూర్.

భారీ ఈవీ చార్జింగ్ హబ్ ప్రారంభం నేడు

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం సర్కిల్‌కు సమీపంలో అతిపెద్ద ఎలక్ట్రిక్ వాహనాల చార్జింగ్ హబ్ శనివారం ప్రారంభం కానుంది. గ్లిడా అనే సంస్థ ఏర్పాటు చేసిన 102 ఈవీ చార్జింగ్ కేంద్రాల హబ్‌ను ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్‌రంజన్ శనివారం సాయంత్రం ప్రారంభించనున్నారు. ఇప్పటికే ఉత్తరాదిలోని గుర్గావ్‌లో అతిపెద్ద ఈవీ చార్జింగ్ కేంద్రం ఉండగా.. రెండో అతిపెద్ద చార్జింగ్ కేంద్రం హైదరాబాద్‌లో అందుబాటులోకి రానుంది. దీనివల్ల ఒకేసారి వందకు పైగా వాహనాలకు చార్జింగ్ చేసే సదుపాయం లభించనుంది.

జీవాలు తగ్గినయ్!



రాష్ట్రంలో భారీగా తగ్గిన గొర్రెలు, మేకల సంఖ్య

2019లో 2,39,88,070 గొర్రెలు, మేకలు

2024కు వచ్చేసరికి 1.62 కోట్లకు తగ్గిన వైనం

మేడ్చల్, వరంగల్ జిల్లాల్లో 60% తగ్గిన జీవాలు

సామాజిక, ఆర్థిక సర్వే-2024 గణాంకాల వెల్లడి

సాక్షి, హైదరాబాద్

రాష్ట్రంలో గొర్రెలు, మేకల సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. 2019తో పోలిస్తే ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా 32 శాతం జీవాలు తగ్గినట్టు సామాజిక, ఆర్థిక సర్వే-2024 గణాంకాలు చెబుతున్నాయి. ఈ గణాంకాల ప్రకారం.. 2019లో రాష్ట్ర వ్యాప్తంగా 1,90,81,605 గొర్రెలు, 49,06,465 మేకలు కలిపి మొత్తం 2,39,88,070 జీవాలుండేవి. కానీ ఐదేళ్ల తర్వాత గణన చేపడితే ఆ సంఖ్య 1.62 కోట్లకు తగ్గిపోయిందని (32.40%) సర్వే వెల్లడించింది. రాష్ట్రంలోని 1,75,115 కుటుంబాల వద్ద ప్రస్తుతం 1,24,14,299 గొర్రెలు, 38,02,609 మేకలు కలిపి 1,62,16,908 జీవాలున్నాయని తెలిపింది.


వరంగల్‌లో 5 లక్షలు గాయబ్

జిల్లాల వారీగా పరిశీలిస్తే మేడ్చల్ జిల్లాలో అత్యధిక శాతం జీవాలు తగ్గాయని ఆర్థిక సర్వే గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఇక్కడ గొర్రెలు, మేకలు కలిపి 2019లో 1.89 లక్షలు ఉంటే 2014కు వచ్చేసరికి ఆ సంఖ్య 74 వేలకు తగ్గిపోయింది. వరంగల్‌లో అత్యధికంగా ఐదేళ్లలో ఐదు లక్షల వరకు జీవాలు మాయమయ్యాయి. 2019లో వరంగల్ జిల్లాలో 8.3 లక్షలున్న జీవాలు 2024కు వచ్చేసరికి 3.33 లక్షలకు తగ్గిపోయాయి. అదే విధంగా సంగారెడ్డిలో 3.50 లక్షలు, మెదక్‌లో 3.9 లక్షలు, నిజామాబాద్‌లో 4.2 లక్షలు, సిద్దిపేటలో 4.5 లక్షలు.. ఇలా పెద్ద సంఖ్యలో జీవాలు తగ్గిపోయాయని గణాంకాలు చెబుతున్నాయి. ఇందుకు కారణాలేవైనా ఇంత పెద్ద సంఖ్యలో జీవాల తగ్గుదల మంచిది కాదని, ఆయా జిల్లాల్లో త్వరలోనే మాంసం సంక్షోభం వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని పశుసంవర్ధక అధికారులు చెబుతున్నారు. గత ఐదేళ్లలో వనపర్తి, గద్వాల, మంచిర్యాల, నల్లగొండ జిల్లాల్లో కొంతమేర జీవాల సంఖ్య ఎక్కువగా కనిపిస్తోంది.

గొర్రెలు కావాలి మహాప్రభో

వాస్తవానికి 2017లో సబ్సిడీ గొర్రెల పంపిణీ పథకాన్ని తెలంగాణ ప్రభుత్వం ప్రారంభించింది. దాదాపు రూ.5వేల కోట్లకు పైగా వెచ్చించి 3.5 లక్షల మంది లబ్ధిదారులకు గొర్రెలను పంపిణీ చేసింది. దీంతో అటు జీవాల సంఖ్యలోనూ, మాంసం ఉత్పత్తిలోనూ తెలంగాణలో భారీ వృద్ధి కనిపించింది. ఆ గొర్రెలు ఇప్పుడు ఏమయ్యాయన్నది ఆసక్తి కలిగిస్తోంది. బీఆర్ఎస్ హయాంలో ప్రారంభించిన ఈ గొర్రెల పథకంలో భారీ అవినీతి జరిగిందనే ఆరోపణలున్నాయి. ఇలావుండగా రెండోవిడత గొర్రెల పంపిణీ కోసం రాష్ట్రంలోని సుమారు 3 లక్షల మంది గొర్రెల కాపరులు ఎదురుచూస్తున్నారు. 85 వేలకు పైగా లబ్ధిదారులు ఇప్పటికే డీడీలు తీశారు. వారికి సంబంధించిన రూ.430 కోట్లు ఇంకా కలెక్టర్ల ఖాతాల్లోనే మూలుగుతున్నాయి. మరో 2.20 లక్షలకు పైగా లబ్ధిదారులు డీడీలు తీయాల్సి ఉంది.

టాప్ 10 జిల్లాల్లో జీవాలు తగ్గాయిలా..



జిల్లా	2019	2024	తగ్గిన శాతం
మేడ్చల్	1,89,421	74,844	60.49
వరంగల్	8,36,738	3,33,461	60.15
సంగారెడ్డి	6,67,786	3,12,137	53.26
మెదక్	7,89,916	3,91,311	50.46
నిజామాబాద్	8,92,158	4,78,388	46.38
సిద్దిపేట	9,84,701	5,30,468	46.13
ఖమ్మం	8,57,331	4,72,892	44.84
కరీంనగర్	7,31,393	4,13,693	43.44
రంగారెడ్డి	10,25,845	5,86,684	42.81
పెద్దపల్లి	6,49,625	3,83,761	40.93

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.